
ఆగస్టు 2016

ఆషాడము - శ్రావణము | శాలివాహన శకం 1938 ₹ 5

ఆంధ్రప్రదేశ్




కృష్ణా పుష్కరాల ప్రత్యేక సంచిక

వెల్లువల కృష్ణమ్మ పొంగిపారిన చాలు

కృష్ణాతీరం... పుణ్యక్షేత్ర తరంగం





4



6



2



7



3



5



8

కృష్ణవేణీ దివ్య తరంగాలు తీరాన ఉన్న ఆలయాల్లో కొలువైన దేవతామూర్తుల పాదాలను స్పృశిస్తూ సాగుతాయి. పుష్కర స్నానం ఆచరించిన తర్వాత, ఆ దివ్యక్షేత్రాల్ని దర్శించడం భక్తులకు ఆనవాయితీ. విజయవాడలో, దగ్గర్లోనూ ఉన్న కొన్ని క్షేత్రాల చిత్రమాలిక:

1. శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం: ఇంద్రకీలాద్రి పర్వతం మీద కొలువైన అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ కనకదుర్గమ్మ ఆలయం.

2. జగ్గయ్యపేట నుండి సుమారు 16 కి.మీ. దూరంలో ఉన్న శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, వేదాద్రి.

3. శ్రీదుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి వారి ఆలయం: పెద్దకళ్లేపల్లిలో కృష్ణానది శ్రీనాగేశ్వర స్వామి వారి దృష్టి పడినంత మేర తూర్పు దిశగా ప్రవహించి ఉత్తర వాహినిగా సముద్రంలో కలుస్తుంది. శ్రీస్వామివారి దృష్టి పడినందువల్ల ఇక్కడ నదిలో స్నానం చేస్తే తిరిగి పునర్జన్మ లేదని స్కంద పురాణంలో ఉంది.

4. మంగళగిరి శ్రీ లక్ష్మీ నృసింహస్వామివారి ఆలయం: ఈ గాలిగోపురం రాష్ట్రంలో అత్యంత ఎత్తయినది. కొండ పైన తెరచుకొని ఉన్న రంధ్రమే పానకాల స్వామి అని ప్రజల నమ్మకం.

5. శ్రీకాకుళేశ్వర స్వామి వారి దేవస్థానం: శ్రీరంగపురం నుండి 8 కి.మీ. దూరంలో ఘంటసాల మండలం, శ్రీకాకుళంలో రాజ్యాల సమేతంగా వెలసిన శ్రీకాకుళేశ్వర స్వామి వారి మెడలో 108 సాలగ్రామశిలలు హారంగా ధరించి ఉండడం ఈ క్షేత్ర ప్రత్యేకత. ఆంధ్రప్రదేశ్ లోని పెద్దగోపుర దేవాలయాల్లో ఇదొకటి.

6. కోడూరు నుండి సుమారు 15 కి.మీ. దూరంలో భావదేవరపల్లిలో ఉంది శ్రీభావన్నారాయణ స్వామి వారి ఆలయం. సుమారు 500 సం. చరిత్ర గల ఈ ఆలయం లో నిద్రచేస్తే తప్పక సంతానం కలుగుతుందని నమ్మిక.

7. శ్రీ దుర్గా గణపేశ్వరస్వామివారి ఆలయం: కాకతీయ గణపతిదేవుడి పేరుమీద ఆయన బావమరిది జాయపసేనాని నిర్మించిన ఆలయమిది.

8. సంగమేశ్వరం శివాలయంలో శివుడి విగ్రహాన్ని పాండవుల అగ్రజుడు ధర్మరాజు ఏటి వొడ్డున ప్రతిష్టించాడని స్థలపురాణం.

ఈ సంచికలో...

సంపాదకీయం

ఆంధ్రప్రదేశ్

తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ప్రచురితం

సంపుటి 61 సంచిక 2

శాలివాహన శకం 1938 ఆషాడము – శ్రావణము

కమిషనర్
ఎస్ వెంకటేశ్వర్ ఐఐఎస్

సంపాదకుడు
కందుల రమేష్ బాబు

నిర్వాహక సంపాదకుడు
నున్నా నరేష్

సహ సంపాదకులు
నీరుకొండ ప్రసాద్
జాస్తి గోపాల ప్రసాద్
డబ్బీరు రామకృష్ణ పట్నాయక్

ముఖచిత్రం
పుష్కర కృష్ణవేణి
(చిత్రకారుడు: మోషే దయాన్)

రెండవ కవర్
కృష్ణాతీర దేవాలయాలు

మూడవ కవర్
ముఖ్యమంత్రి కార్యక్రమాల చిత్రమాలిక

నాల్గవ కవర్
'చంద్రన్న విజయాలు' ప్రకటన

ప్రచురణ
సమాచార, పౌరసంబంధాల శాఖ
సమాచార భవన్, ఎ.సి.గార్డ్స్
హైదరాబాద్ – 500 028
ఫోన్: 040 – 23300258

రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి చెందినవి కానక్కరలేదు.

రూపకల్పన
కార్తీక్ బీసు

ఫోటోలు
తమ్మా శ్రీనివాస రెడ్డి, విజయవాడ

ముద్రణ
కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్

www.andhrapradeshmagazine.org
Email: apchiefeditor@gmail.com
www.ipr.ap.nic.in

పుష్కరం జాతి పండుగైన వేళ...

తెలుగు లెంక తుమ్మల సీతారామమూర్తి గారు పుష్కర సమయంలో కృష్ణానది మీద 'కృష్ణవేణి ' అనే కవిత రాశారు. కృష్ణానదిని కేవలం సాంప్రదాయికంగా చూడటానికి పరిమితం కాలేదాయన. "తల్లి! కృష్ణానదీ! భవత్తటమునందే/ మ్రోసె నాంధ్రపతాక ముమ్మొదటిదెగసి/ తెలుగునావలు నీ దీవనలు గడించి/ యెత్తె తెరచాపదీవుల నెల్లనొత్తె". మచిలీపట్నంలో 'బందరుకోట' రేవు పట్టణం ఉంది. అక్కడ్నించే ఇంగ్లీషువారి నౌకా వ్యాపారం మొదటిసారిగా జరిగింది. అందువల్లనే, 'ఆంధ్రపతాక' మొదటిసారిగా కృష్ణాతీరంలో ఎగిరిందంటారు తుమ్మల. "నీవు కరుణా నిధివి కాన నీతటమ్ము/ లాశ్రయములయ్యె బౌద్ధ విహారములకు," అని కూడా అంటారు అదే కవితలో. చరిత్ర ప్రసిద్ధమైన నాగార్జున పర్వతం, అమరావతి వంటి బౌద్ధం ఆనవాళ్లు కృష్ణాతీరంలో ఉన్నాయని గుర్తుచేస్తారు. ఇది తుమ్మల చారిత్రక, సాంస్కృతిక దృష్టిలో కృష్ణానది!

నది... నీరు మౌలికంగా భౌతికం, వాటితో మన సంబంధం లౌకికం. ఈ సత్యాన్ని దాటవేసి నదికి ఆదిభౌతికత (మాత్రమే) ఆపాదించడం, నదీబంధాన్ని పారలౌకికానికి పరిమితం చేయాలని చూడటం నేల విడిచిన సాములే. నది అంటే వేల మైళ్లు పారే నీరు మాత్రమే కాదు, గమ్యాల వైపు ప్రయాణ స్ఫూర్తి; లక్షలాది ఎకరాలుగా విస్తరించిన పరివాహక సేద్యం... స్నేహం. ఎన్నెన్నో నదీనదాలను కలుపుకొని, చేయెత్తి ఆపిన ఆనకట్టల దరిని సేదతీరి, పల్లె మాగాణిలలో పంటలా పల్లవించాలి నది. అలా జనజీవన స్రవంతితో కలగలిసిపోతుంది కాబట్టే నది దివ్యతీర్థమవుతుంది. ఈ జీవన సందేశాన్ని వినిపించడమే పుష్కరాల నిర్వహణ ఆంతర్యం.


ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది మహోజ్వలంగా నిర్వహించిన గోదావరి మహా పుష్కరాలు గాని, ఈ నెల (ఆగస్టు) 12 నుంచి 23 వరకు అంతకుమించి వేడుకగా జరగనున్న కృష్ణవేణి నదీ పుష్కరాలు గానీ తెలుగు జాతి సాంఘిక, చారిత్రక, ఆధ్యాత్మిక సంస్కృతుల మేలు కలయికగానే నిలిచాయి. ఈ ఆధునిక స్ఫూర్తికి ప్రధాన కారకులు చంద్రబాబు. ముఖ్యమంత్రి విజన్ కారణంగానే ఒక మతానికి పరిమితమైపోయే ప్రమాదం నుంచి తప్పుకొని, పుష్కరాలు జాతి జరుపుకొనే పండగలయ్యాయి. కుల, మత, వర్గ, ప్రాంతీయ విభేధాలను చెరిపి అందరినీ ఏకంచేసిన జాతీయ సమగ్రతా సందర్భాలయ్యాయి. విభజన విధ్వంసంతో అతలాకుతలమైన అవశేషాంధ్రకి మౌలిక సదుపాయాల కల్పనలో వెన్వెంటనే వచ్చిన గోదావరి... కృష్ణ పుష్కరాలు కూడా ఎంతో తోడ్పడటం గొప్ప లౌకిక విజయం. రోడ్లు, తద్వారా మెరుగైన రవాణా సదుపాయాలు, వైద్య ఆరోగ్యాల వంటి మౌలిక సదుపాయాలు, బలపడే కమ్యూనికేషన్ వ్యవస్థలు.... అన్నీ ప్రజాసంక్షేమ సాధకాలే.

జన జీవనాన్ని ఏకం చేయడానికి, ప్రజా ప్రయోజనాన్ని సాధించడానికి ఒక సాంస్కృతిక సందర్భాన్ని ఈ ప్రభుత్వం వినియోగించుకుంటున్న వైనం అభినందనీయం.

కందుల రమేష్

కందుల రమేష్ బాబు
ఎడిటర్

Printed and Published by **RAMESH BABU KANDULA** on behalf of Director/Commissioner, Information and Public Relations Dept.; Printed at **M/s Caxton Offset Pvt. Ltd.**, 11.5.416/3, Red Hills, Hyderabad - 500 004; Published at Office of Director/Commissioner , I&PR Dept, Govt of Andhra Pradesh, Samachar Bhavan, AC Guards, Hyderabad - 500028.
Editor: Ramesh Babu Kandula, Ph: 040-23300258.



'స్థానికత' విజయం చంద్రబాబుదే...

జూలై మాసపత్రిక 'ఆంధ్రప్రదేశ్'లో స్థానికతపై ఎట్టకేలకు రాష్ట్రపతి ఆమోదం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనంలో ఇచ్చిన వివరాలు బాగున్నాయి. రాష్ట్రపతి ఆమోదం పొందడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేసిన కృషి అభినందనీయం. 'స్థానికత' సమస్యపై అభద్రతాభావంతో ఉన్న ప్రభుత్వోద్యోగులు, ఇతరులకు ఈ ఉత్తర్వుల ద్వారా ఎంతో ఆత్మస్థైర్యం కలిగినట్టయింది. ప్రభుత్వోద్యోగులు కోరిన సమస్యలన్నీ దశలవారీగా పరిష్కరిస్తూ వారికి అండగా ఉండటం అభినందనీయం.

– రాయప్రోలు వామనమూర్తి, దిమిలి, విశాఖజిల్లా

కవర్ పేజీ అద్భుతం

జూలై నెల ఆంధ్రప్రదేశ్ పత్రికలో ప్రచురితమైన 'ఏరువాకతో రైతన్నకు భరోసా' అనే కవర్ పేజీ శీర్షిక అదిరింది. ఇందులోని రైతు ప్రయోజనాలకు సంబంధించిన అంశాలన్నీ విపులంగా ఇచ్చినందుకు ధన్యవాదాలు. ధాన్యాగారంగా పేరొందిన పశ్చిమగోదావరి జిల్లాలో ఏరువాక కార్యక్రమానికి అంకురార్పణ చేయడం అభినందనీయం. నదులు అనుసంధానానికి ఇక్కడ నుంచే నాంది పలకడం హర్షనీయం. ముఖ్యమంత్రి చంద్రబాబు రైతన్నల కుటుంబంలో ఒక పెద్దన్నగా నిలుస్తూ... రుణ భారం నుంచి వారిని విముక్తి కలిగించినందుకు అభినందనలు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి గత రెండేళ్లలో అనేక విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకోవడం మంచిపరిణామం.

– కాకరపర్తి సుబ్రహ్మణ్యం, తెనాలి

మనదంతా మహాసంకల్ప దీక్ష

ఆంధ్రప్రదేశ్ జూలై మాసపత్రికలో 'పట్టుదలతో శ్రమిస్తే ఫలితాలు' అనే శీర్షికతో ప్రచురితమైన నవనిర్మాణ, మహాసంకల్ప దీక్ష వార్తల్లో ఇచ్చిన అంశాలన్నీ బాగున్నాయి. 'ఏ పరిస్థితుల్లో రాష్ట్రవిభజన జరిగింది? గత రెండేళ్లలో ఏం సాధించాం? ఈ ఏడాది లక్ష్యాలేమిటి? భవిష్యత్‌లో అందరం ఏం చేయాలి? అనే అంశాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజలకు సవిరంగా తెలియజెప్పడం బాగుంది. నవ్యాంధ్రపాలనలో నవోదయం అనే శీర్షికతో ఇచ్చిన కథనంలో ప్రభుత్వోద్యోగులంతా హైదరాబాద్ నుంచి స్వరాష్ట్ర రాజధాని అమరావతికి తరలి రావడం రాష్ట్ర చరిత్రలో మరిచిపోలేని శుభదినం. మొత్తంమీద ఈ నెల పత్రికలోని అంశాలన్నీ బాగా ఆకట్టుకున్నాయి.

– ముక్కామల శిరీష, అమలాపురం

చంద్రబాబు కృషితోనే రెండంకెల వృద్ధి

ఆంధ్రప్రదేశ్ జూలై మాసపత్రికలో 'రెండంకెల వృద్ధి -రెండింతల అభివృద్ధి' అనే శీర్షికతో వెలువడిన వార్తా కథనంలో విభజన వల్ల ఎన్ని నష్టాలు, కష్టాలు వచ్చినా మొక్కవోని ధైర్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం అవిశ్రాంతంగా చేస్తున్న కృషి ఫలితమే ఈ రెండంకెల వృద్ధి. ముఖ్యమంత్రి అందిస్తున్న సత్పరిపాలనతో మన నూతన రాజధాని అమరావతి, దేశంలోనే ఒక అగ్రగామి నగరంగా పురోగమిస్తుందన్న విశ్వాసం నాకున్నది.

– జి.ఎస్ హరి, చీరాల

'ఆంధ్రప్రదేశ్' ఏడాది చందా 50 రూపాయలే

'ఆంధ్రప్రదేశ్' మాసపత్రికకు చందాదారులుగా చేరాలనుకుంటున్న వారు వార్షిక చందా నిమిత్తం 50 రూపాయల మనియార్డరును 'అకౌంట్స్ ఆఫీసర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, హైదరాబాద్' పేరిట పంపాలి. (మీరు డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) తీసుకునేట్లయితే, బ్యాంకు నిబంధనల ప్రకారం రూ. 60 కి డిడి పంపాలి.) తమ పూర్తి చిరునామాను, తాము 'ఆంధ్రప్రదేశ్ ' పత్రికను ఏ భాషలో కోరుకుంటున్నారో కూడా ఆ మనియార్డరులో రాయాలి. ఆ మనియార్డర్‌ను ఈ క్రింది చిరునామాకు పంపాలి.

అకౌంట్స్ ఆఫీసర్, సమాచార, పౌరసంబంధాలశాఖ, స్టేట్‌గెస్ట్ హౌస్ కాంపౌండ్, గోపాలరెడ్డి రోడ్, సూర్యారావుపేట, విజయవాడ – 520002., ఫోన్. 9949351534.

చందాదారులు తమ చిరునామా మార్పు, కాపీలు అందకపోవడం గురించి ఈ ఫోన్ నెంబరుకు కాల్ చేసి వివరాలు కనుక్కోవచ్చు: 91-9989662462.

రచయితలకు గమనిక

'ఆంధ్రప్రదేశ్' పత్రికపై అభిమానంతో రచనలను పంపుతున్న రచయితలు రచనతోపాటు తమ బ్యాంకు అకౌంట్ పాస్ బుక్ మొదటి పేజీ ఫోటో కాపీ గానీ, బ్లాంక్ చెక్కు కొట్టేసి పంపితేనే, ప్రచురితమైన రచనలు పారితోషికం ఆయా అకౌంట్‌లో జమ చేయడం జరుగుతుందని అకౌంట్స్ అధికారి తెలియజేస్తున్నారు. రచయితలూ, రచయిత్రులు దీని ప్రాధాన్యత గ్రహించి, మాతో సహకరించవలసిందిగా కోరుకుంటున్నాం.

– సంపాదకులు

నవ్యాంధ్ర శిరోమణి– కవిత ఆకట్టుకుంది

అవిశ్రాంత పురోగామి తరంగం విద్యావైద్య పారిశ్రామిక రంగం..మా విశాఖ కెవరు సాటి– మణిమయోజ్వల కిరీటి.. అంటూ పలు విధాలుగా విశాఖ ప్రాశస్త్యాని ఉగ్గడిస్తూ చందు సుబ్బారావు గారు రాసిన కవిత అద్భుతంగా ఉంది. గురజాడ, శ్రీశ్రీ, రావిశాస్త్రి వంటి మహా సాహితీస్రష్టల్ని కవితాత్మకంగా సంస్మరించడం ప్రశంసనీయం. నవ్యాంధ్ర శిరోమణి– కవిత ప్రచురించినందుకు ధన్యవాదాలు.

– ఈదుపల్లి వెంకటేశ్వర రావు, ఏలూరు

'జక్కన' వ్యాస రచనాశిల్పం బాగుంది

ఆంధ్రప్రదేశ్ జూలై మాసపత్రికలో 'చిత్రరూప శిల్పకావ్యం–అమర శిల్పి జక్కన' అనే శీర్షికతో ప్రచురితమైన వ్యాసం బాగుంది. ఇందులో శ్రీరామానుజార్యుల సమకాలీనుడైన అమరశిల్పి జక్కన జీవితంలోని అపురూప ఘట్టాలను కళ్లకు కట్టినట్టుగా వివరించినందుకు ధన్యవాదములు. పత్రికలోని మిగతా అంశాలు కూడ నాకు బాగా ఆకట్టుకున్నాయి. ఈ నెలలో మీరు ప్రచురించిన అంశాలతో అనేక విషయాలు తెలుసుకోగలిగాను.

– రామిరెడ్డి సుబ్బారెడ్డి, కర్నూల్.

ఆంధ్రప్రదేశ్ (తెలుగు, ఇంగ్లీష్) పత్రికను పాఠకులు ఇంటర్నెట్‌లో www.andhrapradeshmagazine.org లో కూడా చదువుకోవచ్చు.



వెల్లివిరిసిన పరస్పర సహకార బంధం

ఆంధ్ర – రష్యా మధ్య ఆదానప్రదానాలు | చంద్రబాబు పర్యటనలో పల్లవించిన మైత్రి

సరిహద్దులు దాటివెళ్లిన ప్రతి ప్రయాణం విదేశీయానమే కావొచ్చు. కానీ, కొన్ని పరదేశీ పర్యటనలు హద్దులు చెరిపేసి, పాత బంధాల్ని మరింత ముడివేసి, కొత్త అనుబంధాలు కలుపుతాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల రష్యా, కజకిస్థాన్‌లలో జరిపిన పర్యటనలు ఈ కోవకు చెందినవే. విదేశీయాత్ర సాఫల్యాన్ని అంచనా కట్టేందుకు అవసరమైన-కొత్త ప్రతిపాదనలు, పెట్టుబడులపై అవగాహనలు, కలిసి పనిచేసే ఒప్పందాలు వంటి ఇచ్చి పుచ్చుకునేవి అన్నీ ఉన్నాయి రష్యా యాత్రలో. అంతకు మించి, రెండు భిన్న సంస్కృతుల మధ్య, వ్యవస్థల మధ్య చంద్రబాబు వేసిన స్నేహవారధి ఎంతో విలువైనది. ఆదానప్రదానాల ఆ సావాస ఫలితంగా నవ్యాంధ్రకు అందనున్న సహాయ సహకారాలు మరెంతో విలువైనవి.

రష్యా పర్యటనల్లో భాగంగా ఎకటెరిన్‌బర్గ్ లో ఇన్నోప్రోమ్-2016 వేదికపై నుంచి చేసిన కీలకోపాన్యాసంలో రష్యాతో భారత్‌కి ఉన్న బంధమే కాదు, గతం నుంచి వర్తమానం దాకా ఆ దేశానికి ఆంధ్రాతో కొనసాగుతున్న అనుబంధాన్ని ప్రస్తావించారు చంద్రబాబు. ఆంధ్రా నుంచి రష్యాకు అత్యధికంగా పొగాకు ఎగుమతులు ఉండటం ఆనాటి లావాదేవీ అయితే, తెలుగువారి రెడ్డిల్యాబ్ రష్యాలో ఫార్మాల్యాబ్‌ను ప్రారంభించించడం ఈనాటి బంధమని చుట్టరికం కలిపి రష్యన్ల మనసులు గెలుచుకోవడం సిఎం రష్యా పర్యటనలో ఒకానొక విశేషం.

రాష్ట్రంతో మైత్రికి రష్యా ప్రధాని డిమిత్రి బాసట

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రష్యా పర్యటనలో భాగంగా రష్యా ప్రధాన మంత్రి డిమిత్రి మెద్వెదేవ్ ను ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి రావాలని సిఎం చంద్రబాబునాయుడు ఆహ్వానించారు. ఇన్నోప్రోమ్-2016కి భారత ప్రతినిధులుగా వెళ్లిన కేంద్ర వాణిజ్యశాఖ సహాయ మంత్రి నిర్మలా సీతారామన్, మహారాష్ట్ర, రాజస్థాన్ ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడణవీస్, వసుంధర రాజే, రష్యాలో భారత రాయబారి పంకజ్ శరణ్‌తో కలిసి రష్యా ప్రధానితో భేటీ అయిన సందర్భంగా ముఖ్యమంత్రి ఆయనని ఆహ్వానించారు. తన పర్యటనకు ఏర్పాట్లు చేయాలని మెద్వెదేవ్ అక్కడికక్కడే అధికారులకు ఆదేశించి, చంద్రబాబు ఆహ్వానంలోని ఆత్మీయతని గుర్తించినట్టు చెప్పకనే చెప్పారు. అంతేగాకుండా, నవ్యాంధ్ర రాజధాని నిర్మాణంలో సహకరించేలా, పరిశ్రమల ఏర్పాటును పరిశీలించేలా తమ మంత్రికి కూడా సూచిస్తానని మెద్వెదేవ్ హామీ ఇచ్చారు.

'భారత్, రష్యా సుస్థిర నాయకత్వాలను కలిగి ఉన్నాయి. ఈ లక్షణాలు మన రెండు దేశాలను ప్రపంచంలోనే ప్రత్యేక దేశాలుగా నిలబెడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమైన నౌకాదళ కేంద్రం ఉంది. మీరు ఏరోస్పేస్ డిఫెన్స్, చమురు, అంతర్గత జలరవాణా, అణుశక్తిలో బలీయమైన శక్తిగా ఉన్నారు. మీ వనరులు, మా ఐటీ రెండూ కలిస్తే అద్భుతమైన జోడీ అవుతుంది. ఈ కలయిక ఉభయతారకం. మీరు మా రాజధానికి రండి' అని సిఎం చంద్రబాబు రష్యా ప్రధానికి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. దీంతో తప్పకుండా వస్తామని ఆయన హామీ ఇచ్చారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటనకు ముందే కొన్ని ప్రాజెక్టులు చేపట్టడానికి చొరవ తీసుకోవాలని చంద్రబాబు విజ్ఞప్తి చేయగా మెద్వెదేవ్ సానుకూలంగా స్పందించారు. తమ వాణిజ్య మంత్రిని ఇదే పనిపై ఉండాల్సిందిగా సూచిస్తామని తెలిపారు.

'రష్యా అంటే మాస్కో, ఇండియా అంటే ఢిల్లీ మాత్రమే కాదు, మా ప్రోవిన్సులు, మీ రాష్ట్రాల మధ్య సహకారం, సమన్వయం కోసం ఈరోజు జరిగిన భేటీ ఒక ముందడుగు;" అని రష్యా ప్రధాన మంత్రి డిమిత్రి మెద్వెదేవ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖలో ముఖ్యమైన నావికా కేంద్రం ఉంది. ఏరోస్పేస్ డిఫెన్స్, ఆయిల్, అంతర్గతజలరవాణా, అణుశక్తిలో రష్యా బలమైన శక్తిగా ఉంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లో నిర్మించే హరితరాజధాని అమరావతిలో రష్యాకు విస్తృత అవకాశాలువున్నాయి. ఈ నేపథ్యంలో రష్యా కంపెనీలు అమరావతి నిర్మాణంలో భాగస్వామి కావచ్చని ముఖ్యమంత్రి ప్రతిస్పందించారు.

ఏపీ పెవిలియన్‌లో రష్యా ప్రధాని

రష్యా ప్రధాని ఇన్నోప్రోమ్-2016లో ఏపీ పెవిలియన్‌ను సందర్శించారు. ఇన్నోప్రోమ్-2016 ప్రదర్శనలో కలియతిరిగి వివిధ ఉత్పత్తుల వివరాలు తెలుసుకున్నారు. కాగా, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ), భారీ ఎర్త్ మూవింగ్ యంత్ర పరికరాలు, 360 డిగ్రీస్ విజన్ ఉపకరణాలపై ముఖ్యమంత్రి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు, చంద్రబాబు ప్రత్యేక విజ్ఞప్తి మేరకు రష్యా ఫెడరేషన్ పరిశ్రమలు, వాణిజ్యశాఖల మంత్రి డెనిస్ మాంచురోవ్ ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌ను ప్రారంభించారు. మరోపక్క రష్యా, ఇండియా బిజినెస్ ఫోరాన్ని రష్యన్ బిజినెస్ ఆర్గనైజేషన్ ప్రతినిధి అలెక్సి రెపిక్ ప్రారంభించారు.


ఇన్నోప్రోమ్ -2016లో చంద్రబాబు కీలకోపన్యాసం

సహజ వనరుల వినియోగం, సాంకేతికతను వినియోగించుకోవడంలో అగ్రస్థానంలో ఉన్న రష్యాతో కలసి పని చేయాలన్న ధృఢ నిశ్చయంతో ఆంధ్రప్రదేశ్ ఉందని, రష్యా, ఏపీల మధ్య చిరకాల మైత్రి కొనసాగుతుందని, ఏపీ నుంచి రష్యాకు అత్యధికంగా పొగాకు ఎగుమతులు జరిగేవని సిఎం చంద్రబాబు అన్నారు. రష్యాలోని ఎకటెరిన్‌బర్గ్‌లో జరిగిన అంతర్జాతీయ పారిశ్రామిక ప్రదర్శన 'ఇన్నోప్రోమ్- 2016' వేదికపై నుంచి సిఎం చంద్రబాబునాయుడు కీలకోపన్యాసం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో పాలుపంచుకోవాలని రష్యాను కోరారు. 'మాకున్న సుదీర్ఘ తీర ప్రాంత అభివృద్ధి కోసం మీతో కలసి పని చేయాలని భావిస్తున్నాం. మా ఎదుగుదలకు తోడ్పడండి" అని విజ్ఞప్తి చేశారు. తెలుగువారి యాజమాన్యంలోని రెడ్డి ల్యాబ్స్ రష్యాలో ఫార్మా ల్యాబ్ ప్రారంభించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. "మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మా కేంద్ర మంత్రి ఇక్కడే ఉన్నారు. అభివృద్ధిలో మేం పరస్పరం పోటీ పడుతున్నాం. రెండంకెల వృద్ధితో దూసుకువెళుతున్న ఆంధ్రప్రదేశ్‌కు రావాలని ప్రతి ఒక్కరినీ ఆహ్వానిస్తున్నాం. రండి,మాతో కలసి పనిచేసేందుకు ఇదో గొప్ప అవకాశం" అని సిఎం చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. ఇన్నోప్రోమ్-2016లో భాగస్వామ్య దేశంగా వ్యవహరిస్తున్న భారతదేశ ప్రతినిధిగా హాజరైన నిర్మలా సీతారామన్ ప్రారంభోపన్యాసం చేశారు. 2025నాటికి భారత్, రష్యాల మధ్య 30బిలియన్ డాలర్ల మేరకు వ్యాపారం జరగాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆమె తెలిపారు.

"భారత్- రష్యా సంబంధాల్ని మెరుగుపరిచే ప్రక్రియ నిరంతరం కొనసాగాలి. వచ్చే సంవత్సరం మార్చిలో చెన్నైలో నిర్వహించే 'ఇండియా ఇంజినీరింగ్ సోర్సింగ్ ఎగ్జిబిషన్'కు రష్యాను ఆహ్వానిస్తున్నాను," అని ఆమె అన్నారు. నాలుగో పారిశ్రామిక విప్లవం దిశగా అడుగులు వేయని దేశాలు ప్రపంచ గమనంలో వెనుకబడిపోతాయని నాల్గురోజుల ఇన్నోప్రోమ్-2016 అభిప్రాయపడింది.

ఏపీలో రష్యా పరిశ్రమల క్లస్టర్

ఆంధ్రప్రదేశ్ లో రష్యా పరిశ్రమలకు ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటు చేయాలని కృతనిశ్చయంతో ఉన్నట్టు చంద్రబాబు తెలిపారు. ఆయన ఎల్మామ్ గ్రూపుతో జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో ఈ విషయం తెలిపారు. రష్యా పరిశ్రమలకు, రష్యాలో స్థిరపడిన భారతీయ పెట్టుబడిదారులకు అన్ని విధాలా సహకరిస్తామని ఎల్మామ్ గ్రూపు డైరెక్టరు ప్రద్నిల్ ఉస్గావ్కర్‌కు ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో తాము అమలు చేస్తున్న పారిశ్రామిక అనుకూల విధానాల గురించి వివరించారు. తమకు అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఏరోస్పేస్ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ వంటి పరిశ్రమలు ఉన్నాయని, భారత్‌లో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నామని ఉస్గావ్కర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో



పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని భావిస్తున్నామని తెలిపారు. దీనికి ముఖ్యమంత్రి స్పందిస్తూ- ఏపీలో ల్యాండ్ బ్యాంక్ ఉందని, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పరిశ్రమల స్థాపనకు వస్తే స్వాగతిస్తామని, అన్ని విధాలా సహకరిస్తామని భరోసా ఇచ్చారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో తాము దేశంలో రెండో స్థానంలో ఉన్నామని, పుష్కల సహజవనరులు ఉన్నాయని, నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి తమ బలమని, ఎల్‌కామ్ గ్రూప్ పరిశ్రమలను స్థాపించడానికి ఆంధ్రప్రదేశ్ ఎంతో అనువైన గమ్యస్థానమని వివరించారు. అంతకుముందు సన్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు వైద్యనాథన్ శివకుమార్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు.

ఏపీలో భారీ పరిశ్రమల స్థాపనకు చెలబిన్స్ చేయూత

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు చెలబిన్స్ ప్రావిన్స్ గవర్నర్ బోరిస్‌తో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, చెలబిన్స్ ప్రావిన్స్ కలసి పనిచేయాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. ఇందుకు గవర్నర్ బోరిస్ అంగీకారం తెలిపారు. ఇరు ప్రాంతాల పక్షాన చెరో ఐదుగురు సభ్యులతో త్వరలో వర్కింగ్ గ్రూప్ ఏర్పాటుకు ఈ సమావేశంలో నిర్ణయించారు. వచ్చే మార్చిలో భారత్ పర్యటన సందర్భంగా పలు ప్రాజెక్టులు కార్యరూపం ధరించాలని ఆకాంక్షించారు. ఏపీ ఐటీ సాంకేతిక పరిజ్ఞానాన్ని చెలబిన్స్ ప్రావిన్స్‌కు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇదిలా ఉంటే సుసంపన్న ప్రాంతంగా పేరున్న చెలబిన్స్ పారిశ్రామిక రాజధాని లాంటిది. భారీ పరిశ్రమలకు కేంద్రం. నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో భవన నిర్మాణాలకు సహకారం అందించటానికి మాస్కో నగరపాలక సంస్థ ముందుకు వచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు మాస్కో నగరపాలక సంస్థ విజ్ఞాన, పారిశ్రామిక విధాన విభాగాధిపతి ఒలెగ్ బొచరోవ్‌తో సమావేశమయ్యారు. రాజధాని భవనాల నిర్మాణంలో తాము సహకరిస్తామని, నూతన రాజధానిని ప్రపంచ స్థాయిలో నిర్మించటానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం తమ దగ్గర ఉందని, సంపూర్ణ సహకారం అందిస్తామని బొచరోవ్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గాజ్‌ప్రోమ్ బ్యాంక్ ఫస్టు వైస్ ప్రెసిడెంట్ యాంట్ సెంటర్‌తో సమావేశమయ్యారు. "భారత్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న దేశం. ఆంధ్రప్రదేశ్‌లో మాకు భారీ పారిశ్రామిక యంత్ర సామాగ్రి అవసరం చాలా ఉంది. మేకిన్ ఇండియాపై భారత్ నిశిత దృష్టి పెట్టింది, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ని భారీ పరిశ్రమల ఏర్పాటుకు వీలయితే అన్ని నెలకొల్పేందుకు మేము కృషి చేస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ తరలి రావటానికి ఇదే తగిన సమయం," అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానించారు.

స్వెర్డ్‌లోవ్స్క గవర్నర్ మెచ్చుకోలు

స్వెర్డ్‌లోవ్స్క గవర్నర్ ఎవిజినీ కుయివషెవ్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ ముఖ్యమంత్రిని ప్రశంసలతో ముంచెత్తారు. ఆంధ్రప్రదేశ్ గురించి తెలుసుకున్నామని, పరిపాలనలో అద్భుత సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించే ప్రతిభ తమకి నచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబును మెచ్చుకున్నారు గవర్నర్. ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం కోర్ డ్యాష్ బోర్డు గురించి, ఎప్పటికప్పుడు తాజా సమాచారం ఉంచే విధానాన్ని తెలుసుకుని స్వెర్డ్‌లోవ్స్క గవర్నర్ ఆశ్చర్యపోయారు. ఎంతో ఆసక్తిగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. 'మీ సుపరిపాలన నుంచి మేం నేరచుకోవాల్సింది ఎంతో ఉంది' అని ఆయన చంద్రబాబుతో అన్నారు. పరస్పర సంప్రదింపుల కోసం ఒక వ్యవస్థ ఏర్పాటు చేసుకుందామని ఆయన ప్రతిపాదించారు. త్వరలో ఏపీకి తమ బృందానికి పంపిస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో రెండు రాష్ట్రాల సంయుక్త నిర్వహణలో వెంచర్స్‌కు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటామని ఆయన తెలిపారు.

ఎన్ఎల్ఎంకె ఉక్కు కంపెనీ ప్రతినిధులతో...

ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడులతో భారత్‌లో ప్రవేశించడానికి ముందుకొస్తున్న ఎన్.ఎల్.ఎం.కె గ్రూప్ ప్రతినిధులతో సిఎం సమావేశమయ్యారు. ప్రపంచంలోని 20 ఉక్కు అగ్రగామి ఉత్పత్తి సంస్థల్లో ఒకటిగా ఈ సంస్థకు గుర్తింపు వున్నది. అతి చౌకగా ఉక్కును ఉత్పత్తి చేసే సంస్థగా పేరు పొందింది. ప్రాజెక్టు ఏర్పాటుకు నిరంతర విద్యుత్ సరఫరా,సహజ వాయువు,సరిపడా నీరు,తగినంత భూమి అవసరమని గ్రూపు ప్రతినిధులు ప్రతిపాదించగా సిఎం చంద్రబాబు స్పందించి ఏపీకి వచ్చి ఈడీబీతో సమన్వయం చేసుకొని అవకాశాలు పరిశీలించుకోవాలని చంద్రబాబు సూచించారు.

బష్కోరొస్తాన్ డిప్యూటీ పిఎం డిమిత్రితో భేటీ

బష్కోరోస్తాన్ ప్రభుత్వ డిప్యూటీ ప్రధానమంత్రి షరనోవ్ డిమిత్రితో సిఎం చంద్రబాబు సమావేశమయ్యారు. తమ రాజధాని ఉఫాలో ఇటీవలే బ్రిక్స్ సమావేశం జరిగిందని,చమురు శుద్ధిలో తమ టెక్నాలజీ ప్రపంచంలోనే ఉత్తమమైనదని,ఇతర ప్రాసెసింగ్ పద్ధతులలో పోలిస్తే 40శాతం వ్యయం తక్కువని షరనోవ్ డిమిత్రి వివరించారు. టెలివిజన్ పరికరాలు,ఎయిర్ క్రాఫ్ట్ ఇంజన్ల తయారీలోను తాము ముందున్నట్లు చెప్పారు. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లో తయారీ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు తమకు ఆసక్తి వుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు వున్న అవకాశాలను సిఎం చంద్రబాబు వివరించగా డిమిత్రి స్పందిస్తూ భారత్‌లో ఆంధ్రప్రదేశ్ ఐటి రంగంలో సాధించిన ప్రగతి తమకు తెలుసునన్నారు. "మీరు అమలు చేస్తున్న ఈ-పాలనా విధానాలపై అధ్యయనం చేయడానికి మీ రాష్ట్రానికి వస్తాం"అని బష్కోరోస్తాన్ డిప్యూటీ ప్రధాని సిఎం చంద్రబాబుతో చెప్పారు. ఈ ఏడాది చివరలో ఏపీకి రావడానికి డిమిత్రి అంగీకరించారు.

నవ్యాంధ్రలో మెరైన్ యూనివర్సిటీ

నవ్యాంధ్ర లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సముద్ర వైజ్ఞానిక విశ్వవిద్యాలయం మెరైన్ యూనివర్సిటీ ఏర్పాటు కానుంది. సిఎం

చంద్రబాబు రష్యా పర్యటనలో ఐదో రోజు ఈ మేరకు కీలకమైన అవగాహన ఒప్పందం కుదిరింది. ఇందుకోసం రష్యా–సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని స్టేట్ మెరైన్ టెక్నికల్ యూనివర్సిటీ సహకారం అందించడానికి ముందుకు వచ్చింది. యూనివర్సిటీ ఏర్పాటులో రష్యాకు చెందిన యునైటెడ్ షిప్ బిల్డింగ్ కార్పొరేషన్ సహకరించడానికి సంసిద్ధత తెలిపింది. ఏపీకి వున్న సుదీర్ఘ సముద్ర తీరం,సముద్ర కార్యకలాపాల్లో ఏపీకి వున్న ప్రత్యేకతలను పరిగణలోకి తీసుకున్నామని ఏపీని ప్రధాన కేంద్రంగా పరిగణిస్తామని కార్పొరేషన్ అధ్యక్షుడు అలెక్సిఎల్ రఖ్మనోవ్ వెల్లడించారు. యూనివర్సిటీ విశిష్టతలపై ప్రతినిధులు,ముఖ్యమంత్రి చంద్రబాబు బృందానికి ప్రజెంటేషన్ ఇచ్చారు. తమ యూనివర్సిటీలో చదువుకున్న 60శాతం మంది గ్రాడ్యుయేట్లకు నౌకా నిర్మాణం పరిశ్రమలో ఉద్యోగాలొచ్చాయన్నారు. తాము నావల్ ఆర్కిటెక్చర్, మెరైన్ ఇంజనీరింగ్ పై దృష్టి పెట్టామన్నారు. యూనివర్సిటీలో ప్రస్తుతం అమెరికా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ,ఫిన్లాండ్,స్వీడన్,సౌత్ కొరియా,సింగపూర్,బ్రెజిల్ నెదర్లాండ్ వంటి దేశాలకు చెందిన 5వేల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు.

రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ తమ దేశానికే ఒక లాజిస్టిక్ హబ్‌గా మారబోతుందని ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు యూనివర్సిటీ ప్రతినిధులకు తెలిపారు. జల రవాణాను వాణిజ్య అవసరాలకు వినియోగించుకోవాలని తాము భావిస్తున్నామని తమ దేశంలో జల రవాణా వ్యయం అత్యంత చౌక అని వారికి వివరించారు. సముద్ర విజ్ఞాన సాంకేతికతతో అంతర్జాతీయ ప్రసిద్ధి చెందిన . సెయింట్ పీటర్స్‌బర్గ్ స్టేట్ మెరైన్ యూనివర్సిటీకి అనుబంధంగా ఏపీలో కొత్త విశ్వవిద్యాలయం ఏర్పాటు కానుండటంతో తనకు ఎంతో సంతోషంగా వుందన్నారు సిఎం చంద్రబాబు.

ఏపీ బీచ్ టూరిజానికి సెయింట్ పీటర్స్‌బర్గ్ సహకారం

ఆంధ్రప్రదేశ్ లో తీర ప్రాంత పర్యటకాభివృద్ధికి సహకరించడానికి సెయింట్ పీటర్స్‌బర్గ్ ముందుకు వచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని ప్రతినిధుల బృందాన్ని ఉద్దేశించి. సెయింట్ పీటర్స్‌బర్గ్ ఎక్స్‌టర్నల్ రిలేషన్స్ కమిటీ చైర్మన్ ఏవిజినీ గ్రిగేరోవ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌తో తమ ప్రావిన్స్‌కు చరిత్రాత్మక సంబంధాలున్నాయని,సెయింట్ పీటర్స్‌బర్గ్, భారత్‌కు దశాబ్దాల బంధమని ఎన్నో తీపి గుర్తులున్నాయన్నారు. ఒక పాఠశాలకు ఇక్కడ తాము విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ పేరు పెట్టినట్లు గుర్తుచేశారు. ఆ పాఠశాలలో హిందీలో బోధిస్తున్నామన్నారు. రష్యా ఔషధ పరిశ్రమ రంగంలో 20శాతం సెయింట్ పీటర్స్‌బర్గ్‌దే అని అన్నారు. ఈ సందర్భంగా ఐటి,ఫార్మాలో ఏపీ,సెయింట్ పీటర్స్‌బర్గ్‌కు మధ్య సంబంధాలు బలపడాలన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు. ఆంధ్రప్రదేశ్‌లో 6 ప్రధాన ఓడరేవులున్నాయని,మరో 8 పోర్టులు అభివృద్ధి చేస్తున్నట్లు సిఎం వివరించారు. పర్యాటక రంగాన్ని తమ రాష్ట్రంలో అభివృద్ధి చేయడానికి సెయింట్ పీటర్స్‌బర్గ్ సహకరించాలన్నారు.

ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డుతో ఎంఓయు(ఎస్సిఎఫ్)

రష్యన్ మారిటైమ్ సేఫ్టీ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ సొవోక్లోమ్ ఫ్లాట్ (ఎస్సిఎఫ్) సిఎం చంద్రబాబు సందర్శించారు. దేశంలో గుజరాత్ తరువాత మా రాష్ట్రానికి పొడవైన సముద్ర తీరం వుందని,రాష్ట్రాన్ని లాజిస్టిక్ హబ్ గా తీర్చిదిద్దుతామన్నారు. ఈస్ట్ ఏసియాకు గేట్‌వేగా తమ రాష్ట్రం నిలవాలని తమ లక్ష్యమన్నారు చంద్రబాబు. మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్టును తమ రాష్ట్రంలో నెలకొల్పడానికి సహకారం అందించాలని కోరారు చంద్రబాబు. పోర్టులు, జల మార్గాలు, కాల్వలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రష్యన్ మారిటైమ్ సేఫ్టీ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ సోవోక్లోమ్(ఎస్ఈఎఫ్) రష్యాలో మొత్తం నావికాదళాన్ని సమన్వయం చేస్తుందని ఎస్సిఎఫ్ ఈసీఓ అలెక్సి ప్రొకొపయేవ్తో వివరించారు. మాస్కోలోని రష్యన్ నేవీ ఫ్లీట్ ఆధిపత్య నియంత్రణ వ్యవస్థను సోవోక్లోమ్ ఫ్లాట్ రూపొందించిందని తెలిపారు. భారత్ మేకిన్ ఇండియా పిలుపులో బాగంగా భారత్‌కు రావాలని భావిస్తున్నట్లు తెలిపారు.

ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డుకు, యూనివర్సిటీకి ఒప్పందాల ముఖ్యాంశాలు:

- సంబంధిత విద్య, పరిశోధనల్లో పరస్పర సహకారం
- ఉభయుల మధ్య సిబ్బంది బదలాయింపు
- విద్య విషయక సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం
- ఇ–లెర్నింగ్ సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవడం
- ఆంధ్రప్రదేశ్‌లో అత్యున్నత ప్రమాణాలతో నడుస్తున్న కొన్ని పాఠశాలల్లో నౌకా నిర్మాణ, సముద్ర విజ్ఞాన కోర్సులు ప్రవేశపెట్టడం. ఇక్కడి విద్యార్థులకు రష్యా యూనివర్సిటీలో ప్రవేశాలు.
- ఆంధ్రప్రదేశ్ లోని ఉన్నతస్థాయి సాంకేతిక విశ్వవిద్యాలయాలతో ఉమ్మడి విద్యా కార్యక్రమాలు
- నౌకా నిర్మాణం, ఓషన్ ఇంజినీరింగ్ రంగాల్లో రష్యా, భారత్ సహకారం.

మంత్రులు యనమల రామకృష్ణుడు, పి.నారాయణ, ప్రభుత్వ సలహాదారు డా. పరకాల ప్రభాకర్, ఉన్నతాధికారులు సతీష్ చంద్ర, జి. సాయిప్రసాద్, అజయ్ జైన్, జాస్తి కృష్ణ కిశోర్, సాల్మన్ అరోకియా రాజ్, శ్రీమతి డి. లక్ష్మీ పార్థసారథి ప్రభృతులతో రష్యాలో పర్యటించిన బృందానికి నేతృత్వం వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కనబరు–స్తున్న చొరవకు కేంద్ర సాయం తోడైతే దేశంలోనే అగ్రగామి రాష్ట్రాల్లో ఒకటిగా ఆంధ్రప్రదేశ్ నిలిచే రోజు మరెంతో దూరంలో లేదు. ❖



ఇన్నోప్రోమ్–2016లో ఏపీ పెవిలియన్ వద్ద రష్యా ప్రధాన మంత్రి డిమిత్రి మెద్వెదేవ్ తో ముఖ్యమంత్రి

"అస్తానా నగరాన్ని పరిశీలించాను. అందంగా, అద్భుతంగా ఉంది. ఇది ఎంతో నూతన, అత్యంత అధునాతన, క్రియాశీల నగరం. గతంలో మీరు విభజన ఫలితాన్ని చూశారు. ప్రస్తుతం రాష్ట్ర విభజనకు గురయిన మేం అదే స్థితిలో ఉన్నాం. మీరు దేశ రాజధానిని నిర్మించుకున్నారు. నేను రాష్ట్ర రాజధానిని నిర్మించుకోవాలి. మేం మీ నగరం నుంచి ఎంతో నేర్చుకోవాల్సి ఉంది. అస్తానా నగర రూపశిల్పులు, నిర్మాణంలో పాల్గొన్న నిపుణుల వివరాలు, వారి అనుభవాలు మాకు ఇవ్వండి. మీరు కూడా అమరావతిని సందర్శించండి. పరస్పరం సహకరించుకోవటానికి మనం ఒక రోడ్‌మ్యాప్ రూపొందించుకుందాం

– ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అస్తానా మేయర్ అస్సెట్ ఇష్కెషోవ్‌తో చంద్రబాబు





కజకిస్థాన్ సంప్రదాయ దుస్తుల్లో ముఖ్యమంత్రి

"అస్తానా నగర నిర్మాణానికి మాకు దశాబ్ద కాలం పట్టింది, పదేళ్ల కాలంలో 150 మంది వాస్తుశిల్పులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అమరావతి నిర్మాణంలో మేం మీకు సంపూర్ణ సహకారం అందిస్తాం. నిర్మాణంలో మేం ఎక్కడ పొరపాట్లు చేశాం, ఎక్కడ సరిగ్గా వ్యవహరించామో మీకు తెలుస్తుంది. ఇందువల్ల పొరపాట్లు జరగకుండా ముందుగానే జాగ్రత్తపడినట్లు అవుతుంది. మా కృషి కంటే మీరు మరింత మెరుగ్గా కృషి చేయవచ్చే. మీతో కలసి పనిచేస్తాం

– అస్తానా మేయర్ అస్సెట్ ఇష్కెషోవ్

అటు అస్తానా... ఇటు అమరావతి!

అస్తానా అంటే అర్థం అమరావతి. ఏ భాషలో ఈ అర్థం? కజకిస్థాన్ వ్యవహార భాష కజక్‌లోనా, అధికారిక భాష రష్యన్ లోనా, మన మాతృభాష తెలుగులోనా. అస్తానా అంటే అమరావతి అనే అర్థాన్ని ఏ డిక్షనరీ ఇస్తుంది? అది మాటల నిఘంటువులో కాదు, చేతల పదకోశంలో తెలుస్తుంది. నరేంద్రుడు ఉప్పందిస్తే, చంద్రుడు అల్లుకుపోయిన కార్యదక్షతల పరిభాష అర్థం అవుతుంది. అప్పుడు అస్తానా- అమరావతి, పర్యాయాలనీ, జంట పదాలని తెలుస్తుంది. అఖండ సోవియట్ యూనియన్ నుండి కిజకిస్థాన్ వేరుపడింది, అవిభాజ్య ఆంధప్రదేశ్ నుండి అవశేషాంధ్ర ఏర్పడింది. ఇలా పునాదుల్లోంచి మొదలుపెట్టుకోవలసిన పరిస్థితుల నుంచి అన్నీ పోలికలే, అన్నింటా సామ్యాలే. ఇటీవల కజకిస్థాన్‌లో రెండు రోజులు పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు- ఇషమ్ నది ఒడ్డున అస్తానాలో మన కృష్ణాతీరాన రేపటి అమరావతిని దర్శించారు. అవకాశాలు అందిపుచ్చుకోవడంలో, అంతర్జాతీయ సహకారం అందుకోవడంలో, పర్యాటక ప్రాముఖ్యాన్ని గుర్తించడంలో అస్తానా వేస్తున్న అడుగుల్లో అమరావతిని చూశారు ముఖ్యమంత్రి. రష్యా పర్యటనలో భాగంగా కజికిస్థాన్‌కు వెళ్లిన చంద్రబాబు కలుసుకున్న ప్రముఖులు, పాల్గొన్న సమావేశాలు, జరిపిన చర్చోపచర్చల్లో అడుగడుగునా అమరావతి స్వప్నమే తొణికిసలాడింది.

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి కజకిస్థాన్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. అస్తానా, ఆంధ్రప్రదేశ్ మధ్య పరస్పర సహకారానికి కార్యాచరణ బృందం ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్, అస్తానాలు నిర్ణయించాయి. ప్రపంచ నగరాల్లో నిర్మాణశైలిలో అద్భుతంగా ప్రశంసలు అందుకున్న కజకిస్థాన్ రాజధాని అస్తానాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అస్తానా మేయర్ అస్సెట్ ఇష్మెషోవ్‌తో భేటీ అయ్యారు. అమరావతి నగర నిర్మాణానికి ఉభయులూ ఆగస్టులో ఒక ప్రాథమిక అవగాహన ఒప్పందం చేసుకోవాలని నిర్ణయించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ గత ఏడాది భారత ప్రధాని నరేంద్రమోదీ ఇక్కడ పర్యటించి ఈ అద్భుత నగర నిర్మాణ విశిష్టతను ప్రశంసించారని, ఈ నగరాన్ని సందర్శించాలని తనకు గుర్తు చేశారన్నారు. అస్తానా నగరం అందంగా,అద్భుతంగా వుంది ఇది అత్యంత అధునాతన క్రియాశీల నగరం. గతంలో వీరు విభజన ఫలితాన్ని చూశారు. ప్రస్తుతం రాష్ట్ర విభజనకు గురైె మేము అదే స్థితిలో వున్నాం,మీరు దేశ రాజధాని నిర్మించుకున్నారు. నేను రాష్ట్ర రాజధాని నిర్మించాలి. మీ నగరం నుంచి ఎంతో నేర్చుకోవాల్సి వుంది. మా రాష్ట్ర రాజధాని నిర్మాణానికి అస్తానా అనుభవాలు స్వీకరించదలిచాం. ఆస్తానా నగర రూపశిల్పులు, నిర్మాణ నిపుణుల వివరాలు,వారి అనుభవాలు మాకు ఇవ్వండని అస్తానా మేయర్ ను సిఎం చంద్రబాబు కోరారు. అంతేగాకుండా మేము ఇక్కడికి వచ్చినట్లే మీరు కూడా అమరావతిని సందర్శించాలి. పరస్పరం సహకరించుకోవడానికి రోడ్ మ్యాప్ రూపొందించుకుందాం. ఐటి,పర్యాటకం, ఔషధ ఉత్పత్తి రంగాల్లో మేము పటిష్టంగా వున్నాం. వైజ్ఞానికంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం మాది. కేవలం రాజధానికే పరిమితం కాకుండా అనేక రంగాలలో మన సహకారం విస్తరించాలి. ఇందుకు మనం కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేసుకుందాం. ఆంధ్రప్రదేశ్ తరఫున వర్కింగ్ గ్రూపునకు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ నేతృత్వం వహించనున్నారు. అస్తానా మేయర్ ఇష్మెషోవ్ మాట్లాడుతూ వర్కింగ్ గ్రూపులో తమ సభ్యులను త్వరలో ప్రకటిస్తామని ప్రకటిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ గ్రూపులో ఐదుగురు,ఆస్తానా వర్కింగ్ గ్రూపులో ఐదుగురు సభ్యులు వుండనున్నారు. వచ్చే ఏడాది ఎక్స్‌పో- 2017 అస్తానాలో నిర్వహించనున్నామని, దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని ఆహ్వానిస్తున్నామని,ఆయన తప్పక హాజరు కావాలని మేయర్ తెలిపారు. ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలత వ్యక్తం చేశారు.

ఐటీలో చంద్రబాబు కృషికి అస్తానా మేయర్ ప్రశంస

అస్తానా మేయర్ ఇష్మెషోవ్ మాట్లాడుతూ 'భారత రాజకీయాల్లో మీ క్రియాశీల పాత్ర మాకు తెలుసని, ఐటీ, సాంకేతిక రంగాల్లో మీరు చూపిన చొరవ తమ దృష్టికి వచ్చింద'ని ప్రశంసించారు. ఇటీవలే తను భారత్‌కి వచ్చి పరిశ్రమల మంత్రిని కలుసుకున్నానని, అనేక మంది వాణిజ్య వేత్తలతో సమావేశమయ్యానని మేయర్ ఇష్మెషోవ్ అన్నారు. రాజధాని నిర్మాణాన్ని దేశాధ్యక్షుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించారన్నారు. తమకున్న అనుభవాలను అమరావతి నిర్మాణంలో పాలు పంచుకోవడానికి సిద్ధంగా వున్నామన్నారు మేయర్.

అమరావతి-అస్తానాకు నేరుగా విమాన సర్వీసు

తమ దేశ రవాణాశాఖ మంత్రితో మాట్లాడి అస్తానా నుంచి అమరావతికి నేరుగా విమాన సర్వీసు నడిపేందుకు ప్రయత్నిస్తానని, ఇష్మెషోవ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు హామీ ఇచ్చారు. అనంతరం కజకిస్థాన్ రాయబారి చంద్రబాబుకు ఘనస్వాగతం పలికి అల్పాహార విందు ఇచ్చారు. నిర్మాణ సౌందర్యం,కౌశలం సిఎం చంద్రబాబుని ముగ్ధుడిని చేసింది. నగరానికి శిగపువ్వు లాంటి ప్రతిష్ఠాత్మక బెతెరిక్ టవర్ నుంచి ఆయన అస్తానా ముఖ్య రాజధాని ప్రాంతాన్ని వీక్షించారు. ఆస్తానా నగరాన్ని 1997లో నిర్మించినందుకు గుర్తుగా రూపుదిద్దిన 97 అడుగుల ఎత్తైన చిహ్నం అది. అట్లాగే నజర్బయేవ్ యూనివర్సిటీని చంద్రబాబు బృందం సందర్శించింది. ఈ బృందంలో ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్ వున్నారు.

❖

బీసీ కార్పోరేషన్లకు నిధుల వరద

బడుగులకు తప్పిన అప్పుల తిప్పలు

రెక్కాడినా డొక్కాడుతుందనే నమ్మకంలేని బడుగు బతుకుల్ని దినదిన గండంగా మార్చే మహమ్మారి అప్పు. ఆ అప్పుల అక్టోపస్ బారి నుంచి బీసీ కులాల పేదలని కాపాడే రెండు మహత్తర పథకాల్ని ప్రవేశపెట్టింది నారా చంద్రబాబు నాయుడి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం. మార్జిన్ మనీ, బీసీ అభ్యుదయ యోజన పేరుతో రెండు పథకాలతో సబ్సిడీకి రుణాలను అందిస్తోంది. 1974లో బీసీ సహకార ఆర్థిక కార్పోరేషన్ ఏర్పాటైన విషయం తెలిసిందే. బీసీ వెల్ఫేర్‌శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సహకార ఆర్థిక కార్పోరేషన్‌కు అనుబంధంగా జిల్లా బీసీ సర్వీస్ కోపరేటివ్ సొసైటీలను 1975లో ఏర్పాటు చేయడం జరిగింది. బీసీల్లో ఉన్న పేద ప్రజల కోసం బీసీ కార్పోరేషన్ ఇప్పుడు పై రెండు పథకాలను అమలు చేస్తోంది.

మార్జిన్ మనీ స్కీము గ్రామీణ ప్రాంత ప్రజల కోసం నిర్దేశించింది. బీసీ అభ్యుదయ యోచన పథకం పట్టణ ప్రాంత ప్రజలకు చెందినది. ఈ రెండు కార్యక్రమాల కింద రూ. 2 లక్షల వరకు రుణ పొందే వీలు కల్పిస్తున్నారు. యూనిట్ మొత్తాన్నిరూ. 2లక్షలుగా నిర్ణయించి 50% వరకు సబ్సిడీ లభిస్తుంది. బ్యాంకు లోను 50% వరకు అందుతుంది. తెల్ల రేషన్ కార్డు ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో నివసించేవారి ఏడాది ఆదాయం రూ. 60 వేలకు మించని వారు ఈ పథకానికి అర్హులు. ఇక పట్టణ ప్రాంతాల్లో మార్జిన్ మనీ పథకం కింద అందించే బీసీ అభ్యుదయ యోచన పథకం లబ్ధిదారుల ఆదాయం రూ. 75 వేలకు మించకుండా ఉండాలి. రుణాలు పొందేవారు వ్యవసాయం, వ్యవసాయేతర రంగాలు, పశుసంవర్ధక రంగంలోనూ, చిన్నతరహా నీటిపారుదల రంగాలను ఎంచుకోవాల్సి ఉంటుంది.



రుణమేళాల జాతర

వీటితోపాటు బడుగు జనం కోసం ప్రభుత్వం చంద్రన్న బీసీ స్వయం ఉపాధి సెలబ్రేషన్స్ (రుణమేళా) కార్యక్రమం ద్వారా అనేక మందికి రుణాలను మంజూరు చేస్తోంది. ఏపీ బీసీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పోరేషన్ లిమిటెడ్ ఈ కార్యక్రమాల అమలును పర్యవేక్షిస్తుంది. చంద్రన్న బీసీ స్వయం ఉ పాధి పథకం కింద రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 2015-16కు గాను, 36,548 మంది లబ్ధిదారులకు రూ. 126.27 కోట్లను సబ్సిడీ రూపంలో అందించడం జరిగింది. దీనికి సంబంధించి గుంటూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో రుణమేళాలను నిర్వహించారు.

చంద్రన్న బీసీ స్వయం ఉపాధి ఉత్సవాల్లో అనంతపురం జిల్లాలో 3500 మంది లబ్ధిదారులు హాజరయ్యారు. 100 వస్తువులను లబ్ధిదారులకు అప్పగించడం జరిగింది. రూ. 20 కోట్లను లబ్ధిదారులకు అందించడమైంది. ఇక గుంటూరు జిల్లాలో 1758 మంది లబ్ధిదారులు హాజరుకాగా, రూ. 11.67 కోట్లు మొత్తాన్ని లబ్ధిదారులకు అందించడం జరిగింది. 70 రకాల వస్తువులను వారికి అందించారు. ఇక నెల్లూరు జిల్లాలో 1084 మంది లబ్ధిదారులకు రూ. 7.01 కోట్లు కేటాయించారు. 65 రకాల వస్తువులను

అందించారు. ఇక కర్నూలు జిల్లాలో 1564 మంది లబ్ధిదారులకు రూ. 12.20 కోట్ల మొత్తాన్ని కేటాయించారు. 60 రకాల వస్తువులను అందజేశారు.

ఇవి కాకుండా... ఏపీ బీసీ కోపరేటివ్-ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్, మరో రెండు పథకాలతో రుణసదుపాయాన్ని కల్పిస్తున్నాయి. మార్జిన్ మనీ, బీసీ అభ్యుదయ యోజన పథకాలు ద్వారా పేదలకు సబ్సిడీతో రుణాలను మంజూరు చేస్తున్నాయి. 2015-16 సంవత్సరానికి గాను బీసీ అభ్యుదయ యోజన, మార్జిన్ మనీ పథకాల కింద 69, 176 మంది లబ్ధిదారులకు రూ. 380 కోట్ల కేటాయించాలని నిర్ణయించారు. ఈ మొత్తంలో రూ. 190 కోట్ల మేర సబ్సిడీ రూపంలో లబ్ధిదారులకు చేయూత లభిస్తుంది. 2015-16 ఏడాదికి గాను లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది.

2015-16 సంవత్సరానికి గాను 10 బీసీ ఫెడరేషన్ల ద్వారా ఆయా వర్గాల ప్రజలకు రూ. 192.19 కోట్లను మంజూరు చేయాలని నిర్ణయించారు. ఏపీ వాషర్‌మెన్ కోపరేటివ్ ఫెడరేషన్, ఏపీ నాయిబ్రహ్మణ కార్పోరేషన్ ఫెడరేషన్, ఏపీ వడ్డెర కోపరేటివ్ ఫెడరేషన్, ఏపీ సాగర్ (ఉప్పర) కోపరేటివ్ ఫెడరేషన్, ఏపీ వాల్మీకి బోయ ఫెడరేషన్, ఏపీ కృష్ణ బలిజ, పూజల కోపరేటివ్ ఫెడరేషన్, ఏపీ కుమ్మరి, శాలివాహన ఫెడరేషన్, ఏపీ స్టేట్ విశ్వబ్రాహ్మణ కోపరేటివ్ ఫెడరేషన్, ఏపీ మేదర కోపరేటివ్ ఫెడరేషన్లకు దరఖాస్తుల ఆధారంగా రూ. 192.19 కోట్ల మేర బడ్జెట్ కేటాయించారు. 76,874 మంది లబ్ధిదారులకు వివిధ పథకాల కింద నిధులు మంజూరు చేస్తున్నారు. ఈ పథకాల కోసం ఇప్పటికే 45,834 మంది దరఖాస్తు చేసుకోగా, రుణమంజూరు ప్రక్రియ కొనసాగుతోంది.

– రీసెర్చ్, రిఫరెన్స్ వింగ్
సమాచార, పౌరసంబంధాల శాఖ

డిజిటలైజేషన్‌లో నవ్యాంధ్రకు ప్రథమ ర్యాంకు

కేంద్రమంత్రి వెంకయ్య చేతుల మీదుగా అవార్డు అందుకున్న మంత్రి డా.పల్లె



సమాచార,సాంకేతిక పరిజ్ఞాన రంగంలో నవ్యాంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా పురోగమిస్తున్నది. రాజధాని లేకుండా కొత్త రాష్ట్రం ఏర్పడిందన్న లోటు లేకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అహర్నిశలూ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పాటుపడుతూ సత్పరిపాలనకు పెద్దపీట వేస్తున్నారు. ఇ-గవర్నెన్స్ విధానంతో కాగితరహిత పరిపాలనకు చంద్రబాబు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో నవ్యాంధ్ర ప్రదేశ్ ...పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం, అవినీతిరహిత కార్యనిర్వహణ వంటి ఆదర్శమైన పాలనాచర్యలు చేపట్టడంలో పరుగులు పెడుతోంది.

డిజిటలైజేషన్ రంగంలో రాష్ట్రాలు సాధిస్తున్న పురోగతిపై ప్రతిష్ఠాకరమైన సీఎన్‌బీసీ సంస్థ జరిపిన అధ్యయనంలో నవ్యాంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. జూలై 15న న్యూఢిల్లీలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసారాలశాఖ మంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడు చేతుల మీదుగా రాష్ట్ర సమాచార,పౌరసంబంధాలు, ఐటి శాఖల మంత్రి డా.పల్లె రఘునాథరెడ్డి ఈ అవార్డును అందుకున్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ పల్లె మాట్లాడుతూ డిజిటలైజేషన్ రంగంలో గత ఏడాది నుంచి ప్రభుత్వం చేస్తున్న కృషికి తగ్గ ఫలితాలు వస్తున్నాయన్నారు. ఈ రంగంలో తమ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానానికి చేరుకున్నందుకు గర్వపడుతున్నామన్నారు. ఈ ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. డిజిటలైజేషన్ రంగాన్ని వృద్ధి చేయడంపట్ల ముఖ్యమంత్రి ప్రత్యేకదృష్టి పెట్టారన్నారు.

పరిపాలనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించిన ఘనత కూడ ముఖ్యమంత్రిదేనని డాక్టర్ పల్లె కొనియాడారు. ఐటీ రంగం ముఖ్యమంత్రి చంద్రబాబు మానసపుత్రిక అని అభివర్ణించారు. ఈ-పోస్, పింఛన్ల పంపిణీ, భూగర్భ జలాల కొలత, ఆధార్ అనుసంధానం, రైతులు, డ్వాక్రా సంఘాల ఖాతాలను ఆన్‌లైన్ వంటివి అమలు చేశామన్నారు. అలాగే ఏపీ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సామాన్యులకు నెలకు కేవలం రూ.149లకే టీవీ, బ్రాడ్‌బ్యాండ్, ఇంటర్నెట్ సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టు పనులు ముమ్మరంగా సాగుతున్నాయని మంత్రి డా.పల్లె స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇ-గవర్నెన్స్ విధానంవల్ల ప్రజలు అత్యంత సులభంగా ప్రభుత్వ పత్రాలు, సేవలను ఆన్‌లైన్‌లోనే పొందగలుగుతున్నారని గుర్తు చేశారు. ఈ సాంకేతిక విధానంవల్ల ప్రభుత్వ పథకాల అమలులో అక్రమాలకు, అవినీతికి తావుండదన్నారు. అలాగే నిజమైన అర్హులుకే పథకాల లబ్ధిచేరురుతుందన్నారు. ముఖ్యమంత్రి డ్యాష్ బోర్డు ద్వారా పరిపాలనలో పారదర్శకతను మరింత పెంచామన్నారు. డిజిటలైజేషన్‌లో నవ్యాంధ్రకు వచ్చిన ఈ అవార్డు ముఖ్యమంత్రి చంద్రబాబు పనితీరుకు నిదర్శనమని మంత్రి డాక్టర్. పల్లె రఘునాథరెడ్డి అన్నారు.

ఖండాంతరాలకు ఏపీ ఎల్ఈడీ వెలుగులు

ఇంధన పొదుపు-సామర్థ్యం అమలులో బ్రిక్స్ దేశాలకు ఆంధ్ర ఆదర్శం

ఇంధనపొదుపు రంగంలో ముఖ్యంగా విశాఖపట్నంలో ఎల్ఈడీ వీధి దీపాల ద్వారా కలిగే పొదుపును నమూనాగా ప్రపంచానికి చూపడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నాన్ని ఎంపిక చేసింది. దీనిని పరిశీలించేందుకు 'బ్రిక్స్' దేశాలు ఆసక్తిగా ఉన్నాయని కేంద్ర విద్యుత్ శాఖ అదనపు కార్యదర్శి బి.పి.పాండే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.ఠక్కర్‌కు పంపిన సమాచారంలో తెలిపారు. ఫలితంగా, 'విద్యుత్ ఆదా, ఆధునిక సేవలు' అనే అంశంపై రెండు రోజుల పాటు విశాఖపట్నంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు బ్రిక్స్ దేశాల ప్రతినిధులు హాజరయ్యారు.

ఏడాదికి రూ.4.23 కోట్ల ఆదా

ప్రస్తుతం విశాఖ నగరంలో 95 వేల ఎల్ఈడీ విద్యుత్తు దీపాలు ఉన్నాయి. ఎల్ఈడీ బల్బుల వల్ల కలిగే పొదుపు వల్ల గ్రేటర్ విశాఖపట్నం ఏడాదికి రూ.4.23 కోట్ల విలువ కలిగిన70 లక్షల యూనిట్ల విద్యుత్తును ఆదా చేయగలుగుతోంది. హుద్‌హుద్ తర్వాత కేవలం రెండు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. ఎల్ఈడీ దీపాల పని తీరు, దాని వల్ల ఆదా అయిన ఇంధనం, ఖర్చులపై ఒక ప్రత్యేక పరిశీలన చేశారు. 2014, 2015సంవత్సరాల్లో వీధిదీపాలపై విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) కట్టిన బిల్లులను సమగ్రంగా పరిశీలించారు. ఈ రెండేళ్లను పోల్చి చూస్తే విద్యుత్తు వినియోగంలో 32.65 శాతం, బిల్లుల్లో 30.1శాతం నిధులు ఆదా అయ్యాయని గుర్తించారు. తద్వారా విశాఖ నగరపాలక సంస్థకు 2015లో రూ.4.23 కోట్లు ఆదా అయినట్లు నివేదిక ఇచ్చారు. 2014లో 220.57 లక్షల యూనిట్లు ఖర్చయితే, 2015లో కేవలం 148.54 లక్షల యూనిట్లు మాత్రమే వినియోగించినట్లు చెబుతున్నారు. ఇలా 40శాతం విద్యుత్తును ఆదా చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదిక ఇచ్చింది. విశాఖ ఎల్ఈడీ వీధి దీపాల ప్రాజెక్టు ప్రపంచ దేశాలను ఆలోచించేలా చేసింది. 2015 జూన్‌లో ప్యారిస్‌లో ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఈఏ) ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ సదస్సుల్లో

సంఖ్యాపరంగా ప్రపంచ దేశాల్లో 3 శాతం కూడా లేని ఆ ఐదుదేశాల- బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా (బ్రిక్స్)- కూటమిని సగం ప్రపంచం అనొచ్చు. కారణం - భూమ్మీది జనాభాలో సుమారు సగం మంది ఈ దేశాల్లోనే ఉన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నాల్గో వంతు వాటా ఆ కూటమిది. అటువంటి ప్రభావవంతమైన ప్రాపంచిక శక్తిని భూగోళం కొసన ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభావితం చేసింది. ఇంధన సామర్థ్యం, పొదుపులో భారతదేశానికే మార్గదర్శకంగా నిలిచిన నవ్యాంధ్ర ఇప్పుడు మిగతా బ్రిక్స్ దేశాల్ని కూడా ఆకర్షించింది. పొదుపుపై ఇటీవల జరిగిన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు మన రాష్ట్ర మార్గదర్శకత్వాన్ని ఎలుగెత్తి చాటింది.



దీని మీద ప్రత్యేకంగా చర్చ జరిగింది. ఆ తర్వాత వాతావరణ మార్పులపై జరిగిన కాప్21 సదస్సుల్లో ఈ ప్రాజెక్టుకు గుర్తింపు వచ్చింది. 90దేశాలకు చెందిన వారు ఈ సదస్సుల్లో పాల్గొన్నారు. ఈ తరహా గుర్తింపుల నేపథ్యంలో బ్రిక్స్ సమావేశాన్ని ఇక్కడే ఏర్పాటు చేసేందుకు కేంద్ర విద్యుత్తు మంత్రిత్వ శాఖ మొగ్గు చూపింది.

బ్రిక్స్ దేశాల ప్రశంస

ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి విద్యుత్‌ను ఆదా చేయవచ్చునని, ప్రయోగాత్మకంగా ఇది విశాఖలో రుజువైందని బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా (బ్రిక్స్) దేశాల ప్రతినిధులు ప్రశంసించారు. అలాగే కేంద్ర విద్యుత్తు శాఖ అదనపు కార్యదర్శి బి.పి.పాండే, ఎనర్జీ ఎఫీషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ ఎండీ సౌరభ్‌కుమార్, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియన్సీ కార్యదర్శి సంజయ్‌సేత్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏపీట్రాన్స్ కో సీఎండీ కె.విజయానంద్ కూడా పాల్గొన్నారు. విద్యుత్ ఆదా, నైపుణ్యవంతమైన సేవలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉపయోగించిన టెక్నాలజీ గురించి, చేస్తున్న ఆలోచనల గురించి చర్చించారు.

కాగా, విద్యుత్ ఆదాలో ఇప్పటికే రాష్ట్రం ముందంజలో ఉంది. అందులోనూ విశాఖలో సోలార్ విద్యుత్ వెలుగుల వినియోగం ద్వారా మెరుగైన ఫలితాలు సాధిస్తోంది. ఈ క్రమంలో ఈ సదస్సు ద్వారా ఆధునిక టెక్నాలజీ మరింత చేరువయ్యే అవకాశం ఉన్నట్టుగా అభివర్ణిస్తున్నారు. వివిధ దేశాల్లో అవలంబిస్తున్న విధానాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే వ్యాపార భాగస్వామ్య సదస్సు, అంతర్జాతీయ నేవీ ఫ్లీట్ ద్వారా ప్రపంచ విశాఖకు ప్రపంచ స్థాయి గుర్తింపు దక్కింది. తాజాగా ఈ ఐదు దేశాల సదస్సుతో విశాఖ ఖ్యాతి మరింత పెరిగింది.

గిరిపుత్రుల గెలుపు పాట

వెదురు సాగుతో కుదురుకున్న బతుకు బాట

చట్టాలు కాగితాలకే పరిమితం అన్న పాత మాటని తప్పని నిరూపించారు ఆ అడవితల్లి బిడ్డలు. ఏజెన్సీ పరిధిలో అటవీహక్కులు గుర్తింపు చట్టం - 2006 కింద సామూహిక అటవీ హక్కులను సద్వినియోగపర్చుకుని వెదురు సాగు, సేకరణతో లబ్ధి పొందిన గ్రామంగా తమ సిరిసినపల్లిని నిలిపారు వారు.



అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006 కింద నవ్యాంధ్రప్రదేశ్‌లో సామూహిక అటవీ హక్కులను సద్వినియోగపర్చుకున్న ఏకైక గ్రామం చింతూరు మండలంలోని సిరిసినపల్లి గ్రామం. ఈ గ్రామంలో 31 గిరిజన కుటుంబాలు నివసిస్తూ సామూహిక అటవీ హక్కులను సద్వినియోగపర్చుకొని 1732 ఎకరాల్లో ఉన్న చిన్నతరహా అటవీ ఉత్పత్తులైన వెదురును ఈ హక్కులు ద్వారా సాగుచేసి వచ్చిన ఉత్పత్తులను సేకరించి, దానిని అమ్మగా లభించిన ఆదాయంతో గ్రామ, కుటుంబ అభివృద్ధికి, అలాగే అటవీ అభివృద్ధి కోసం ఖర్చుచేస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఈ చింతూరు మండలం భద్రాచలం ఐటిడిఎ నుండి చింతూరు ఐటిడిఎలో విలీనమైంది. గ్రామ సామూహిక అటవీ హక్కుల కమిటీ అధ్యక్షుడు మడివి కన్నారావు, ఉపాధ్యక్షులు రాజయ్య, మరో 10 మంది సభ్యులతో కమిటీ నియమించడం జరిగింది. అప్పట్లో గ్రామ పెద్దలు, ప్రధాన మంత్రి రూరల్ డెవలప్‌మెంట్ ఫెలో (పిఎంఆర్‌డిఎఫ్) వారు అటవీ ఉత్పత్తుల సుస్థిర సేకరణ పద్ధతులను పాటించడం, డిపోలో ఎలా భద్రపర్చాలనే అంశాలు, సామూహిక హక్కులపై కమిటీ సభ్యులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చారు. ఈ ఏడాది 37 వేలు వెదురు గెడలు సేకరించి వాటిని ఐటిడిఎ సహకారంతో జిసిసి వాహనం ద్వారా సిరిసినపల్లి డిపోకు తరలించారు. వీటి అమ్మకానికి సంబంధించి ఐటిడిఎకు గ్రామస్తులు అర్జీ పెట్టుకొనగా ఐటిడిఎ పిఓ అటవీ శాఖాధికారులు, పిఎంఆర్‌డిఎఫ్, సహాయ సహకారాలతో గ్రామస్తులు బహిరంగ వేలంకు సిద్ధమయ్యారు. అధిక ఆదాయం పొందే విధంగా పద్ధతులను గ్రామస్తులు అవలంబించారు. అనంతరం బహిరంగ వేలం నోటీసు ఇవ్వగా 33 మంది బిడ్డర్లు నామినేషన్ దాఖలు చేయగా వీటిద్వారా రూ. 29.20 లక్షలు ఆదాయం సమకూరింది. ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం ఆర్ఓఎఫ్ఆర్ కింద సామూహిక అటవీ హక్కులు వాడుకొని పెద్దఎత్తున ఆదాయం పొందిన గ్రామం సిరిసినపల్లి అని ఐటిడిఎ పిఓ కెవిఎన్ చక్రధరబాబు అన్నారు. ఈ 1732 ఎకరాల విస్తీర్ణాన్ని 3 భాగాలుగా విభజించి ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్క భాగంలోని వెదురు సేకరిస్తూ 3 సంవత్సరాలపాటు ఆదాయం పొందేలా గ్రామస్తులు చర్యలు తీసుకున్నారు. ఈ నిధుల్లో 25 శాతం అటవీ అభివృద్ధికి, ఇంకో 25 శాతం వచ్చే ఏడాది అటవీ అభివృద్ధికి వెచ్చించుకుంటారని, మిగిలిన 50 శాతం నిధులతో గ్రామంలో తాగునీటి సదుపాయం, చెరువులు, ఫారం పాండ్లు నిర్మాణానికి వినియోగించుకుంటూ గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రతి గ్రామంలో సామూహిక అటవీ హక్కులను వర్తింపచేసే ఈ వినూత్న కార్యక్రమాలు చేపట్టి నూతన ఒరవడితో గిరిజనుల సుస్థిర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని చక్రధరబాబు భావిస్తున్నారు. వెదురు సేకరణ ద్వారా గిట్టుబాటు ధర కల్పించడంలో పిఎంఆర్‌డిఎఫ్ పి.పృథ్వీ, ఎపిఓ జనరల్ పి.వి.ఎస్. నాయుడు, డిఎఫ్ఓ ప్రసాదరావు సహాయ సహకారాలు అందించడం జరిగిందని కమిటీ సభ్యులు రాజయ్య తెలిపారు.

ఈ తరహా విధానాన్ని అటవీ హక్కుల గుర్తింపు చట్టం ద్వారా గిరిజనులు సద్వినియోగపర్చుకోవాలని ఐటిడిఎ పిఓ విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ తరహా విధానం అవలంభించడం ద్వారా గిరిజనులు ప్రభుత్వంపై అంతగా ఆధారపడాల్సిన అవసరం ఉండదని, ఈ హక్కుల ద్వారా గ్రామాలకు అవసరమైన అన్ని వసతులు ఒనగూరే అవకాశం ఉందని పిఓ చక్రధరబాబు తెలిపారు.

సహాయ పథక నిర్వహణ అధికారి (ప్రచారం),
రంపచోడవరం

వాడవాడలా పారిశ్రామిక ప్రగతి... ఊరూరా ఉపాధి!

మంత్రివర్గ సమావేశంలో విధాన నిర్ణయాలు



నవ్యాంధ్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన అమరావతిలో తాజాగా జరిగిన రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో అనేక కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారు. ఈ భేటీలో తీసుకున్న విధాన నిర్ణయాలను రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి డా.పల్లె రఘునాథరెడ్డి వెల్లడించారు. ఆ వివరాలు ఇలా వున్నాయి.

- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ పారిశ్రామిక పార్కులు నెలకొల్పాలి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేసే నిమిత్తం చెరో వంద ఎకరాల భూమి కేటాయించాలి. ఒక్కొక్క పార్కు ద్వారా కనీసం వెయ్యి మంది వంతున 1.70లక్షల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. ఇప్పటికే 117 నియోజకవర్గాలలో సుమారు 18,340 ఎకరాల భూమిని గుర్తించారు. వీటి నిర్వహణా బాధ్యతలను అప్పగించేందుకు ఈసారి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.
- మచిలీపట్నం ఓడరేవు నిర్మాణానికి, పారిశ్రామిక వాడల ఏర్పాటుకోసం మొత్తం 22వేల ఎకరాల భూమిని సేకరించాలి. సమీకరించనున్న ఈ భూమిలో 14వేల ఎకరాలు పట్టాభూములు ఉండగా, 8వేల ఎకరాలు అసైన్డు భూములు ఉన్నాయి. మచిలీపట్నం ప్రాంత అభివృద్ధి సంస్థ 29గ్రామాల పరిధిలో 425చ.కి.మీ విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఈ గ్రామాల పరిధిలో తొలి దశకింద రెండువేల ఎకరాలను సమీకరించి, భవిష్యత్‌లో 22వేల ఎకరాలు సమీకరించాలి. నూతన రాజధాని అమరావతి నిర్మాణం సందర్భంలో చేపట్టిన భూ సమీకరణ విధానాన్నే ఇక్కడ కూడ అనుసరించాలి. ల్యాండ్ పూలింగ్ కింద భూమి ఇచ్చే రైతులకు తమ వాటా కింద వెయ్యి చ.గజాల స్థలాన్ని నివాసం కోసం, అలాగే మరో 250చ.గజాల స్థలాన్ని వాణిజ్య కార్యకలాపాలకోసం ఇవ్వాలి. 2017 జూలై నాటికి ఈ భూ సమీకరణ ప్రక్రియను పూర్తిచేయాలి. భూ సమీకరణ ప్రక్రియ కోసం రూ.230కోట్లు అవసరమని అంచనా వేయగా, ఇందులో తొలివిడతగా రూ.50కోట్లు విడుదల చేయాలి.
- పట్టిసీమ ప్రాజెక్టును ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి , గడువుకు ముందే పూర్తిచేసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కలను సాకారం చేసి, రికార్డు సృష్టించి నందుకు జలవనరులశాఖ పరిధిలోని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను మంత్రిమండలి అభినందించింది. ఈ ప్రాజెక్టు పనులలో నిమగ్నమైన ఇంజినీరింగ్ అధికారులందరికీ ఒక ఇంక్రిమెంట్ ఇవ్వాలి. అలాగే ప్రతీ నెలలో ఒక పర్యాయం ముఖ్యమంత్రే నేరుగా

అవశేషాంధ్రని నవ్యాంధ్రగా తీర్చిదిద్దుతున్న నిర్నిరోధ క్రమంలో పాలనాపరంగా ప్రతిరోజూ ఒక కొత్త పేజీయే. ఈ నవ నిర్మాణ గ్రంథంలో అతి కీలకమైన మంత్రివర్గ సమావేశం ఒక కొత్త అధ్యాయమే. తాజా మంత్రివర్గ సమావేశం తీసుకున్న నిర్ణయాలే దానికి నిదర్శనం. నవ్యాంధ్రలో ప్రతి నియోజకవర్గంలోనూ పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయాలన్నది ఒక ముఖ్యమైన నిర్ణయం. కనీవినీ ఎరుగని పారిశ్రామిక మహోదయం ముంగిట 1.70లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనుండటం శుభసూచికం. ఇంకా, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంపు, మచిలీపట్నం ఓడరేవుకు 22వేల ఎకరాల భూ సేకరణ, పట్టిసీమ ఇంజినీర్లకు ప్రోత్సాహకాలు... వంటివి మంత్రిమండలి సమావేశంలో తీసుకున్న విధాన నిర్ణయాలు.

ఈ ప్రాజెక్టును సందర్శించాలి.

- జాతీయ ప్రాజెక్టుగా పోలవరం భారీ నీటిపారుదల ప్రాజెక్టును 2018 నాటికి పూర్తి చేయాలి. ప్రతి నెలా జరిగే మంత్రిమండలి భేటీలో దీని పురోగతిపై చర్చించాలి. ప్రతినెలలో ఒక సారి ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టును పరిశీలించాలి. పురోగతిపై వారానికి ఒకసారి సమీక్ష నిర్వహించాలి. పోలవరం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిర్మించేందుకు మొత్తం సుమారుగా రూ. 32వేల కోట్లు అవసరం. ఇందులో రూ. 20వేల కోట్లు భూ సేకరణకు, రూ. 12వేల కోట్లు ప్రాజెక్టు నిర్మాణానికి వ్యయం కానున్నది. ఇప్పటిదాకా దాదాపు రూ. 8వేల కోట్లు ఖర్చయింది. కేంద్రప్రభుత్వ సహకారంతో నిర్ణీత లక్ష్యానికి లోబడే ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేయాలి.
- ప్రభుత్వశాఖలు, ప్రభుత్వరంగ సంస్థలలో పనిచేస్తున్న పొరుగుసేవల(అవుట్ సోర్సింగ్) ఉద్యోగులకు ప్రస్తుతం చెల్లిస్తున్న కనీస వేతనాన్ని రూ. 6,700ల నుంచి రూ. 12వేలకు, అలాగే గరిష్ఠ వేతనాన్ని రూ. 11,500ల నుంచి రూ. 17,500లకు పెంచాలి. పెరిగిన ఈ వేతనాలను ఆగస్టు నెల నుంచే అమల్లోకి రావాలి. 15,745 మంది ఒప్పంద ఉద్యోగులకు ఈ పెరుగుదల అమలవుతుంది.
- గ్రేడ్-2 భాషా పండితులు, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న వ్యాయామోపాధ్యాయుల స్కూల్ అసిస్టెంట్ శ్రేణికి పదోన్నతి కల్పించడం.
- 2016-17 విద్యాసంవత్సరానికి సంబంధించి శ్రీకాకుళం జిల్లా ఐఐఐటీ తరగతులను నూజివీడు ఐఐఐటీలోనూ, ఒంగోలు ఐఐఐటీ తరగతులను ఆర్‌కే వ్యాలీలో నిర్వహించాలి. ఒక్కొక్క ఐఐఐటీలో విద్యాసంవత్సరాన్ని వెయ్యి సీట్లతో మొదలు పెట్టాలి.
- ఉద్యాన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా నాలుగు ఉద్యాన కళాశాలల ఏర్పాటు చేయాలి.
- ప్రైవేటు యూనివర్సిటీల బిల్లు ఆధారంగా రాష్ట్రంలో ఐదు వర్సిటీలకు లెటర్ ఆఫ్ ఇండెంట్(ఎల్ఓఐ) ఇవ్వాలి. వీటిలో ఎమిటి, ఎస్ఆర్ఎం, వీఐటీ యూనివర్సిటీలు అమరావతిలో ఏర్పాటు కానుండగా, మిగిలిన సెంచూరియన్ యూనివర్సిటీకి విజయనగరంలో స్థలం ఉండగా, ఫిషరీష్ అండ్ ఓషియన్ వర్సిటీ భీమవరంలో ఏర్పాటవుతున్నది.

ఓట్లశాతం ఆధారంగా పార్టీ కార్యాలయాలకు స్థలాలు

అమరావతిలో రాజకీయపార్టీలకు ఓట్ల శాతం ఆధారంగా పార్టీ కార్యాలయాల ఏర్పాటుకు స్థలాలు కేటాయించాలి. జాతీయ పార్టీలకు, అలాగే ఉభయసభల్లో ఏదో ఒక దానిలో ప్రాతినిథ్యం ఉన్న పార్టీలకు అమరావతిలో స్థలాలు కేటాయించాలి. పార్టీ కార్యాలయాలకు స్థలం కేటాయించేందుకు ధరఖాస్తులు పెట్టుకోవలసి ఉంటుంది. ❖

నవ్యాంధ్ర కొత్త డీజీపిగా నండూరి సాంబశివరావు

పదవీ విరమణ చేసిన డీజీపి రాముడు



నవ్యాంధ్రప్రదేశ్ తొలి డీజీపీగా ఇంతవరకు సేవలందించిన జెవి రాముడు జూలై 23న పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నండూరి సాంబశివరావును నియమించారు. ఆయనకు డీజీపిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం జూలై 21న ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రస్తుత డీజీపి జెవి రాముడు 23న పదవీ విరమణ చేసిన మరుక్షణం ఆయన నుంచి సాంబశివరావు బాధ్యతలు స్వీకరించారు.

సాంబశివరావు గురించి...

సాంబశివరావు 1984 బ్యాచ్‌కు చెందిన ఐపిఎస్ అధికారి. ప్రకాశంజిల్లా, ఒంగోలు పట్టణానికి సమీపంలో గల మిరియాలపాలెం ఈయన స్వగ్రామం. కాన్పూర్ ఐఐటీ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఎంటెక్ పూర్తిచేశారు. ఆ తర్వాత సివిల్స్ పరీక్షల్లో విజయం సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. 1987లో ఆదిలాబాద్ జిల్లా, బెల్లంపల్లి ఏఎస్పీగా నియమితులయ్యారు. తరువాత మెదక్, రంగారెడ్డి, గుంటూరు, మహబూబ్‌నగర్ జిల్లాలలో ఎస్పీగా పనిచేశారు. అనంతరం ఇంటిలిజెన్స్ విభాగం ఎస్పీగా, అలాగే నిఘావిభాగం డిఐజీగా, హైదరాబాద్ రేంజ్, సీఐడీ విభాగాలలో డీఐజీగా వ్యవహరించారు. రాయలసీమ రీజియన్ ఐజీగా, విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్‌గా పనిచేశారు. అదనపు డీజీపీ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా పనిచేశారు. అగ్నిమాపకదళం అధిపతిగా కొన్నాళ్లపాటు పనిచేశారు. ఆ తర్వాత సాంబశివరావు ఆర్టీసీ ఎండీగా నియమితులై, ప్రజారవాణాను మెరుగుపరుస్తూ, రోడ్డు రవాణా సంస్థ పురోగతికి విశిష్టమైన సేవలు అందిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ❖

రాష్ట్రంలో సముద్రతీర ప్రాంతానికి మహర్దశ

నవ్యాంధ్ర కంఠాన సాగరమాల



వెయ్యి కిలోమీటర్ల పొడవున పరుచుకున్న కోస్తా తీరాన్ని గెలుపు జెండా చేసి ఎగరేసిన చంద్రబాబు చాతుర్యం గురించి విన్నారా? అంతే దీర్ఘంగా విస్తరించిన సముద్రాన్నే దిక్సూచి లైట్‌హౌజ్‌గా నిలిపి దేశదేశాల్ని ఆంధ్రప్రదేశ్ వైపు ఆకర్షించిన ఆ వాణిజ్య వ్యూహం కన్నారా? అడ్డగోలు విభజన వల్ల అనాథగా మిగిలిన అవశేషాంధ్రప్రదేశ్ సారథికి, సవాళ్లే సోపానాలుగా, అవరోధాలే అవకాశాలుగా మలుచుకునే నాయకుడికి సముద్ర తీరం సముద్రమంత దన్ను కావడంలో ఆశ్చర్యం ఏముంది?

ముఖ్యమంత్రి సామర్థ్యం వల్ల రాష్ట్రంలో సముద్రతీర ప్రాంతానికి మహర్దశ పట్టోంది. మారిటైమ్ బోర్డు బిల్లు ఆమోదం పొందింది, కాగా, ఇండియన్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐడబ్ల్యూఏఐ)తో ఒప్పందం చేసుకున్న తొలి రాష్ట్రమయ్యింది మన నవ్యాంధ్ర. భవిష్యత్ చిత్రపటం మీద రూపుదిద్దు కుంటున్న ఈ మహా జలదృశ్యం అంతటితో ఆగిపోలేదు. పోర్టుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి, 'మచిలీపట్నం ప్రాంత అభివృద్ధి అథారిటీ' ఏర్పాటు, తీరంలో మూడు లాజిస్టిక్ పార్కులు, పోర్టుల నుంచి జాతీయ రహదారులను కలిపే రోడ్లు, ఇంకా సముద్ర వైజ్ఞానిక విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ఒప్పందం... వంటి వాటితో సంపూర్ణమయ్యింది.

కోస్తా తీరాన్ని గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ సప్లై చైన్ గా తీర్చిదిద్దటానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇచ్ఛాపురం నుంచి తడ వరకు 9 జిల్లాలలో 974 కిలో మీటర్ల సముద్రతీర ప్రాంతం ఉంది. సముద్రంలో అంతులేని జలరాశి ఉన్నట్లే తీరం వెంట అంతులేని ఆర్థికాభివృద్ధికి అవకాశం ఉంది. మన నౌకాశ్రయాలు తూర్పు ఆసియా, ఆగ్నేయాసియా దేశాలను అనుసంధానంగా నిలుస్తూ, ఆయా దేశాలతో వాణిజ్య సంబంధాలకు అత్యంత అనుకూలంగా ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏపిని తూర్పు తీర ముఖద్వారంగా అభివర్ణించారు. సముద్ర విజ్ఞానాన్ని రాష్ట్ర విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చి, తీర ప్రాంతాలను అభివృద్ధి పరచాలన్న కృతనిశ్చయంతో సిఎం ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గ్రీన్ ఫీల్డ్ బీచ్ కారిడార్లు ఏర్పాటు చేసి, తీరప్రాంత పర్యాటక రంగం అభివృద్ధికి కూడా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. జల రవాణాను పునరుద్దరించే ఆలోచనలు కూడా ప్రభుత్వం చేస్తోంది. సముద్రాన్ని, తీర ప్రాంతాన్ని అన్ని విధాల, అవకాశం ఉన్న మేరకు వినియోగించుకొని ఉత్పత్తి, ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం దేశ, విదేశాలలోని ప్రముఖ సంస్థలతో ఒప్పొందాలు చేసుకుంటోంది.

రాష్ట్రంలో కొత్త పోర్టులు ఏర్పాటు, ప్రస్తుతం ఉన్న పోర్టులను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. అలాగే రాష్ట్రంలో మొదటి సారిగా మెరైన్ బోర్డును కూడా నెలకొల్పాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం మహారాష్ట్రలో మాత్రమే ఇటువంటి బోర్డు ఉంది. ఆ రాష్ట్రంలో 720 కిలోమీటర్ల సముద్రతీరం ఉంది. 1996లో మహారాష్ట్ర మారిటైమ్ బోర్డును ఏర్పాటు చేశారు. సముద్రతీర ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పన, ఓడరేవుల నిర్వహణ, వాటి అభివృద్ధి, హార్బర్సలో ట్రాఫిక్ నియంత్రణ, సముద్ర జలాలకు సంబంధించిన వ్యవహారాలను ఈ బోర్డు చూసుకుంటుంది. మన రాష్ట్రంలో కూడా అటువంటి బోర్డును ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు మారిటైమ్ బిల్లుని ఆమోదించారు. ఐడబ్ల్యూఏఐ సహాయంతో ఆంధ్రప్రదేశ్ నాలుగు జాతీయ జలమార్గాలకు చెందిన ప్రాజెక్టులు చేపడుతోంది. సాగరమాల పథకంలో రాష్ట్రం ప్రధాన భాగస్వామి కానుంది. ఆసియా దేశాలలోనే తొలిసారిగా తూర్పుగోదావరి జిల్లా అంతర్వేదిలో డ్రెడ్జింగ్ హార్బర్ ఏర్పాటు కానుంది. కేంద్ర జాతీయ జలరవాణా మార్గాల అభివృద్ధిలో

భాగంగా 888 కిలోమీటర్ల కాకినాడ-పుదుచ్చేరి జలరవాణా మార్గాన్ని అభివృద్ధి చేయనున్నారు. ఐడబ్ల్యుఏఐతో ఈ రకమైన ఒప్పందం చేసుకున్న తొలి రాష్ట్రంగా ఏపి నిలిచింది. అలాగే తమిళనాడు-ఏపి రెండు దక్షిణాది రాష్ట్రాలకు అనుసంధానంగా విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (విసిఐసి) శ్రీకాకుళం జిల్లా పైడి భీమవరం నుంచి తమిళనాడులోని చెన్నై వరకు ఏర్పాటు కానుంది. ఇది భవిష్యత్ లో ఈస్ట్ ఎకనామిక్ కారిడార్ గా కీలకం కానుంది. లక్ష కోట్ల రూపాయలతో దేశంలో తొలిసారిగా ఏర్పాటు కానున్న ఈ సాగరతీర కారిడార్ వల్ల దాదాపు 50వేల మందికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. ఈ కారిడార్‌కు ఆసియా డవలప్‌మెంట్ బ్యాంకు రుణం కూడా ప్రకటించింది. అంతే కాకుండా విశాఖపట్నం జిల్లా రాంబిల్లిలో 5వేల కోట్ల రూపాయలతో నౌకా నిర్మాణ కేంద్రం నిర్మిస్తానని రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీ ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒక ఒప్పందం కూడా చేసుకున్నారు.

తీర ప్రాంతాన్ని వినియోగించుకొని పోర్టుల ఆధారిత అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. నౌకాశ్రయాలను అభివృద్ధి చేయడం ద్వారా తీర ప్రాంత ఆర్థికాభివృద్ధి వ్యూహాన్ని ప్రభుత్వం సిద్ధం చేసింది. ఉత్తర భారతదేశానికి కార్గో కంటెయినర్లను పంపించేందుకు అనువుగా రాష్ట్రంలోని చిన్న, మధ్య తరహా పోర్టులను మలుచుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. పోటీ తత్వాన్ని పెంచేందుకు ప్రైవేటు రంగం ద్వారా పోర్టుల అభివృద్ధి చేస్తున్నారు. మచిలీపట్నం పోర్టు 2018 నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. ఇప్పటికే 'మచిలీపట్నం ప్రాంత అభివృద్ధి అథారిటీ'ని కూడా ఏర్పాటు చేశారు.

ఈ ఆర్థిక సంవత్సరంలో మచిలీపట్నం, భావనపాడు నౌకాశ్రయాలను అభివృద్ధిపరుస్తారు. విశాఖ, కృష్ణపట్నం, కాకినాడలలో లాజిస్టిక్ పార్కులు ఏర్పాటు చేయనున్నాను. విశాఖలో 98 ఎకరాలలో, కృష్ణపట్నంలో 142 ఎకరాలలో, కాకినాడలో 89 ఎకరాలలో ఈ పార్కులను నెలకొల్పుతారు.



రెండేళ్లలో వీటిని ప్రారంభిస్తారు. కాకినాడ నుంచి భోగాపురం వరకు గ్రీన్‌ఫీల్డ్ బీచ్‌రోడ్డు నిర్మిస్తారు. పర్యాటకరంగ అభివృద్ధిలో భాగంగా బీచ్ కారిడార్ ఏర్పాటు చేస్తారు. ఈ బీచ్ కారిడార్ ఏర్పాటు కోసం బిడ్స్ నిర్వహణకు ప్రభుత్వం ఇన్‌క్యాప్‌కు అనుమతి కూడా ఇచ్చింది.

ఓడ రేవుల నుంచి రాష్ట్రంలోని ప్రధాన రహదారులను కలుపుతూ రోడ్లు వేయడానికి రోడ్డు గ్రిడ్ ను ఏర్పాటు చేశారు. రాష్ట్రం నుంచి దేశమంతటికి రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతోపాటు తీరప్రాంతా పర్యాటక రంగం అభివృద్ధికి కూడా ఈ రోడ్డు గ్రిడ్ ఉపయోగపడుతుంది. మచిలీపట్నం పోర్టు నుంచే గాక మంగినపూడి బీచ్ నుంచి నాలుగు వరుసల రహదారిని జాతీయ రహదారికి కలిపే ప్రయత్నం మొదలైంది. మరోపక్క రాష్ట్రంలోని అన్ని ఓడరేవులను జాతీయ రహదారులకు అనుసంధానం చేస్తూ కొత్త మార్గాలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

ప్రస్తుతం సిఎం చంద్రబాబు నాయుడు రష్యా పర్యటన మెరైన్ రంగం అభివృద్ధికి దోహదపడుతోంది. మెరైన్ రంగంలో ఏపికి సంపూర్ణ సహాయ సహకారాలు అందజేసేందుకు రష్యాకు చెందిన యునైటెడ్ షిప్ బిల్డింగ్ కార్పొరేషన్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఏపిలో ఉన్న సుదీర్ఘ సముద్రతీరం, సముద్రయాన కార్యకలాపాల్లో రాష్ట్రానికి ఉన్న ప్రత్యేకతలను ఆ కార్పోరేషన్ గుర్తించింది. ఈ విషయంలో ఏపీని ప్రధాన కేంద్రంగా పరిగణనలోకి తీసుకుంటామని ఆ కార్పొరేషన్ అధ్యక్షుడు అలెక్సీ ఎల్ రఖ్మనోవ్ తెలిపారు. రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సముద్ర వైజ్ఞానిక విశ్వవిద్యాలయం(మెరైన్ యూనివర్సిటీ) ఏర్పాటుకు రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఉన్న స్టేట్ మెరైన్ టెక్నికల్ యూనివర్సిటీ సహకారం అందించేందుకు ముందుకొచ్చింది. అంతేకాకుండా సీఎం పర్యటనలో భాగంగా ఒక ఒప్పందం కూడా జరిగింది. విశ్వవిద్యాలయ ఏర్పాటుకు సహకరించేందుకు యునైటెడ్ షిప్ బిల్డింగ్ కార్పొరేషన్ సంసిద్ధత వ్యక్తం చేసింది.

రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే చర్యల ద్వారా రాష్ట్రంలోని సముద్రతీర ప్రాంత ముఖచిత్రం మారిపోనుంది. తీరప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పన, ఓడరేవుల అభివృద్ధి, హార్బర్లు, విశ్వవిద్యాలయం ఏర్పాటు, బీచ్ కారిడార్ అభివృద్ధి ద్వారా ఉత్పత్తి, ఉపాధి అవకాశాలతోపాలు రాష్ట్ర ఆర్థికాభివృద్ధి గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

రీసెర్చ్,, రిఫరెన్స్ వింగ్,
సమాచార, పౌరసంబంధాల శాఖ

ఆగమైన మా బతుకుల్ని ఆదుకున్న రుణమాఫీ

రుణ ఉపశమనంపై రైతులోకం

తాడే పామై కాటేయడమంటే రుణపాశం యమపాశం కావడం. బతుకు ఫలం చేదు విషం కావడమంటే, పంట చీడకి పనికిరాని పురుగుల మందు రైతన్న ఉసురు తీసే పెరుగు బువ్వ కావడం. "ఊరు పొమ్మంది... కాడు రమ్మంది" అన్నట్టు రైతన్న పరిస్థితి తయారైనప్పుడే, రాష్ట్ర విభజనతో ఏర్పడిన అవశేషాంధ్రప్రదేశ్ అనే నెత్తుటి గుడ్డు రైతులోకాన్ని మరింత భయపెట్టింది. అటువంటి దుస్థితిలో ఉన్న రైతులకి కొండంత భరోసా అయ్యారు నారా చంద్రబాబు నాయుడు. లోటు బడ్జెట్టుకి కూడా వెరవకుండా రైతులకి రుణ ఉపశమనం అమలు చేసి వ్యవసాయానికి మహర్దశని కల్పించారు ముఖ్యమంత్రి అంటోంది రైతులోకం. రాష్ట్రం నలుమూలల్నుంచీ రైతన్నలు పంచుకుంటున్న అనుభవాలివి.

దేశానికి వెన్నెముక వంటి రైతుల కడగండ్లను చంద్రబాబు నాయుడు ప్రత్యక్షంగా చూసి, పంచుకొని, వారిని ఓదార్చిన ఫలితమే రుణమాఫీ పథకం. 2014 ఎన్నికలకు ఏడాది ముందే,పాదయాత్ర సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా చూసి రుణమాఫీ చేసి ఆదుకోవాల్సిన పరిస్థితిని గమనించి అధికారంలోకి వస్తే రైతు రుణమాఫీ చేసి రైతులను ఆదుకుంటానని ఎన్నికలకు ఏడాది ముందే చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అదే విషయాన్ని తమ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ప్రధాన హామీగా చేర్చారు. ఎన్నికల ముందు శ్రీకాకుళం నుండి చిత్తూరు వరకు ప్రతి జిల్లా, ప్రతి గ్రామంలోను రైతులు రచ్చబండల పైనా, పొలాల్లోనూ చర్చించిన ప్రధానాంశం రుణమాఫిపైనే. రుణమాఫీతోనే తమ బతుకులు బాగుపడతాయని,ఆ హామీ అమలైతే తమకు అమృత వర్షమేనని దశాబ్దాల తరబడి వ్యవసాయం చేస్తున్నా సొంతంగా పెట్టుబడి పెట్టుకోలేని పరిస్థితుల్లో వున్నామని రైతులు వాపోయారు. అందుకే ఒక్కసారి రుణమాఫీ అయితే ఆ ఊబి నుండి బయటపడవచ్చనే రుణమాఫీని బలంగా కోరుకున్నారు రైతులు. ఆ విధంగానే అన్నమాట ప్రకారం అధికారంలోకి వచ్చీ రాగానే అన్నదాతల రుణవిముక్తికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. దశల వారిగా రుణ విమోచన పథకాన్ని అమలు చేస్తూ అన్నదాతకు అండగా నిలిచారు.

గత పాలకుల అసమర్థ,అవినీతి అసంబద్ధ విధానాలతో వ్యవసాయ రంగం వెన్ను విరిగింది. వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరిగిపోయి,సాగు బరువై,ఆసరా కరువై వరుస నష్టాలతో అప్పుల ఊబిలో కూరుకుపోయి రైతు ఆత్మహత్యలే రోజువారీ వార్తలయ్యాయి. అటువంటి దుర్భర పరిస్థితుల్లో వున్న వ్యవసాయ రంగాన్ని, రైతుని ఏ విధంగానైనా కాపాడాలని సిఎం చంద్రబాబునాయుడు కంకణం కట్టుకున్నారు. అందుకే భారమైనా భారీ రుణమాఫీ పథకాన్ని తన భుజాలకెత్తుకున్నారు. రుణమాఫీ అన్నది జనాకర్షణ పథకం కాదు. దేశానికి అన్నం పెడుతున్న అన్నదాతకి ఆర్థిక భరోసాగా భావించి రుణమాఫీ బాధ్యతను, తాను తీసుకున్నారు. అటు కేంద్రం కానీ,ఇటు రిజర్వ్ బ్యాంకు కానీ ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించలేదు. కనీసం రైతు రుణాలు రీషెడ్యూల్ చేయడానికి కూడా బ్యాంకులు అంగీకరించలేదు. ఇన్ని అవరోధాలు ఎదురైనా ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సంకల్పించారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల పేరు చెప్పి తప్పించుకొనే ప్రయత్నం చేయలేదు.

రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా రాష్ట్రానికి రాజధాని లేకున్నా,కేంద్ర సహకారం లేకున్నా రైతులను అప్పుల ఊబి నుండి గట్టెక్కించాలన్న ధృఢ సంకల్పంతో రుణమాఫీ అమలుచేస్తూ రైతులను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి శ్రీకాకుళం జిల్లా నుండి చిత్తూరు జిల్లా వరకు రైతులు జేజేలు పలుకుతున్నారు. కష్టకాలంలో రైతు ఇంట పెద్ద బిడ్డలా ఆదుకుంటున్నాడంటూ ఆశీర్వచనాలు పలుకుతున్నారు.

ఉత్తరాంధ్ర

శ్రీకాకుళం జిల్లా

శ్రీకాకుళం జిల్లాలో రైతు రుణమాఫీతో రైతులు



సంతోషం వ్యక్తం చేసారు. వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టబడి సాగు ఖర్చులు కరిగిపోయి అప్పుల భారంతో తల్లడిల్లుతున్న తమకు చంద్రబాబు ప్రకటించిన రుణమాఫీ ఎంతో ఉపశమనం కలిగించిందని రైతులు వెల్లడించారు.

కొండల సూర్యనారాయణ, టెక్కలి మండలం, భగవాన్‌పురం గ్రామం

రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీతో ఆదుకోకుంటే తమ జీవితాలు ఇంకా ఆగమైపోయేవని శ్రీకాకుళం జిల్లా రైతు కొండల సూర్యనారాయణ చెప్పారు. ఒక్కసారిగా పెట్టుబడులు పెరిగిపోవడంతో, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో దిగుబడి రాకపోవడం, చేతికందిన పంటకు మద్దతు ధర కల్పించకపోవడంతో పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయామని, ప్రస్తుతం ప్రభుత్వం లక్షన్నర అప్పు తీర్చేందుకు బాధ్యత తీసుకుందని మరోసారి వ్యవసాయం చేయాలని ధైర్యాన్నిచ్చిందని సూర్యనారాయణ చెప్పాడు.

మొత్తం రెండు విడతలుగా రూ. 60 వేల రు-ణమాఫీ పొందినట్లు వివరించారు.

పొన్నాడ నారాయణరావు, దమయంతి, టెక్కలి మండలం, భగవాన్‌పురం గ్రామం

రాష్ట్రం విడిపోయింది, రాజధాని సైతం లేదు, జీతాలివ్వడానికి సైతం ఆదాయం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం చంద్రబాబునాయుడు రుణమాఫీ ఎలా చేయగలుగుతారోనని అనుకున్నా. 6 ఎకరాల భూమి సాగు చేసి వ్యవసాయంలో నష్టం వస్తే ఎలా బతకాలో అని తర్జనభర్జన పడ్డాం. హైదరాబాద్ నుంచి వచ్చే ఆదాయం లేదు రుణమాఫీ ఎలా చేస్తారోనని అధైర్యపడ్డాం. కానీ ఇచ్చిన మాటకు కట్టుబడి మొదటి విడత రూ. 30 వేలు, రెండో విడత రూ. 30 వేలు రుణమాఫీ చేశారు. మిగిలిన రుణమాఫీకి రుణ ఉపశమన పత్రం ప్రభుత్వం ఇచ్చింది.

విశాఖపట్టణం జిల్లా

నిమ్మకాళ్ల అప్పలకొండ , పద్మనాభం



మండలం, అర్చుకునిపాలెం

ఆంధ్రాబ్యాంకులో రూ.45 వేల పంట రుణం తీసుకున్నాను. ఒకే విడతలో పూర్తి రుణ విముక్తి జరిగింది. అప్పటివరకు పంటల సాగుకోసం ఎవరి వద్దకు అప్పుకు వెళ్లాలో అని ఆలోచిస్తున్న తరుణంలో ప్రభుత్వ నిర్ణయం నాలో వ్యవసాయంపై కొత్త ఆశలు రేకెత్తించింది. ఎవరి సాయం అవసరం లేకుండానే నాకు చంద్రబాబు ప్రభుత్వం సహకరించిందని ఆమె చెప్పుకొచ్చారు.

జిల్లాల వారీగా రైతు రుణవిమోచన పథకం

జిల్లా	మొదటి విడత చెల్లించిన ఎకౌంట్లు	రూ. కోట్లలో	రెండో విడత చెల్లించిన ఎకౌంట్లు	చెల్లించిన మొత్తం
శ్రీకాకుళం	277674	384.03	146709	103.07
విజయనగరం	208172	308.58	91059	62.87
విశాఖపట్టణం	219155	326.35	100583	79.28
తూర్పు గోదావరి	441964	605.09	249712	175.23
పశ్చిమ గోదావరి	483483	627.29	335456	262.33
ముంపు మండలాలు	4872	7.57		
కృష్ణా	436945	568.20	296324	232.11
గుంటూరు	661693	917.84	522321	486.47
ప్రకాశం	448459	588.06	367888	343.74
నెల్లూరు	279681	394.26	193003	154.65
చిత్తూరు	367117	510.89	266312	228.50
కడప	346860	457.47	254317	205.69
అనంతపురము	802351	1054.87	545759	416.67
కర్నూలు	427131	679.89	270110	251.94
మొత్తం	**54,055,57**	**7,433.39**	**36,39,553**	**3,002.55**

బొల్లెంపల్లి సుబ్బారావు, భీమునిపట్నం మండలంలోని నగరపాలెం పశ్చిమగోదావరి జిల్లా తగరపువలసలోని ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు నుండి రూ. 40, 682 రుణం పొందిన బొల్లెంపల్లి సుబ్బారావుకు ఒకే విడతలో రుణమాఫీకి అర్హత సాధించానని ఈ రుణమాఫీతో తన కుటుంబం బయటపడిందని కుటుంబ సభ్యులతో జీవితాంతం సీఎం చంద్రబాబు నాయుడికి రుణపడి ఉంటామని వారు పేర్కొన్నారు.

వీర్ల కృష్ణ పోతురాజు, వెంకటాపురం

రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేసి తమ జీవితాల్లో వెలుగులు నింపిందని వెంకటాపురం గ్రామ రైతు వీర్ల కృష్ణ పోతురాజు చెప్పారు. రుణవిముక్తి పత్రాన్ని పొందిన పోతురాజు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా, చంద్రబాబు ప్రభుత్వం రుణమాఫీ చేసిందని చంద్రబాబునాయుడు రైతుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. వెంకటాపురంలో నాలుగు ఎకరాల పంట పండిస్తూ ప్రతీ ఏటా బ్యాంకు ద్వారా రుణాన్ని పొందుతున్నానని 2013లో 90 వేల రూపాయల రుణాన్ని పొందగా ఆ మొత్తాన్ని చంద్రబాబు నాయుడు సర్కారు మాఫీ చేసిందని తొలివిడతగా 18,400 రూపాయల సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ కాగా ఇప్పుడు అదే మొత్తం జమైందని, రుణవిమోచన పత్రాన్ని కూడా తీసుకున్నట్టు చెప్పారు.

తుమ్మల వెంకటేశ్వరరావు, పోణంగి గ్రామం, గుంటూరుజిల్లా

తనకున్న 98 వేల రూపాయల రుణాన్ని

ప్రభుత్వం మాఫీ చేసిందని దీని వలన తమ కుటుంబం ఎంతో ఆనందంగా ఉందని పోణంగి గ్రామానికి చెందిన రైతు తుమ్మల వెంకటేశ్వరరావు అన్నారు. రుణమాఫీ వల్ల తన మనవళ్లను చదివిస్తున్నానని రుణమాఫీ వల్ల మిగిలిన డబ్బుతో పిల్లలను మంచి చదువులు చదివించాలని అనుకుంటున్నట్టు తెలిపారు.



చిలుకూరి వెంకట నరసింహారావు, పొన్నూరు మండలం చింతలపూడి,గుంటూరు జిల్లా

తమ తల్లిదండ్రులు తీసుకున్న రుణం లక్షా 80 వేల రూపాయల్లో ఇప్పటి వరకు రూ. 60 వేల వరకు రుణమాఫీ అయినట్టు పొన్నూరు మండలం చింతలపూడి రైతు చిలుకూరి వెంకట నరసింహారావు చెప్పారు. రుణమాఫీతో అప్పుల నుంచి బయటపడ పద్దామని రైతులకు ఇది లాభదాయకమైన పథకమని ఆయన అన్నారు. తమ తల్లిదండ్రులు అప్పు తీర్చేలేం ఇళ్లు అమ్మాల్సి వస్తుందని ఎంతో బెంగపడేవారని చెప్పారు.

ముప్పరాజు వెంకట్రావు, పొత్తూరు గ్రామం.

రుణమాఫీ పథకం పేద రైతుల పాలిట వరమని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ వల్ల రైతులు అప్పుల ఊబి నుండి బయటపడ్డారని పొత్తూరు గ్రామానికి చెందిన ముప్పరాజు వెంకట్రావు చెప్పారు. రైతుల గురించి పాలకులు పూర్తిగా మరచిపోయిన సమయంలో చంద్రబాబు నేనున్నాంటూ ఇచ్చిన రుణమాఫీ హామీ ఇప్పుడు తమ కుటుంబాన్ని తలెత్తుకు తిరిగేలా చేసిందని రుణమాఫీ ద్వారా మిగిలిన డబ్బులతో పిల్లలకు మంచి చదువులు చెప్పించుకునే అవకాశం దక్కిందని వెంకట్రావు చెప్పారు.

భూమిరెడ్డి జయచంద్రారెడ్డి, మదనపల్లి, చిత్తూరు జిల్లా

ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీతో తనకు రూ. 52,562 రుణవిమోచన కలిగిందని తొలి విడతలో 13 వేలు, రెండో విడతలో రూ. 13,141 రుణమాఫీ అయిందని జయచంద్రారెడ్డి చెప్పారు. వర్షాలు పడుతున్న ఈ సమయంలో విత్తనాలు చల్లుతున్న నేపథ్యంలో రుణమాఫీ కావడం సంతోషంగా ఉందని జయచంద్రారెడ్డి చెప్పారు.

వెంకటేశ్వర్లు, నంద్యాల, కర్నూలు జిల్లా

కష్టకాలంలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన రుణమాఫీ రైతులకు ఎంతో ఊరట కలిగించిందని నంద్యాల మండలం పుసులూరు రైతు వెంకటేశ్వర్లు తెలిపారు. రెండో విడత రుణమాఫీ చేసిన గ్రామాల్లో రుణమాఫీ పత్రాలు పంపిణీ చేయడంతో రైతుల్లో ఆనందం నెలకొందని అన్నారు. గత ఏడాది వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది ముందుగానే రుణమాఫీ చేయడం ఆనందాన్ని కలిగిస్తోందని



వెంకటేశ్వర్లు చెప్పారు.

పెద్దగంగిరెడ్డి, పెండ్లిమర్రి మండలం,కడప జిల్లా

రెండో విడత రుణమాఫీతో రూ. 24,106 మేర లబ్ధి పొందామని ఇంకా బ్యాలెన్స్ రుణం మొత్తాన్ని నాలుగు విడతల్లో చెల్లించే విధంగా రూ. 96,427 మొత్తానికి రుణ ఉపశమన అర్హత పత్రాన్ని ప్రభుత్వం అందించిందని, రుణమాఫీ లభించడం వల్ల తమకు మరోసారి బ్యాంకు నుంచి రుణాన్ని పొందే అవకాశం కలిగిందని గంగిరెడ్డి చెప్పుకొచ్చారు. తాజాగా అందిన రుణమాఫీ సొమ్ముతో ఈ ఖరీఫ్ సీజన్లో వరి, మిరప, పంటలు వేసుకోడం తేలికైందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రైతు రుణమాఫీ పథకం ఇప్పటికీ రెండు విడతలుగా చెల్లింపులు జరిగాయి. మొదటి విడతలో 54,05,557 రైతులకు గాను రూ.7,433.39 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. రెండో విడతలో 36,39,553 మంది రైతులకు గాను 3002.55 కోట్ల రూపాయల మేర రైతులకు రుణవిముక్తి జరిగింది. రైతుల మిగతా మొత్తాలకు రుణవిమోచన పత్రాలను అందజేశారు.

హామీ ఇవ్వకపోయినా ఉద్యానవన రైతులకు కూడా రుణం ఉపశమనం కలిగించింది రాష్ట్ర ప్రభుత్వం. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో వున్న 2,20,956 మంది ఉద్యానవన రైతులకు వారి ఖాతాల్లో రూ.380 కోట్లు జమ చేసి ఉద్యానవన రైతులను ఆదుకున్నది. దేశ చరిత్రలో ఎన్నడూ జరగనంతటి రుణ ఉపశమనానికి శ్రీకారం చుట్టారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. అడుగడుగునా ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నా దాదాపు రూ. 24,500 కోట్ల రుణమాఫీ భారాన్ని తన నెత్తికి ఎత్తుకున్నారు. గతంలో ఇంతటి ధైర్యం ఈ ప్రభుత్వం చేయలేదు. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల పేరు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేయలేదు. అందుకే రుణమాఫీ అమలు చేసినందుకు రైతులోకం సంబరాలు చేసుకుంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకి జేజేలు పలుకుతున్నారు.

❖

వ్యవసాయ రుణాల లక్ష్యం రూ.83 వేల కోట్లు

రాష్ట్ర ప్రణాళికలో సింహభాగం వ్యవసాయానికే



ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 83 వేల కోట్ల రూపాయలు వ్యవసాయ రుణాలు అందించాలని వ్యవసాయ శాఖ ప్రతిపాదించింది. రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఏపి ప్రభుత్వం ఈ ఏడాది రూ. 1,65,538తో వార్షిక రుణప్రణాళికను విడుదల చేసింది. రైతులు పెట్టుబడులకు ఇబ్బందిపడకుండా, వారు ప్రైవేటు రుణదాతలపై ఆధారపడకుండా ప్రభుత్వం తక్కువ వడ్డీకి, అసలు వడ్డీలేకుండా కూడా బ్యాంకులు, సహకార సంఘాల ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తోంది.

కౌలు రైతులు కూడా బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకి రుణం పొందే అవకాశం కల్పించింది. జిల్లాల వారీగా ఖరీఫ్, రబీ పంటరుణాలు, కాలపరిమితి రుణాల వివరాలను వ్యవసాయ శాఖ రూపొందించింది. రాష్ట్ర రుణ ప్రణాళిక మొత్తం 1,65,538 కోట్ల రూపాయలలో 75.84 శాతం వ్యవసాయరంగానికే ప్రభుత్వం కేటాయించింది. వార్షిక రుణప్రణాళికలో ఖరీఫ్ లో రూ. 36వేల కోట్లు, రబీలో రూ. 24వేల కోట్లు మొత్తం రూ. 60వేల కోట్ల రూపాయలను పంట రుణాలుగా అందించనున్నారు. అదేవిధంగా వ్యవసాయ అనుబంధ రంగాలకు 23వేల కోట్ల రూపాయలు అందించనున్నారు.

జిల్లాల వారీగా వార్షిక రుణప్రణాళికలను పరిశీలిస్తే గుంటూరు జిల్లాలో రూ. 11,404 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో రూ. 10,274 కోట్లు, చిత్తూరు జిల్లాలో రూ. 6,918 కోట్లు, శ్రీకాకుళం జిల్లాలో రూ. 3,501 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో రూ. 10,021 కోట్లు ఇవ్వనున్నారు. అలాగే విజయనగరం జిల్లాలో రూ. 2.405 కోట్లు, విశాఖ జిల్లాలో రూ. 3,432 కోట్లు, కృష్ణా జిల్లాలో రూ. 7,143 కోట్లు, ప్రకాశం జిల్లాలో రూ. 6,603 కోట్లు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో రూ. 4,891 కోట్లు, వైఎస్ఆర్ కడప జిల్లాలో రూ. 4,799 కోట్లు, అనంతపురం జిల్లాలో రూ. 6,425 కోట్లు, కర్నూలు జిల్లాలో రూ. 5,184 కోట్లు అందజేస్తారు.

లక్ష రూపాయల లోపు పంట రుణం తీసుకొని ఏడాదిలోగా తిరిగి చెల్లిస్తే వడ్డీ చెల్లించవలసిన అవసరంలేదు. లక్ష నుంచి మూడు లక్షల రూపాయల వరకు రుణం తీసుకుని ఏడాదిలోపు తిరిగి చెల్లిస్తే పావలా వడ్డీ పథకం వర్తిస్తుంది. రైతులకు ఇచ్చే పంట రుణాలపై బ్యాంకులకు ప్రభుత్వం మూడు శాతం వడ్డీ చెల్లిస్తుంది.

రాష్ట్రంలోని 13 జిల్లాలలో 9 లక్షల 90వేల 664 మంది కౌలు రైతులకు కూడా వ్యవసాయ రుణాలు అందజేయాలని ప్రతిపాదించారు. భూములు సాగుచేసే కౌలు రైతులకు రెవెన్యూ శాఖవారు కొత్తగా రుణ అర్హత కార్డులు ఇస్తారు. గతంలో తీసుకున్నవారికి రెన్యూవల్ చేస్తారు. ఆ కార్డులు ఉన్నవారికి వ్యవసాయ రుణాలు ఇస్తారు. పశ్చిమగోదావరి జిల్లాలో రెండు లక్షల 36వేల మందికి, కర్నూలు జిల్లాలో 84 వేల 923 మందికి, శ్రీకాకుళం జిల్లాలో 28 వేల 867 మంది కౌలు రైతులకు రుణ సౌకర్యం కల్పిస్తారు. అలాగే విజయనగరం జిల్లాలో 24,807 మందికి, విశాఖపట్నం జిల్లాలో 15వేల మందికి, తూర్పుగోదావరి జిల్లాలో 1,32,629 మందికి, కృష్ణా జిల్లాలో 1,31,870 మందికి, గుంటూరు జిల్లాలో లక్షా 60వేల మందికి, ప్రకాశం జిల్లాలో 24,231 మందికి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 61వేల మందికి, అనంతపురం జిల్లాలో 45వేల మందికి, వైఎస్ఆర్ కడప జిల్లాలో 13,350 మందికి, చిత్తూరు జిల్లాలో 32వేల మందికి వ్యవసాయ రుణాలు అందజేస్తారు.

రైతులకు, కౌలుదారులకు ఈ విధంగా వ్యవసాయ సీజన్ ప్రారంభమయ్యే నాటికే రుణాలు అందజేయడం ద్వారా వ్యవసాయ రంగంలో ఉత్పత్తి, ఉత్పాదకత పెరిగే అవకాశం ఉంది. అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పినట్లుగా రెండంకెల వృద్ధిరేటు సాధించడం పెద్ద కష్టమేమీకాదు.

– రీసెర్చ్, రిఫరెన్స్ వింగ్,
సమాచార, పౌరసంబంధాల శాఖ

ఎన్టీఆర్ పట్టణ గృహ నిర్మాణ పథకం

నెరవేరుతున్న సామాన్యుడి సొంతింటి కల



- ఒక్కో ఇంటికి రూ.3.50 లక్షల వ్యయం
- కేంద్రం ఇచ్చే రాయితీ రూ.1.5లక్షలు : రాష్ట్రం ఇచ్చే రాయితీ రూ.లక్ష
- లబ్ధిదారుని వాటా రూ.25వేలు : రూ.75వేలు రుణం

కనీస అవసరాలు- కూడు... గుడ్డ... గూడు- ల్లో పేదవాడి, మరీ ముఖ్యంగా పట్టణాల్లో ఉండే బడుగుజీవికి ఖరీదైన కల తలదాచుకునే గూడు. అయితే, సొంత ఇల్లు అనేది ఇక మీదట అందని మ్రానిపండు ఎంతమాత్రం కాదని నిరూపిస్తోంది నారా చంద్రబాబు నాయుడి ప్రభుత్వం. నవ్యాంధ్ర 31పట్టణాలలో 73 వేల గృహాల నిర్మాణం చేపట్టి సమగ్ర సంక్షేమాంధ్ర దిశగా సాగిపోతోంది.

రాష్ట్రంలోని సొంత గూడు లేక అనేక అవస్థలు పడుతున్న సామాన్యుల కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ పట్టణ గృహ నిర్మాణ పథకం కింద 31 పట్టణాలలో 73,041 గృహాలను నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు వ్యక్తిగత గృహాలను నిర్మించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ గృహాల నిర్మాణానికి అవసరమయ్యే నిధుల కేటాయింపుపై మార్గదర్శకాలను వెల్లడిస్తూ ఉత్తర్వులు జారీ చేసారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త సహకారంతో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చేపడుతున్న ఈ ఎన్టీఆర్ పట్టణ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని మొత్తం 32 ప్రాజెక్టుల కింద చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎంపికైన లబ్ధిదారులే స్వయంగా తమ గృహాలను నిర్మించుకోవాల్సి వుంటుంది. ఒక్కో ఇంటికి మూడున్నర లక్షలు ఖర్చయ్యే ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ. 1.50లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం ఒక లక్ష వంతున రాయితీ ఇస్తుంది. ఇక మిగిలిన లక్ష రూపాయలలో రూ.25వేలు లబ్ధిదారుడే తన వాటా కింద భరించాల్సి వుంటుంది. మిగతా రూ.75వేలు ప్రభుత్వమే ఆయా జిల్లా కలెక్టర్ల సహకారంతో బ్యాంకుల నుంచి రుణ సదుపాయం కల్పిస్తుంది.

ఇదిలావుండగా. 2011లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, కుల, జనగణన సమాచారం ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. 323చ.అడుగులు విస్తీర్ణంలో రెండు పడకల ఇంటిని నిర్మిస్తారు. ఈ ఇంటిలో రెండు పడక గదులు, ఒక హాలు, వంట గది, ఒక స్నానపు గది-మరుగుదొడ్డి ఉండేలా ప్రభుత్వం ఆ ఉత్తర్వులో నిర్దేశించింది. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న "అందరికీ ఇళ్లు" అనే పథకం కింద నవ్యాంధ్రకు తొలివిడతలో మొత్తం 1.93లక్షల కేటాయించింది. అయితే ఈ ఇళ్లను నాలుగు రకాలుగా విభజించారు. వీటిని మురికివాడల అభివృద్ధి, ప్రైవేట్ భాగస్వామ్యంతో తక్కువ ధరలతో నిర్మాణం, సబ్సిడీతో కూడిన రుణ పథకం, లబ్ధిదారుడే స్వయంగా నిర్మించుకోవడం ....వంటి నాలుగు రకాల పద్ధతుల్లో నిర్మించుకోవచ్చు. ఈ నాలుగు

జిల్లాల వారీగా ప్రభుత్వం కేటాయించిన గృహాల వివరాలు

జిల్లా పేరు	మంజూరైన ఇళ్లు
శ్రీకాకుళం	కేటాయించాల్సి ఉంది
విజయనగరం	6,641
విశాఖపట్నం	10,912
తూర్పు గోదావరి	5,098
పశ్చిమ గోదావరి	1,910
కృష్ణా	11,850
గుంటూరు	11,808
ప్రకాశం	1,112
నెల్లూరు	6,240
చిత్తూరు	5,240
కడప	3,373
అనంతపురం	8,207
కర్నూలు	650

రకాల ఇళ్ళలో మూడు రకాల ఇళ్లను మున్సిపల్ పరిపాలనాశాఖ చేపట్టనున్నది.

ఇక నాల్గవ రకంలో భాగంగా లబ్ధిదారుడు నేరుగా నిర్మించుకునే విధానాన్నే రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఎంపిక చేసుకున్నది. ఈ విధానం వల్ల తన సొంతింటి నిర్మాణంలో ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా, ప్రమాణాలను ఆయా లబ్ధిదారులే స్వయంగా గృహనిర్మాణ సంస్థ సహకారంతో పర్యవేక్షించుకోవలసి ఉంటుంది. తాజాగా జారీ అయిన ప్రభుత్వ ఆదేశాల(జీవో ఆర్టీ నంబర్ : 86)తో లబ్ధిదారులు నిర్మించుకునే 73,041 ఇళ్లకు రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థే బాధ్యతా వహించనున్నది.

❖

సిఐఐ సదస్సు ఒప్పందాలకు కార్యరూపం

విశాఖలో గత జనవరిన విజయవంతమైన సిఐఐ 22వ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలు కార్యరూపం దాల్చుతున్నాయి. వాటిని కాగితాల మీద నుంచి ఒప్పందాల పట్టాలు ఎక్కించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆనాటి వేదిక మీదే చేసిన వ్యూహరచన ఫలించిందనవచ్చు. వచ్చే ఏడాది 23వ భాగస్వామ్య సదస్సు ఇదే విశాఖ వేదిక మీద జరిగేలా చూడటం, పాత ఒప్పందాల స్థితిగతుల్ని ఆ సదస్సులో సమీక్షించుకోవాలని ప్రతిపాదించడం ఆ వ్యూహంలో భాగాలే. సిఐఐ గత భాగస్వామ్య సదస్సుల్లోకుదిరిన అవగాహన ఒప్పందాలకు సంబంధించి ఇప్పటివరకు సాధారణంగా జరుగుతున్న వ్యవహార సరళికి భిన్నంగా, విశాఖ ఒప్పందాలు కార్యరూపంలోకి రావడం వెనక ఉంది చంద్రబాబు చాతుర్యమే.

విశాఖలో జరిగిన పారిశ్రామిక భాగస్వామ్య సదస్సులో 380 సంస్థలతో రూ.4,50,000 కోట్ల మేరకు వివిధ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఎంఓయులు కుదుర్చుకుంది. ఆయా ఒప్పందాలు కుదుర్చుకున్న కంపెనీల్లో కొన్ని పెద్దవి కాగా కొన్ని ఒక మోస్తరివి వున్నాయి. దీంతో ఆయా కంపెనీలతో పరిశ్రమలశాఖ కార్యదర్శిగా వున్న ఎస్ఎస్ రావత్, ప్రస్తుతం ఈ బాధ్యత నిర్వహిస్తున్న సాల్మన్ ఆరోగ్యరాజ్,పరిశ్రమలశాఖ డైరెక్టర్ కార్తికేయ మిశ్రాలతో పాటు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ టక్కర్ సంప్రదింపులు జరిపారు. ఆ సంప్రదింపుల ఫలితంగా పలు పరిశ్రమలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చి కార్యాచరణ ప్రారంభించాయి. ఎంఓయులు కుదుర్చుకున్న వాటిలో 360 కంపెనీలు రాష్ట్రంలో తమ పరిశ్రమలు స్థాపించేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ కంపెనీలు రూ.3,08,214 కోట్లను పెట్టుబడిగా పెట్టనున్నాయి. దీంతో 7,69,571 మందికి ఉపాధి కల్పించనున్నారు. ఈ ఒప్పందాలు అన్నిటిపై పరిశ్రమలశాఖ కార్యదర్శి, డైరెక్టర్లతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టక్కర్ సమావేశం నిర్వహించారు.

గ్రీన్ కేటగిరీ పరిశ్రమల వివరాలు

కేటగిరీ	కంపెనీలు	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి పొందేవారి సంఖ్య
జీ-1ప్రొడక్షన్‌కి వెళ్ళిన కంపెనీలు	116	16,650	67,701
జీ-2ట్రైయల్ ప్రొడక్షన్‌లో వున్నవి	16	1,340	9,540
జీ-3మిషనరీ బిగించినవి	20	5,076	17,856
జీ-4 సివిల్ వర్క్స్ మొదలయినవి	64	10,596	28,798

రెడ్ కేటగిరి పరిశ్రమల వివరాలు

ఆర్-1 అనుమతులు రాక	7	1,955	2,611
ఆర్-2 భూమి స్వాధీనం	53	83,947	1,21,756
ఆర్-3 ప్రభుత్వ భూమి పరిశీలన	58	1,79,738	4,46,264
ఆర్-4 డీపీఆర్ సమర్పించాల్సినవి	26	8,913	75,045

ఆంధ్రప్రదేశ్‌కు వెల్లువలా పరిశ్రమలు రాబోతున్నాయి. లక్షలాది ఉద్యోగాలకు బాటలు పడుతున్నాయి. వ్యవసాయం ఆహారాన్ని అందిస్తే, పరిశ్రమలు బతుకుదెరువు కల్పిస్తున్నాయి. పరిశ్రమలే రాష్ట్ర పురోగమనానికి ప్రధాన ఆలంబనగా నిలవనున్నాయి. రాష్ట్రంలో పారిశ్రామికంగా పండగ వాతావరణం కనిపిస్తోంది.

❖

ఏపీ అభివృద్ధికి డ్రాగన్ పెట్టుబడులు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు చైనాలో రెడ్ కార్పెట్ స్వాగతం

ప్రపంచ ఆర్థిక వేదికలపై ఆంధ్రప్రదేశ్ వాణి వినిపించేందుకు క్రమం తప్పకుండా హాజరయ్యే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చైనాలో జూన్ చివరి వారంలో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సమావేశాలకు సైతం హాజరయ్యారు. ఇప్పటివరకు జరిపిన పెట్టుబడుల ఆకర్షణ యాత్రలన్నీ ఫలిస్తున్నాయనే చెప్పాలి. ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలు ఒక్కొక్కటిగా ఏపీలో కాలుమోపుతున్న వేళ రెట్టించిన ఉత్సాహంతో తన బృందాన్ని తీసుకుని మరోసారి డ్రాగన్ సీమలో పలు పట్టణాలు, సంస్థల అధినేతలతో భేటీ అయి వచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో గల అవకాశాలపై ప్రజెంటేషన్లు, పారిశ్రామికవేత్తలతో వరుస భేటీలు, ద్వైపాక్షిక చర్చలు, అవగాహనా ఒప్పందాలు... ఇలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చైనా పర్యటన నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణానికి బాటలు వేయనుంది. వరల్డ్ ఎకనమిక్ ఫోరం వేదికను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సంపూర్ణంగా వినియోగించుకున్నారు. . రాష్ట్రానికి పెట్టుబడుల అన్వేషణలో ఫలితాల సాధనలో నిరంతరంగా శ్రమిస్తున్న చంద్రబాబుకు చైనాలో బ్రహ్మరథం పట్టారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికిముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థతకు, పడుతున్న కష్టం, తపన తెలిసి చైనీయులు ఆకర్షితులయి ఏపీ అభివృద్ధిలో తమవంతు సహకారం అందజేస్తామని హామీ ఇచ్చారు. గత పరిచయాలు, పాలనానుభవం, పెట్టుబడులకోసం నిరంతర అన్వేషణ, శక్తిసామర్థ్యాలను రాష్ట్రాభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు వినియోగిస్తున్నారని చైనా పర్యటన విశదం చేస్తోంది. ఈ నేపథ్యంలో నవ్యాంధ్ర అభివృద్ధికి చైనాతో పెద్ద ఎత్తున పెట్టుబడులకు ఆస్కారమున్న 6 అవగాహనా ఒప్పందాలు చేసుకోవడం ఒక రికార్డు. చైనా కంపెనీలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఆరు ప్రాథమిక అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకోవడం శు భపరిణామం.ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అకుంఠిత, నిరంతర తపస్సు, శక్తిసామర్థ్యాలను వినియోగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు చైనా పర్యటనతో రాష్ట్రానికి రూ.58వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వెల్లువెత్తనున్నాయి. 'కొత్త ఛాంపియన్ల వార్షిక సదస్సు' పేరుతో



జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ కార్యక్రమాల్లో పాల్గొని వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు సంబంధించిన అంతర్జాతీయ అంశాలపై ముఖ్యవక్తగా కీలక ప్రసంగాలు చేయడమే కాకుండా ప్రఖ్యాత సంస్థల అధిపతులు, వాణిజ్యవేత్తలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించి, ప్రశంసలు పొందిన దేశంలోని ఏకైక రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రత్యేక గుర్తింపు, ఘనతను సాధించారనడంలో సందేహంలేదు.

ఏపీలో అవకాశాలిలా...

ఆంధ్రప్రదేశ్‌లో అపార ఖనిజసంపద, విస్తార అవకాశాలున్నాయి. వ్యాపార సరళీకరణ అంశంలో భారత్‌లో ఏపీ రెండో స్థానం, విదేశీ పెట్టుబడుల ఆకర్షణలో మూడోస్థానంలో వుంది. ఆంధ్రప్రదేశ్ సమీప భవిష్యత్తులో లాజిస్టిక్ హబ్‌గా మారనుంది. తూర్పుతీర ముఖద్వారంగా నౌకా రవాణాలో కీలకపాత్ర పోషించనుంది. విశాఖ–చెన్నయ్, చెన్నయ్–బెంగళూరు కారిడార్ల ద్వారా పారిశ్రామికాభివృద్ధికి ఉజ్వల భవిష్యత్తు ఉంది. విద్యుత్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ మిగులును సాధించింది. రాష్ట్రానికి పుష్కల జలవనరులున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో నిపుణులైన కార్మికులకు కొరతలేదు. పారిశ్రామిక అశాంతి లేదు. నూతన సాంకేతికతను అందిపుచ్చుకోగల యువశక్తి అమోఘం. 'డిజిటల్ ఆంధ్రప్రదేశ్'గా అభివృద్ధి చెందుతోంది. "ప్రతి రంగంలో

గత పరిచయాలు, పాలనానుభవం, పెట్టుబడులకోసం నిరంతర అన్వేషణ, శక్తిసామర్థ్యాలను రాష్ట్రాభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు వినియోగిస్తున్నారని చైనా పర్యటన విశదం చేస్తోంది. ఈ నేపథ్యంలో నవ్యాంధ్ర అభివృద్ధికి చైనాతో పెద్ద ఎత్తున పెట్టుబడులకు ఆస్కారమున్న 6 అవగాహనా ఒప్పందాలు చేసుకోవడం ఒక రికార్డు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అకుంఠిత, నిరంతర తపస్సు, శక్తిసామర్థ్యాలను వినియోగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు చైనా పర్యటనతో రాష్ట్రానికి రూ.58వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వెల్లువెత్తనున్నాయి.

సాధిస్తున్న ప్రగతిని 'రియల్ టైమ్' విధానంలో పర్యవేక్షిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో ఫైబర్ గ్రిడ్ ఏర్పాటు వ్యయాన్ని తగ్గించి, తక్కువ కాలంలో రాష్ట్రానికి ఫైబర్ గ్రిడ్ సేవలు అందిస్తున్నాం. పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నాం. 21 రోజుల్లో అన్ని అనుమతులు మంజూరు చేస్తాం. ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రాష్ట్రం 10.99% వృద్ధిరేటు సాధించింది. 15%వృద్ధి రేటు సాధనను లక్ష్యంగా నిర్ణయించుకుని పనిచేస్తున్నాం. పరిశ్రమలు స్థాపించే పెట్టుబడిదారులకు ఆంధ్రప్రదేశ్ విధానాలు ఎంతో అనుకూలంగా ఉంటాయి" అంటూ ప్రతిచోటా వివరించడంలో చంద్రబాబు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

ఆంధ్రప్రదేశ్ లో ప్రజల జీవన స్థితిగతులను మార్చడానికి తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని, గుయాన్ స్వల్ప వ్యవధిలో ఎలా అభివృద్ధి చెందిందో వివరించిన చైనా కమ్యూనిస్టు పార్టీ డిప్యూటీ సెక్రటరీ జోంగ్ వెన్ గిజో, ఏపీ మధ్య సౌహార్ద సంబంధాలపై అవగాహనా ఒప్పందం చేసుకున్నారు. చంద్రబాబు బృందం 200కు పైగా చైనా పెట్టుబడిదారులతో జరిపిన సమావేశంలో ఏపీలో పెట్టుబడులకు అవకాశాలున్న రంగాలు, రాష్ట్ర సానుకూలతలు, ప్రభుత్వ పారిశ్రామిక విధానాలపై లఘు చిత్రాన్ని ప్రదర్శించడంతో వారు రాష్ట్రానికి రావడానికి చాలా ఉత్సాహం చూపడానికి దారితీసింది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం చైర్మన్ ప్రొఫెసర్ ష్వాబ్‌తో భేటీ ఈ విజిట్‌లో మరో హైలైట్. నౌకాయాన, ఆతిథ్య రంగాలలో 9 బిలియన్ డాలర్ల టర్నోవర్ కలిగిన లిబ్రా గ్రూప్ నౌకాయానం, విమానయానం, పునరుత్పాదక ఇంధన రంగాలపై స్పష్టమైన ప్రతిపాదనలతో ఆంధ్రప్రదేశ్‌కు రావడంపై సానుకూలంగా స్పందించారు.

దొనకొండ లో ఇంటర్నేషనల్ ఇండస్ట్రియల్ పార్కు

మూడు దశలలో రూ.43,120 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే ఇంటర్నేషనల్ ఇండస్ట్రియల్ పార్కును మూడు దశల్లో పూర్తి చేస్తారు. ఈ ఇంటర్నేషనల్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు వల్ల తొలిదశలో 10 వేలమందికి, రెండోదశలో 21 వేల మందికి, మూడవదశలో 24వేల మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తుంది. పరోక్షంగా లక్షా 20 వేల మంది ఉపాధి పొందనున్నారు. జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ యాసుషి అకాహోషి చంద్రబాబును కలిసి త్వరలో విజయవాడ వస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించాలని జపాన్ కంపెనీలను ప్రోత్సహిస్తున్నట్లు యాసుకి అకాహోషి చెప్పడం విశేషం. ప్రపంచంలో 280 దేశాలతో పార్శిల్, కార్గో సేవలు అందిస్తున్న యునైటెడ్ పార్శిల్ సర్వీసెస్ (యుపిఎస్) గ్రూప్ కార్పోరేట్ స్ట్రాటజీ ప్రెసిడెంట్ జాన్ విల్లెం బ్రీన్‌తో సమావేశమయ్యారు. విశాఖ కృష్ణపట్నం ఓడరేవుల్ని కార్గో హబ్‌లుగా ఏర్పర్చుకోవచ్చన్న సూచనకు వారు సానుకూలంగా స్పందించారు.

రూ.3 వేల కోట్లతో ఉక్కు కర్మాగారం

ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో ఆంధ్రప్రదేశ్‌లో రూ. 3 వేల కోట్ల పెట్టుబడులతో ఉక్కు కర్మాగారం స్థాపనకు చైనా ప్రభుత్వ ఉక్కు రంగంలో అతిపెద్ద కంపెనీ అయిన అన్‌స్టీల్ చీఫ్ ఇంజనీర్ జువెన్ గేంగ్ సంసిద్ధత వ్యక్తం చేశారు. పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్ తో కలిసి పనిచేయాలని శ్రీలంక ప్రధాని ఆకాంక్షను సమర విక్రమ చంద్రబాబుకు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టడానికి కువైట్ డానిష్ డెయిరీ ఆసక్తి కనపరుస్తోందని కువైట్ డెయిరీ కంపెనీ సీఈఓ మహ్మద్ జాఫర్ తెలిపారు.

కృష్ణపట్నంలో ఎరువుల కర్మాగారం

2017-18 మధ్య రూ.10,183 కోట్ల ప్రతిపాదిత వ్యయంతో నిర్మాణం మొదలయ్యే గ్యాస్ ఆధారిత ఎరువుల కర్మాగారానికి ముఖ్యమంత్రి చైనా పర్యటనలో అంకురార్పణ జరిగింది. చైనా హాంక్యూ కాంట్రాక్టింగ్ అండ్ ఇంజనీరింగ్ కార్పొరేషన్, ఇసోమెరిక్ హోల్డింగ్స్, ఎల్ఈపీఎల్ వెంచర్స్‌తో ఒప్పందం జరిగింది. టియాంజిన్ ప్రపంచ ఆర్థిక సదస్సులో ఈ కీలక ఒప్పందం కుదిరింది. ఈ కర్మాగారం వల్ల ప్రత్యక్షంగా 5,000 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. 2017-18 సంవత్సరాల మధ్య ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమవుతుంది

పవర్ చైనా గిజో ఇంజనీరింగ్ కార్పోరేషన్

పవర్ చైనా గిజో ఇంజనీరింగ్ కార్పోరేషన్ వచ్చే పదేళ్లలో దశలవారీగా ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టనుంది. ఏపీ జిల్లాలలో మౌలిక సదుపాయాల కల్పన, పునరుత్పాదక విద్యుత్తు, విద్యుత్‌ఉత్పత్తి, ప్రసారం, పారిశ్రామికాభివృద్ధికోసం పవర్ చైనా గిజో ఇంజనీరింగ్ కార్పోరేషన్ పదేళ్లలో దశలవారీగా ఏటా పెట్టుబడులు పెడుతుంది. ఇందువల్ల 10 వేల నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయని అంచనా.

అమరావతి నిర్మాణంలో

చైనా స్టేట్ కన్‌స్ట్రక్షన్ ఫోర్త్ ఇంజనీరింగ్ కంపెనీ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో పాలుపంచుకుంటుంది. మౌలిక సదుపాయాల ప్రాజెక్టు చేపడుతుంది. నిర్మాణ పరిశ్రమ అభివృద్ధికి సహకారం అందిస్తుంది. నిర్మాణ కార్మికుల జీవన ప్రమాణాల మెరుగుపర్చే కృషిలో తన పెట్టుబడులు, టెక్నాలజీ, అనుభవంతో ఏపీకి తోడ్పాటు అందిస్తుంది. "రాష్ట్రానికి రాజధానిని నిర్మించుకునే అవకాశం మాకు వచ్చింది, ప్రపంచంలోనే అత్యుత్తమ రాజధాని నిర్మించుకునేందుకు కృతనిశ్చయంతో ఉన్నాం. విభజన తరువాత ఎదురైన సవాళ్లలోనే అవకాశాలను వెతుక్కుంటున్నాం,"అని ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రసంగానికి దేశాధినేతలకు, సంస్థల అధిపతులకు నుంచి స్పందన లభించింది. సౌత్ హ్యూటన్ కంపెనీ, ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు రెండూ కలిసి ఏపీలో పట్టణాభివృద్ధికి సహకారంపై అవగాహనకు వచ్చాయి. రాష్ట్రంలోని పురపాలక సంఘాలలో మంచినీటి సరఫరా, డ్రెయినేజీ, సీవరేజ్ ట్రీట్‌మెంట్, సముద్రపు నీటిని డీశాలినేషన్ చేసే ప్రాజెక్టుల్లో సౌత్ హ్యూటన్ కంపెనీ ప్రత్యక్ష పెట్టుబడులు పెడుతుంది.ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం నెలకొల్పనున్న 'బిల్డింగ్ మెటీరియల్ మ్యాన్యుఫాక్చర్ పార్కు' నిర్మాణంలో 'గిజో చాంగ్



తైయువాన్ ఎనర్జీ–సేవింగ్ బిల్డింగ్ మెటీరియల్స్ కంపెనీ లిమిటెడ్' ప్రత్యక్ష పెట్టుబడులు పెడుతుంది. ఎసెడ్రిల్స్ రాక్ టూల్స్ కంపెనీ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం ప్రకారం ఆ కంపెనీ భవన నిర్మాణ రంగంలో అధునాతన టెక్నాలజీ సమకూరుస్తుంది. భవన నిర్మాణ రంగానికి ఉపకరించే రాతి పనిముట్లు, డ్రిల్లింగ్ పరికరాలు, గనుల తవ్వకంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం సమకూర్చుతుంది. మౌలిక సదుపాయాల కల్పన రంగంలో ప్రత్యక్ష పెట్టుబడులు పెడుతుంది. ఈ ఒప్పందంతో రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు గణనీయంగా లభిస్తాయి. గిజో మారిటైమ్ సిల్క్ రోడ్ ఇంటర్నేషనల్ ఇన్వెస్టిమెంట్ కార్పొరేషన్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాథమిక అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రంలో ఏర్పాటయ్యే 'ఇండస్ట్రియల్ పార్కు'లో ప్రత్యక్ష పెట్టుబడులు పెడుతుంది. ప్రాజెక్టుకు రూపకల్పన, నిర్మాణంలో సహకారం అందిస్తుంది.

ఏపీలో అప్పో 1000 కోట్ల పెట్టుబడులు

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి చైనా మొబైల్ ఫోన్ల ఉత్పత్తి కంపెనీ అప్పో ముందుకు వచ్చింది. ఏపీలో మొబైల్ యూనిట్ స్థాపనకు ముందుకొచ్చారు. ఈ కంపెనీ ఏర్పాటయితే 25,000 ఉద్యోగావకాశాలు వస్తాయి.

"నవ్యాంధ్ర రాజధాని అమరావతి అంకుర దశలో ఉంది. ప్రపంచంలో ఎక్కడ ఉత్తమ విధానాలు అమలులో వుంటే వాటిని తీసుకొచ్చి మా రాష్ట్రంలో పరిస్థితులకు తగ్గట్టు అమలుచేస్తున్నాం. అమరావతిలో ప్రపంచశ్రేణి మౌలిక సదు–పాయాలను కల్పించాలని భావిస్తున్నాం. రాజధాని నిర్మాణానికి ఒక్క రూపాయి చెల్లించకుండానే రైతులు మామీద విశ్వాసంతో 34 వేల ఎకరాల భూమిని సమీకరణ కింద ఇచ్చారు. ఇది ఒక చరిత్ర. రైతులుతమ భూమిని ప్రభుత్వానికి ధారాదత్తం చేయటం ప్రపంచ చరిత్రలో మరెక్కడా జరగలేదు. జపాన్, యూకే, సింగపూర్ వంటి దేశాలు అమరావతి నిర్మాణంలో భాగస్వామ్యం అవుతున్నాయి. అమరావతి రూపంలో చైనా కంపెనీలకు సువర్ణావకాశం ముందుకొచ్చింది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ అంశాలను ఉదహరించి ఆకట్టుకోవడం విశేషం. "మీరు అమరావతి నిర్మాణంలో సహకరించండి, ఒకసారి ఇండియా వచ్చి కొత్త రాజధాని ప్రాంతాన్ని సందర్శించండి' అని చైనా కమ్యూనిస్టు పార్టీ గిజో ప్రావిన్స్ కార్యదర్శిని చంద్రబాబు కోరడంతో గిజో ప్రావిన్స్, ఏపీ మధ్య సోదర సంబంధాల కోసం రెండు ప్రభుత్వాల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది.

ఏపీలో ఇతిహాద్ ఎయిర్ వేస్

హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగి స్వరాష్ట్రానికి చేరుకునే ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభవార్త. సమీప భవిష్యత్తులో ఏపీ వచ్చే ప్రయాణీకులు శంషాబాద్ రాకుండానే నేరుగా విజయవాడ, విశాఖ, తిరుపతి చేరుకోవచ్చు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంతర్జాతీయ విమానయాన సంస్థ ఇతిహాద్ వైస్ ప్రెసిడెంట్ విజయ్ పూనోసామితో ముఖాముఖి భేటీ అయ్యారు. విజయవాడ, విశాఖ, తిరుపతి నుంచి నేరుగా విదేశాలకు వెళ్లే సదుపాయం కల్పించటానికి ఇతిహాద్ ఎయిర్‌వేస్ వైస్ ప్రెసిడెంట్ విజయ్ పూనోసామి అంగీకరించడం విమాన ప్రయాణీకులకు ప్రయోజనకరం కానుంది.

రాష్ట్రంలో బుల్లెట్ రైళ్లు!

ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన వేగం మరింత పెరగాలంటే రాష్ట్రంలో బుల్లెట్ రైళ్ళే రావాల్సిన ఆవశ్యకత నెలకొంది. రాష్ట్రంలో బుల్లెట్ రైళ్లు మొదలయితే ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి ఢోకా ఉండదు. ఈనేపథ్యంలో బీజింగ్ వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చైనా రైల్ కంపెనీతో సమావేశమయి చర్చించారు. బుల్లెట్ రైళ్లు, హైస్పీడు రైళ్ల సర్వీసుల్ని అధ్యయనం చేయడానికి బీజింగ్‌కు బుల్లెట్ రైలులో సీయం చంద్రబాబు ప్రయాణించారు.

అమరావతి–విశాఖ, అమరావతి–హైదరాబాద్ మార్గాల్లో బుల్లెట్ లేదా హైస్పీడ్ రైళ్లను ప్రవేశపెట్టే అవకాశాలపై పరిశీలన జరిపారు. గంటకు 295 కిలోమీటర్ల వేగంతో చైనాలోని బుల్లెట్ రైళ్లు ప్రయాణిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తికి స్పెయిన్‌కు చెందిన 'ఆక్సియోనా ఎనర్జీ' ముందుకు వచ్చింది. ఆక్సియోనా ఎనర్జీ కంపెనీ ఏపీలో 200 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పనుంది. వచ్చే ఏడాది జూన్ నాటికి విద్యుత్ కేంద్రం నెలకొల్పుతారు. ఏ వేదిక మీదకు వెళ్లినా ఆంధ్రప్రదేశ్ వనరులు, పెట్టుబడులకు గల అపార అవకాశాలను వివరించి పారిశ్రామికవేత్తలను ఆకట్టుకుంటున్నారు. ఈసారి పర్యటనలో కూడా ఆసక్తిని కనబరడమే కాదు పలు చైనా కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధం కావడమే ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతకు నిదర్శనం.

కాగితాల్లోంచి కార్యాచరణకి ....

భూమార్గం పట్టనున్న రూ.12వేల కోట్ల ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు



- అమరావతిలో అతిపెద్ద కన్వెన్షన్ కేంద్రం
- గ్లోబల్ ఐవీ లీగ్ విశ్వవిద్యాలయం
- క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం
- వైద్య విశ్లేషణ కేంద్రం

నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర సామాజిక, పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధి కోసం నిర్విరామంగా చేస్తున్న కృషికి దశలవారీగా ఫలితాలు దక్కుతున్నాయి. నూతన రాజధాని అమరావతి ప్రాంతంలో దాదాపు రూ.12వేల కోట్ల పెట్టుబడితో ప్రతిష్ఠాకరమైన ఎనిమిది ప్రాజెక్టులు రాబోతున్నాయి. వేలాది మంది నిరుద్యోగ విద్యావంతులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. ఈ ప్రాజెక్టులన్నీ 2018నాటికే పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధమౌతున్నాయి.

అమరావతిలో ఈ ప్రాజెక్టులు పెట్టేందుకు అబుదాబి(యుఏఇ)కి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త బిఆర్ షెట్టి ముందుకు వచ్చారు. ఆయన ఈ ప్రాజెక్టుల ఏర్పాటుకు సంబంధించి గత మే నెల రెండవ తేదీన ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంగతి విధితమే. ఈ ఒప్పంద నియమావళి ప్రకారం ప్రాజెక్టుల పురోగతిపై షెట్టి ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆయన నిర్మించబోతున్న ప్రాజెక్టు ప్రణాళికల మౌలిక వివరాలన్నీ చంద్రబాబుకు విపులీకరించారు.

యుఏఇకి చెందిన పారిశ్రామిక వేత్త బిఆర్ షెట్టి అమరావతి ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న ప్రాజెక్టుల వివరాలివిగో....

- ఒకేసారి పదివేల మంది ఆహుతులు కూర్చునేందుకు అనువైన విశాలమైన కన్వెన్షన్ కేంద్రం. అయిదు నక్షత్రాల స్థాయి గల హెూటల్, ఎగ్జిబిషన్ సెంటర్ కూడ ఈ ప్రాజెక్టులో ఉంటాయి.
- ఆసియాలోనే ప్రప్రథమ క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం ఏర్పాటు. వైద్యరంగంలో అత్యున్నతమైన ప్రమాణాలతో కూడిన పరిశోధనలకు వినియోగపడే విధంగా వైద్య విశ్లేషణ కేంద్రం ఏర్పాటు.
- వైద్య సంస్థలకు దోహదపడే నాలెడ్జ్ ప్రాసెస్-అవుట్ సోర్సింగ్ కేంద్రం ఏర్పాటు
- గ్లోబల్ ఐవీ లీగ్ విశ్వవిద్యాలయం. వైజ్ఞానిక భాగస్వామిగా వైద్య విశ్వవిద్యాలయం ఏర్పాటు.
- క్యాన్సర్ చికిత్సలో నూతన సాంకేతిక, ఆవిష్కారాలకు వినియోగపడే పరిశోధనా కేంద్రాలతోపాటు జపాన్ దేశానికి చెందిన మిత్సుబిషి ఫార్మాసూటికల్ , కాస్మో ఆయిల్ సంస్థల ఏర్పాటు.
- ఫైజర్, మెర్క్, అబాట్స్ మొదలైన ప్రతిష్ఠాకరమైన ఫార్మా సంస్థల భాగస్వామ్యంతో ఫార్మాసూటికల్ తయారీ కేంద్రం ఏర్పాటు.
- రాష్ట్రంలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన 3500పడకల ఆస్పత్రుల నిర్మాణం. హృద్రోగం, మధుమేహం, క్యాన్సర్ తదితర విభాగాల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటు. దీనికి అనుబంధంగా అమరావతిలో 1500పడకలు గలిగిన ఒక ఆస్పత్రి, కర్నూలులో 300పడకలు గల మరో ఆస్పత్రి నిర్మాణం. మిగిలిన పడకలకు చెందిన ఆస్పత్రులను ప్రభుత్వం ఖరారు చేయనున్న ప్రాంతాలలో ఏర్పాటు చేస్తారు.
- అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన గోల్ఫ్ కోర్సు నిర్మాణం.

❖

అపూర్వ సర్వేక్షణకి అనూహ్య స్పందన

ముఖ్యమంత్రి కుటుంబంతో మొదలైన ప్రజాసాధికార సర్వే



సమాజంలో అవినీతి అక్రమాలను నిరోధించి, ఆర్థిక అసమానతలను రూపుమాపి ప్రజల జీవన ప్రమాణాలను మరింత మెరుగు పరచాలన్న ప్రధానమైన లక్ష్యసాధన కోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో, మునుపెన్నడూ లేని విధంగా నవ్యాంధ్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో వినూత్న రీతిలో చేపట్టిన ప్రజా సాధికార సర్వే(స్మార్ట్ పల్స్ సర్వే) విజయవంతమైంది. ఇది దేశంలోనే తొలిలి ఆన్‌లైన్ సర్వే కావడం మరో విశేషం. మధ్య దళారీలను నియంత్రించడంతో పాటు సామాన్య ప్రజలకు బహుళ ప్రయోజనాలను కల్పించేందుకు ఈ సర్వే దోహదపడనున్నది.

ప్రజల భవిష్యత్ ప్రయోజనాలకోసం ఉద్దేశించిన ఈ సర్వేలో ప్రజలంతా పాల్గొనాలని ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపునకు ప్రజలు అనూహ్యంగా స్పందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూలై 8న విజయవాడ అధికార నివాసంలో తమ కుటుంబంతోనే అంకురార్పణ చేశారు. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికార నివాసానికి ఏడబ్ల్యూ కేపీ 2963 నంబరును సర్వే అధికారులు కేటాయించారు.

అనంతరం ప్రభుత్వ కార్యదర్శి టక్కర్ కుటుంబం నుంచి సర్వే అధికారులు వివరాలు సేకరించారు. నెలాఖరు వరకూ నిర్విరామంగా సాగిన ప్రజా సాధికార సర్వేలో ఇరవై రెండు రోజులపాటు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి సమాచారాన్నీ అధికారులు సేకరించారు. అధికారుల పర్యవేక్షణలో 4.90 కోట్ల మంది డేటాను ఎన్యుమరేటర్లు నమోదు చేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రజా సాధికార సర్వే విజయవంతంగా పూర్తి చేస్తే రాష్ట్ర చరిత్రలో ఓ మైలురాయిగా మిగిలిపోతుందని ప్రారంభంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ సర్వే వల్ల పూర్తిస్థాయిలో అందరి సమాచారం అందుబాటులోకి వస్తుందని, సమస్యలు చాలా వరకు రియల్ టైమ్‌లో పరిష్కరించవచ్చని ఆయన అన్నారు. గతంలో నమోదు చేసిన వివరాల్లో మార్పులు చేర్పులు సర్వేలో నమోదయ్యేలా చూడాలన్న ముఖ్యమంత్రి ఆదేశాలను అధికారులు తు.చ. తప్పకుండా అమలు చేశారు.

సర్వే వల్ల ప్రయోజనాలివే...

ఈ సర్వేలో సేకరించిన వివరాలు అన్ని శాఖలకు ఉపయోగపడనున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను దళారీలు లేకుండా అమలు చేయొచ్చు. అలాగే ఈ సర్వే వివరాలను కాపులకోసం ఏర్పాటు చేసిన బీసీ కమిషన్‌కు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజలకు సంబంధించిన సమగ్ర సమాచారం ప్రభుత్వానికి చేరనున్నది. ప్రజాసాధికార సర్వే ద్వారా సేకరించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు భద్ర పరచనున్నారు.

ఇదిలావుండగా, ప్రతీ నివాసానికీ ఒక ప్రత్యేక నంబరు కేటాయిస్తున్నారు. ఈ నంబరులో నాలుగు ఆంగ్ల అక్షరాలు, నాలుగు అంకెలు పొందుపరిచారు. భవిష్యత్‌లో ఈ నంబరును ఆన్‌లైన్లో నమోదుచేస్తే ...ఆ ఇంటిలో నివాసం ఉండే కుటుంబసభ్యుల వివరాలన్నీ సమగ్రంగా తెలుస్తాయి. ఈ సర్వే వివారాలన్నీ ఆధార కార్డుతో అనుసంధానం చేశారు. దీని ఆధారంగా ఆయా కుటుంబాలలో గల చిన్న పిల్లలకూ కూడా ఆధార్ కార్డులు జారీ చేయనున్నారు. బ్యాంకు ఖాతాను దీంతో అనుసంధానం చేసి, ప్రభుత్వ పథకాలన్నీ నేరుగా లబ్ధిదారుల ఖాతాలలో జమ అయ్యేలా చూస్తున్నారు. దీనివల్ల మధ్య దళారీల బెడద తప్పుతుంది. ప్రభుత్వం నేడు ప్రధానంగా అమలు చేస్తున్న చంద్రన్న బీమా, నిత్యావసర సరుకుల పంపిణీ, పింఛన్లు మొదలైన అనేక పథకాలు శతశాతం లబ్ధిదారునికి అందనున్నది.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : చంద్రబాబు

తమ ప్రభుత్వం చేపట్టే ప్రజా సాధికార సర్వే ద్వారా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందనున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. తన సర్వే వివరాలను నమోదు చేసుకున్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పరిపాలనలో కాగిత రహితంగా ఈ-ఆఫీస్, ఈ-కేబినేట్ విధానాన్ని అమలు చేయడంవల్ల ఫిర్యాదులు బాగా తగ్గాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఆన్‌లైన్లో ఐరిస్, బయోమెట్రిక్ విధానాలతో కాగిత రహిత పరిపాలన అమలు చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. వ్యక్తులకు చెందిన పూర్తి సమాచారాన్ని సేకరించి, వారి అవసరాలు ఏ విధంగా తీర్చాలో ఆలోచించి, వారికి ఉపాధి అవకాశాలు కల్పించి, ఆదాయ మార్గాలు పెంచడానికి కృషి చేయనున్నట్లు స్పష్టీకరించారు. బ్యాంకు ఖాతా లేని వారికి బ్యాంకు ఖాతా తెరిచి, ప్రభుత్వం అందించే రాయితీలతో పాటు, పథకాలన్నీ లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాలో జమ చేస్తామని సిఎం వెల్లడించారు. ❖

నవ్యాంధ్రలో రూ.23వేల కోట్ల 'మలేషియా' పెట్టుబడులు

ప్రభుత్వంతో ఏడు మలేషియా సంస్థల ఒప్పందాలు

'ఏషియన్-ఇండియా బిజినెస్ లీడర్‌షిప్ సమ్మిట్'లో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

మలేషియా దేశానికి చెందిన కంపెనీల సౌజన్యంతో రాబోయే రోజుల్లో దాదాపు రూ.23వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చే అవకాశాలున్నాయి. భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు పలు కంపెనీలు ముందుకు వచ్చాయి. కౌలాలంపూర్‌లో జూలై 21న జరిగిన ఏషియన్-ఇండియా బిజినెస్ లీడర్‌షిప్ సమ్మిట్ 'లో దాదాపు ఏడు కంపెనీలు, సంస్థలు ఈ మేరకు ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకోవడం హర్షణీయం.

ఈ సమ్మిట్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసులు, కార్మిక, ఉపాధిశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఆయనతోపాటు ప్రభుత్వం తరపున రాష్ట్ర పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి కరికాల వలవన్, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక అభివృద్ధి మండలి(ఈడీబీ) ఈసీఓ జె కృష్ణకిశోర్ ప్రభృతులు పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉండే సానుకూల వాతావరణంతోపాటు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలు, ఇతర మౌలిక సదు-పాయాల కల్పనపై మంత్రి అచ్చెన్నాయుడు ఔత్సాహిక పెట్టుబడిదారులను ఆకర్షించే విధంగా వివరించారు. పెమాండు, మలేషియా పీఎంఓల ప్రాతినిధ్యంతో మలేషియా, నవ్యాంధ్రప్రదేశ్‌ల మధ్య పరస్పర వ్యాపార, వాణిజ్య సంబంధాలు మెరుగుపరచుకుందామని, మలేషియా వాణిజ్య,పరిశ్రమలశాఖ మంత్రి ముస్తఫా మహ్మద్ కోరగా అందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది.

పెట్టుబడులు పెట్టే కంపెనీలు...

ఈ సందర్భంగా ఆగ్నేయాసియా దేశాల సంఘం(ఎన్ఎస్ఇఎన్) తో మంత్రి అచ్చెన్నాయుడు బృందం సుదీర్ఘంగా చర్చలు జరిపింది. ఈ చర్చలు, సంప్రదింపులలో భాగంగానే దాదాపు రూ.23వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ఒప్పందం కుదిరింది.

ఎన్ఎస్ఇఎన్ సభ్య సంస్థల ఉమ్మడి భాగస్వామ్యంతో నవ్యాంధ్రలో ఆయిల్‌పామ్ సంబంధిత బయోడీజిల్ అసోషియేషన్ (ఎంబీఏ) తన సమ్మతిని తెలిపింది. ఈ ప్రాజెక్టులో రూ.6,713కోట్ల పెట్టుబడులు పెట్టడానికి, ఐదువేల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఆ సంస్థ ఒప్పందం చేసుకున్నది.

అలాగే అంటా స్ట్రాటజిక్ సంస్థ రూ.167.50కోట్ల ప్రాథమిక పెట్టుబడులతో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టును నెలకొల్పడానికి ముందుకు వచ్చింది. ఈ మేరకు ఈడీబీతో అవగాహనా ఒప్పందం చేసుకున్నది.

ప్రొటాస్కోబెర్హాద్, కోప్ మేంటాప్ బెర్హాద్(మలేషియా పోలీసు సహకార సంస్థ)సంస్థ రూ.3,360కోట్ల పెట్టుబడితో నీటి శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నది.

హైగార్డ్ ఎస్డీఎన్ బీహెచ్‌డీ సంస్థ రూ.6,720కోట్ల పెట్టుబడితో వాటర్, సీవరేజ్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చి, ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందం చేసుకున్నది.

అలాగే ఇదే కంపెనీ మరో రూ.2,688 నుంచి రూ.3,360కోట్ల పెట్టుబడితో ఇంటిగ్రేటెడ్ రీటైల్ హౌసింగ్ ప్రాజెక్టు చేపట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేసి, ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నది.

సుమ్‌విన్ సొల్యూషన్స్ మలేషియా ఎస్డీఎన్ బీహెచ్‌డీ సంస్థ ఆహార, పానీయాల రంగంలో పది నుంచి యాభై కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది.

బయోటెక్నాలజీ, సంబంధిత రంగాలలో రూ.33.50కోట్ల నుంచి రూ.67కోట్ల వరకు పెట్టుబడి పెట్టేందుకు ఎన్విగొనెక్స్ ఇండస్ట్రీస్ అనే సంస్థ ముందుకు వచ్చింది. ఇంకా మరికొన్ని కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ప్రతిపాదించి ఒప్పందాలకు సిద్ధమవుతున్నాయి. ❖

"వృత్తి రాజకీయం ... హోదా ముఖ్యమంత్రి"

"నా వృత్తి రాజకీయం...హోదా ముఖ్యమంత్రి" అని చంద్రబాబు నాయుడు సర్వే అధికారులకు స్వయంగా తెలియజేశారు. పెళ్లి నాటికి తన వయస్సు 30 సంవత్సరాలని తెలిపారు. స్మార్ట్ సర్వే సందర్భంగా సర్వే అధికారులు ముఖ్యమంత్రి నుంచి నిర్ణీత ఫార్మేట్‌కు లోబడి మొత్తం 80 ప్రశ్నలు వేశారు. చంద్రబాబు నుంచి సమాధానాలన్నీ రాబట్టాక ఆయన నివాసానికి అధికారికంగా నంబరు కేటాయించారు. ప్రస్తుతం తాను, తనయుడు లోకేష్ ఇద్దరమే ఇంట్లో ఉంటున్నామని, మిగిలిన కుటుంబసభ్యుల సమాచారం తర్వాత తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆ సర్వే అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, తనయుడు లోకేష్ వేలిముద్రలను, ఐరిస్ ఫోటోలను సర్వే అధికారులు సేకరించారు.

సర్వే సందర్భంగా ముఖ్యమంత్రి స్వయంగా అందించిన వివరాలు

పేరు : నారా చంద్రబాబు నాయుడు

చిరునామా: ఉండవల్లి, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా

ఆధార నంబర్ : 300 300 688 099

ఓటరు గుర్తింపు సంఖ్య : ఎఫ్ వై 12032036739

విద్యార్హత : ఎం.ఏ (అర్థ శాస్త్రం)

యూనివర్సిటీ : ఎస్వీ యూనివర్సిటీ

ఉద్యోగం : లేదు. ('ఉద్యోగం ఉందనుకుని సంక్షేమ పథకాలు ఏమైనా చేసేయ్ గలవు ...నీ ఉద్యోగం ఊడిపోతుంది...' అంటూ సరదాగా సర్వే ఉద్యోగులపై ఛలోక్తులు విసిరి అందర్నీ కాసేపు ముఖ్యమంత్రి నవ్వించారు)

వృత్తి : రాజకీయం

ప్రస్తుత హోదా : ముఖ్యమంత్రి

వార్షిక ఆదాయం : రూ.36లక్షలు

ఇల్లు : ఆర్సీసీ స్లాబ్

సొంతమా? అద్దెదా? : ప్రభుత్వ నివాసం (ప్రభుత్వం అద్దెకు తీసుకున్నది)

విస్తీర్ణమెంత? : ఐదువేల చదరపు అడుగులు

శాశ్వత నివాసం ఉన్నదా? : లేదు

ఎలక్ట్రికల్ ఉపకరణాలు ఉన్నాయా? : ఫ్రిజ్, టీవి, ఏసి, వాషింగ్ మెషిన్

పెళ్లయిందా? అయితే అప్పటికి వయసు: వివాహమైంది. 30 సంవత్సరాలు

కిసాన్ కార్డు ఉందా? : లేదు

ఆరోగ్య బీమా ఉందా? : లేదు

'విభజన' కష్టాల నుంచి విముక్తి చేయండి

అంతర్రాష్ట్ర మండలి భేటీలో ప్రధానిని అభ్యర్థించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



సమాఖ్య స్ఫూర్తిని కాలరాసిన ఆనాటి యూపీయే ప్రభుత్వం దుర్మార్గంగా, ఏకపక్షంగా రాష్ట్రాన్ని విభజించి, నవ్యాంధ్రను బలవంతంగా కష్టాల ఊబిలోకి నెట్టేసింది. ఏకపక్షంగా చేసిన రాష్ట్ర విభజనవల్ల ఆంధ్రప్రదేశ్ తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. అశాస్త్రీయంగా చేసిన ఈ విభజన మూలంగా రెండు రాష్ట్రాల మధ్య ఆస్తులు, అప్పుల విభజన జటిలంగా మారింది' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. భారత ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జూలై 16న న్యూఢిల్లీలో జరిగిన అంతర్రాష్ట్ర మండలి సమావేశంలో నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రసంగించారు. వేలాదికోట్ల ఆర్థిలోటుతో అష్టకష్టాలు పడుతున్నప్పటికీ రాష్ట్ర విస్తృత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను దిగ్విజయంగా అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు.

పురిటి నుంచే పుట్టెడు కష్టాలతో బాధపడుతున్న నవ్యాంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికోసం తక్షణమే ప్రత్యేక హోదా ప్రకటించి, తమకు అండగా ఉండాలని ప్రధాని నరేంద్రమోదీకి చంద్రబాబు విన్నవించారు. పూంఛీ కమిషన్ సిఫార్సులు కొన్నింటిని స్వాగతిస్తూనే మరికొన్నింటిని వ్యతిరేకించారు. ఈ భేటీలో ప్రధాన కార్యదర్శి ఎస్‌పి టక్కర్ కూడ పాల్గొన్నారు. దాదాపు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులూ పాల్గొన్న ఈ అంతర్రాష్ట్ర మండలి భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధాని దృష్టికి తెచ్చిన అంశాలు ఆయన మాటల్లోనే....

- రాష్ట్రాల మధ్య తలెత్తే వివాదాలను సామరస్యంగా, న్యాయబద్ధంగా పరిష్కరించే అధికారాన్ని అంతర్రాష్ట్ర మండలికి ఇవ్వాలన్న సిఫార్సులను స్వాగతిస్తున్నాం. సమస్యలను ఈ వేదికకు నివేదించే సందర్భంలో తప్పనిసరిగా ఆయా రాష్ట్రాల అనుమతి తీసుకోవాలి. మండలి తీసుకునే విధాన నిర్ణయానికి రాష్ట్రాలన్నీ తప్పనిసరిగా కట్టుబడి ఉండాలి.
- సమాఖ్య విధానానికి సంబంధించి సర్కారియా, పూంఛీ కమిషన్‌లు రెండూ ఇచ్చిన అనేక విలువైన సిఫార్సులను విస్మరించడమే కాకుండా, భాగస్వామ్య పక్షాలతో చర్చలు జరపకుండానే విభజన ప్రక్రియ చేపట్టారు. రెండు రాష్ట్రాల ప్రజల ప్రయోజనాలను కాపాడటంతోపాటు ఆస్తులు, అప్పుల విభజన సున్నితంగా జరగాలన్న సూత్రాన్ని విస్మరించారు.
- విభజననాటికి నవ్యాంధ్రలో 58శాతం జనాభా ఉంది. ఇంత ఎక్కువ జనాభా ఉన్న కొత్త రాష్ట్రానికి 46శాతం ఆదాయాన్ని పంచారు. ఆస్తులను ప్రాంతాలవారీగా, అప్పులను జనాభాప్రాతిపదికన ఇచ్చారు.
- విభజన చట్టంలో నిర్దేశించిన అంశాలతో పాటు నవ్యాంధ్రకు ప్రత్యేక హోదా, జాతీయప్రాజెక్టు పోలవరం నిర్మాణం, రాజధాని నిర్మాణానికి ప్రత్యేక ఆర్థిక సహాయం, విశాఖపట్నానికి రైల్వే జోన్, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, వేగవంతమైన పారిశ్రామికీకరణ కోసం ప్రోత్సాహకాలు సమకూర్చాలి. రెవిన్యూలోటు భర్తీకోసం ఆనాటి ప్రధాని రాజ్యసభలో ఇచ్చిన హామీలను త్వరితగతిలో అమలుచేయాలి.
- కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు రెండూ సమన్వయంతో పనిచేయాల్సిన సంస్థలు. లౌకికతత్వాన్ని కాపాడటంతోపాటు, రాజ్యాంగం నిర్దేశించినట్లుగా ప్రజలకు సామాజిక, ఆర్థిక న్యాయాన్ని అందించే విధంగా వ్యవహరించాలి.
- నవ్యాంధ్రప్రదేశ్ విభజన సమయంలో నాటి యూపీయే ప్రభుత్వం అనుసరించిన విధానం గురించి ఇక్కడ ప్రస్తావించాల్సి ఉంది. ఆనాటి యూపీఏ అనుసరించిన విభజన విధానం అశాస్త్రీయంగా సాగడమే కాకుండా నవ్యాంధ్రకు అనేక సమస్యలు తెచ్చిపెట్టింది.
- నదీపరీవాహక ప్రాంతంలో చిట్టచివర ఉన్న నవ్యాంధ్రప్రదేశ్ సాగునీటి పరంగా తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటోంది. ఇంతవరకు కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య మండళ్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తికాలేదు.
- విభజన చట్టంలోని నిబంధనలు రాజ్యసభలో నాటి ప్రధాని ఇచ్చిన హామీల సంగతి అన్ని రాజకీయపక్షాలకు తెలిసిందే. గనుక వాటిని అమలు చేయడానికి పార్టీలన్నీ సహకరించాలి.
- రాష్ట్రాల ఆర్థికమంత్రుల సాధికార కమిటీ పనితీరును చూసిన తర్వాత అదే తరహాలో మిగతా రంగాల్లో కూడ సాధికార కమిటీలు వేయాలన్న ఆలోచన సహేతుకంకాదు.
- కేంద్ర ప్రభుత్వమే సొంతంగా రాష్ట్రాలకు పారామిలటరీ దళాలు తరలించడం సరైన దికాదు.
- రాష్ట్ర విభజన నేపథ్యంలో అన్ని కేంద్రీయ

విశ్వవిద్యాలయాలు తెలంగాణకు తరలిపోయినందువల్ల ఏపీలో కొత్తగా ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం తగిన సహకారం అందించాలి.

- ఆన్‌లైన్‌లో జరిగే నేరాల నియంత్రణకు ఒక స్వతంత్ర ప్రతిపత్తితో కూడిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవలసిన అవసరం ఉన్నది.
- రాష్ట్ర పోలీసు బలగాల ఆధునీకీకరణ, అంతర్గత భద్రతకు అనువైన మౌలికవసతుల కల్పనకు కేంద్రమే పూర్తి ఆర్థిక సహకారం అందించాలన్న పూంఛీ కమిషన్ సిఫారసులను స్వాగతిస్తున్నాం.
- కొత్త రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో గ్రేహౌండ్ శిక్షణ కేంద్రం, ఏపీ పోలీసస్ అకాడమీ వంటి సంస్థలను ఏర్పాటు చేయాల్సి ఉన్నది. ఇందుకు కేంద్రం తగిన ఆర్థిక సహకారం అందించాల్సి ఉంది.

రూ.1000ల నోట్లను నిషేధించాలి

అవినీతి, అక్రమాలను నిరోధించేందుకు అనేక సంస్కరణలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు ముఖ్యమంత్రి. ప్రధానంగా నల్లధనంపై కొరడా ఝుళిపించేందుకు రూ.1000ల నోట్లను వెంటనే నిషేధించాలని ఆయన ప్రధాని నరేంద్రమోదీని కోరారు.

అవినీతిని అంతం చేయడంలో మన దేశం ఐక్యరాజ్య సమితితో కలిసి పనిచేస్తున్నందువల్ల, అంతర్రాష్ట్ర మండలి సమావేశంలో ఆ అంశాన్ని కూడ అజెండాగా చేర్చాలని చంద్రబాబు సూచించారు.

ప్రత్యేక దర్యాప్తు బృందం సిఫారసు చేసినట్లు మూడు లక్షల రూపాయలకు పైచిలుకు జరిగిన నగదు లావాదేవీల ప్రక్రియను నిషేధించి, గరిష్ఠ నగదు నిల్వలను రూ.10లక్షలకే పరిమితం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అవినీతి కేసులను నిర్దిష్ట కాలవ్యవధిలోపు పరిష్కరించాలని సూచించారు. అక్రమాస్తుల కేసుల్లోని నిందితుల ఆస్తులను తక్షణం స్వాధీనం చేసుకునే వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రతిపాదనను బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ కూడ సమర్థించారు.

❖

దున్నేవాడికే పంట రుణం, బీమా పరిహారం

వీడియో కాన్ఫరెన్స్ లో ముఖ్యమంత్రి

నవ్యాంధ్రలో భూ యాజమాన్య హక్కులతో నిమిత్తం లేకుండా, భూమిని సాగు చేసుకునే రైతులకే పంట రుణాలను మంజూరు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులు, బ్యాంకర్లను ఆదేశించారు. అలాగే పంటల బీమా పరిహారాన్ని కూడా కౌలు రైతులు, సాగుదారులకే అందేలా చర్యలు తీసుకోవాలని బీమా కంపెనీలకు సూచించారు. విజయవాడలోని తన కార్యాలయంలో ప్రధాన మంత్రి పంటల బీమా యోజన పథకం, వ్యవసాయ రుణాలు, ఇతర అంశాలపై అధికారులతో ముఖ్యమంత్రి ఇటీవల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతు వ్యవసాయ రుణబకాయిల వసూళ్ళలో జిల్లా కలెక్టర్లు బ్యాంకర్లతో తరచూ సమావేశం కావాలన్నారు.

రైతులు, కౌలు రైతులకు వ్యవసాయ రుణాలు, పంట నష్ట పరిహారం నిర్ణీత గడువులోగా సక్రమంగా అందించే విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకర్లు, బీమా కంపెనీలు సమన్వయంతో వ్యవహరించాలని ముఖ్యమంత్రి సూచించారు. తాజా పంట క్షేత్రాల చిత్రాలను, సాగుదారుల ఫోటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామని, అందువల్ల ఈ వెబ్‌ల్యాండ్ సమాచారాన్ని ప్రామాణికంగా తీసుకుని సాగుదారులకు రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన బ్యాంకర్లకు సూచించారు.

అలాగే రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలను సకాలంలో చెల్లించేలా బ్యాంకర్లు గ్రామాల్లో చైతన్య సదస్సులు నిర్వహించాలన్నారు.

కష్టాలలో ఉన్న రైతులకు తమ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండడం వల్లే పంట నష్టం తగ్గిందన్నారు. దీనివల్ల బీమా కంపెనీలకు పరిహార భారం కూడా గణనీయంగా తగ్గుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. బీమా చెల్లింపులో పెద్దగా భారం పడనందువల్ల ప్రీమియం తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని బీమా కంపెనీలను ఆయన కోరారు. సాంకేతిక సహకారంతో పంట నష్టం వివరాలను సమగ్రంగా అందిస్తామని, బీమా కంపెనీలు కూడా అదే స్థాయి-లో పరిహారం చెల్లించాలని కోరారు. పరిహారం సకాలంలో, పూర్తిస్థాయిలో చెల్లిస్తే రైతులు కూడా పంటల బీమాకు పెద్దఎత్తున ముందుకు వస్తారన్నారు.

వ్యవసాయ పంటల ఉత్పాదకతలో ఈ ఏడాది మన రాష్ట్రం దేశంలో ప్రథమ స్థానంలో వుండేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నదని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ లక్ష్య సాధనకోసం ఇందుకు కృషి చేయాలని అధికారులను ఆయన కోరారు. విత్తనాలు, ఎరువులు సరఫరా నుంచి వ్యవసాయ రుణాలు, పంట నష్ట పరిహారం, ఇన్ పుట్ సబ్సిడీ తదితర రాయితీలను రైతులకు అందిస్తూ వారికి అండగా నిలుస్తున్నామన్నారు.

ప్రతి వెయ్యి ఎకరాలకు ఒక ఎంపీఈవో వుండేలా చర్యలు తీసుకున్నామన్నారు. భూసార పరీక్షలు, భూగర్భజలాల వివరాలు ఎప్పటికప్పుడు రైతులకు అందించాలని సూచించారు. విద్యుత్, ఎరువులు, విత్తనాలు, సాగునీటి విషయంలో రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూస్తున్నామన్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న ప్రాంతాల్లో రెయిన్‌గన్స్ వినియోగించి పంటలను కాపాడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రెయిన్‌గన్స్ సాయంతో రోజుకు లక్ష ఎకరాల్లో పంటలను రక్షించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. నాగార్జున సాగర్ పరివాహక ప్రాంతంలో సాగునీటి కోసం ఎదురు చూడకుండా, ఖరీఫ్ ఆలస్యం కాకుండా మెట్ట పంటలను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు.

రిజర్వాయర్లలో నీటి లభ్యతను బట్టి ముందుగానే రబీ ప్రారంభమయ్యేలా చూస్తామన్నారు. సూక్ష్మ సేద్యానికి, రెయిన్ గన్స్ కొనుగోలుకు రూ. 161 కోట్లు వ్యయం చేసినట్టు ముఖ్యమంత్రి తెలిపారు. నీటి సరఫరా కోసం ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత మాత్రం రైతులదేనన్నారు.

తుపానులు రాకముందే పంట చేతికొచ్చేలా, ముందుగానే సాగు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే పంటకాలం కన్నా ముందే రైతులకు విత్తనాలను అందించేలా టెక్నాలజీని వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి విజయ్ కుమార్, కమిషనర్ ధనుంజయ రెడ్డి, రైతు సాధికార సంస్థ సీఈవో కె. మధుసూధనరావు, వివిధ జిల్లాల కలెక్టర్లు, బ్యాంకర్లు, బీమా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉప్పొంగి పొంగేటి మా కృష్ణవేణి
పొంగూర బంగారు సింగారి రాణి

సహ్యాద్రి... బ్రహ్మగిరి- పేర్లేమైతేనేం, యుగాలుగా చెలించని మహోన్నత జాతి సంస్కృతి వంటి కొండలు. శ్వేతాశ్వత్థ వృక్షం... అమలక వృక్షం - పేర్లేమైతేనేం, తరాలుగా చెదరని నిండైన జాతి సంస్కారం వంటి చెట్లు: ఇవీ కృష్ణ- వేణీ నదీ మూలాలు.
హరిహరాత్మకమైన కృష్ణవేణి, బ్రహ్మ అంశతో పుట్టిన కకుద్మతి కలిశాక త్రిమూర్త్యాత్మకం అయ్యిందని ఐతిహ్యం.
త్రిమూర్త్యాత్మకం అంటే సృష్టి... స్థితి... లయాత్మకం. ఝరిలో ధ్వని - శబ్దం - నాదం. పుట్టుక- ప్రవాహం- సాగరంలో సంలీనం- సృష్టి స్థితి లయల్ని వేర్వేరుగా చూడలేని నిరంతర చంక్రమణమే కృష్ణవేణి. బ్రహ్మాండ పురాణం మన్వంతర గణనాల ప్రకారం కృష్ణా నది వయసు 43 కోట్ల సంవత్సరాలు. లౌకిక పరిభాషలో దీని అర్థం ఏమిటి? మహానదులకు మల్లే మన్వంతరాలు దాటి ప్రవహిస్తున్న కృష్ణ - అనంత కాలవాహిని. నిరంతర చైతన్య స్రవంతి! కృష్ణవేణి త్రిమూర్త్యాత్మకం మాత్రమే ఏమిటి? పంచభూతాత్మకం కూడా. ఒట్టి నీరే కాదు- ఉపరితల అద్దంలో బింబమౌతుంది ఆకాశం; అల్లరి అలల లాహిరిలో ఆగని వాయులీనం; గట్లు ఒరిసే ఉరవడికి అంటే మట్టి పరిమళం; ఉప్పెనల ఉత్పాతంలో బుగులుకొనే బడబాగ్ని- వెరసి పృథివి... ఆపస్సు... తేజస్సు... వాయువు... ఆకాశాల పాంచ భౌతికం మన కృష్ణవేణి!
నదీ- నాగరికత, పశుగణాల ఆవిర్భావం, పీఠభూముల సేద్యం, పాడి పంట, పల్లె.... పట్టణం... నగరం! నది సముద్రంలో సంగమిస్తుంటే, గ్రామాలు తరలి వచ్చి పట్టణాల్లో, నగరాల్లో ఓదిగిపోతున్నాయి. ఎదిగిపోతున్నానని, ఎగిరి పోతున్నానని భ్రమరకాంక్షతో ఎక్కడెక్కడో దిగంతాల ఆవలికి వెళ్లిన మనిషి మళ్లీ బయల్దేరిన చోటికే చేరుకుంటున్నాడు. మూలాలను వదిలి తాను పోగొట్టుకున్నదేమిటో తనకే అర్థంకాక సతమతమై క్రిక్కిరిసిన జనం మధ్య ఒంటరివాడై మనిషి సరికొత్త వెతుకులాట మొదలు పెడుతున్నాడు. అప్పుడు గుర్తుకొచ్చేది ఏమిటి? తన ఆరంభం! దానికి ఆలంబనైన ఊరు. ఒకనాడు గ్రామాల్లో ఖాళీ లోగిళ్లు దర్శనమిచ్చాయి. నిజమే! వాకిట్లో కసవు ఊడ్చి ఇన్ని కళ్లాపి నీళ్లు చల్లి ముగ్గు పెట్టి దీపం వెలిగించే దిక్కు కరవైన ఎన్నో ఇళ్లు మళ్లీ ఆవాసాలవుతున్నాయి. అమ్మను విడిచి వెళ్లడం, ఎక్కడెక్కడో తిరిగి మళ్లీ అమ్మను వెతుక్కుంటూ రావడం బిడ్డ పనే అయిందిగాని ఊరు అమ్మలా ఉన్నచోటే ఉంది. ఋతువులు మారుతున్నాయి. ఎండాకాలం, వర్షాకాలం, శీతాకాలం వస్తున్నవి, వెళ్తున్నవి.
అంతమాత్రాన నది ఇంకుతుందా లేక ఊరు ఖాళీ అవుతుందా? సహజ జీవశక్తి స్వంతం చేసుకున్న వాటి గమనాన్ని ఆపగల్గిన వాడెవ్వడు? ఊరును బతికించడమైనా లేక ఊరును తనలో కలుపుకోవడమైనా ఒక్క నది మాత్రమే చేయగలదు. ఊరును వదలి బయటికొచ్చిన మనిషి తిరిగి ఊరును వెతుక్కుంటూ ఊరి బాహువుల్లోకి వెళ్లవలసిందేగాని ఊరు ఎక్కడికి పోతుంది? ఊరు ఊసు లేకుండా ఊపిరి సలపదనుకున్న వాడు ఒక గుప్పెడు ఊరి జ్ఞాపకాలను వెంట తెచ్చుకుని వాటితో బతకాలేగాని తనను కాదని వదిలి వెళ్లినవాడు లేకుంటే ఊరికేమవుతుంది ? ఊరిని బతికిస్తున్న నదికేమవుతుంది?
అందుకే అశేష జనజీవన స్రవంతిని సతతం సజీవం చేసే నదికి నమ- స్కరించాలి. పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే కృష్ణా నదీమతల్లి పుష్కర వేళ (ఆగస్టు 12- 23) అయినా కృతజ్ఞతగా కైమోడ్చాలి. మన అంతరాంతర జ్యోతిస్సీమలకి బాహ్యరూపాలుగా వెలసిన దేవాలయాల శక్తి కేంద్రాలను తాకి తడుముతూ దివ్యతీర్థంగా మారి పులకరించే పుష్కరావర్త మూర్తికి ప్రణమిల్లాలి. తరించాలి!





పాపహారిణి... మోక్షకారిణి కృష్ణవేణీ!

వెల్లువల కృష్ణమ్మ పొంగిపారిన చాలు...



ఉత్తర భారతదేశంలోని గంగానది, దక్షిణ భారతదేశంలోని కృష్ణవేణీ నది మాత్రమే దర్శన, స్పర్శన, కీర్తనాదుల వలన నరులను తరింపచేస్తాయి అని పురాణాలు ప్రకటిస్తున్నాయి. ఈ రెండు నదుల విషయంలో ఒక విశేషం ఉంది. గంగానది అందరి పాపాలను హరిస్తుంది. కానీ తనకు సంక్రమించిన పాపాన్ని మాత్రం తొలగించుకొనలేనిది. ఇతరుల పాపాలనే కాదు, తన పాపాలను నిర్మూలించుకునే విశిష్టమైన సామర్థ్యం కలది కృష్ణవేణీనది.

మహానది కృష్ణవేణిలో స్నానం చేయడానికి దేవతలు మానవ జన్మకి తపిస్తారట. అటువంటి కృష్ణా నదీ మహిమ వర్ణించడానికి ఆ దేవతలే అశక్తులనడం అతిశయోక్తి కాదు. కృష్ణా నది ప్రవహించే ప్రదేశాలు శుభప్రదాలు. ఆ కృష్ణానదీ తీరవాసులు మహాభాగ్యవంతులు, కృష్ణా, గోదావరీ నదులమూలంగా ఆంధ్రప్రదేశ్ దక్షిణాదికి ధాన్యాగారం, దేశానికే అన్నపూర్ణ.

కృష్ణానది మహారాష్ట్రలోని మహాబలేశ్వరం దగ్గర సముద్ర మట్టానికి 470 అడుగుల ఎత్తున పుట్టింది. కృష్ణానదిపై ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించిన తొలి నాటి నీటి పారుదల పథకాలలో ముఖ్యమైనవి శ్రీశైలం ప్రాజెక్టు, నాగార్జున సాగర్, ప్రకాశం బ్యారేజ్, తెలుగుగంగ పథకం మొదలైనవి. కృష్ణానది మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో విస్తరించింది. కృష్ణా నది పొడవు 778 మైళ్లు. ఈ నది పరివాహక ప్రాంతం 2,51,000 చదరపు మైళ్లు విస్తరించి ఉంది. మన రా ష్ట్రంలో విజయవాడ సమీపంలోని పులిగడ్డ వద్ద మూడు పాయలై చివరకు హంసలదీవి వద్ద బంగాళాఖాతంలో కలుస్తోంది. ప్రతి సంవత్సరం కృష్ణా నది 12 లక్షల క్యూసెక్కుల వర్షపు నీరు సమకూర్చుకునేది. ఇప్పటి దుర్భర వర్షాభావ పరిస్థితుల్లో అదంతా నిన్నటి చరిత్రగా మిగిలిపోయింది. అప్పట్లో కృష్ణాడెల్టాలో 35 అంగుళాల ఏడాది సగటు వర్షం కూడా సక్రమంగా పడేది కాదు. 1833లో కృష్ణా జిల్లాలో కనివిని ఎరుగని కరువు వచ్చింది. 1852-1855 మధ్య సర్ ఆర్థర్ కాటన్, కెప్టెన్ చార్లెస్ ఆర్ల్ కృష్ణా నదిపై 7 ఫర్లాంగుల ఆనకట్ట 30 లక్షల రూపాయల ఖర్చుతో 6 లక్షల ఎకరాల సాగుబడికి ఉ ద్దేశించి నిర్మించారు. 1958లో 2.80 కోట్లతో ప్రకాశం బ్యారేజి పూర్తి చేయబడింది. కృష్ణానదీ తీరంలో వెలసిన అధునాతన దివ్య దేవాలయం నాగార్జున సాగర్ ప్రాజెక్టు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు పండిట్ నెహ్రూ పునాది రాయి వేసిన డిసెంబర్ 10, 1955, కోస్తాంధ్ర గతినే కాదు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గతినే మార్చేసింది. . ఇది ప్రపంచంలో ఎత్తయిన డ్యాము. 6056 అడుగుల ఎత్తు గల రాతి సిమెంటు కట్టడం సముద్రమట్టం నుంచి లేచింది. నదీ గర్భానికి 370 అడుగుల ఎత్తున ఉంటుంది.

కకుద్మతీ, విశాలా, విజయ, వైష్ణవి, మలాపహారిణి, కుముద, కౌశిక, నారాయణి, భీమా, తుంగభద్ర, అరుణ, మూసి మొదలైన 14 ఉప నదులు తనలో లీనం చేసుకొన్న కృష్ణానది ఒక అపూర్వమైన జలరాశి. ప్రకృతి



సౌందర్యాన్ని అందజేసే అందాలరాశి. జనులకు సంపదలు అనుగ్రహించే సౌభాగ్యరాశి, భక్తజనుల పాలిట పుణ్యరాశి.

ఆవిర్భావం- ఐతిహ్యం

భరతఖండము పాడియావు అన్నాడో కవి. అఖండ భూమండలానికి అలంకారం మన దేశం. అటువంటి భారత భూభాగంలో సహ్యాద్రి పర్వతం ఉంది. శ్రీకృష్ణ భగవానుడు కృష్ణానది జన్మస్థావరమైన అశ్వత్థ వృక్ష స్వరూపం ధరించి సహ్యాద్రి పర్వతం పైన అవతరించాడు. భవబంధ విముక్తి స్వరూపిణి, పాపహారిణి, మోక్షకారిణి అయిన కృష్ణానది సహ్యాద్రి పర్వతంపై ఉన్న అశ్వత్థ వృక్షమూలంలో ఉద్భవించింది. కల్పారంభంలో బ్రహ్మ సృష్టి ప్రారంభం చేయడం మూలంగా కృష్ణానది ఆవిర్భావం సంభవించిందని ఐతిహ్యం.

'కృష్ణా విష్ణుతనుః సాక్షాత్ వేణీ దేవో మహేశ్వరః' అన్న ప్రసిద్ధి ఏర్పడింది. 'కృష్ణా కృష్ణాంగ సంభూతా' అని కీర్తింపబడింది. కృష్ణవేణి హరిహరాత్మకమయింది. బ్రహ్మదేవుని అంశతో పుట్టిన 'కకుద్మతీ' నది కృష్ణవేణితో కలసి త్రిమూర్త్యాత్మకమయింది. విశాలా, విజయ, వైష్ణవి, మలాపహారిణి, కుముద, కౌశిక, భీమా, తుంగభద్ర ఆదిగా గల దైవాంశగల నదులు ఉపనదులు కావడం వలన కృష్ణవేణి హరిహరాత్మక, త్రిమూర్త్యాత్మక మాత్రమేగాక సర్వదేవతాత్మకమయింది. దేవాంశగల నదులు పూర్వవాహినులయ్యాయి. దేవతల భార్యల అంశలు కలవి పశ్చిమ వాహినులయ్యాయి. గాయత్రీ స్వర పశ్చిమాభిముఖ నదీ స్వరూపాలు పొందాయి. ఇది పద్మపురాణంలోని కార్తీక మహత్మ్యంలోని కృష్ణానదీ జన్మ వృత్తాంతం. బ్రహ్మాండ పురాణపు మన్వంతర గణితం ప్రకారం కృష్ణానది 42,89,84,000 ఏళ్ళ పూర్వపు నాటిదిగా భావింపబడుతోంది. పద్మ మహాపురాణం ఉత్తర ఖండం 113వ అధ్యాయం ప్రకారం కృష్ణానది 9,81,080 సంవత్సరాలకు ముందు పుట్టిందిగా ఊహింపబడుతోంది. ఈ మన్వంతర గణితాలను పురస్కరించుకుని ప్రపంచంలోను, భారతదేశంలోను గల అతి పురాతన, బహు ప్రాచీనమైన నదులలో కృష్ణానది ఒకటిగా పరిగణించవలసి ఉంటుంది. బ్రహ్మాండ పురాణం కృష్ణానదిని పేర్కొంది. విష్ణు పురాణం కృష్ణవేణిని పరిగణించింది. భారతం కృష్ణను వర్ణించింది.

మహారాష్ట్రమందలి మహాబలేశ్వరునకు సమీపంలోని కొండల అడుగు భాగాన గల గోముఖాకారం గల ఒక రంధ్రం నేటి కృష్ణానది జన్మస్థానం. సతారాకు సుమారు 5 మైళ్ల దూరంలో వేణీనది కృష్ణలో కలసింది. దీనిని నేడు 'సంగమనా నగరం' అంటున్నారు.

"తత్ర విష్ణు రభూత్ కృష్ణా/ వేణీ దేవో మహేశ్వరః/ బ్రహ్మా కకుద్మతీ/ పృథగే వాచర న్నమీప" దివి నుండి భువికి దిగిన కృష్ణానది మహిమ ఇది!

పుష్కర స్నానం

నూతి నీటి స్నానం, చెరువులో స్నానం, నదీస్నానం, పుష్కర స్నానమని స్నానాలు నాలుగు రకాలు. ఈ వాపీ కూప తటాక నదీ స్నానాలు ఒకదానికంటే మరొకటి గుణప్రదమైంది, గణనీయమైందీ అని హిందువుల నమ్మకం. మృత్తికా స్నానం, విభూతి స్నానం వంటివి మనిషి వ్యాధిగ్రస్తుడైనప్పుడు చేసే స్నాన ప్రత్యామ్నాయాలు. మల మూత్ర విసర్జన తరువాత చేసేది కంఠస్నానం. దేవపూజలకు, పితృదేవతా పూజలకు అవసరమై చేసేవి శిరస్నానాలు, వార స్నానంగా, పండుగ స్నానంగా, పర్వదిన స్నానంగా చేయవలసింది. 'అభ్యంగన స్నానం' ఏ స్నానమైనా శ్రేష్ఠమైనదే. అన్ని స్నానాలలో నదీస్నానం శ్రేష్ఠతరం. పుష్కర స్నానం మరీ శ్రేష్ఠం. అటువంటి పుష్కర

నదీస్నానం మానవుని శారీరక మానసిక పటుత్వాలను అభివృద్ధి చేస్తుందట. ఆ సమయంలో ఆ నదిపై నుండి ప్రసరించే వాయువును పీలిస్తే ఆయుర్దాయం పెరుగుతుందట. ఆవిధంగా పుష్కర స్నానం శ్రేష్ఠతమమైంది.

అమృతస్పర్శతో అతి పావనం

గరుత్మంతుడు మాతృదాస్య (తల్లి వినత శాప) విముక్తికై స్వర్గం నుండి అమృత భాండం తీసుకు వస్తున్నప్పుడు దానిలోని అమృత



బిందువులు పడిన నదులన్నీ అమృత బిందు స్పర్శచే అతి పవిత్రములైన తీర్థరాజాలయ్యాయని ఒక పౌరాణిక గాథ ఉంది. ఆవిధంగా ప్రఖ్యాతమైన తీర్థాలలో కృష్ణ, గోదావరి మహానదులు కూడా ఉన్నాయి. అమృత బిందు స్పర్శ భాగ్యం పొందిన కృష్ణవేణి పుష్కర స్నానం భక్తులకు లభించిన దివ్యమైన వరం.

నర్మదా తీరంలో తపస్సు వలన గంగా తీరంలో మరణం వలన గోదావరీ తీరంలో తపోదాన మరణాదుల వలన జనులు తరిస్తారు. ఉత్తర భారతదేశంలోని గంగానది, దక్షిణ భారతదేశంలోని కృష్ణవేణీ నది మాత్రమే దర్శన, స్పర్శన, కీర్తనాదుల వలన నరులను తరింపచేస్తాయి అని పురాణాలు ప్రకటిస్తున్నాయి. ఈ రెండు నదుల విషయంలో ఒక విశేషం ఉంది. గంగానది అందరి పాపాలను హరిస్తుంది. కానీ తనకు సంక్రమించిన పాపాన్ని మాత్రం తొలగించుకొనలేనిది. ఇతరుల పాపాలనే కాదు, తన పాపాలను నిర్మూలించుకునే విశిష్టమైన సామర్థ్యం కలది కృష్ణవేణీనది. గంగాతీరంలోని ఒక విప్ర వనిత నిత్య వ్యభిచారిణియై నిత్య గంగాస్నానం ద్వారా నిత్య వ్యభిచార దోషం తొలగించుకునేదట. ఆ వ్యభిచారిణి పాపం గంగకు సంక్రమించగా దాన్ని హరింపచేసుకోలేక పోయిందట. కాగా గంగ నిత్య వాయస (కాకి) రూపం పొంది కృష్ణలో స్నానం చేసి తన పాపం హరింపచేసుకుని హంస రూపంతో స్వస్థానం చేరుకునేదట. ఇది కృష్ణా మహత్యం వివరించే ఒక కథ. కృష్ణకు చెందిన హంసలదీవి కథ కూడా ఇదే.

కృష్ణా స్నానం శతధేను ఫలం

కృష్ణా నది మహాబలేశ్వరం నుండి శ్రీశైలం వరకు గంగా నదితో సమానమైంది. అక్కడ నుండి సాగర సంగమం వరకు నూరు రెట్లు ఫలవంతమైంది. సహ్యా పర్వతం నుండి సాగరం వరకూ కృష్ణానది రెండు తీరాల వెంట యోజన పర్యంతం మోక్షప్రదమైన క్షేత్రంగా ప్రకటింపబడింది. స్వప్నంలోని క్లేశాలు మేల్కొన్నప్పుడు బాధింపవు. కృష్ణానది మహిమ గ్రహించిన వారిని మాయగాని, లోకమాయకు చెందిన కష్టాలుగాని బాధింపవు. కాగా కృష్ణపై నుండి వీచే గాలి సూర్యరశ్మి చీకటిని తొలగించినట్లు పాపాలను నాశనం చేస్తుంది. కృష్ణ సర్వం ప్రసాదిస్తుంది. ముక్తి ఇవ్వడంలో ఆశ్చర్యం ఏమిటి? కృష్ణాతీరంలోని జప, హోమ, తప, దాన, సద్గురు సేవాదులు అనంత పాప సముదాయాలను నిర్మూలించి అక్షయ ఫలితాలు కలిగిస్తాయి. వేయిజన్మల పాపమైనా కృష్ణానదిలో చేసే భక్తిపురస్సరమైన ఒక స్నానంతో నశిస్తుంది. కృష్ణానది ప్రవహించే గ్రామ, అరణ్య, పర్వత ప్రాంతాలలలో విధి విధానంగా చేసే కృష్ణానదీ స్నానం వాజపేయ ఫలితం సిద్ధింప చేస్తుంది. అంతేకాదు కృష్ణానదీ ప్రవాహ స్నానం నూరు పాడి ఆవుల దానఫలం (శతధేను ఫలం) కలగచేస్తుంది.

పావన కృష్ణా తరంగ వాయువులు సోకిన నరుడు సర్వపాప హరుడై శ్రీహరివాసం పొందుతాడు. గాలివలన ఎగిరిన కృష్ణానది యొక్క తుంపురుల తాకిడి ఏ నరునకు కలుగుతుందో ఆ మానవుడి నూరు జన్మల పాపాలు హరిస్తాయి. ఇది కృష్ణవేణిపై ప్రసరించే వాయువుల దివ్య ప్రభావం. బ్రహ్మజ్ఞాని కావడం, గయలో శ్రాద్ధం చేయడం, కురుక్షేత్రంలో దానం కావించడం, కృష్ణవేణీ జలపానం చేయడం సమానమైన సత్కార్యాలు. కృష్ణవేణీ నదీజలాలలో స్నానం చేయడం వలన కృష్ణవేణిపై వీచే గాలులు పీల్చడం వలన, కృష్ణవేణీ జలాలు పానం చేయడం వలన ఇట్టి మహత్తరమైన దివ్యఫలాలు లభిస్తాయి.

గురుడు కన్యారాశిలో ఉన్నపుడు పుడమిలోని పవిత్ర తీర్థాలన్నీ కృష్ణానదిని ఆశ్రయిస్తాయి. త్రిమూర్తులు, ఇంద్రాది సకల దేవతలు, ఋషులు అందరూ కృష్ణానదీ తీరంలో నివసిస్తారు. రవి కన్యలో ఉన్నపుడు కృష్ణానదీ స్నానం 60 వేల సంవత్సరాల గంగానదీ స్నాన ఫలం ప్రసాదిస్తుంది. ప్రతి సంవత్సరం రవి కన్యలో ప్రవేశించినపుడు కృష్ణానదీ స్నానం అంతటి పుణ్యఫలం ఇస్తుంటే 12 సంవత్సరాలకు గురుడు కన్యారాశిలో ప్రవేశించినపుడు కృష్ణానదీ పుష్కర స్నానం ఎంతటి అనంత పుణ్యఫలం భక్తులకు సన్నిహితం చేస్తుందో పరిగణించడం సాధ్యమా? వర్ణించడం సాధ్యమా?

శ్రీ కనకదుర్గా మల్లేశ్వరులు ఆవిర్భవించిన దివ్యక్షేత్రం విజయవాడ. నిత్యం యాత్రికులు కృష్ణమ్మలో స్నానంచేసి దుర్గమ్మను చూస్తుంటారు. విజయవాడ కనకదుర్గా క్షేత్ర పవిత్రతను ఇంద్రకీలాద్రి పర్వతం శతాధికం చేస్తోంది. కృష్ణానది సహస్రాధికం కావిస్తోంది. అర్జునుడు తపస్సుచేసి పశుపతిని మెప్పించి పాశుపతాస్త్రం పొందింది కృష్ణానదీ తీరంలో ఇంద్రకీలాద్రి పర్వతంపైన. కృష్ణమ్మను సేవిస్తేకానీ తనను దర్శించి, పూజించడానికి అనుమతించదు విజయవాడ కనకదుర్గమ్మ. శ్రీ దుర్ముఖి నామ సంవత్సరం శ్రావణ శుద్ధ అష్టమి గురువారం ఆగస్టు 11 రాత్రి 11గం. 32 నిమిషములకు గురుడు కన్యా రాశి ప్రవేశం కనుక, మర్నాడు శ్రావణ శుద్ధ నవమి శుక్రవారంనాడు అంటే ఆగస్టు 12 కృష్ణానదికి పుష్కరాలు ప్రారంభం కానున్నాయి. సార్థ త్రికోటి తీర్థ రాజ సహిత కృష్ణవేణీ నదీ పుష్కరాలు 12 దినాలు మహా వైభవంగా జరుగుతాయి. 'కన్యాగతే దేవగురౌ, సార్థత్రికోటి తీర్థ సహిత, పుష్కర ప్రయుక్తా మహాపర్వాణీ పుణ్యకాలే, కృష్ణవేణీ స్నానమహం కరిష్యే' అని సంకల్పం చెప్పుకొని కృష్ణా పుష్కర స్నానం చేద్దాం... తరిద్దాం.

❖

మహానది... మంగళకర శబ్దనది!



పార్వతీపరమేశ్వరుల్లా శబ్దం– అర్థం మధ్య అర్ధనారీశ్వర బంధం ఉందన్నాడు మహాకవి కాళిదాసు. అర్థానికి అతీతమైన శబ్దశక్తిని చాటి చెప్పింది మన భారతీయ అనాది వేదం. నదీనదాల ఋణం తీర్చుకోవడానికి పుష్కర పవిత్ర వేళలో తీరాన కైమోడ్చే అశేష జన వాహిని మంత్ర సహితంగా సృష్టించే శబ్దనది పరమ పావనం , జాతికి మంగళకరం.

పుష్కర స్నాన సమయంలో మంత్ర పఠనం మన విధి. విధులు నిర్వహిస్తూ అర్ఘ్యమివ్వడం అనాది ఆచారం.

స్నానానికి ఆజ్ఞ తీసుకోవడానికి:

పావని! త్వం జగత్పూజ్యే! సర్వతీర్థమయే! శుభే!

త్వయి స్నాతుమనుజ్ఞాం మే దేహి కృష్ణే! మహానది!

మనసులో ధ్యానించుకోవడానికి

కన్యాగతే దేవగురౌ పితౄణాం తారణాయ చ

సర్వపాప విముక్త్యర్థం తీర్థస్నానం కరోమ్యహమ్

నదికి నమస్కారం చేస్తూ చెప్పవలసినది

తీర్థ రాజ నమస్తుభ్యం సర్వలోకైక పావన!

త్వయి స్నానం కరోమ్యద్య భవబంధ విముక్తయే.

ఈ కింది మంత్రాలతో ఒక్కొక్క దేవతకు ప్రత్యేకముగా అర్ఘ్యమీయవలెను.

కృష్ణా నదికి

కృష్ణానది! మహాదేవి! సర్వపాపహరేమలే

స్నాన సాద్గుణ్య సిద్ధ్యర్థమిద మర్ఘ్యం దదామ్యహమ్

శ్రీకృష్ణవేణ్యై మహానద్యై నమః ఇదమర్ఘ్యం సమర్పయామి

తీర్థరాజుకు

తీర్థరాజ! మహాభాగ! సర్వతీర్థ సమావృత

ఇదమర్ఘ్యం మయా దత్తం గృహాణ వరదో భవ

తీర్థరాజాయ నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.

బృహస్పతికి

బృహస్పతే! సురాధ్యక్ష! సర్వదేవనమస్కృత

ఇదమర్ఘ్యం ప్రదాస్యామి సంగృహాణ మహామతే

బృహస్పతయే నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.

విష్ణువుకు

శ్రీరమానాథ! శ్రీవిష్ణో! గంగోద్భవ పదాంబుజ

సంగృహాణ! జగన్నాథ! ఇదమర్ఘ్యం దదామ్యహమ్

శ్రీమహావిష్ణవే నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.

శివునకు

ఉమానాథ! మహాదేవ! గంగాధర! మహేశ్వర!

ఇదమర్ఘ్యం మయా దత్తం సంగృహాణ త్ర్యయంబక

శివాయ నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.

బ్రహ్మాది దేవతలకు

బ్రహ్మేంద్రాగ్ని ముఖాస్సర్వే సురాః పుణ్యఫలప్రదా

ఇదమర్ఘ్యం ప్రదాస్యామి గృహ్ణీత విధినాధునాః

బ్రహ్మాది సర్వదేవేభ్యో నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.

వశిష్ఠాది మునులకు

వశిష్ఠో గౌతమో త్రిశ్చభారద్వాజోమృకండుజః

విశ్వామిత్రో దేవలశ్చ తుభ్యమర్ఘ్యం దదామ్యహమ్

వశిష్ఠాది మునిభ్యో నమః ఇదమర్ఘ్యం సమ–ర్పయామి.

గంగాది సకల నదులకు

గంగాద్యాశ్చ మహానద్యో యాశ్చ పుణ్యాస్సమాగతాః

ఇదమర్ఘ్యం ప్రదాస్యామి యూయం గృహ్ణీత సన్నిధౌ

గంగాదిభ్యో నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.

సూర్యనారాయణమూర్తికి:

ఉదయే బ్రహ్మ రూపీ చ మధ్యాహ్నే తు మహేశ్వరః

సాయంకాలే సదా విష్ణుః త్రిమూర్తిశ్చ దివాకరః

ఛాయా ఉషాసమేత శ్రీ సూర్య నారాయణ పర బ్రహ్మణే నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.

గంగలో నీళ్లు మూడుమార్లు పుచ్చుకొని ఒడ్డునకు వచ్చి, నీళ్లలోనే నిలిచి, ఈ కింది మంత్రముతో కట్టుకున్న వస్త్రము నీళ్లను ఒడ్డుమీద మూడుసార్లు పిండవలయును.

యన్మయా దూషితం తోయం శారీరమలసంయుతమ్

తస్య పాప విశుధ్యర్థం యక్ష్మాణం తర్పయామ్యహమ్.

ఒడ్డునకు వచ్చి పొడి గుడ్డలు (పట్టు వస్త్రములు) కట్టుకొని సూర్యధ్యానము చేసుకొనవలెను.

ధ్యేయస్సదా సవితృమండల మధ్యవర్తీ

నారాయణ స్సర సిజాసనసన్ని విష్టః

కేయూరవాన్ మకరకుండలవాన్

కిరీటి హారీ హిరణ్మయవపుః ధృతశంఖచక్రః ❖

కృష్ణా పుష్కరం 2016

కృష్ణా పుష్కరాలకు సర్వం సిద్ధం

ఈ భూమి మీద జీవించే సకల ప్రాణులకూ నీరు ఆధారం. ఆ నీటిని అందించే నదులతో మానవునికి తరతరాలుగా అనుబంధం కొనసాగుతోంది. నిత్యం ప్రవహించే జీవనదులు మానవునకు ఆహారాన్ని, ఆరోగ్యాన్ని, ఆనందాన్ని అందిస్తున్నాయి. ప్రపంచంలోని అన్ని దేశాల్లోను మహా నగరాలన్నీ నదీ తీర ప్రాంతాల్లోనే వెలిశాయి, అభివృద్ధి చెందాయన్న విషయాన్ని కూడా మనం గమనించాలి. అంతటి ప్రాముఖ్యత గల జీవనదుల్లో స్నానమాచరించడాన్ని మన భారతీయులు ఒక పుణ్య కార్యంగా, ఒక కర్తవ్యంగా భావిస్తారు. దేశంలో గల 12 జీవ నదుల్లో ఒక్కో ఏడాది ఒక్కొక్క నదికి పుష్కరాలు వస్తాయి. ఆ పుష్కరాల్లో స్నామమాచరించడానికి ఎన్ని అవాంతరాలు ఎదురైనా, ఎన్ని ఇబ్బందులకు గురైనా, ఎంతటి ఖర్చు అయినా భరించి సుదూర ప్రాంతాల నుండి సైతం కుటుంబ సభ్యులతో సహా పుష్కర యాత్రను చేపడుతూ దానినొక మహా సంకల్పంగా ప్రజలు భావిస్తారు. ఆ విధంగా పుష్కరాలకు తరలి వచ్చే యాత్రికులకు సకల సదుపాయాలు కల్పించాలి. ఈ ఏడాది మన రాష్ట్రంలో కృష్ణా పుష్కరాలు జరుగుతున్నాయి. కృష్ణా పుష్కరాలకు తరలి వచ్చే యాత్రికుల అవసరాలకు అనుగుణంగా అన్ని సదు-పాయాలను కల్పించే బాధ్యతను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వాన గల ప్రభుత్వం చేపట్టింది. రాష్ట్ర ప్రజలకు నదులతో గల అనుబంధాన్ని, రాష్ట్ర ఆర్థిక పురోగతిలో నదుల ఆవశ్యకతను గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగించడానికి ఈ పుష్కరాలను సద్వినియోగం చేసుకునే దిశలో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. గత ఏడాది జరిగిన గోదావరి పుష్కరాలను విజయవంతం చేసిన తీరులోనే కృష్ణా పుష్కరాలను కూడా విజయవంతం చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను పూర్తి చేసింది. పుష్కర యాత్రికులకు ఏవిధమైన అసౌకర్యం కలగని రీతిలో తగిన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం శ్రమించి పుష్కరాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.



ఈ నెల 12వ తేది నుండి 12 రోజులపాటు23 వ తేదీ వరకు జరిగే పుష్కరాలకు తరలి వచ్చే యాత్రికుల వసతి, భద్రత, వైద్య సహాయం, రవాణా వంటి అంశాలకు సంబంధించిన ఏర్పాట్లు, పుష్కరాలు జరిగే కృష్ణ, గుంటూరు, కర్నూలు జిల్లాల్లోని దేవాలయాల అభివృద్ధి, కొన్ని దేవాలయాల జీర్ణోద్ధరణ, గ్రామీణ ప్రాంతాల్లో పుష్కర స్నాన ఘాట్లకు రహదారుల నిర్మాణం, త్రాగు నీటి సదు-

పాయం, పట్టణ, నగర ప్రాంతాల్లో రహదారుల విస్తరణ, అభివృద్ధి, సుందరీకరణ వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. దాదాపుగా 15 ప్రభుత్వ శాఖలు తమ పరిధిలో చేపట్టవలసిన అంశాలపై విస్తృత ప్రణాళికలను రూపొందించి, వాటికి అనుగుణంగా పనులను చేపట్టాయి.

ప్రభుత్వ యంత్రాంగంలో అత్యంత కీలకమైన రెవెన్యూ శాఖ, వివిధ ప్రభుత్వ శాఖలు అమలు చేసే కార్యక్రమాలను సమన్వయపరచే బాధ్యతను తీసుకుంది. పుష్కరాలు జరిగే మూడు జిల్లాల్లోని కృష్ణ తీరాలలోగల 326 ఆలయాల అభివృద్ధి, అలంకరణ పనులను దేవాదాయ శాఖ చేపట్టింది. అందులో ప్రధానంగా శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం, విజయవాడ, శ్రీఅమరలింగేశ్వర స్వామి దేవస్థానం, అమరావతి, శ్రీభ్రమరాంబ మల్లిఖార్జున స్వామి దేవస్థానం, శ్రీశైలం, శ్రీలక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం, వేదాద్రి, శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానం, హంసలదీవి వంటి ఆలయాలు ఉన్నాయి. చారిత్రకంగా ప్రసిద్ధిగాంచిన అమరావతిలో ఈ పుష్కరాల సందర్భంగా ధ్యాన బుద్ధ ప్రాజెక్టు సమీపంలో 18 ఎకరాల స్థలంలో ఎనిమిది ప్రముఖ దేవాలయాల నమూనా మందిరాలను దేవాదాయ శాఖ ఏర్పాటు చేస్తోంది. దాంతోపాటు యాత్రికులు పుష్కరాల సమయంలో ప్రధానంగా నిర్వహించే పిండ ప్రదానాలకు పురోహితుల నియామకం, వారికి గుర్తింపు కార్డుల జారీ, యాత్రికుల నుండి పిండ ప్రదానానికి వసూలు చేయవలసిన రుసుం నిర్ణయం వంటి కార్యక్రమాలను దేవాదాయ శాఖ అమలు చేస్తోంది. పిండ ప్రదానం వంటి కార్యక్రమాలను నిర్వహించడానికి ఇప్పటికే సుమారు 2,000 మంది పురోహితులు దేవాదాయ శాఖ వద్ద తమ పేర్లను నమోదు చేసుకున్నారు. పుష్కరాల సందర్భంగా 6 తరహా పూజాది కార్యక్రమాలను యాత్రికులు నిర్వహిస్తారని, అందు కోసం 40 రకాల పూజాది సామగ్రి అవవసరమని భావించి, దానికి అనుగుణంగా వాటి సేకరణపై దేవాదాయ శాఖ దృష్టి సారించింది.

మరో వైపున, తిరుమల తిరుపతి దేవస్థానం విజయవాడలో శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ నమూనా మందిరాన్ని నిర్మించింది.



పురపాలక శాఖ తన పరిధిలోని పట్టణ, నగర ప్రాంతాల్లో రహదారుల విస్తరణ, మరమ్మతులు, సుందరీకరణ వంటి పనులను పూర్తి చేసింది. పంచాయతిరాజ్ శాఖ గ్రామీణ ప్రాంతాల్లోని నదీ తీరంలో గల స్నానఘాట్లకు రహదారుల నిర్మాణం, అక్కడకు చేరుకునే యాత్రికులకు త్రాగునీటి సదుపాయం కల్పన బాధ్యతలను చేపట్టింది. రహదారులు, భవనాల శాఖ తన పరిధిలో గల రహదారుల అభివృద్ధి, మరమ్మతులను చేపట్టడం, ప్రభుత్వ వసతి గృహాల అభివృద్ధి, సుందరీకరణ వంటి పనులను పూర్తి చేసింది. స్నానఘాట్ల సమీపంలో నదుల్లో నీటిని శుభ్రపరచే పనులను మత్స్య శాఖ చేపట్టింది. యాత్రికలకు రక్షణ, భద్రత కోసం పోలీస్ యంత్రాంగం ఒక ప్రత్యేక ప్రణాళికను రూపొందించుకుని, దానికి అనుగుణంగా పోలీస్ సిబ్బంది, అధికారులను ఇతర ప్రాంతాల నుండి తరలించే చర్యలను పోలీస్ శాఖ అమలు చేస్తోంది. స్నానఘట్టాల వద్ద యాత్రికులకు రక్షణగా గజ ఈతగాళ్ళను నియమించడంతోపాటు, అత్యవసర పరిస్థితుల్లో యాత్రికులు, ఆయా ప్రాంతాల్లోని ఆస్తులను అగ్ని ప్రమాదాల నుండి కాపాడే చర్యలను అగ్నిమాపక, విపత్తు నివారణ శాఖ నిర్వహిస్తోంది. యాత్రికులకు అవసరమైన అత్యవసర వైద్య సేవలను అందించడానికి వైద్య, ఆరోగ్య శాఖ ప్రణాళికలను రూపొందించింది. ఆంధ్ర ప్రదేశ్ దక్షిణ విద్యుత్ పంపిణి సంస్థ – ఎపిఎస్‌పిడిసిఎల్ మూడు జిల్లాలో పుష్కరాలు జరిగే ప్రదేశాల్లో నిరంతరం విద్యుత్ సరఫరాను అందించే చర్యలు చేపట్టడంతోపాటు, అందులో భాగంగా అవసరమైన మేరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు, కొత్త లైన్ల నిర్మాణం వంటి పనులను పూర్తి చేసింది. స్నానఘాట్ల వద్ద హైమాస్ట్ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసింది.

యాత్రికుల రవాణాకు అవసరమైన ప్రత్యేక బస్సుల ఏర్పాటు, అందుకోసం ప్రత్యేక బస్

కృష్ణా పుష్కరం 2016

స్టాండ్ల నిర్మించింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రతి రోజు 3 లక్షల మంది యాత్రికులు విజయవాడకు తరలి వచ్చే విధంగా ప్రత్యేక బస్సులు నడపడానికి రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రణాళికలు రూపొందించింది. విజయవాడ నగరంలో ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి యాత్రికులు చేరుకునే విధంగా 300 ప్రత్యేక సిటీ సర్వీసులను కూడా నడపాలని ఆర్‌టిసి ఒక విస్తృత ప్రణాళిక చేపట్టింది.

పుష్కరాలకు రైల్వే చేపట్టవలసిన చర్యలపై



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రైల్వే శాఖ మంత్రి సురేష్ ప్రభు సంయుక్తంగా అధికారులతో సమీక్షించారు. పుష్కర యాత్రికుల సంఖ్యకు అనుగుణంగా 600 ప్రత్యేక రైళ్ళను నడపడానికి, యాత్రికులకు అవసరమైన సదుపాయాలను కల్పించడానికి రైల్వే పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసింది. యాత్రికుల సౌకర్యార్థం పుష్కర నగర్‌లలోనే టికెట్ల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైల్వే నిర్ణయించింది.

పుష్కరాలు జరిగే మూడు జిల్లాల్లో గల పర్యాటక ప్రదేశాల ప్రాముఖ్యతలను వివరించి, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే ప్రణాళికలను పర్యాటక చేపట్టింది. యాత్రికులకు పుష్కరాల ప్రాధాన్యతను తెలియ చేస్తూ, విజ్ఞాన, వినోద భరితమైన సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు రాష్ట్ర సాంస్కృతిక శాఖ సిద్ధమయ్యింది.

అన్నింటికన్నా ప్రధానంగా, పుష్కరాల సమాచారం పై విస్తృత ప్రచారం కల్పించడంతోపాటు, పుష్కరాల తరుణంలో సమాచారాన్ని ప్రసార, సమాచార మాధ్యమాల ద్వారా అందించే కార్యక్రమాలను సమాచార, పౌర సంబంధాల శాఖ చేపట్టింది.

పుష్కరాల తరుణంలో రాయల సీమలోని కడప, కర్నూలు జిల్లాల యాత్రికులతోపాటు తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్రల్లోని కొన్ని ప్రాంతాలకు చెందిన యాత్రికులకు ఎక్కువగా శ్రీశైలం చేరుకుంటారు. ఒడిస్సా, తమిళనాడు, కర్నాటకలోని కొన్ని ప్రాంతాలు, ఉత్తర భారతం నుండి తరలి వచ్చే యాత్రికులతోపాటు కోస్తా జిల్లాలు, చిత్తూరు, అనంతపురం జిల్లాలకు చెందిన యాత్రికులు కృష్ణ, గుంటూరు జిల్లాల్లోని కృష్ణా తీరంలో పుష్కర పుణ్య స్నానాలు చేస్తారు. ఇందులో మిగిలని ప్రాంతాల కన్నా అధిక సంఖ్యలో 3.5 కోట్ల మంది యాత్రికులు విజయవాడకు తరలి వచ్చే అవకాశం ఉందని అధికార యంత్రాంగం గుర్తించి అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసింది.

కృష్ణా జిల్లాలో జగ్గయ్యపేట సమీపంలోని ముక్త్యాల నుండి కోడూరు మండంలోని హంసల దీవి వరకు 73 ఘాట్ల నిర్మాణం జరిగింది. అందులో విజయవాడ నగర పరిధిలో నాలుగు ఘాట్లు, మిగిలిన 69 ఘాట్లను గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించారు. విజయవాడలో 15 పుష్కర్ నగర్ లు, గ్రామీణ ప్రాంతాల్లో 24 పుష్కర్ నగర్‌లను ఏర్పాటు చేశారు. విజయవాడకు భారీగా తరలి వచ్చే యాత్రికుల రక్షణ నిమిత్తం రాష్ట్ర పోలీస్ యంత్రాంగం ఒక బృహత్తర ప్రణాళికను రూపొందించి, 17 వేల మంది పోలీస్ సిబ్బందిని వివిధ జిల్లాల నుండి తరలించాలని నిర్ణయించింది.

గుంటూరు జిల్లాలో నాగార్జున సాగర్ నుండి రేపల్లె వరకు 160 ఘాట్ల నిర్మాణం జరుగుతోంది. అందులో ప్రధానంగా అమరావతి వద్ద 1.35 కిలోమీటర్ల మేర అతి పెద్ద ఘాట్ నిర్మాణం జరిగింది. ఈ జిల్లాలో యాత్రికుల సౌకర్యార్థం ఒక్కొక్క పుష్కర్ నగర్‌లో 10 వేల మందికి వసతి చేకూర్చే విధంగా 10 పుష్కర్ నగర్‌ల నిర్మాణం,10 వేల తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణాలు జరిగాయి. కర్నూలు జిల్లాలోని శ్రీశైలం, సంగమేశ్వరం వద్ద పుష్కర ఘాట్ల నిర్మాణం జరిగింది.

ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా వివిధ రంగాల అభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలు, ప్రభుత్వ విధానాలు, వాటి ఫలితంగా సాధించిన విజయాలపై పుష్కరాలను పురస్కరించుకుని విజయవాడలో తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ప్రతి రోజు సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

పుష్కరాలకు తరలి వచ్చే యాత్రికులకు సేవలు అందించడానికి ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లతోపాటు పలు ధార్మిక, స్వచ్ఛంద సేవా సంస్థలు సిద్ధమై తాము చేయదలచిన సేవల వివరాలను ఇప్పటికే ప్రభుత్వ యంత్రాంగానికి సమర్పించాయి.

– కెఆర్‌కె రెడ్డి
సీనియర్ పాత్రికేయులు

కృష్ణా పుష్కరం 2016

కృష్ణా పుష్కరాలకు 2500 బస్సులు సిద్ధం

ప్రయాణీకుల రద్దీకి తగ్గట్లుగా ఆర్టీసీ బస్సులు

కృష్ణా పుష్కరాలలో ప్రయాణికులకు ఎటువంటి కష్టాలు ఎదురవకుండా ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ సమగ్ర ప్రణాళికను రూపొందించింది. పుష్కర యాత్రికులు ఎక్కువగా వచ్చే కృష్ణా, గుంటూరు జిల్లాలలో ఈసారి పుష్కర నగర్లు నిర్మిస్తున్నారు. కృష్ణా పుష్కరాలకు వచ్చే యాత్రికులకు మెరుగైన ప్రయాణ వసతులు కల్పించేందుకు ఏపీఎస్ఆర్టీసీ సిద్ధమైంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 2,500 బస్సులు నడుపనున్నారు. రాష్ట్రంలో ఏ జిల్లానుంచైనా కృష్ణ పుష్కరాలకు విజయవాడ, గుంటూరు, కర్నూలు ప్రాంతాలకు వెళ్లి వచ్చేందుకు వీలుగా సులువుగా ప్రయాణం చేసేందుకు ప్రయాణీకులకు అందుబాటులో ఉండేలా పెద్ద సంఖ్యలో బస్సులు నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. రద్దీకి అనుగుణంగా విజయవాడలో 400 బస్సులు, శ్రీశైలంలో 100 బస్సులను సిద్ధంగా (రిజర్వు) ఉంచడానికి ఏపీఎస్ ఆర్టీసీ ఉన్నతాధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు.

విజయవాడలో 24 పుష్కర నగర్లు, గుంటూరు జిల్లాలో 10 పుష్కర నగర్లు ఏర్పాటు చేస్తున్నారు. గుంటూరు నగరం అమరావతి రోడ్డులో లాంఫామ్ దగ్గరలోని 33 ఎకరాల విస్తీర్ణంలో భారీ పుష్కర నగర్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ పుష్కర నగర్లలో యాత్రికులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కొక్క పుష్కర నగర్‌కు 24 లక్షల నుంచి కోటి మంది వరకు వస్తారని అంచనా వేస్తున్నారు. ఇక్కడే బస్ స్టేషన్, వసతి, టాయిలెట్స్ వగైరా ఏర్పాట్లు చేశారు. పోలీసుశాఖతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడికక్కడ శాటిలైట్ స్టేషన్లతో బస్సులు నడుపుతారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు నేరుగా నగరంలోకి ప్రవేశించకుండా నగరం బయటే బస్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే బస్సులను మాత్రమే పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ వరకు అనుమతిస్తారు. విశాఖపట్నం వైపు నుంచి వచ్చే బస్సులను ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో నిలిపివేసి అక్కడ నుంచి సిటీసర్వీసుల ద్వారా ప్రయాణికులను ఘాట్లకు తరలిస్తారు. పుష్కరాలకోసం విశాఖపట్నం, ఇతర ప్రాంతాల నుంచి 700 నుంచి 1000సిటీ బస్సులను రప్పిస్తున్నారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో చక్కటి పుష్కరనగర్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

ఆర్టీసీ సర్వీసులన్నింటినీ జీపీఆర్ఎస్‌తో అనుసంధానించదలిచారు. బ్యారేజీ దిగువన ఏకీకృతంగా విస్తరిస్తున్న అతిపెద్ద భారీ ఘాట్‌లో పీఎన్‌బీఎస్ ఎదురుగా ఉన్న పద్మావతి ఘాట్ ఒకటి. ఇందులో. కృష్ణా బ్యారేజీ - రైల్ బ్రిడ్జి మధ్య ఒక సరస్సు వంటిదానిని ఏర్పాటు చేయనున్నారు. నగరంలో మొత్తం 12 శాటిలైట్ బస్‌స్టేషన్స్ ఏర్పాటు చేస్తున్నారు. తాత్కాలిక బస్‌స్టేషన్లు. రైల్వేస్టేషన్, పీఎన్‌బీఎస్, శాటిలైట్ రైల్వేస్టేషన్స్, పుష్కర నగర్‌లకు ఒక సర్కిల్‌గా ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి. ప్రతి మూడు నిమషాలకు ఒక బస్సు కదిలేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. పుష్కరనగర్ల నుంచి యాత్రికులు నగరంలో వెళ్లాలనుకునే ప్రదేశాలకు అనగా దేవాలయాలు, ఘాట్లు, బస్టాండ్, రైల్వే స్టేషన తదితర ప్రదేశాలకు చేరుకోవడానికి వీలుగా ఉచితంగా బస్సు సౌకర్యాలను ఏర్పాటుచేస్తున్నారు. కృష్ణా పుష్కరాల సమయంలో ప్రయాణికులకు ఎటువంటి కష్టాలు ఎదురవకుండా సమగ్ర ప్రణాళికను రూపొందించడంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు పెద్దెత్తున కసరత్తు నిర్వహించారు. విజయవాడలో జరుగుతున్న పుష్కర ఘాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షించి అవసరమైన బస్సులను నడపడానికి చర్యలు తీసుకున్నారు.

పీఎన్‌బీఎస్ వద్ద నుంచి ఇబ్రహీంపట్నం నదీ సంగమం వరకు పుష్కర ఘాట్‌లు ఉన్నాయి. ఆయా ఘాట్ల వరకు బస్సులు తిప్పడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఒక మార్గంలో ట్రాఫిక్ స్తంభించినా మరొక మార్గంలో పంపించేలా ప్రణాళికలు రూపొందించారు.

> ఆర్టీసీ సర్వీసులన్నింటినీ జీపీఆర్ఎస్‌తో అనుసంధానించదలిచారు. నగరంలో మొత్తం 12 శాటిలైట్ బస్‌స్టేషన్స్ ఏర్పాటు చేస్తున్నారు. తాత్కాలిక బస్‌స్టేషన్లు. రైల్వేస్టేషన్, పీఎన్‌బీఎస్, శాటిలైట్ రైల్వేస్టేషన్స్, పుష్కర నగర్‌లకు ఒక సర్కిల్‌గా ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి.

ఆరు శాటిలైట్ బస్టాండ్‌లు, 136 ప్రైవేటు పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. పుష్కరాల్లో 400 బస్సులను స్పేర్‌గా ఉంచారు. అవసరమైన ప్రాంతాల్లో వాటిని వెంటనే నడుపుతారు. 2004లో జరిగిన కృష్ణా పుష్కరాల్లో 950 బస్సులు వినియోగించారు. ప్రస్తుతం మూడు రెట్లు ఎక్కువగా బస్సులు తిప్పనున్నారు. విజయవాడ, గుంటూరు మధ్య నిరంతర సర్వీసులను నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. 500 నుంచి 600 సిటీ బస్సులను విజయవాడలో, 400 సిటీ బస్సులు గుంటూరు ప్రాంతంలో, మరో 200 బస్సులు ఇతర ప్రాంతాలలో అందుబాటులో వుంచి నిరంతర సర్వీసులను నడుపుతారు. ఎక్కడికక్కడే శాటిలైట్ బస్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు.

విజయవాడ, గుంటూరు మధ్య నిరంతర సర్వీసులను నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. 500 నుంచి 600 సిటీ బస్సులను విజయవాడలో, 400 సిటీ బస్సులు గుంటూరు ప్రాంతంలో, మరో 200 బస్సులు ఇతర ప్రాంతాలలో అందుబాటులో వుంచి నిరంతర సర్వీసులను నడుపుతారు. ఘాట్ల వివరాల కోసం, రవాణా, వసతులను తెలియజేసేందుకు యాప్, గూగుల్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగాల్లోకి తీసుకొచ్చారు.

పుష్కర ప్రయాణికులకు దక్షిణమధ్య రైల్వే విస్తృత ఏర్పాట్లు

ఆంధ్రప్రదేశ్ లో కృష్ణా పుష్కరాలకు వచ్చే కోట్లాది ప్రయాణీకుల రద్దీని తట్టుకునేందుకు దక్షిణ మధ్య రైల్వే విస్తృత ఏర్పాట్లు చేసింది. అదనంగా నడపనున్న 238 ప్రత్యేక రైళ్లలో అత్యధికం ఆంధ్రప్రదేశ్‌కే కేటాయించారు. అన్ని రైళ్లు అప్ అండ్ డౌన్ లో తిరుగుతాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పుష్కరాలు జరిగే ప్రాంతాలకు ఆగస్టు 11వ తేదీ నుంచి 24 వరకు ఈ రైళ్లను నడపనున్నారు.. అత్యధిక రైళ్లు ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా విజయవాడ మీదుగా రాకపోకలు సాగించనున్నాయి.

ప్రత్యేకరైళ్లను, సాధారణ రైళ్లను విజయవాడ శివారులోనే ఆపుతారు. అయితే హైదరాబాద్‌వైపు నుంచి వచ్చే ప్రత్యేక రైళ్లు రాయనపాడు స్టేషన్‌లో, మచిలీపట్నం వైపు నుంచి వచ్చేవి మధురానగర్ వద్ద, విశాఖపట్నం వైపు నుంచి వచ్చే రైళ్లు గుణదల, గన్నవరం స్టేషన్లలో ఆగనున్నాయి. ఇందుకు అనుగుణంగా అక్కడి నుంచి ఉచిత బస్సులను నడుపుతారు.

అత్యంత అధునాతనంగా రైల్వే స్టేషన్లు

గన్నవరం ఎయిర్ పోర్టును అందంగా తీర్చిదిద్దినట్లుగానే విజయవాడ, గుంటూరు రైల్వే స్టేషన్లను అత్యంత అధునాతనంగా, అందంగా కన్పించేలా తీర్చిదిద్దుతున్నారు. తాత్కాలిక బస్‌స్టేషన్లు. రైల్వేస్టేషన్, పీఎన్‌బీఎస్, శాటిలైట్ రైల్వేస్టేషన్స్, పుష్కర నగర్‌లకు ఒక సర్కిల్‌గా ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి. ప్రతి మూడు నిమిషాలకు ఒక బస్సు కదిలేలా చర్యలు తీసుకొంటున్నారు. ప్రయాణీకుల ప్రక్రియను నిర్వహించడంలో లోటుపాట్లను తెలుసుకోడానికి ముందుగా ట్రయల్ రన్ జరుపుతారు.. మూడు రోజులు ముందుగానే సిబ్బందిని విధుల్లోకి చేర్చుకుని విధుల నిర్వహణపై అవగాహన కల్పిస్తారు. తాడేపల్లి కృష్ణా కెనాల్ రైల్వేజంక్షన్‌ను రాబోయే కృష్ణా పుష్కరాలకు అనువుగా రైల్వేశాఖ అధికారులు సిద్ధం చేశారు. స్టేషన్‌లో వివిధ అభివృద్ధి పనులు, పుష్కర యాత్రికులకు సౌకర్యాలు కల్పించడానికి రూ. 3 కోట్లను వెచ్చిస్తున్నారు. విజయవాడకు కూతవేటు దూరంలో వున్న స్టేషన్ కావడంతో తాడేపల్లి కృష్ణా కెనాల్ రైల్వేజంక్షన్‌లో పుష్కరాల సమయంలో చెన్నై వైపు నుంచి వచ్చే రైళ్లను ఇక్కడ నిలుపుదల చేసి అధికసంఖ్యలో వచ్చే యాత్రికుల రద్దీని నియంత్రించాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపే విధంగా అయిదవ నెంబరు ఫ్లాట్‌ఫారంను ఆధునికీకరించారు. అలాగే, స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద రద్దీని నియంత్రించడానికి రెండవ నెంబరు ఫ్లాట్‌ఫారం నుంచి నేరుగా స్టేషన్ బయటికి వెళ్లే విధంగా నూతన ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. టిక్కెట్ కౌంటర్ సమీపంలో మరో ఆరు నూతన కౌంటర్లను ఏర్పాటు చేశారు. స్టేషన్ ఎదురు ఖాళీ స్థలంలో యాత్రికులు బస చేయడానికి పుష్కరనగర్‌ను ఏర్పాటు చేశారు.

పుష్కరాలకు డబుల్ డెక్కర్..

విశాఖపట్నం-విజయవాడ మధ్య నడపటానికి సిద్ధంగా ఉన్న డబుల్ డెక్కర్ రైలు పుష్కరాలకు ప్రారంభం కానుంది. అదే విధంగా విజయవాడ-ధర్మవరం రైలు జులై 12న మధ్యాహ్నం 3.30 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరే విధంగా రైల్వే మంత్రి సురేష్‌ప్రభు న్యూఢిల్లీ నుంచి రిమోట్ ద్వారా జెండా ఊపి ప్రారంభించారు. వారంలో మూడు రోజుల పాటు సోమ, బుధ, శనివారాలలో విజయవాడ నుంచి రాత్రి 11.05 గంటలకు బయలుదేరి ధర్మవరానికి మరుసటి రోజు ఉదయం 6.05 గంటలకు చేరుకుంటుంది. విజయవాడ నుంచి 17215 నెంబర్‌తో, ధర్మవరం నుంచి 17216 నెంబర్ ఈ రైలు రాకపోకలు సాగించనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు కోరిక మేరకు రాయలసీమ ప్రాంతాల నుంచి అమరావతి రాజధానికి తరలివచ్చే ఉద్యోగుల సౌకర్యార్థం కోసం రైల్వే మంత్రి సురేష్ ప్రభు ఈ రైలుకు గ్రీన సిగ్నల్ ఇచ్చారు.

238 ప్రత్యేక రైళ్ల రాకపోకల ప్రయాణ రూట్లు

- సికింద్రాబాద్ నుంచి కాకినాడ పోర్టుకు వయా గుంటూరు మీదుగా 14 సర్వీసులు
- తిరుపతి నుంచి విజయవాడ మీదుగా కాకినాడ టౌన్‌కు 28 సర్వీసులు.
- కాచిగూడ నుంచి కాకినాడ పోర్టుకు 4.
- తిరుపతి నుంచి విశాఖపట్నం 4.
- విజయవాడ నుంచి విశాఖపట్నం 16.
- హైదరాబాద్ నుంచి గద్వాల్ 4.
- మణుగూరు నుంచి తెనాలి 24.

సాధారణ ఛార్జీలు..

- విజయవాడ నుంచి ఒంగోలు 12.
- హైదరాబాద్ నుంచి గుంటూరు 24.
- తిరుపతి నుంచి రాజమహేంద్రవరం 10.
- గుంతకల్లు నుంచి కృష్ణాకు (ఏపీ-కర్ణాటక సరిహద్దు)?ద 12.
- గుంతకల్లు నుంచి విజయవాడ 12.
- సికింద్రాబాద్ నుంచి గద్వాల్ 12 సర్వీసులు.

అదనంగా నడిపే ప్రత్యేక రైళ్లు ఒడిశా నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల మీదుగా విజయవాడ, గుంటూరు వరకు రాకపోకలు సాగించనున్నాయి. ఒడిశాలోని రాయగడ-విజయవాడ (కృష్ణాకెనాల్) మధ్య 8 సర్వీసులు, విశాఖపట్నం-గుంటూరుల మధ్య 20 సర్వీసులు, ఒడిశాలోని పూరి-గుంటూరుల మధ్య 8 సర్వీసులు ప్రత్యేక రైళ్లుగా రాకపోకలు సాగించనున్నాయి.

ఆచారం- సంస్కారం నది- నమ్మకం!

పుష్కరవిధుల్లో పుణ్యం

నది, నదీతీరాన జీవనం, పరిఢవిల్లిన నాగరికత తరతరాలుగా పంచిచ్చినదానికి ప్రతిగా నదిలోకి విసిరే సత్తుకాసు, చేసే నమస్కారం - అవి ఆదాన ప్రదానాలు. అవే భారతీయ సంస్కృతీ మూలాలు. పంచే కొద్దీ పెరుగుతుందట పుణ్యం, తరుగుతుందట క్లేశం. అంతరాల సమాజానికి దానం - తొలి సమాధానం. బహుశా అందుకేనేమో పుష్కర విధులకి దానానికీ అవినాభావ సంబంధం. దానం చేస్తే ప్రతిఫలమేమిటో చెబుతుంది ఆచారం. ఏమీ ఆశించకుండా పుష్కరవిధుల్ని నిర్వహిస్తుంది విశ్వాసం. అదే మన సంస్కారం!



పుష్కర దినాలలో మొదటి రోజున బంగారం, వెండి, ధాన్యం, భూమి దానం చేయాలి. బంగారం, వెండి దానం చేయడం వలన ఇహలోక సుఖభోగాలతో పాటు సూర్యచంద్ర లోకాల ప్రాప్తి కలుగుతుంది. భూదానం వలన భూపతిత్వం వస్తుంది. ధాన్య దానం కుబేర సంపద కలిగిస్తుంది.

రెండవ రోజున గో, వస్త్ర, రత్న, లవణ దానాలు చేయాలి. గోదానం వలన రుద్రలోక ప్రాప్తి, వస్త్రదానం వలన వసులోక ప్రాప్తి, రత్న దానం వలన సార్వభౌమత్వం, లవణ దానం వలన లావణ్యం కలుగుతాయి.

మూడవ రోజున శాక, ఫల, గుడ, అశ్వదానాలు చేయాలి. కుబేర, అశ్వనీ దేవతాలోక సౌఖ్యాలు అనుభవించి, ఇంద్ర సమాన వైభవం పొందుతారు.

నాలుగవ రోజున పాలు, తేనె, నెయ్యి, నూనె దానం చేయాలి. క్షీర దానం సిరిసంపదలు, తేజస్సు కలిగిస్తుంది. తేనె దానం చేయడం వలన వైకుంఠనగర ప్రవేశం కలుగుతుంది. ఘృతదానం ఆయువును పెంచుతుంది. తైల దానం నరక నివారకం.

అయిదవ రోజున ధాన్యం, బండి, గేదె, ఎద్దులను దానంగా ఇవ్వాలి. ఈ దానాల వలన దివ్యమైన భోగభాగ్యాలతో కైలాస నివాసం కలుగుతుంది.

ఆరవ రోజున అగరు, కస్తూరి, చందన దానాలు చేయాలి. ఔషధ దానం అంటే వట్టివేరు, జాజికాయ, జాపత్రి, కరక్కాయ వంటి వానిని దానం చేయాలి. ఆరోగ్యం, భాగ్యం, లక్ష్మీ కటాక్షం కలిగి ఇంద్ర, చంద్ర, గంధర్వ లోకనివాస సులభమవుతుంది.

ఏడవ రోజున గృహ, పీఠ, శయ్యా, ఆందోళికా (పల్లకి) దానాలు చేయాలి. దీనివలన చిరకాల సౌఖ్యం, అమరత్వం, మరు జన్మలో ప్రభుత్వ అధికారం వస్తాయి.

ఎనిమిదవ రోజున గంధ, దారు, పుష్పమాలా దానాలు చేస్తే ఇంద్రలోకంలో దివ్యమైన సుఖాలు ప్రాప్తిస్తాయి.

తొమ్మిదవ రోజున పిండ ప్రదానం, పితృదేవతారాధనం చేయాలి. దాసీ, శయ్యా, కంబళదానాలు ఇవ్వాలి. పితృదేవతల అనుగ్రహం వలన వంశవృద్ధి, సత్సంతాన సిద్ధి జరుగుతుంది. దాసీ, శయ్యా, కంబళ దానాలు సర్వభాగ్యాలు, స్వర్గ సుఖాలు అందిస్తాయి.

పదవ రోజున శాక, సాలగ్రామ, పుస్తకదానాలు, వెండి, ముత్యం లోహపు గొలుసులు మొదలైన దానాలు చెప్పబడ్డాయి. సాలగ్రామ దానం భూమండల దాన ఫలితం కలిగిస్తుంది. శాక, పుస్తక, రజిత, మౌక్తి, లోహ దానాలు అక్షయ పుణ్యలోకాలను సన్నిహితం చేస్తాయి.

పదకొండవ రోజున చే గజ తురగాది దానాలు వైకుంఠలోక ప్రవేశం కలిగిస్తాయి.

పన్నెండవ రోజున చేసే తిల, అజ (మేక) దానాలు సర్వ ఆపదలను నివారిస్తాయి. ఆనాడు ప్రత్యామ్నాయం లేకుండా సాలగ్రామ దానం చేయాలి. పుష్కర విద్యుక్త స్నానం చేసి షోడశ దానాలు చేయాలి. ఆవు, బంగారం, వెండి, గేదె, రత్నాలు, పుస్తకాలు, ప్రత్తి, ఏనుగు, గుర్రం, దాసీ, త్రాసు, ఇల్లు, తేనె, మేక, శయ్య, కన్యా ఆదిగా గల దానాలు షోడశ దానాలు. ఆర్థిక, ఇతర పరిస్థితుల దృష్ట్యా పై దానాలు చేయడానికి శక్తి, అవకాశం లేని వారు ఆ దానాలకు ప్రత్యామ్నాయంగా యథాశక్తి మనస్సంకల్పిత దక్షిణను సమర్పించడం ద్వారా అభీష్ట సిద్ధిని పొందవచ్చు. ❖

కృష్ణా పుష్కరం 2016

కృష్ణాతీరంలో ఆదిమ మానవుని అడుగుజాడలు


నదులు నాగరికతలకు పుట్టిళ్లు. తెలుగు నేలపై కృష్ణా, గోదావరి నదులు ఆదిమ మానవునికి ఆటపట్టయి తెలుగు వారి వెలుగు చరిత్రకు అద్దం పడుతున్నాయి. కొయన, ఘటప్రభ, మలప్రభ, భీమ (రథి), తుంగభద్ర, భవనాశి, మూసీ అనే ఏడు ఉప నదులను తనలో కలుపుకొని, మహారాష్ట్రలోని నాసిక్ నుంచి సాగర సంగమం దాకా ప్రవహిస్తున్న కృష్ణా నది రెండువైపులా ఆడుగుజాడలు కనిపించాయి. సహజసిద్ధమైన కొండగుహల్లోనూ, కొండ చరియల కింద నివసించిన ఆదిమ మానవులు పాత రాతియుగంలో ముడి రాతి పనిముట్లతో, జంతువులను వేటాడి, ప్రకృతిసిద్ధంగా లభించే దుంపలు, పళ్లను ఆహారంగా స్వీకరించారు. మధ్య రాతియుగంలో రాతి పనిముట్లను తయారు చేసుకొన్నప్పుడు వచ్చిన పెచ్చుల్ని వాడుకుని ఆహారాన్ని సంపాదించుకున్నాడు. కొనదేలిన, మొనగల చిన్నవైన రాతి పనిముట్లను తీర్చిదిద్దుకొన్నందువల్ల ఈ యుగాన్ని సూక్ష్మ రాతి యుగమని కూడా అన్నారు. తరువాతి దశలో రాతి పనిముట్లను అరగదీసి, నునుపైన మొనలతో నగిషీగా చేసుకొని కొత్తరకమైన రాతి గొడ్డళ్లను, ఉలులను, శానాలను తయారు చేసుకోవడాన ఈ యుగాన్ని కొత్త రాతి యుగమన్నారు. ఈ యుగం చివరి దశలో రాగిని కనుగొని పనిముట్లు తయారు చేసుకొని, రాతి పనిముట్లతోపాటు వాడుకోవడం వల్ల ఈ యుగాన్ని రాగి రాతియుగమన్నారు. దీని తరువాత ఇనుమును కనుగొని, వ్యవసాయం, రక్షణ, ఇంటికి అవసరమైన అనేక పనిముట్లు చేసుకొని, ఇనుమును విరివిగా వాడటంచేత ఇనుప యుగమని, చనిపోయిన వారి సమాధుల చుట్టూ పెద్ద పెద్ద బండరాళ్లను గుండ్రంగా పేర్చిన కాలంగాబట్టి బృహత్ శిలాయుగమని కూడా అన్నారు.

కృష్ణాతీరంలో పాతరాతి యుగం క్రీ.పూ. 2,00,000 లక్షల నుంచి 1,25,000 సం. వరకు, మధ్య పాత రాతి యుగం క్రీ.పూ. 1,25,000 నుంచి క్రీ.పూ. 50,000 సం. వరకు, ఎగువ పాత రాతి యుగం క్రీ.పూ. 50,000 నుంచి క్రీ.పూ. 8,000 సం.ల వరకు, కొత్త రాతియుగం క్రీ..పూ. 4000 నుంచి క్రీ.పూ. 1750 వరకు, రాగి రాతియుగం క్రీ.పూ. 1750 నుంచి క్రీ.పూ. 1100 సం. వరకు, చివరగా ఇనుప యుగం క్రీ.పూ. 1100 నుంచి క్రీ.పూ. 600 సం. వరకు కొనసాగినట్లు పురావస్తు పరిశోధనలు రుజువు చేశాయి. ఆయా కాలాల్లో పనిముట్లు కోసం మనిషి ఉపయోగించిన ముడిసరుకు, పనిముట్ల స్వభావాన్నిబట్టి కాలాన్ని రాతి, రాగి (కంచు), ఇనుప యుగాలుగా స్థూలంగా విభజించారు.

కృష్ణా తీరంలోని దిగువ పాత



రాతియుగంలో రాతిని చెక్కి పెచ్చులను ఊడదీసి పెద్ద సైజు గొడ్డళ్ల పనిముట్లను తయారు చేశారు. కృష్ణా నదికి ఉత్తరాన ఉన్న మహబూబ్‌నగర్ జిల్లా చంద్రగుప్త పట్టణం, ఈర్లదిన్నె, క్యాతూరు, మంఖాళీ, సింగవరం, సోమశిలలోను, నల్గొండ జిల్లాలో డిండి, హాలియా, కృష్ణాపూర్, రాయవరం, వజీరాబాద్ (వాడపల్లి), ఏలేశ్వరంలోనూ, గుంటూరు జిల్లాలో కారెంపూడి, నాగార్జున కొండల్లోనూ, ప్రకాశం జిల్లాలో డోర్నాల, గిద్దలూరు, కనిగిరి, యర్రగొండపాలెం లోనూ, కర్నూలు జిల్లాలో శ్రీశైలం, తాండ్రపాడులో ఇలాంటి



రాతి పనిముట్లు లభించగా కృష్ణా జిల్లాలో అప్పటి మానవుని ఉనికి లేకపోవటం గమనార్హం.

ఇక పాత రాతియుగంలోని రెండవదశను సూచించే మధ్య పాత రాతియుగంలో రాతి నుంచి తీసిన పెచ్చులతో గీకుడు రాళ్లు, మొనలు, బర్మాలు మొదలైన అఘూలియన్ సంస్కృతిలో తయారైన తేలికపాటి సన్నటైన పనిముట్లతో కర్రలతో బరిసెలులాంటి ఆయుధాలు తయారు చేసుకొని వేటకు వెళ్లి ఆహార సంపాదన చేసేవారు. ఈరకమైన పనిముట్లు మహబూబ్‌నగర్ జిల్లాలోని బాల్గెర, చంద్రగుప్త పట్టణం, దసరాపల్లె, గుర్జిహాల్, కదలీవనం, కూడవెల్లి, క్యాతూరు, యానంపల్లి, ఎద్దులగూడెం, సోమశిలలో లభించాయి. నల్గొండ జిల్లాలోని ఏలేశ్వరం, కర్నూలు జిల్లాలోని బేతంచర్ల, ముచ్చట్ల చింతమానుగాలి, భీముని కొలను, వీరాపురం, మూర్వకొండ, సాతానికోట, సిద్ధరాజలింగాపురం, శ్రీశైలంలోనూ, ప్రకాశం జిల్లా ఆకివీడు, గిద్దలూరులోనూ, గుంటూరు జిల్లాలో గోకినకొండ, కారెంపూడి, కొత్తపాలెం, నాగార్జునకొండల్లోనూ, కృష్ణా జిల్లాలో లింగాగూడెం, పోపూరు, పున్నపల్లి, రామాపురం, తుమ్మలపాలెం, వెలది, విశ్వతపాడుల్లో దొరికిన ఈ కాలపు ఆదిమ మానవుని ఉనికిని తెలియచేశాయి. దిగువ పాత రాతియుగంలో రాతి పెచ్చులతోనూ ఎముకలలోనూ పనిముట్లు, ఆయుధాలు తయారు చేసుకున్నారు. వీటిలో బ్లేళ్లు,

కత్తులు, చురకత్తులు, బర్మాలు, బల్లెపు విలునలు, బాణపు మొనలు కూడా ఉన్నాయి. ఈ కాలపు పనిముట్లు మహబూబ్‌నగర్ జిల్లాలో చంద్రగుప్త పట్టణం, బూర్జుహాల్, కదళీవనంల లోనూ, ప్రకాశం జిల్లాలో చిలకపాడు, గన్నవరం, కనిగిరి, వెలిగండ్లలోను, గుంటూరు జిల్లా నాగార్జునకొండలో దొరికాయి.

ఇంతకు ముందు యుగంకంటే పనిముట్లు నునుపుగాను, పదునుగానూ ఉండేట్లు తయారు చేసుకొని, పాత కొత్త రాతియుగాల సంధి దశను సూచించే కాలాన్ని మధ్య రాతియుగం అన్నారు. పనిముట్ల మరీ చిన్నగా, సన్నగా ఉండటాన ఈ యుగాన్ని సూక్ష్మరాతి యుగమని కూడా అంటారు. పనిముట్లు పరిమాణంలో అర అంగుళం నుంచి రెండు అంగుళాల లోపు ఉంటాయి. వీటిని కర్రల్లో అమర్చుకొని వేటకు వాడేబాణాల వలే గానీ, గడ్డి కోయటానికి కొడవలిలా గానీ, చేపలు పట్టుకునే గాలముగా గానీ, పిట్టల్ని, చిన్నచిన్న జంతువుల్ని చంపే ఆయుధాలుగానూ వాడుకునేవారు. కృష్ణా తీరంలో ఈ కాలపు స్థావరాలు చాలానే కనుక్కోవడం వల్ల జనాభాలో కూడా పెరుగుదల ఉందని చెప్పవచ్చు. ఆహార సేకరణ కోసం, మానవులు ఒకచోటి నుంచి మరో చోటికి వలసలు పోయేవారు. చివరి దశలో మట్టి పాత్రలను తయారు చేయటం ప్రారంభించి, ఒకచోట స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. గుహలు, కొండ చరియల కింద నివసించినట్లు కర్నూలు జిల్లా కేతవరం, బొల్లారం, దుర్గంలలో లభించిన ఈ కాలపు పనిముట్లు రుజువు చేస్తున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని యంపలదీవిపాడు తవ్వకాలలో ఈరకం పనిముట్లతో పాటు ఎద్దు అస్తి పంజరం దొరకటాన నాటి ప్రజలు ఎద్దుల్ని మచ్చిక చేసుకొన్నట్లు చెప్పవచ్చు. ఈ కాలంలో కొండ చరియల గోడలపైన తాము చూసిన దృశ్యాలైన చెట్లు, చేమలు, జంతువులను, ఎరుపు, తెలుపు రంగుల్లో చిత్రించుకొని,



శిలాయుగంలోనే చిత్రకళకు నాంది పలికారు. ఈ కాలపు పనిముట్లు, వర్ణ చిత్రాలవలన నాటి జీవన విధానాన్ని అంచనా వేయవచ్చు. ఈ కాలపు పనిముట్లు కృష్ణా తీరంలోని మహబూబ్‌నగర్ జిల్లా అమ్రాబాద్, మన్ననూరులోనూ, నల్లగొండ జిల్లా మీనంపల్లి, రాయవరం, ఏలేశ్వరంలోనూ, కర్నూలు జిల్లాలో తాండ్రపాడు, ముచ్చెట్ల చింతమానుగవి, కేతవరం, సాతానికోటలలోనూ, ప్రకాశం జిల్లా అగ్రహారం, గిద్దలూరులలోనూ, గుంటూరు జిల్లా కారెంపూడి, నాగార్జునకొండలలో లభించాయి.

కృష్ణా తీరంలో మధ్య రాతియుగం తరువాత దశను కొత్త రాతియుగమంటారు. ముందు కొండ గుహల్లోనూ, కొండ చరియల కింద నివసించిన ఈ కాలపు ప్రజలు తరువాత చుట్టిళ్లు కట్టుకొని స్థిర నివాసాలు ఏర్పరచుకున్నారు. నాటి ప్రజలు గుహల్లోంచి మైదానాల్లోకి మారినట్టుగ, భూమిలో గుంటలు తవ్వుకొని వాటిలో నివసించే వారు. రాళ్లను చీల్చి నునుపుగాను, మెరుపు వచ్చేట్లుగా గొడ్డళ్లు, రెండువైపులా పదును గల ఉలులు, సుత్తెలు, నాగటి కర్రులు రోళ్లు, దంపుడు రాళ్లు, గుండ్రటి రాళ్లు, ఎముకలు, కొమ్ములతో చేసిన రాతి పనిముట్లు కొత్తగా తయారు చేసుకోవటంతో ఈ యుగాన్ని కొత్త రాతియుగమన్నారు. పశువులను మచ్చిక చేసుకుని పెంచుకున్నారు.వ్యవసాయాన్ని విస్తృతం చేసి రాగులు, ఉలవలు, పెసలు మొదలైన ధాన్యపు గింజలను పండించి, వండుకుని తిన్నారు. ఈ యుగంలో మానవులు ఆహార సేకరణ దశ నుండి ఆహారాన్ని ఉత్పత్తి చేసే దశకు చేరుకున్నారు. వెదుళ్ల రాపిళ్లతో నిప్పును పుట్టించారు. గుహల గోడలపైన, కప్పులపైన వేటాడే దృశ్యాలను ప్రకృతిసిద్ధంగా దొరికిన రంగులతో వేసుకొని తరువాతి తరం వారికి శిక్షణ ఇచ్చారు. తొలిదశలో చేతితోనూ, మలి దశలో సారెపైన అవసరాలకు తగ్గట్టు రకరకాల మట్టి పాత్రలను తయారు చేసుకున్నారు. ఈ కాలానికి చెందిన గుంట ఆవాసాలు కృష్ణా తీరంలో నాగార్జునకొండ, గండ్లూరులలో కనుగొన్నారు.

కొత్త రాతియుగపు స్థావరాలు మహబూబ్‌నగర్ జిల్లాలోని చిన్నమారూరు, చాగటూరు, బూడిదపాడు, కూడవెల్లి,



కృష్ణా పుష్కరం 2016

కారపాకలలోనూ, ప్రాగటూరు, నల్లగొండ జిల్లాలో నల్లగొండ, ఏలేశ్వరంలను, కర్నూలు జిల్లా వీరాపురం, రామాపురం, సింగనపల్లిలోను, ప్రకాశం జిల్లాలో ఉప్పలపాడు, నరవ, గిద్దలూరు, పూసలపాడు, కనిగిరి, తర్లుబాడు, శివాపురం, దర్శిపాడు, మైలవరం, కొణిదెన, బబ్బేపల్లిలోనూ, గుంటూరు జిల్లాలో నాగార్జునకొండ, గురజాల, కామేపల్లి, పొన్నెకల్లు, కంఠంరాజు కొండూరు, గొడవర్రు, నిడుముక్కల, లాం, అమరావతి, చేబ్రోలు, సంతమాగులూరు, వేమవరం, పాలపాడు, జొన్నలగడ్డ, గొర్రెలపాడు, మ-ంప్పాళ్ల, గండ్లూరు, అబ్బూరు, అలుగు మల్లిపాడు, నరమాలపాడుల లోను, కృష్ణా జిల్లాలో కేసరపల్లి, ఈదర, తాడిగడప, పల్లగిరి, మాగల్లు, శనగపాడులలో కనుగొనటం జరిగింది.


కొత్త రాతియుగపు చివరి రోజుల్లో మానవులు లోహాన్ని కనిపెట్టి రకరకాల పనిముట్లు తయారు చేసుకొన్నారు. ముందుగా రాగిని, తరువాత కంచును కనిపెట్టి కత్తులు, గొడ్డళ్లు, చేపల్ని పట్టే గాలాలు, కాళ్ల కడియాలు, చేతి గాజుల్లాంటి ఆభరణాలు కూడా తయారు చేసుకున్నారు. కృష్ణా తీరంలోని కర్నూలు జిల్లా రామాపురం, బెలుం గుహలు, మహబూబ్‌నగర్ జిల్లా చిన్నమారూరు, గుంటూరు జిల్లా నాగార్జున కొండ, గుత్తికొండబిలం, గండ్లూరులలో ఇలాంటి ఆధారాలు దొరికాయి. నాటి మానవులు ఒకచోట స్థిరంగా గుడిసెలువేసుకుని కుదుళ్లుగా ఏర్పడి, గ్రామాలకు నాంది పలికారు. మట్టిపాత్రల తయారీలోనైపుణ్యం



సంపాదించి, వాటిపై రంగులద్దడం ప్రారంభించారు. రాగితో మధ్య ఈనె, రెండంచులూ సన్నగా ఉండే పొడవాటి కత్తుల్ని కూడా తయారు చేసుకున్నారు. పట్టుకోవటానికి వీలుగా పిడి భాగంల అటుఇటు రెండు కొనలు ఉండటం వల్ల వీటిని మీసాల కత్తులని, యాంటెన్నా స్వోర్డులనీ పిలిచారు. క్రీ.పూ. 1750–1100 సం.ల మధ్య కాలానికి చెందిన ఇలాంటి మీసాల కత్తులు కర్నూలు జిల్లా బెలుం గుహలోనూ, గుంటూరు జిల్లా గుత్తికొండ బిలంలోనూ బయల్పడినాయి. చనిపోయిన వారి అస్థికలను కుండల్లో పెట్టి, భూమిలో పాతిపెట్టే వారు. గండ్లూరులో ఇలాంటి ఆధారం లభించింది. ఒక్కొక్కసారి ఎముకలను సేకరించి వాటిని మట్టి కుండల్లో నిక్షిప్తం చేసేవారని మహబూబ్‌నగర్ జిల్లా ఉట్నూరు, ఐజలో ఆధారాలు దొరికాయి. ఈ కాలపు ప్రజలు కూడా కొన్ని సందర్భాల్లో కొండచరియల కింద నివసిస్తూ, వాటి గోడలపైన తాము వేటాడిన కొట్లాడిన దృశ్యాలను సహజసిద్ధంగా లభించే ఎర్రజాజు (మట్టి)తోనూ,జంతువుల కొవ్వులు, చెట్ల పాలు, జిగుర్లతో చేసిన రంగులతో చిత్రించారు.

ఈ కాలంలో నలుపు ఎరుపు రంగు కలిగిన మట్టిపాత్రలు రంధ్రాలున్న కుండలు, చిన్న గురిగెలు, మూకుళ్లను తయారు చేసుకున్నారు. కొన్ని పాత్రలపై తెలుపు రంగుతో కొన్ని గీతల్ని కూడా గీశారు. ప్రజలు వేటకు తోడు వ్యవసాయాన్ని ముమ్మరం చేశారు. వీరు ఎనుము, గొర్రె, మేక, జింక, కుందేలు, తాబేలు, పీత, నత్తలను తిన్నట్లు వీరాపురం తవ్వకాల్లో దొరికిన ఎముకల ద్వారా తెలుస్తుంది. మునుపటికంటే మెరుగైన జీవితాన్ని గడిపిన రాగి రాతి యుగపు ప్రజలు ఇనుమును కనుగొనడానికి కారకులైనారు.

పెద్ద పెద్ద రాళ్లను గుండ్రంగా అమర్చి సమాధులను కట్టడం వల్ల ఈ యుగాన్ని బృహత్ (పెద్ద) శిలా (రాళ్ల) యుగమని




పిలిచారు. ఇదే కాలంలో ఇనుమును కనిపెట్టడం వల్ల ఇనుప యుగమని పేరు కలిగింది. ఇలాంటి పెద్ద పెద్ద రాళ్లున్న సమాధుల్ని రాక్షసగుళ్లు, పాండవుల గుళ్లనీ, మహబూబ్‌నగర్ జిల్లాలో రక్కీసబండలని కూడా పిలుస్తారు. క్రీ.శ. 1100 – 600 మధ్య కాలంలో కృష్ణా తీరంలో ఈ సంస్కృతి విలసిల్లింది. చనిపోయిన వారి అస్థికల్ని గానీ, శవాన్ని గానీ సమాధుల్లో ఉంచి వారికి సంబంధించిన వస్తు సామగ్రితో పూడ్చిపెట్టే వాళ్లు. నాలుగువైపులా రాతి పలకలను నిలిపి సమాధులను నిలిపి, వాటిపై పెద్దరాతితో మూసేవారు. ఇలాంటి పెట్టె సమాధుల్లో శవంతో పాటువారు వాడిన వస్తువులు, పాత్రలు, ఆభరణాలు, ఆయుధాలు కూడా దాచేవారు. ఇలా భూమిపై కట్టిన సమాధిని డాల్మెడో అంటారు. అలాకాకుండా గుంటను తవ్వి, శవాలను పాతిపెట్టిన తరువాత పైభాగంలో చుట్టూ గుండ్రంగా పెద్ద పెద్ద గుండుల్ని పేర్చిన సమాధి ఆనవాళ్లు సురక్షితంగా ఉండేట్లు చేస్తారు. దీన్ని సిస్ట్ బరియల్ అంటారు. భూమిపైన గులకరాళ్లను అర్ధగోళాకారంగా పాతరలా ఏర్పరచే వారు. వీటిని కెయిర్న్ సర్కిళ్లు అంటారు. కొన్ని సందర్భాల్లో ఈ సమాధుల దగ్గర మరణించిన వారికి గుర్తుగా రాతిస్తంభాలను

కూడా నిలిపే వారు. వీటిని మెన్‌మేర్లంటారు. ఈ నిలువు రాళ్లనే వరుసగా పాతితే వాటిని ఎవెన్యూలంటారు.

కృష్ణాతీరంలో గుంటూరు జిల్లా కారెంపూడిలో 14 అడుగుల ఎత్తు, 4.3 వెడల్పు, 8 అంగుళాల మందం ఉన్న మెన్‌వారే (నిలువు రాయి) ఉంది. అలాగే మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ దగ్గర గల మురారిదొడ్డి, ముడుమాలలో వరుసగా పాతిన నిలువు రాళ్లున్నాయి. ఇదే జిల్లాలో కృష్ణా నది ఎడమగట్టు ఉన్న మారుగుత్తి దగ్గర, కోటకద్ర దగ్గర వందలాది డాల్మెన్‌లున్నాయి. చుట్టూ బండరాళ్లను పేర్చి పైన గులకరాళ్లతో నింపిన సమాధులు గల కెయిర్న్ సర్కిల్స్ మహబూబ్‌నగర్ జిల్లా గొందిమల్ల, చిన్నమరూరు, పెద్ద మరూరు, చాగటూరు, ఉప్పలపాడు, అందుగుల, బూడిదపాడు, ఉప్పేరు, ఈర్లదిన్నె, కారపాకల, శేరుపల్లి (గది సమాధులు కూడా), ఎనుములదొడ్డి, వెల్లటూరులోను, నల్లగొండ జిల్లా తిప్పర్తి, వలిగొండ, పజ్జూరు, నార్కట్‌పల్లి, ఏలేశ్వరం, పర్ధమానుకోట, పెద్ద తొర్రూరు, హుజూర్‌నగర్ లోను, గుంటూరు జిల్లా నాగార్జున కొండ, మద్దూరు, మోతడకలోను, ప్రకాశం జిల్లా గజ్జెలకొండ, కర్నూలు జిల్లా వీరాపురం, సాతానికోట, రామాపురం, పాతపాడుల్లో ఉన్నాయి. కృష్ణా జిల్లా ముక్త్యాల, ఆగిరిపల్లి, తెన్నేరు, బుద్ధారం, కేసరపల్లి, చోడవరంలవద్ద ఈ యుగపు సమాధులున్నాయి.

రాష్ట్రపురావస్తు శాఖ బిర్లా పురావస్తు సంస్థలు, కృష్ణా తీరంలో జరిపిన తవ్వకాల్లో ఇనుప యుగపు ప్రజల సంస్కృతి తెలిసింది. సమాధులు విడిగాను, సముదాయాలుగానూ, ఉత్తర దక్షిణ ముఖాలుగా నిర్మించబడ్డాయి. రాతిగదుల సమాధుల్లో ముందు అడ్డరాతికి ఒక కన్నం పెట్టడం, ఒకే సమాధిలో రెండు, అంతకంటే ఎక్కువ గదులున్న కుటుంబ సమాధులు (హుజూర్‌నగర్‌లో 9 గదులున్న సమాధి ఉంది) తెగకు ముఖ్యుల కోసం నిర్మించిన అతి పెద్ద సమాధులు




(ఉప్పలపాడులోని రాజు, రాణి అని పిలువబడుతున్న సమాధులు) వీరి సమాధి నిర్మాణ పద్ధతుల్ని తెలియచేస్తున్నాయి. రాయి దొరకని కృష్ణా తీరంలోనున్న ఆగిరిపల్లి, తెన్నేరుల్లో ఇసుక నేలలో మట్టి శవపేటికల్ని తయారు చేసి అందులో చనిపోయిన వారి ఎముకలనుంచి సమాధి మధ్యలో పెట్టి పూడ్చిన ఆధారాలు దొరికాయి. మహబూబ్‌నగర్ ఉప్పలపాడులో కొయ్యతో చేసిన శవపేటికలు బయల్పడి విదేశీ సంపర్కాన్ని తెలియచేస్తున్నాయి. ఈ కాలపు చివరి రోజుల్లో సమాధి బండలపై బ్రాహ్మీ అక్షరాలను కూడా చెక్కుకున్నారు. ముక్త్యాల లోని సమాధి ప్రవేశ ద్వారపు రాయిపైన 'లూవిసిరి' అన్న అక్షరాలున్నాయి. చిన్న మారూరులో గడ్డితో కప్పబడిన మానవుని శవపు రేఖా చిత్రాన్ని ఉలితో చెక్కారు.

వ్యవసాయంవీరి ముఖ్య వృత్తి. ఎద్దు, గుర్రం, ఎనుములను వ్యవసాయ పనులకు ఉపయోగించుకున్నారు. మట్టితో చేసి కాల్చిన జంతువుల మట్టిబొమ్మలు దొరికాయి. చాగటూరులోను, నాగార్జున



కొండలోనూ గుర్రాన్ని కూడా విరివిగా వినియోగించినట్లు అక్కడ దొరికిన గుర్రపు కళ్లెం, నాడాలు, కాళ్లు పెట్టుకునే స్టిరప్‌లు, గుర్రపు అస్తి పంజరాలు రుజువు చేస్తున్నాయి. ఇనుముతో చేసిన పలుగు, నాగలికర్రు, కొడవళ్లు వంటి వ్యవసాయ పనిముట్లతో పాటు ఇంటి పనిముట్లయిన చిన్నగరిటెలు, బర్మాలు, మేకులు, ఆయుధాలైన శూలము, గండ్రగొడ్డలి, కత్తులను తయారు చేసుకున్నట్లు తవ్వకాల వల్ల తెలుస్తుంది. ఈ కాలపు ప్రజలు ఎనుము, గొర్రె, మేక, కుందేళ్లను, చేపలను తినేవారని, రాగి, బార్లీ, ఉలవలు, బఠానీ, మినుములు, పెసలు వాడినట్లు శేరుపల్లి, వీరాపురం తవ్వకాల్లో ఆధారాలు బయల్పడినాయి. సమాధుల్లో వారు వాడిన



మట్టి, స్ఫటికం, శంఖాలతో చేసిన పూసాలు, గాజులు, కంకణాలు లాంటి ఆభరణాలను కూడా ధరించే వారని తెలుస్తుంది. శిలాయుగంలో ప్రారంభమైన చిత్రకళ ఈ యుగంలో కూడా కొనసాగింది. ఇనుము కనుక్కోవటంతో నాటి సమాజం అనూహ్యమైన జీవన విధానం సంతరించుకుంది.

పరిశీలిస్తే కృష్ణా తీరం ఆదిమ మానవుని అడుగుజాడలను తన పొత్తిళ్లలో పెట్టుకుని పాత, మధ్య, కొత్త రాతి–రాగి యుగాలు, అటు తరువాత ఇనుప యుగానికి ఆయువుపట్టయి, మానవ నాగరికత వికాసానికి, చారిత్రక, మధ్య యుగాల ప్రగతికి దోహదం చేసింది.

– ఈమని శివనాగిరెడ్డి, స్థపతి

కృష్ణా పుష్కరం 2016

ప్రాచీన సాహిత్యంలో కృష్ణానది

వేదవ్యాస మహర్షి తన మహాభారతేతిహాసం సభాపర్వంలో 'గోదావరీ కృష్ణవేణీ కావేరీ చ సరిద్వరా' (9-20) అంటూ దక్షిణ భారతంలో ప్రవహించే శ్రేష్ఠమైన మూడు నదులనీ పేర్కొన్నాడు.

ఎక్కడి వాడో వేదవ్యాసుడే జ్ఞప్తియందుంచుకున్న మన కృష్ణానదిని, ఆంధ్రదేశంలో నడయాడి ఇక్కడి గాలి పీల్చుకున్న మన తెలుగు కవులు మరిమరి జపించడంలో ఆశ్చర్యమేముంది! వేంగీ దేశంలో నివాసముండి పావన గోదావరీ తీరాన ఆంధ్ర మహాభారత రచనకి నాందీ ప్రస్తావన చేసిన ఆదికవి నన్నయ భట్టారకులు వీలైనపుడల్లా ఆంధ్రప్రాంతపు నదుల్నీ, తీర్థాలనీ ప్రస్తావిస్తూనే ఉన్నారు. పాండవ మధ్యముడు సమయోల్లంఘున చేసినందుకు ప్రాయశ్చిత్తంగా నియమానుసారం పన్నెండు నెలల తీర్థయాత్ర చేసిన సందర్భాన్ని దొరకబుచ్చుకుని నన్నయగారు అర్జునుడిని దక్షిణా పథమందలి వేంగీ ప్రాంతానికి తీసుకొచ్చారు. గోదావరి స్నానం చేయించారు. ద్రాక్షారామంలో భీమేశ్వరుని దర్శనం చేయించారు. ఆ వెనుక శ్రీ పర్వతం వెలసిన శ్రీశైల క్షేత్రానికి తోడ్కొని పోయారు. శ్రీశైలం చేరిన పార్థుడు పాతాళగంగగా విఖ్యాతినొందిన కృష్ణవేణిలో జలకాలాడి వుంటాడు కదా! నన్నయగారెంత శోభాయమానంగా వేంగీ రాజ్యాన్ని వర్ణించారో చూడండి.

సీ. దక్షిణ గగనా ద్దయు నొప్పిన
గోదావరియు జగదాదియైన


భీమేశ్వరంలోను బెడగగుచున్న శ్రీ
పర్వతంబును జూచి యుర్విలోన

ననఘుమై శిష్టాగ్రహార భూయిష్టమై
ధరణీసురోత్తమాధ్వరవిధాన

పుణ్యసమృద్ధమై పొలుచు వేగీదేశ విభవంబు
జూచుచు విభుడు దక్షి

తే. ణాంబురాశి తీరంబున కరిగి
దురితహారియైన కావేరీ మహాసముద్ర

సంగమంబున భూసురేశ్వరుల
కభిమతార్థదానంబు దేసి కృతార్థుడగును



(ఆదిపర్వం 8-139)

నన్నయగారికి గోదావరి, కృష్ణల వైభవం చెప్పే అవకాశం సభాపర్వంలో మయసభ వద్ద లభించింది. ధర్మజుడు నారదునికి మయసభను చూపించగా, ఆ దేవర్షి సూరపతి యమ వరుణ ధనేశ్వర కమలా సనుల సభలను చూశాను కాని అవి కూడా ఈ మయసభకి వైభవంలో సరిరావు అంటాడు. అప్పుడు వరుణ సభను వర్ణిస్తూ నారదుడు ఆ సభలో -

సీ. అందు సుఖాసీనుడైన యవ్వరుణేంద్రు
నంబుధుల్ నాల్గును నధికభక్తి

గాళింది నర్మద గంగ గోదావరి విదిశ
విపాశ కావేరి కృష్ణ

వేణి సరస్వతి పెన్న యైరావతి యనగ
ప్రసిద్ధంబులయిన నదులు

సరనీ తటాక నిర్ఝర దీర్ఘికాదులు దిక్కులు
నధిక ధాత్రీధరములు

ఆ. వసుమతియును దేహవంతంబులై వచ్చి
మకరకూర్మ శింశుమార సింహ

శరభ సామజాది జలచర స్థలచర
తతులతోడ సంతతంబు గొలుచు

(సభా పర్వం 1-41)

నన్నయగారు అరణ్యపర్వంలో మరోసారి కృష్ణవేణి ప్రస్తావన చేశారు. ఈ మారు ఆయన మరింత స్పష్టంగా ఆ నదీస్నానం ఎటువంటి ఫలితాన్ని ఇస్తుందో చెప్పారు. అరణ్యంలో ధర్మరాజు వద్దకు వచ్చిన నారద మహర్షి ధర్మజుని ప్రశ్నకు జవాబుగా భీష్మునికి పులస్త్యుడు అంతకు ముందెన్నడో అందించిన సమాచారాన్ని తెలియచేస్తాడు. తీర్థ సేవనాపరులు ఎటువంటి సత్ఫలితాలు

కృష్ణా పుష్కరం 2016

అప్పటి పేజీల్లోంచి

కీర్తిశేషులు వంక బాలసుబ్రహ్మణ్యం గారిని గుర్తింపులేని సాహితీవేత్త (ఇంగ్లీషులో UNSUNG HERO అనవచ్చు). కానీ, వాడ్రేవు చినవీరభద్రుడు వంటి గొప్ప సాహిత్యకారులని వారి ప్రారంభ యవ్వన దశలో ప్రభావితం చేసినది వంక వారు. కవిత్వం, తత్త్వశాస్త్రం, కళాసృజనతో ఆగిపోకుండా ఆ యువకులకి శాస్త్రీయ, లలిత సంగీతమాధుర్యం చవిచూపింది ఆయనే. "సంగీతాన్ని ఎట్లా వినాలో, ఎట్లా ప్రశంసించాలో బాలసుబ్రహ్మణ్యమే మాకు నేర్పారు" అని చెప్తారు వాడ్రేవు. 2004 కృష్ణాపుష్కరాల సందర్భంగా నాటి ఆంధ్రప్రదేశ్ సంచికలో వంక బాలసుబ్రహ్మణ్యం రచించిన 'ప్రాచీన సాహిత్యంలో కృష్ణానది ' ఆయన సాహిత్య పరిజ్ఞానానికి కూడా దాఖలా. ఈ కృష్ణా పుష్కరాల సందర్భంగా నదీ సాహితీ ప్రశస్త్యాన్ని తలుచుకుంటూ, వంక వారిని కూడా స్మరిస్తూ, ఆనాటి మా సంచిక నుంచి ఈ వ్యాసాన్ని సంక్షిప్తంగా పునర్ముద్రిస్తున్నాం.

పొందగలరో వివరించి చెప్పే అవకాశం వేదవ్యాసుడికైనా, నన్నయగారికైనా అపురూపంగా లభించిందిక్కడ. యావద్భారతావనిలో ఉన్న సమస్త క్షేత్రాలనీ, తీర్థాలనీ పేరు పేరునా చెప్పి వాటిని సేవించడం వలన ఎటువంటి ఫలితాలుండగలవో చెప్పారు.

తే. పరమమైన తీర్థంబు శ్రీ పర్వతంబు,
నందు దేవహ్రదంబాడి యాదిదేవు

నీశునర్చించి వడయుదు రిష్టఫలము,
నశ్వమేధఫలంబును నవనిజనులు

వ. తొల్లి శతక్రతుండు నూరు క్రతువులు సేయటంజేసి పవిత్రంబున కృష్ణవేణి యందు

దేవహ్రదం బాడిన సర్వపాప వినాశనం బగు బాంధ్య పర్వతంబునం గావేరీ తీర్థంబును

దుంగభద్రయు సముద్రతీరంబున గన్యాతీర్థంబును నాడి యశ్వమేధ ఫలంబు వడయుదురు

(అరణ్య పర్వము 2-276-277)

కృష్ణానది ప్రతిభా విశేషాలని వర్ణించే అవసరం అవకాశం తిక్కనగారికి భీష్మపర్వంలో లభించింది. సంజయుదు భారత యుద్ధ విశేషాలని ధృతరాష్ట్రునికి వివరించడానికి ముందు ఈ భారతదేశంలో కల విశేషాలని చెప్తాడు. అదిగో, ఆ సందర్భంలో కృష్ణవేణీ ప్రస్తావన వచ్చింది.

వ. గంగయు దుంగభద్ర వేత్రవతియు వేదవతియు గృష్ణవేణియు చెన్నయు

యమునయు దమనయు వరావతియు గావేరియు గోదావరియు నర్మదయు

బాహుదయును సరయువును శతద్రువును వితస్తయు విపాశయు దామ్రపర్ణియు

నను మహానదులు మరియు ననేక సరిద్విశేషంబులోనుం గలిగి వీనివలన నానా

ముఖంబుల ధనధాన్యాది సంపరాగమంబులు సొంపు మిగిలి యుండు

(భీష్మ పర్వము 1-38)

కృష్ణా తీరవాసులకి తమ జన్మభూమి అంటే ఎంత మక్కువో ప్రబంధ పరమేశ్వరుడు ఎర్రాప్రెగడ వారు తమ హరివంశంలో అన్నదానిని గమనిస్తే తెలుస్తుంది. క్రీస్తుశకం 1335కి ముందు అద్దంకి పంటరెడ్ల కొలువులో ఉండి ఎర్రాప్రగడ రచించిన ఉత్తర హరివంశంలో 'మన భూమిబోలు భూమి యెందును బుట్టదు' అంటారు. ఆయనకానాడు చదలవాడే గుర్తుకొచ్చిందో ఏమో!

బెజవాడ మల్లికేశ్వర స్వామి ఆలయంలోని మహామండవేశ్వర పల్లకేతుని శిలాశాసనం కూడా వేంగీ చాళుక్యుల కాలంనాటిదే. 'మల్లేశ్వర ఇతిఖ్యాత: సన్నిధత్తే మహేశ్వర: శ్రీ మద్విజయ వాటా ఖ్యపురే కృష్ణా విభూషణే' అంటూ కృష్ణానదీ తీరాన ఉన్న విజయవాటికని ప్రస్తుతిస్తోంది.

మరీ బెజవాడ విజయవాడ ఎప్పుడయిందో కాని పండితారాధ్యుని 'శివతత్త్వ సారము' గ్రంథంలో ఆ పేరు దర్శనమిస్తోంది.

'ఒక్కడె దైవము శివుడని నిక్కము సేయుటకు ముడిచె నిప్పులఉ చీరన్

స్రుక్కక శ్రీపతి పండితుడు అక్కజముగ విజయవాడ నలజిమ్మి శివా'

పురాతత్వ పరిశోధన శాఖవారు త్రవ్వితే బయటపడిన విజయపురి గౌరవకాలం నాటికింకా ఉందేమో! క్రీ.శ. పదునాల్గవ శతాబ్దంలో గౌరవ రచించిన 'నవనాథ చరిత్రం'లో ఈ వర్ణన ఉంది.

'ఆ కృష్ణవేణి మహానది దాటి - వీకనేశ్వర ఇభు నుత్తరమున

నాయతంబై మించు నశ్వమేధాద్రి - వాయవ్యమున నవద్వారకవాట

పరిఘ సమున్నత ప్రాకార యంత్ర...'

కృష్ణా తీరమందలి శ్రీశైల క్షేత్రం పురాణ చరిత్ర ప్రసిద్ధమైనది. శివ పురాణం ఎప్పుడు రచింపబడ్డదో కానీ అందులో -

'జ్యోతిర్లింగం ద్వితీయం చప్రోక్తం మల్లిక సంజ్ఞాతమ్

ధర్మనాత్సర్వ సుఖరం కదితం లోకహేత్య' అని స్పష్టం చేస్తోంది రుద్రసహితలో.

శంకర భగవత్పాదులు -

శ్రీశైల శృంగ వివిధ్వసంగె శేషాద్రి బృంగేవి సదావసన్తమ్

తమర్జునం మల్లిక పూర్వమేనమ్ నమామి సంసార సముద్రసేతుకు అంటున్నారు.

శ్రీశైల పర్వతం శిలాదుడనే మహర్షికి తప:ఫలంగా కలిగిన ద్వితీయ కుమారుడు పర్వతుడనే వాడు. పర్వతుడు పరమశివుని దర్శనం కోరి అపురూపమైన తపస్సు చేశాడు. సదాశివుడు దర్శనం ఇవ్వగా పర్వతుడు 'సర్వతాష్టకం'తో స్తుతించి, తన శిరస్సుమీద గంగాది సర్వపుణ్య తీర్థాలతో సహా శివుడు కసించాలని కోరుకున్నాడు. అందుకే శ్రీశైల పర్వతమే శివలింగం వలే ఉంటుంది.

శ్రీశైల శిఖరం దృష్ట్వా వారాణస్యాం మృతోదృవమ్

కేదారే హ్యదకం పీత్వా పునర్జన్మన విద్యతే

కేదారంలో స్నానించడం వలన, కాశీలో మరణించడం చేత, శ్రీశైల శిఖర దర్శన మాత్రంచేత జన్మరాహిత్యం, ముక్తి లభిస్తాయని పద్మ పురాణం చెబుతోంది.

శ్రీ శంకర భగవత్పాదులు శ్రీశైలంలో కొన్నాళ్ళుండి తపస్సు చేశారని, 'శివానందలహరి' నిక్కడే రచించారని అంటారు.

సంధ్యారంభ విజృంభితం శ్రుతి శిర్దీ స్సానంత రాధిష్టితం

సక్రమ భ్రమరాభిరామ సకృత్వ ద్వాసనా శోభితం

భోగీంద్రాభరణం సమస్తా సుమనః పూజ్యం గుణావిష్కృతం

సేవే శ్రీగిరి మల్లికార్జున మహాలింగం సేవాలింగితమ్॥

అని మల్లెపూవుతో మనోహరంగా మల్లికార్జున మహాలింగానికి అభద కల్పనం చేసి చెప్పారు ఆదిశంకరులు.

ఈ క్షేత్రంలోని పర్వతాన్ని శివలింగంగా సంభావించి పాల్కురికి సోమనాథుడు తన 'పండితారాధ్య చరిత్ర' ద్విపద కావ్యంలో ఎంతటి భక్త్యావేశాలతో ఎంత మనోహరంగా వర్ణించాడో చూడండి.

పండితన తపము ప్రోగైన మూర్తి, శంభుని

యశోరాశి,

గరువుగట్టిన మమాకాశంబు, శృతుల శిరము

ఘనీభవించిన పరంజ్యోతి, దఱగని పుణ్యము

తపనిధిను తులగుటి సదాశివుని యంకుర మద్రిజాత

వలపలి బరి భక్తవరుల యిర్వేల్పు నలనంబు లేని

విజ్ఞానాన్ని కడలు, ధృతి ముద్దగించిన దివ్యామృతంబు

లత గరిగొన్న మూలస్తంభమునగ దెలవారునట్టి యా శ్రీశైలశిఖర

శ్రీశైల శిఖరాన్ని ఇంత మనోహరంగా కీర్తించిన సోమనాథుడు పర్వతుడు సదాశివుని సకల తీర్థాలతో కూడిన తనపై నివసింపకునే ఘట్టాన్ని కూడా అంతటి సొగసుగానే వర్ణించారు.

గంగ భాగీరథి గంగ పాతాళ గంగ భీమరథి సౌగంధిక వీరజ

వౌశికి గాంధారి గావేరి యసి విపాశ వరుణ దుంగభద్ర ప్రయాగ

నంద సరస్వతి నర్మద యమున మందాకిని గయగోమతి దామ్రపర్ణి

స్రోత నేత్రావతి సోమ ప్రభాస వైతరిణి దమన పంజర సరయు

వేగతి సురసి విశ్రుత సంద్రభాగ మహాభాగ వాసవి సిత్ర యమరబంచనది

గాయత్రి యుత్సాహ విమల నేత్రవతియు విమలాభ్రకనక శోణ

వేదవతియు శుక్లప్రభాసవేణి పుష్కర గృష్ణవేణి కులాపహారి గోదావరి

యాదిగా నిఖిల ధారుణి గలుగ తీర్థంబులు నదులు మూర్తిమంతంబులై

మొనని నా మీద వర్తింపుచుండెరు వరమిమ్ము..

సకలాంధ్ర కర్ణాటాధీశుడు ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు తన 'ఆముక్తమాల్యద' కావ్యాన్ని ఆంధ్ర మహావిష్ణువాదేశం మేరకు రచించి తిరుమలవాసునికి అంకితమీయడానికి గల కారణాన్ని వాక్యారంభంలో ఇలా వ్రాయిచ్చాడు.

"... మున్నే గళింగదేశ విజిగీషా మనీషం దండెత్తిపోయి విజయవాటిం

గొన్ని వానరంబులుండి శ్రీకాకుళ నికేతనుండగు నాంధ్ర మధుమధను సేవింపబోయి

హరివాస రోపవాసం బచ్చట గావింప, నప్పుణన్ రాత్ర చతుర్థయామంబున..

దద్గాం జలడొక్కు... నంద్రభాష యసాధ్యంబె యందునొక్క కృతి వినిర్మింపుమిక మాకు బ్రియముగలుగ...'

వరదలు వచ్చినపుడు కృష్ణవేణి ప్రళయాన్ని కూడా తీసుకు రాగలదు. అలా తెచ్చే కవిసార్వభౌముడు శ్రీనాథని విలపింపజేసింది.

'కృష్ణవేణమ్మ గొనిపోయె నింతఫలము, బిలబిలాక్షులు దినిపోయె దిలలు పెసలు బొడ్డు పల్లెను గొడ్డేరి మోసపోతి, నెట్లు చెల్లింతు దంకంబు వేడునూర్లు'

వయసులో ఉండగా రచించిన కావ్యాలన్నింటా గంగనో, గోదావరినో కొనియాడి నెత్తికెత్తుకొని చివరి రోజులలో తననాశ్రయించిన శ్రీనాథుని పట్ల యిసుమంతైన కరుణ కూడా చూపించని కృష్ణవేణి గోదావరీ తీరమందలి పట్టిసీమ నుండి తన తీరాన ఉన్న పల్నాటి 'జెట్టిపాలెం' గ్రామాన కేతెంచి తనమీదే ఆశపెట్టుకున్న యధావాక్కుల అన్నమయ్య నెంతటి అభిమానంలో చేరదీసింది! సర్వేశ్వర శతకం రచిస్తూ ఈ అన్నమయ్య కృష్ణ ఒడ్డునే కూర్చుని గండకత్తెర నొకదానిని మెడకి తగిలించుకొని, తను రచించిన పద్యం ప్రతీదానినీ కృష్ణలో పడవేసి, ప్రవాహానికి ఎదురీది తిరిగి తన చెంతకొచ్చిన పద్యాన్నే స్వీకరిస్తానని, అలా ఒక పద్యం తిరిగి రాకపోయినా మెడకి తగిలించుకొన్న గండకత్తెరతో పీక నుత్తిరించుకొంటానని మొండి పట్టుదలతో ఉన్నాడు. కృష్ణవేణి ఆయన పద్యం ప్రతి ఒక్కదానినీ ఆయనకి అందించింది. ఒకటిలానో రాకపోతే ఒక పశువుల కాపరి తనకు దొరికిందని తెచ్చి యిచ్చాడట. ఇంతకీ అది ఆయన రచించిన పద్యం కాదట. సర్వేశ్వరుడే రచించి వుంటాడు. కృష్ణమ్మ అభిమానం అటువంటిది!

ఆచార్య నాగార్జునుడు, ఆచార్య అర్హలులి వంటి బౌద్ధ, జైన గురువులే నదీతటాన తమ బోధనలని వినిపించారు. శ్రీధర పండితుడు, పండితారాధ్యుడు మున్నగు వారెందరో కృష్ణానదీ ప్రాంతాల సంఘ సంస్కరణ నడుం బిగించారు. శ్రీకాకుళం, భట్టిప్రోలు, ధరణికోట, జగ్గయ్యపేట, విజయపురి, బెజవాడ అనే విజయవాటిక, అమరావతి, ఘంటసాల, మోటుపల్లి వంటి నగరాలన్నీ కృష్ణానదీ తీరంలోనే రూపుదిద్దుకున్నాయి. నాటి ధాన్యకటకాన్ని ఆంధ్రులేనాడూ మరచిపోలేరు.

అందుకే దశకుమార చరిత్రం భరతవాక్యంలో కేతన ఇలా అంటారు:

రాజవాహన నృపతి ధర్మమున రాజ్య

పాలన చేయునెడల బ్రజకరమ సుఖము

గనిరి ధరయెల్ల శ్రీ ధాన్య కటకమయ్యె

నతని కీర్తులు పాల్పొంగినట్లు వెలసి

తేలివాహ నదిగా బౌద్ధులకూ, కణ్ణాబెణ్ణాగా జైనులకు, మైసోలియాగా గ్రీకులకూ ఒక సూర్యుడు సమస్త జీవులకు.. అన్నచందాన అందరికీ తలకొకరూ పై కనిపించి అలరించిన కృష్ణవేణీ నదీ తీరాన వెలసిన శ్రీకాకుళం కవిసమ్రాట్ విశ్వనాథ వారికి ఈవిధంగా అనిపించడంలో ఆశ్చర్యం లేదు.

శ్రీకృష్ణవేణీ గరిష్ఠ సాధస్తరం గాహత ప్రాకారమైన యదియు

బురుజుల దితిజ సమూహ రక్తము గ్రోలు నాల్కవోలు పతారనాటి నదియు

రాజరాజాంధ్ర విష్ణుని రాజధాని కలుషముల కెల్ల పిడుగు శ్రీకాకుళంబు

కన్నులకు కట్టినట్లుగ గానబడెదు వేదకాలము నాటి ముత్తైదువట్లు

ఆచార్య నాగార్జునుడు ప్రబోధించిన ధర్మాన్ని కృష్ణవేణి నేటికీ మనందరికీ వినిపిస్తూనే ఉంది.

యదానాప్తం మయా పుణ్యం – స్తువత్యం స్తుతి భాజనం

అనిమిత్తం బంధనాపీతం – భూయాత్ తేనా ఖిలం జగత్.

– వంక బాలసుబ్రహ్మణ్యం

కృష్ణా పుష్కరం 2016

కృష్ణా తీరంలో దారిదీపాలు

నదుల బాగోగులు చూసుకోవటానికి పుష్కరాలొక అవకాశం. మనం ముందుకు కదలాలంటే ఒక సహేతుక కారణం కావాలి. పుష్కరాలు అలాంటి అవకాశాన్నిస్తాయి. నదీ పర్యావరణం గురించి, దాని పరిసరాల పరిశుభ్రత గురించి కనీసం పన్నెండేళ్ల కొకసారైనా ప్రక్షాళన ఆలోచన చేస్తారీ మనుషులని పుష్కరాలకి ఆ ప్రాధాన్యత నివ్వటం జరిగింది.

మతం ఏదైతేనేం...? జలాలే జీవరాశికి జీవనాధారం. ప్రాణాలు పోస్తున్న జలాన్ని దేవతగా గౌరవించాలనుకునే వారందరికీ ఈ పుష్కరాలు పవిత్రమైనవే! స్నానాలు కాదు, నది అందించే స్ఫూర్తి ముఖ్యం.

కృష్ణమ్మ ఒడిలో పెరిగిన తెలుగు మణిదీపాలను పుష్కరాని కొకసారైనా మనం సంస్మరించుకోవటం మనల్ని మనం పుష్కలం చేసుకోవటం అవుతుంది.

ప్రాచీన కాలంలో దారిదీపాలు

ఆంధ్రవిష్ణువు శ్రీకాకుళం రాజధానిగా మహేంద్ర పర్వతం నుండి శ్రీ శైలం వరకూ ఆంధ్ర రాజ్యాన్ని విస్తరించాడు.

బృహత్కథ వ్రాసిన మహితాత్ముడు గుణాఢ్యుడు (క్రీ.పూ. 60-20), గుణాఢ్యుణ్ణి ఓడించిన వ్యాకరణ పండితుడు శర్వవర్మ (క్రీ. పూ. 70-15), తన అద్భుత గాథా సంకలనం గాథాసప్తశతి ద్వారా ఆనాటి తెలుగు సమాజాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన హాలచక్రవర్తి (క్రీ.శ. 67) ఇలా ఎందరో దారి దీపాలై నిలిచిన మహితాత్ములను కన్నతల్లీ! కృష్ణమ్మా నీకు వందనం.

గౌతమీపుత్ర శాతకర్ణి (క్రీ.పూ. 78-102) శాతవాహన రాజులలో 23వ వాడు. ఇతన్నే శాలివాహనుడు అనికూడా పిలుస్తారు. శాలివాహనుని పేరు మీదే ఈనాటికీ భారతీయ క్యాలండరు చలామణీ అవుతోంది. పల్లవ రాజ్య నిర్మాత శివస్కందవర్మ, మహాయాన బౌద్ధ ప్రవర్తకుడు ఆచార్య నాగార్జునుడు (క్రీ. శ. 174), నాగార్జునుడు వ్రాసిన "సుహ్రుల్లేఖ"ను అందుకున్న యజ్ఞశ్రీ శాతకర్ణి, నాగార్జునుడు తరువాత అంతటి బౌద్ధపండితుడిగా పేరొందిన దిజ్ఞాగుడు (క్రీ. శ.6వ శతాబ్దం), రస శాస్త్ర ప్రవక్త సిద్ధ నాగార్జునుడు (క్రీ.శ.6 వ శతాబ్దం), పూర్వమీమాంస సిద్ధాంత ప్రవర్తకుడు కుమారిల భట్టు, శివనింద చేసిన వారింట నిప్పు పుట్టకుండా జమ్మిచెట్టుకు నిప్పును మూటగట్టిన శైవాచార్యుడు శ్రీపతి పండితుడు(క్రీ.శ. 950) వీళ్ళంతా ప్రాచీన కృష్ణాతీరంలో కృష్ణ ఒడ్డున దారి దీపాలై నిలిచినవారే!

సాంస్కృతిక దారిదీపాలు

శ్రీకృష్ణ లీలా గానామృతాన్ని అందించిన లీలాశుకుడు క్రీ.శ. (1270), 13వ శతాబ్ది నాటి కూచిపూడి నాట్యరూపకర్త సిద్ధేంద్రయోగి, "కృష్ణలీలా తరంగిణి" కర్త నారాయణ తీర్థుల వారు, కృష్ణాజిల్లా మొవ్వ గ్రామంలో జన్మించిన వాగ్గేయకారుడు క్షేత్రయ్య (క్రీ.శ. 1595) కృష్ణాతీరప్రాంతాలలో సాంస్కృతిక చైతన్యానికి ముఖ్య కారకులు.

కర్ణాటక సంగీతానికి ప్రాణప్రతిష్ఠ చేసిన త్యాగరాజస్వామి శిష్యులు మేలత్తూరు వెంకటరామ శాస్త్రి(1750)గారితో ప్రారంభమైన గురుశిష్య పరంపర ఆయన మనుమడు కృష్ణ బ్రహ్మశాస్త్రి, సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి (1860), వీరి మనుమడు, ప్రసిద్ధ సంగీత దర్శకులు సుసర్ల దక్షిణా మూర్తి. మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారి గురువుగా పేరుగాంచిన ప్రముఖ గాత్రవిద్వాంసులు పారుపల్లి రామక్రిష్ణయ్య (1883-1951), ప్రముఖ వాయులీన విద్వాంసులు అన్నవరపు రామస్వామి, బందరులో జన్మించిన మరో ప్రసిద్ధ సంగీతవేత్త గరికపర్తి కోటయ్య దేవర (1865), తొలి తెలుగు నాటకం మంజరీ మధుకరీయం వ్రాసిన కోరాడ రామచంద్ర శాస్త్రి (1816) కృష్ణాతీరం వారే.

కూచిపూడి కళాకారుల్లో అగ్ర శ్రేణికి చెందిన వారిలో ముఖ్యులు బ్రహ్మశ్రీ నాట్య కళానిధి వేదాంతం లక్ష్మీ నారాయణ శాస్త్రిగారు, కూచిపూడి నాట్యకళకే అంకితమైన చింతా వెంకటరామయ్య, చింతా కృష్ణమూర్తి, వెంపటి వెంకటనారాయణ, ఆడవేషాల్లో అందెవేసిన మగధీరుడు వేదాంత సత్యనారాయణశర్మ, కూచిపూడి నృత్య నాటక సంప్రదాయంలో ప్రతినాయక పాత్రలను, భయానక, భీభత్స, రౌద్ర, వీర రసాలను పోషించే పాత్రలకు కొత్త ఒరవడి తెచ్చిన నాట్యాచార్యులు హరి పున్నయ్య గారు తొలి తెలుగు స్వతంత్ర సాంఘిక నాటకం నందకరాజ్యం రచయిత వావిలాల వాసుదేవ శాస్త్రి(1851) కూడా ఇక్కడ పుట్టిన వారే.

తెలుగు సినీ పరిశ్రమకి చెందిన తొలి తెలుగు మూకీ చిత్ర నిర్మాత రఘుపతి వెంకయ్య, గూడవల్లి రామబ్రహ్మం, గొప్ప నటులు డా. గోవిందరాజులు సుబ్బారావు, ముదిగొండ లింగమూర్తి, అలనాటి సంగీత



దర్శకుడు ఆదినారాయణరావు, సినిమాలలో నృత్య దర్శకులుగా వెలుగొందిన వేదాంతం రాఘవయ్య (కొన్ని చిత్రాలకు దర్శకత్వమూ వహించారు), వెంపటి సత్యనారాయణ, పసుమర్తి కృష్ణమూర్తి, పెంపటి చినసత్యం, వేదాంతం జగన్నాథశర్మ, తెలుగు ప్రేక్షక హృదయాల్లో శాశ్వతంగా నిలిచి పోయిన వెండితెర వేల్పులు నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వర రావు, సి.యస్.ఆర్‌గా ప్రసిద్ధుడైన చిలకలపూడి సీతారామాంజనేయులు, యస్వీఆర్ గా జగత్ప్రసిద్ధమైన సామర్ల వెంకట రంగారావు, ఈలపాట రఘురామయ్యగా ప్రఖ్యాతిచెందిన కల్యాణం వెంకట సుబ్బయ్య, "కళా వాచస్పతి" కొంగర జగ్గయ్య, "మిక్కిలి"నేని గా ప్రసిద్ధులైన మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, బొడ్డపాటిగా ప్రసిద్ధులైన సినీ హాస్య నటులు బొడ్డపాటి కృష్ణారావు, అలనాటి తెలుగు సినిమా నటీమణి, గాయని మరియు నిర్మాత సి.కృష్ణవేణి లేదా ఎం.కృష్ణవేణీ, అమ్మ, బామ్మ పాత్రలకు ప్రాణం పోసిన సహజనటి నిర్మలమ్మ, అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు, పౌరాణిక చిత్రాల బ్రహ్మ కమలాకర కామేశ్వరరావు , 'విక్టరీ' నే యింటి పేరు చేసుకొన్న వీరమాచనేని మధుసూదనరావు, కొసరాజుగా ప్రసిద్ధి చెందిన కొసరాజు రాఘవయ్య చౌదరి, వేదాంతం రాఘవయ్య భార్య నటి సూర్యప్రభ, ఆమె సోదరి ప్రముఖ నటి పుష్పవల్లి .... అందరూ కృష్ణాతీర దీపాలే.

సాహిత్య దారిదీపాలు

తన బాల్యాన్నీ వార్ధక్యాన్నీ కృష్ణాతీరం లోనే గడిపిన శ్రీనాథ మహాకవి (1365 – 1425), ఆయన బావమరిది. నాచికేతోపాఖ్యానం లాంటి గొప్ప రచనలు చేసిన దగ్గుపల్లి దుగ్గన, పంచతంత్రాన్ని తెనిగించిన దూబగుంట నారాయణ కవి(క్రీ.శ. 1470) , రాధాకృష్ణ తత్వాన్ని తన తరానికి సుబోధకం చేసిన అందించిన వల్లభాచార్యులు(క్రీ.శ.1473), రాజశేఖర చరిత్రం వ్రాసిన మాదయగారి మల్లన అష్ట దిగ్గజాల్లో ఒకడు అయ్యంకి మల్లన్న ఇక్కడ



గాలి పీల్చిన కవులు. తంజావూరు విజయరాఘవుని ఆస్థాన కవి, విజయవిలాసం వ్రాసిన చేమకూరి వెంకట కవి (1560) కృష్ణాజిల్లా నందిగామలో జన్మించాడని ప్రతీతి.

మహామహోపాధ్యాయ, భట్టారక, బాలసరస్వతి బిరుదులు పొంది, ఎలకూచి బాలసరస్వతి (క్రీ.శ.1590)గా ప్రసిద్ధుడైన వెంకట కృష్ణయ్య కృష్ణాతీర వాసి. విశ్వనాథనాయకుని స్థానాపతి రచించిన రాయవాచకాన్ని కృష్ణరాయ విజయం పేరుతో పద్యకావ్యంగా రచించిన కుమార ధూర్జటి (క్రీ.శ.1650) నూజివీడుకు దత్తత వచ్చాడని చెప్తారు. కృష్ణాజిల్లా చల్లపల్లి రాజాగారి ఆస్థాన కవి 'హంసల దీవి వేణు గోపాల శతకం, శ్రీకాకుళాంధ్రదేవ శతకం రచించిన కాసుల పురుషోత్తమ కవి(1750), తొలి తెలుగు నిఘంటువు ఆంధ్రదీపిక నిర్మాత మామిడి (వెంకయ్య) వెంకటార్యులు(క్రీశ. 1764), బ్రౌన్ దొరకు ఆంధ్రగీర్వాణ భాషలు బోధించిన పత్యం అద్వైత బ్రహ్మన్న శాస్త్రి (క్రీశ. 1775) పత్యం పరబ్రహ్మ శాస్త్రి సోదరులు, శాసనాధారాలతో పరిశోధనాత్మక చరిత్ర నిర్మాణానికి పితామహుడిగా ఖ్యాతి గడించిన కావలి వేంకట బొర్రయ్య. (1776) లకు మాతృమూర్తి కృష్ణమ్మ!

తెలుగు భాష మూలాలను వెలికి తీసిన ప్రఖ్యాత భాషావేత్త కోరాడ రామకృష్ణయ్య పంతులు గారు మచిలీపట్టణంలో జన్మించారు. మరో భాషావేత్త కోరాడ మహదేవశాస్త్రి వీరి కుమారుడు. అవధాన విద్యకొక సుస్థిర రూపాన్నిచ్చిన ఘనాపాఠి మాడభూషి వేంకటాచార్య కవి(1835) కృష్ణాజిల్లా నూజివీడులో జన్మించారు. వేదాలకు భాష్యం వ్రాయించ వలసిందిగా ఆనందగజపతి రాజా వారికి మాక్సుముల్లర్ ఆత్మూరి లక్ష్మీ నరసింహ సోమయాజి (1845) పేరు సూచించారనే ప్రసిద్ధి కలిన ఈ మహాపండితుడు కృష్ణాజిల్లా నూజివీడులో జన్మించారు. వీరేశలింగం గారికి వీరు గురువు. ఒక వ్యక్తి ఇన్ని ఘన కృతులు వెలయించగలడా అన్నంత ప్రతిభశాలి, అభినవ శ్రీనాథ– దాసు శ్రీరామకవి(1846) కృష్ణాజిల్లా అల్లూరులో జన్మించారు. 'శంకర నారాయణ ఇంగ్లీష్ – తెలుగు నిఘంటువు' నిర్మాత పావులూరి శంకర నారాయణ శ్రేష్ఠి కృష్ణాజిల్లా నూజివీడులో జన్మించారు.



హిందీలో రచనలు చేసిన తొలి తెలుగు రచయిత, మహా పండితుడు, బహుభాషా కోవిదుడు, సాహితీవేత్త నాదెళ్ళ పురుషోత్తమ (శాస్త్రి) కవి(1863)మచిలీపట్టణంలో జన్మించారు.

వేటూరి ప్రభాకర శాస్త్రి. ఓలేటి వేంకటరామశాస్త్రి, వేలూరి శివరామశాస్త్రి , విశ్వనాథ సత్యనారాయణ, పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వరరావు వంటి శిష్యరత్నాలను తయారు చేసిన చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి గారు (1870) కడియంలో జన్మించారు. బందరు హిందూ హైస్కూల్ ఆంధ్రపండితులుగా పనిచేశారు. దివాకర్ల తిరుపతి శాస్త్రిగారితో కలిసి తిరుపతి వేంకట కవులు పేరుతో జంటకవులుగా ప్రసిద్ధులు. సంస్కృతాంధ్ర పండితుడు వేటూరి సుందర శాస్త్రి (1866) పెదకళ్ళేపల్లిలో జన్మించారు. ప్రజ్ఞాప్రభాకరుడు వేటూరి ప్రభాకర శాస్త్రిగారు వీరి కుమారులే.

కాశీమజిలీ కథలు వ్రాసిన మధిర సుబ్బన్న దీక్షితులు, గొప్ప వేద పండితుడు సూరి మార్కండేయ శాస్త్రి (1868), అపర ధన్వంతరి, ఆయుర్వేదోద్ధారక దీవి గోపాలాచార్యులు (1872), సంచార సరస్వతి కాశీ కృష్ణాచార్య (1872), 'కవిగారు'గా ప్రసిద్ధులైన మారేపల్లి రామచంద్ర శాస్త్రి(1874), విజ్ఞాన చంద్రికా ప్రచురణలు, ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం, శ్రీకృష్ణదేవరాయాంధ్ర బాషానిలయం మొదలైన వ్యవస్థల స్థాపకుడు కొమర్రాజు వేంకట లక్ష్మణరావు (1877) కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ, అంతటి విశ్వనాథ వారినే పాషాణపాక ప్రభో అనగల్గిన పేరిడీ బ్రహ్మ జరూక్ శాస్త్రి (జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి), త్రిపురనేని గోపీచంద్ కృష్ణమ్మ బిడ్డలే.

సంపాదక దారిదీపాలు

ఆంధ్రపత్రిక వ్యవస్థాపకుడు విశ్వదాత, దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వర రావు పంతులు తెలుగు జాతి వైతాళికులలో ముఖ్యుడు. ఉమారంగనాయకులు నాయుడు (1872), ఋషి తుల్యుడైన సాహితీ వేత్త ముట్నూరి కృష్ణారావు, ఆంధ్ర పత్రిక సంపాదకులు శివలెంక శంభుప్రసాద్, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి పత్రికల సంపాదకులు, నవ యుగ మేధావి, నార్ల వెంకటేశ్వర రావు, నవశక్తి, ప్రజాశక్తి, విశాలాంధ్ర పత్రికల సంపాదకులు, కామ్రేడ్ మద్దుకూరి చంద్రశేఖర రావు, ప్రసిద్ధ చరిత్ర వేత్త, మార్క్సిష్టు తత్వవేత్త యేటుకూరి బలరామమూర్తి, కమ్యూనిష్టు నాయకుడు, ప్రజాశక్తి పత్రిక స్థాపకుడు-సంపాదకుడు మోటూరి హనుమంతరావు, ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకులు, విశిష్ఠ రచయిత నండూరి రామమోహన రావు- కృష్ణాతీరంలో ప్రభవించిన సంపాదక దీపాలు.



సామాజిక దారిదీపాలు

శ్రీ సత్యనారాయణ స్వామి'ని అన్నవరంలో ప్రతిష్టించి, తెలుగునాట ప్రతి ఇంటా సత్యనారాయణ వ్రతాలు నిర్వహించుకునేలా ప్రచారం చేసిన అద్దేపల్లి కృష్ణ శాస్త్రి (1846) దివిసీమవాడు. ఒకో శ్లోకానికి 108 వ్యాఖ్యానాలు చెప్పగల మేథో పండితుడు.

దేశభక్త కొండా వేంకటప్పయ్య (1866) తొలితరం స్వాతంత్ర్య యోధుడు. కృష్ణాపత్రిక, మచిలీపట్టణం ఆంధ్రజాతీయ కళాశాల లాంటి చిరస్మరణీయ వ్యవస్థల నిర్మాత. దేశం కోసం సర్వస్వం అర్పించిన త్యాగధనుడు.

గురుదేవుడని దేవులపల్లి కృష్ణశాస్త్రి, చలం ప్రభృతులు గౌరవించిన సంస్కర్త, బ్రహ్మసమాజ వాది రఘుపతి వెంకట రత్నం నాయుడు (1872) మచిలీపట్టణంలో జన్మించారు.

జాతీయ జెండా రూపకర్త, జపాన్ భాష నేర్చి జపాన్ వెంకయ్య గానూ, ప్రత్తిపంటకు సంబంధించి ఆధునిక మెళకువలను నేర్చి ప్రత్తి వెంకయ్యగానూ ప్రసిద్ధుడైన పింగళి వెంకయ్య (1878) కృష్ణాజిల్లా 'భట్ల పెనుమర్రు' గ్రామంలో జన్మించారు.

జాతీయ విద్యకై కృషి చేసిన తెలుగుబిడ్డ కోపల్లె హనుమంతరావు (1880) - మచిలీపట్నంలో ఆంధ్ర జాతీయ కళాశాల స్థాపించారు. స్వాతంత్ర్య సమరయోధుడు...

దారిదీపాలుగా మహిళామణులు

రాధికాస్వాంతనం కవయిత్రి ముద్దుపళని (1730-1790) 18వ శతాబ్దమునకు చెందిన తెలుగు కవయిత్రి. ఈమె 1739 నుండి 1763 వరకు తంజావూరు నేలిన మరాఠ నాయక వంశపు రాజు ప్రతాపసింహ ఆస్థాన కవయిత్రి. గొప్ప విష్ణు భక్తురాలు. గోదాదేవి వ్రాసిన తిరుప్పావై లోని 30 పాశురాలలో పదింటిని తెలుగులోకి అనువదించి సప్తపది అని నామకరణం చేసింది. వైష్ణవులు ధనుర్మాసములో సప్తపదిని పఠిస్తారు.

స్త్రీజన కల్పవల్లిగ ప్రసిద్ధి పొందిన విదుషీమణి బండారు అచ్చమాంబ 1874లో కృష్ణాజిల్లా నందిగామలో జన్మించారు. తెలంగాణా తొలి రచయిత్రిగా వినుతికెక్కారు. తమ్ముడు శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు గారిని పెంచి పెద్ద చేసి, ఆయన ద్వారా అనేక భాషలు నేర్చుకున్నారు. అబలా సచ్చరిత్ర రత్నమాల పేరుతో భారతీయ మహిళా ప్రముఖుల జీవిత చరిత్రలను వెలుగులోకి తెచ్చారు. నూట పాతికేళ్ళక్రితం చీకటి రోజుల్లో ఒక మహిళ ఊరూరా మహిళా జాగృతి కలిగించే ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. కృష్ణమ్మ పుత్రికలు వీరనారీమణులను పుత్రికలుగా కన్న కృష్ణమ్మా నీకు వందనాలు.

ఎందరో మహానుభావులు! అందరికీ వందనాలు!

- డా. జి వి పూర్ణచందు

కృష్ణా పుష్కరం 2016

బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను

సినీగీతాల్లో తరంగిణి కృష్ణవేణి

కృష్ణా నదిని తలచుకోగానే మనసు ఉప్పొంగిపోతుంది. ఎన్నెన్నో మధురమైన ఊహలు రెక్కలు విప్పుకుని అంబరాన్ని చుంబిస్తాయి. నేను పుట్టింది నూజివీడు తాలూకా గుళ్లపూడిలో. అది కృష్ణా జిల్లా లోని ఓ బుల్లి అందమైన గ్రామం. మా వూరిని ఆనుకుని వున్నది అమ్మలాంటి 'తమ్మిలేరు'. తమ్మిలేరుకి ఇటు ఒడ్డు కృష్ణా జిల్లా అయితే అవతలి ఒడ్డు పశ్చిమ గోదావరి జిల్లా. అలా నేను ఇద్దరమ్మల ముద్దుబిడ్డనయ్యాను. పుట్టింది గుళ్లపూడి, పెరిగింది చింతలపూడి.

నాకు 'కృష్ణ అంటే విశ్వనాథ, కరుణశ్రీ, తెన్నేటి హేమలత, పెద్దిభొట్ల, మో, కెవిఎల్ రావుగారు. వీరందరినీ చూసే భాగ్యం కలిగింది. వారితో సంభాషించే అదృష్టమూ కలిగింది.

మిత్రులు శ్రీ జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు గారు, కీ.శే. ఓంకార్, రచయిత శ్రీ లల్లాదేవి అందరం కలిసింది 'లత'గారి ఇంట్లోనే. నన్ను సినిమాల్లోకెళ్లమని ప్రోత్సహించిందీ లతమ్మే. కృష్ణ ప్రవహించే దారుల్లో నేనూ పయనించాను. ఎందరెందరో రచయితలు, రచయిత్రులు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు, సామాజిక సేవకులు, రాజకీయ నాయకులు.. అందరినీ కలిపే జీవనది కృష్ణవేణి. విజయవాడ వెడితే ఇప్పటికీ గంటలకి గంటలు గడుపుతూ కృష్ణమ్మని చూస్తూ కృష్ణమ్మతో ఊసులాడుతూ.

ఎంత చూసినా తనివి తీరదు. ఆ గాలులనెంత పీల్చినా ఆర్తి తీరదు. అది అమృతతుల్యమైన అమ్మ మనసులాంటిది. ఒక్కో తరంగమూ ఒక్కో తీరమై యుగ యుగాలుగా సాగిపోతూనే ఉంది. మానవ జీవన సారం సంపూర్ణంగా తెలిసిన కృష్ణమ్మ మనసుకి ఓ నెచ్చెలి. మనిషికి దైవం.

అక్షరాలకందని, సౌందర్యం కృష్ణవేణిది. ఎందరు ఎన్నివిధాలుగా వర్ణించారో.. ఎన్నెన్ని పదాలతో కీర్తించారో. ఎందరెందరు ఆమె ఒడిలో 'సేద'దీరారో!

ఆ తల్లికి మనఃస్ఫూర్తిగా నమస్కరిస్తూ చలనచిత్ర గీతాల్లో ఆ తల్లిని స్తుతించిన పదాల్ని చూద్దాం.

మనకు కవి ఆత్రేయగారు 'బంగారు బొమ్మలు' చిత్రంలో అద్భుతంగా రాసిన పాట 'నేనీదరినీ నువ్వాదరినీ.. కృష్ణమ్మ కలిపింది ఇద్దరినీ'

ఇద్దరు ప్రేమికులని కలిపిన కృష్ణమ్మ ఎంత ప్రేమమయి. కెవి మహదేవన్ స్వరపరచగా బాలు సుశీల పాడిన ఆ పాట కృష్ణమ్మ పరుగులిడుతున్నంత కాలం మన గుండెల్లో మారుమోగుతూనే ఉంటుంది.

ఒకరిని మహాకవి అంటాం. ఒకరిని 'యుగకర్త' అంటాం. ఇలా మన గౌరవాన్ని అనేక బిరుదులతో చాటుకుంటాము. మరి మన వేటూరిగారికి ఏ బిరుదునివ్వాలి? బిరుదులకి అతీతుడాయన. కృష్ణా నది ఎంత చల్లగా అందర్నీ కలుపుకుని ప్రవహిస్తుందో వేటూరి కలమూ అంతే. కృష్ణా జిల్లాలో పుట్టారు కనుక కృష్ణవేణి అంటే ఆయనకి ప్రాణం. ఆయన కృష్ణానది మీద రాసినన్ని పాటలు మరే రచయిత వ్రాయలేదు.

ఇదే నా సమాధానం చిత్రంలో నే పాడనా నవరాగాల తెలుగు పాట అని పల్లవించి, చరణంలో

'గోదారి గంగమ్మ తొలికోడలై / అలివేలి కృష్ణమ్మ మలి కోడలై' అంటారు.

రెండు జీవ నదుల్ని కోడళ్లను చేసిన ఘనత వేటూరిది.

అంతేకాదు 'పరదేశి' చిత్రంలో

'తాజ్‌మహలే ప్రణయ జీవుల పావురం

కృష్ణవేణీ శిల్ప రమణీ నర్తనం' అంటారు.


రెండు పంక్తులలో ఉత్తర దక్షిణాలకి ఉయ్యాల కట్టిన మహానుభావుడాయన.

'నా వాలుజడ కృష్ణవేణి / నా పూలజడ వెన్నెల గోదారి' (చిత్రం: అమెరికా అల్లుడు)

'నాగార్జునకొండ కోనలో నాట్యరాణి కృష్ణవేణి' (చిత్రం: సిరిసిరి మువ్వ. ప॥ గజ్జ ఘల్లుమంటుంటే)


ఎంతటి భావుకత.. ఎంతటి భావ చిత్రం..!

'కడవైన కృష్ణమ్మ పొంగగా కడలేని మాగాణి పండగా' అంటారు పల్నాటి సింహం చిత్రం, 'పాలుపొంగే గడ్డ పల్నాటిసీమనే' పాటలో.









కృష్ణా పుష్కరం 2016

అణో రణీయాన్ మహతో మహీయాన్ అన్నట్టు కృష్ణవేణమ్మని కడవలో నింపారు. కడలేని మాగాణిని పండించారు.

కృష్ణ, గోదావరులు ఆయనకి రెండు కళ్లు. పక్షపాతం చూపలేదు.

'మమతల మాగాణమే మసియైపోగా

తెలుగుతల్లి విలపించెను భోరు భోరున

సాగే కన్నీరే కృష్ణాగోదారిలా.." అంటారు.

'ఊరికి మొనగాడు' చిత్రంలో 'కదలిరండి మనుషులైతే' పాటలో.

అలాగే 'సరిగమలు' చిత్రంలో 'గోదావరి పయ్యెద కృష్ణమ్మ నీ వాల్జడ' అన్నా అది వేటూరికే చెల్లింది. ఎందుకంటే ఆయన కలమే ఓ హలం.

ఒకసారి కవులందరూ సరదాగా శ్రీ కోదండపాణి ఆడియో వీడియోలో (ఎస్పికెపి రికార్డింగ్ థియేటర్ లేక ఎస్పి బాలుగారి థియేటర్)లో కలిసినప్పుడు మళ్లీ కృష్ణా గోదావరుల ప్రసక్తి వచ్చింది. వేటూరిగారు అర్ధనిమీలిత నేత్రాలతో మాట్లాడుతూ,

'నా సిరికా కొలను చిన్నది' కావ్యంలో

'కలలన్నీ అలలైన సిరికా కొలను రాణి

గలగలని నేడు సాగిన కృష్ణవేణి' అన్నారు.

వరుస కట్టింది పెండ్యాలవారు. అందులోనే అలివేణి వ్యక్తిత్వాన్ని, ఔన్నత్యాన్ని వర్ణిస్తూ 'కృష్ణా జలతరంగ నిర్నిద్రగాన పరితోషిత' అన్నారు. కృష్ణమ్మ మీద ఎంత ప్రేమో!

ఇక 'శంకరాభరణం' సంగతి చెప్పక్కర్లేదు. 'రాగం.. తానం.. పల్లవి' పాట ప్రజల హృదయాల్లో మారుమోగి పోయింది. 'రాగం తానం పల్లవి' పాటలో 'కృష్ణా తరంగాల సారంగ రాగాలు.. కృష్ణలీలా తరంగిణీ భక్తిగీతాలు' అన్న వేటూరి మాటలు చిరంజీవులుగా మన హృదయాల్లో నిలిచిపోయాయి. అక్షరాలతో అక్షరమైన పూజ సలిపారు కృష్ణవేణికి.

'యువరత్న రాజా' సినిమాలో 'మా కళ్యాణ సీతమ్మ' పాటలో

'కృష్ణవేణి వాల్జడ కనకదుర్గ వేయగా

గౌతమంత చీరగా కట్టుకోవే సీతలా'

అంటారు. కృష్ణవేణికి కనకదుర్గమ్మ వాల్జడ వేసిందా?సీత గౌతమిని చీరలా కట్టుకుందా (కట్టుకోవాలా)?అసలీ వూహ మరో పది జన్మలెత్తినా అందుతుందా?

'శుభోదయం' సినిమాలో 'కంచికి పోతావా కృష్ణమ్మా – ఆ కంచి వార్తలేమి కృష్ణమ్మా' అంటారు. ఏ కథ చేరినా కంచికేగా!

కృష్ణమ్మ పెన్నమ్మ పెనవేసుకున్నట్టు – పెదవుల్ని కలిపేయనా' అంటారు. కృష్ణ గలగలల్లో వేటూరి వారి ఎదసవ్వడి ఎప్పటికీ వినిపిస్తూనే ఉంటుంది.

'దేశోద్ధారకులు' సినిమాలో మోదుకూరి జాన్సన్‌గారు కూడా కృష్ణమ్మకు తనదైన శైలిలో ప్రాధాన్యత కల్పించారు.

'స్వాగతం.. సుస్వాగతం' పాటలో 'గోదావరి పాదాలకు నీళ్లివ్వగా.. పినాకిని పిలిచి నీకు పీటవేయగా, కృష్ణవేణి వచ్చి నీకు కడుపు నింపగా.. కన్నతల్లి కడుపుతీపి తాంబూలమివ్వగా' అంటారు. ఎంత చక్కని మాట. కృష్ణమ్మ కోటాను కోట్ల మందికి కడుపు నింపుతూనే ఉంది. నింపుతూనే ఉంటుంది.

శ్రీ ఇంద్రకంటి శ్రీకాంతశర్మగారికి కూడా కృష్ణా నదితో అవినాభావ సంబంధం ఉంది. నెలవంక సినిమాలో వారే 'ఈ కోవెల వాకిలిలో ఏదో అడుగుల సవ్వడి' పాటలో

'నీ కన్నుల వెన్నెల చూసి మనసే చిరు తరగయ్యిందీ కృష్ణవేణి పరుగయ్యిందీ..' అని హృద్యంగా వర్ణిస్తారు. ఎంత చక్కని భావం.

ఇక సి.నారాయణరెడ్డిగారు స్పృశించని అంశం లేదు. విశ్వంభరుడాయన. అక్షర కర్పూర హారతులిచ్చే కర్పూర వసంతరాయుడాయన. "కృష్ణవేణి మా ఇంటి అలివేణి" అన్నారు.

'ఆడవే జలకమ్ములాడవే' అంటూ కథానాయికని ఉత్సాహ పరిచారు. ఉర్రూతలూగించారు ఆంధ్ర ప్రేక్షకులనీ, శ్రోతలనీ.. తమ పాటలతో.

ఇంతకీ ఆమె ఎక్కడ జలకాలాడాలట?

'నాగార్జునుని బోధనలు ఫలియించిన చోట

బౌద్ధమత వృక్షమ్ము పల్లవించిన చోట

కృష్ణవేణీ తరంగిణీ జాలిగుండెయె సాగరమ్మై

రూపు సవరించుకొను నీట!

జలకాలాడాలిట.

జ్ఞానపీఠాన్ని అధిరోహించిన కవి చక్రవర్తి.. సలామ్.. కలంతో ఎన్ని హొయలొలికించారు జనాబ్!! బాణీ కట్టింది ఐ.వి. రాజుగారయితే (నేటి సోమరాజుగారి తండ్రిగారు) పాడింది అమర గాయకులు ఘంటసాల వారు. వారికి జంటగా పాడినది అచ్చతెలుగు ఆడపడుచు పి.సుశీలగారు. చిత్రం 'విచిత్ర కుటుంబం'.

మళ్లీ టి.వి. రాజుగారి సారథ్యంలో ది గ్రేట్ రఫీగారు గానం చేసిన పాట 'గోపాలబాల నిన్నే కోరి'. రఫీ రఫీనే.. మరొకరితో వారిని పోల్చలేము. ఘంటసాల గారికి రఫీగారంటే ఇష్టం. ఇక ఎస్పి బాలసుబ్రమణ్యం గారయితే వారి ఎస్పి కోదండపాణి రికార్డింగ్ స్టూడియో ఎంట్రన్స్‌లోనే రఫీగారి చిరునవ్వులు చిందించే చిత్రాన్ని ప్రతిష్టింప చేశారు. ఎంటర్ అవగానే రఫీగార్ని చూస్తే ఆ రోజంతా అద్భుతంగా గడిచేది. ఎస్పిబికి రఫీగారంటే ప్రాణం.

ఆ మధుర గాయకుడు, 'ఏ మూధులు కాదంటున్నా నా మనసు నీదేనన్నా

పూజారి అడ్డం ఉన్నా – నా దైవం నీవేనన్నా కృష్ణమ్మా.. నిను నమ్మిన వాడ్ని నట్టేట ముంచేస్తావో..' అని పాడితే. కృష్ణమ్మ లక్ష అడుగుల ఎత్తున, నిలబెడుతుంది గానీ, నట్టేట ఎలా ముంచుతుందీ? అదీ రఫీసాబ్‌ని!

ఒక సరదా విషయం ఇక్కడ ప్రస్తావించాలి. ఆత్రేయ, ఆరుద్ర, వేటూరి, వీరంతా వీర లెవల్లో రచనలు చేసే సమయంలో ఒక పదీ పదకొండు నెలలు అటు ఇటుగా మేం నలుగురం రచయితలం చిత్రసీమలోకి అడుగుపెట్టాం. ముందుగా ఎంటరైంది సిరివెన్నెల సినిమానే. ఇంటిపేరుగా చేసుకున్న చేంబ్రోలు సీతారామశాస్త్రిగారు.

తరువాత వచ్చింది ఉభయ భాషా ప్రవీణ, తెన్నేటి హేమలత గారు 'షట్‌శాస్త్ర చక్రవర్తి' అని ముద్దుగా పిలిచే జొన్నవిత్తుల రామలింగేశ్వరరావుగారు.

కృష్ణా పుష్కరం 2016

ఆ తరవాత వచ్చింది అద్భుతమైన ప్రజ్ఞ, అసాధారణ ధారణ శక్తి కలిగిన వెన్నెలకంటి రాజేశ్వర ప్రసాద్. ఇతన్నే నేను ముద్దుగా 'బుల్లెబ్బాయ్' అని, 'తమ్ముడా' అని పిలుచుకునేది.

చివరగా వచ్చింది నేను. భగవంతుని దయవల్ల నలుగురము, మా మా పద్ధతిలో గత 30 ఏళ్లుగా సినీరంగంలోనే కొనసాగుతున్నాం.

జొన్నవిత్తులకీ కృష్ణా నదికీ విడదీయరాని సంబంధం. ఆ 'చాలు'లో పుట్టిన వాడు కదా మరి. కృష్ణమ్మ మీద ఆయన రాసినన్ని ప్రైవేట్ సాంగ్స్ ఎవరూ రాసి వుండరు. మేమిద్దరం సినిమాల్లోకి రాకముందే ఆయన వ్రాసిన 'సుస్వాగత మిదే నీకు కృష్ణవేణీ' అన్న గీతం ప్రజల హృదయాల్లో మార-ుమోగిపోయేది. గత పుష్కరాల్లో ఆ గీతం విడుదలై మరోసారి మళ్లీ ప్రజల హృదయాల్లో తిష్టవేసింది.

ఆయనే 'దేవుళ్లు' సినిమాలో 'మా కనకదుర్గా విజయ కనకదుర్గా' అనే పల్లవితో మొదలయ్యే పాటలో 'ఓంకార రవాల అలల కృష్ణాతీరము' అని అద్భుతంగా కృష్ణా తీరాన్ని వర్ణించారు.

ఇక మా 'బుల్లెబ్బాయ్' అని నేను పిలిచే వెన్నెలకంటి 'మహానది' అనే కమల్‌హాసన్ గారి సినిమాలో కృష్ణమ్మని గుండె నిండుగా కొనియాడారు.

'శ్రీరంగ రంగనాధుని దివ్యరూపమే చూడవే/

శ్రీదేవి రంగనాయకీ నామం సంతతం పాడవే/ నీలవేణిలో నీటిముత్యాలు కృష్ణవేణిలో అలల గీతాలు / నీలవేణిలో నీటిముత్యాలు నీరజాక్షునికి పూలుగా

కృష్ణవేణిలో అలల గీతాలు కృష్ణగీతలే పాడగా' – ఎంత చక్కని పదాలు.. ఎంత హృద్యమైన అక్షరాలు!!

నేనూ 'కృష్ణ' పైన పాటల్లో ఒక లైన్ వ్రాయడం జరిగింది. సినిమా పేరు 'జూ లకటక..'. 'గుడివాడ స్టేషనూ ఎప్పుడైనా చూశావా.. బెజవాడ కృష్ణలో మునకవేసి వచ్చావా కాకినాడ బుల్లెమ్మా.. సీటు చూసుకోవమ్మా.. సర్కారు బండొచ్చిందీ సిగ్నలిచ్చినారమ్మా.

'కృష్ణానది' పేరు విన్నప్పుడల్లా గుర్తొచ్చే రెండు పాటలున్నాయి. నా చిన్నతనం నుంచే నేను పాడుకున్న పాటలు మనిషికీ మనసుకి ఉత్తేజాన్నీ ఉత్సాహాన్ని కలిగించే పాటలు అవి. తెలుగుజాతి ఉన్నంత కాలం చెక్కు చెదరని పాటలు. తెలుగు జాతికి జాతీయ గీతంలాంటి పాటలు.

ఒకదాన్ని శంకరంబాడి సుందరాచారిగారు రచించిన 'మా తెలుగు తల్లికీ మల్లెపూదండ' పాట. దేశ విదేశాల్లో ఏ సభలో ఏ సమావేశాలు జరిగినా తెలుగువారి గొంతులో నినదించే పాట. పాడింది టంగుటూరి సూర్యకుమారి గారు. చాలామందికి తెలియని విషయం ఏమంటే, ఈ పాటను స్వరపరిచిన స్వరకర్త పేరు. ఈమధ్యనే మ్యూజికాలజిస్టు 'రాజు' ద్వారా తెలిసింది. దీనిని స్వరపరిచిన ఆర్. ఆర్.సుదర్శనం గారని. చాలా గొప్ప సంగీత దర్శకుడాయన. ఒక పాట దశాబ్దాలపాటు నిలిచి పోవడానికి కారణం, రచన లోని గొప్పదనం.. ట్యూన్‌కి ఉన్న బలం, గాయనీ గాయకుల ప్రతిభ. ఆ మూడూ రంగరించిన అద్భుత గేయం 'మా తెలుగు తల్లికీ మల్లెపూదండ' అందులో ఒక చరణంలో

'గలగలా గోదారి కదలిపోతుంటేను / బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను/

బంగారు పంటలే పండుతాయీ/ మురిపాల ముత్యాలు దొరలుతాయీ..' ॥ మా తెలుగు ॥

వేములపల్లి శ్రీకృష్ణగారు గొప్ప స్ఫూర్తిదాతలు. మాటల్లో వారి ఖచ్చితత్వమే వారి పాటలోనూ ప్రతిఫలించింది. నా చిన్నతనం నుంచి నన్ను ఉత్తేజపరిచిన పాట 'చేయెత్తి జైకొట్టు తెలుగోడా'. ఏ సభకి వెళ్లినా ఈ పాటలోని ఏదో ఓ చరణాన్ని పాడటం నాకు అలవాటు, ఇష్టమూ. నా దృష్టిలో ఈ పాటని కూడా ప్రతి తెలుగువాడు నేర్చుకోవాలి. బాల బాలికలకి నేర్పాలి.

ఈ పాటలోని ఓ చరణం

'కల్లోల గౌతమీ.. వెల్లువల కృష్ణమ్మ

తుంగభద్రా పెన్న పొంగిపొరలిన చాలు

ధాన్యరాశులు పండు దేశానా

కూడు గుడ్డకు కొదువ లేదోయీ..' ॥ చేయెత్తి ॥

అయ్యలారా! అమ్మలారా.. మన తెలుగుని మన బిడ్డలకు అందించాలి. అపారమైన సంపద మన తెలుగు జాతిది. మన తరువాతి తరాలకి అందించాలంటే ఇంగ్లీషునో మరో పరభాషనో చదవవద్దని అనను. ముందు మాతృభాష నేర్పి ఆ తరువాత ఎన్ని భాషలైనా నేర్పవచ్చు. దయచేసి 'తెలుగు'ని అశ్రద్ధ చేయకండి. మన జాతికి పునాది తెలుగు. మన జాతికి వెలుగు 'తెలుగు'.

'ఏ దేశమేగినా ఎందు కాలిడినా.. నిలుపరా నీ జాతి నిండు గౌరవము' అని అన్నట్టు మన జాతి గౌరవం మన చేతుల్లోనే ఉంది. ఆచంద్రతారార్కం అది నిలుపుకుందాం. జై తెలుగు తల్లి. జైహింద్.

అయ్యా.. తెలుగుజాతి కన్నతల్లి వంటి కృష్ణానది గురించిన సినీ గీతాల్లో నేను ఉదహరించినవి అతి కొద్ది మాత్రమే. కారణం స్థలాభావం. ఇంకా ఎన్నెన్నో సినీ, ప్రైవేటు గీతాలున్నాయి. కొండంత దేవుడికి కొండంత పత్రిని తేలేనట్టుగానే యుగ యుగాలుగా ప్రవహిస్తున్న ఈ సజీవమూర్తికి సాష్టాంగ నమస్కారం చేస్తూ తెలుగు బిడ్డలందరూ ఈ పుష్కరాల్లో పాల్గొనాలని (కులమత భేదంలేకుండా.. నిండు మనసుతో) మనసునీ, శరీరాన్నీ పవిత్ర పరచుకోవాలని ఆకాంక్షిస్తూ, తెలుగు వెలుగు విశ్వమంతా వ్యాపించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఈ అవకాశాన్ని నాకు ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాను.



– భువనచంద్ర

పొంగి పొరలే కృష్ణ

పదహారు కళలతో
పరువులెత్తే కృష్ణ
పరువులెడుతూ పల్లె
పాట పాడే కృష్ణ - 1
పడుచు గాలులతోటి
పలుకులాడే కృష్ణ
వొంపు వొంపున చిలిపి
హొయల నొలికే కృష్ణ - 2
దుర్గమ్మ పదములకు
పసుపునిచ్చే కృష్ణ
మల్లన్న శ్రీమతికి
మల్లెలిచ్చే కృష్ణ - 3
కార్మికుల కష్టాన్ని
తుడిచిపెట్టే కృష్ణ
అన్నదాతకు సిరుల
విరులనిచ్చే కృష్ణ - 4
జలకమాడే యువతి
జడను లాగే కృష్ణ
మునకలేసే చెలిని
ముద్దులాడే కృష్ణ - 5
చిరువాన చినుకులకు
పరవశించే కృష్ణ
జడివానతో పొంగి
పొరలిపోయే కృష్ణ - 6
దేవతల శిరసుపై
నాట్యమాడే కృష్ణ
తపియించు మనసులను
చల్లబరిచే కృష్ణ - 7
వీరులకు తిలకాన్ని
దిద్దిపంపే కృష్ణ
వీరమాతల బొట్టు
చెరగనివ్వని కృష్ణ - 8
స్వాతంత్ర్య యోధులకు
జన్మనిచ్చిన కృష్ణ
కవిగాయకుల ఎదలో
నడయాడునది కృష్ణ - 9
సద్గురువులెందరినో
అందించినది కృష్ణ
ఆనంద కెరటాల
తేలించినది కృష్ణ - 10
వెండితెరపై వన్నె
చిన్నెలొలికిన కృష్ణ
వెండితెర వెలుగులను
అందించినది కృష్ణ - 11
శరణన్న వారలను
కరుణ జూచే కృష్ణ
ముష్కరుల తుష్కరుల
ముంచివేసిన కృష్ణ - 12
మన్మధుడి విల్లుకై
చెరకునిచ్చిన కృష్ణ
ప్రణయ కావ్యాలకే
స్ఫూర్తినిచ్చిన కృష్ణ - 13
పసిబిడ్డలా జనుల
పలుకరించే కృష్ణ
ప్రౌఢలా మనసులను
మరపించునది కృష్ణ - 14
సంగీత సాహిత్య
సమ్మేళనమే కృష్ణ
నాట్య శాస్త్రాలకే
తలమానికము కృష్ణ - 15
విశ్వనాధుల వారి
వేయిపడగల కృష్ణ
మల్లాది కథలుగా
మరులుగొల్పిన కృష్ణ - 16
మువ్వ గోపాలుడై
మురళినూదిన కృష్ణ
క్షేత్రయ్య గళములో
నడయాడినది కృష్ణ - 17
ఇరువైపులా గుడుల
కొలువుదీరిన కృష్ణ
గుడిగంటలతోబాటు
రవళించునది కృష్ణ - 18
బౌద్ధ భిక్షువులకూ
విడుదులిచ్చిన కృష్ణ
ఆర్య నాగార్జునుని
ఆదరించిన కృష్ణ - 19
దర్గాలు చర్చిలతో
పులకించినది కృష్ణ
మతములన్నింటినీ
కలుపుకొన్నది కృష్ణ - 20
ఎన్నెన్నో పత్రికల
పుట్టినిల్లీ కృష్ణ
మహితాత్ములెందరికో
మెట్టినిల్లీ కృష్ణ - 21
సిద్ధేంద్రునికి నాట్య
యోగమిచ్చిన కృష్ణ
నృత్య రాత్నావళిని
వెలయించినది కృష్ణ - 22
గ్రంధాలయాలకై
నినదించినది కృష్ణ
సమర శంఖాలనే
పూరించినది కృష్ణ - 23
విద్యాలయాలతో
వెల్లువెత్తిన కృష్ణ
వైజ్ఞానికుల తీర్చి
దిద్దినది మన కృష్ణ - 24
పశువుల పక్షుల
తృష్ణ తీర్చే కృష్ణ
ప్రకృతిలో ప్రకృతై
పరిఢవిల్లే కృష్ణ - 25
సకల సంపదలనూ
ప్రేమతో మనకిచ్చి
సాగరుని వొడిలోకి
సాగిపోయే కృష్ణ - 26
నిస్వార్ధనాయకుల
నెలవు మన కృష్ణమ్మ
ఒకసారి స్మరియిస్తే
తరియించునీ జన్మ - 27
శత కోటి దండాలు
తల్లి కృష్ణమ్మా
నీ దీవెనలు తెలుగు
జాతికివ్వమ్మా!!!

– భువనచంద్ర

స్వీయ ధృవీకరణతోనే స్థానికత

- నవ్యాంధ్రప్రదేశ్‌లో 'స్థానికత'ను కోరుకునే వారంతా స్వీయ ధృవీకరణ చేసుకోవచ్చు. స్వీయ ధృవీకరణతోనే 'స్థానికత'ను ఖరారు చేసుకోవాలని మంత్రిమండలి నిర్ణయించింది. త్వరలోనే మార్గదర్శకాలు జారీచేయనున్నారు. స్థానికతను నిర్ధారించే ప్రక్రియను సరళీకృతం చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. స్థానికత నిర్ధారణకోసం ఆన్‌లైన్‌లోనే దరఖాసస్తు చేసుకునే విధంగా ఒక ప్రొఫార్మా రూపొందిస్తున్నారు.

మున్సిపాలిటీలపై నిరంతర పర్యవేక్షణ

- నవ్యాంధ్రలో గల మున్సిపాలిటీల పనితీరుపై ఇక నుంచి నిరంతరం పర్యవేక్షించేంచి, వాటి పరిపాలన నిర్వహణ తీరును మరింత మెరుగుపరిచి, పట్టణాలు, నగరాల సమగ్రాభివృద్ధికి దోహదపడాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్రంలోని 96 మున్సిపాలిటీలు, 14 మున్సిపల్ కార్పొరేషన్ల డేటాను ఆన్‌లైన్ చేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ నూతన విధానం అమలు చేససేందుకు ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్(ఈఆర్‌పి) ససాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. ఫైనాన్స్ మాడ్యూల్, వర్క్ మాడ్యూల్, ఆస్తి పన్ను మాడ్యుల్ మొదలైన 24 మాడ్యూల్స్ ఈ విధానంలో పొందుపరిచారు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు మినహా మిగిలిన అన్ని కార్పొరేషన్ల పరిధిలోనూ ఈ సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెచ్చి, పట్టణ,నగరప్రాంతాలలో స్థానిక పరిపాలనను మరింత బలోపేతం చేసి, పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయనున్నారు. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు నగర పాలక సంస్థలకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్లు ఉన్నాయి. వీటిని కూడ ఈఆర్‌పీ విధానంలోకి విలీనం చేస్తున్నారు. వివిధ అవసరాలపై ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ అనుమతులు జారీ, పన్నుల చెల్లింపు వంటి కార్యకలాపాలన్నీ ఇకముందు ఈ నూతన విధానంతోనే అమలు చేయనున్నారు.

కృష్ణానదికి హారతి

- పవిత్రమైన కృష్ణా పుష్కరాలు సందర్భంగా విజయవాడకు సమీపంలోని ఇబ్రహీంపట్నం వద్ద కృష్ణా నదికి హారతి ఇచ్చే కార్యక్రమానికి వచ్చే ఈ నెల రెండవ వారంలో శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్ర దేవాదాయశాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. గోదావరి-కృష్ణా నదుల సంగమ క్షేత్రం కృష్ణా నది హారతికి ప్రధాన భూమిక వహించబోతోంది. ఆగసస్టు 12 నుంచి అత్యంతవైభవోపేతంగా ప్రారంభం కాబోతున్న కృష్ణా పుష్కరాలకు ముందు మూడు, నాలుగు రోజుల ముందే కృష్ణా హారతి ప్రారంభం అవుతుంది. ప్రతిరోజూ సూర్యాస్తమయం తర్వాత కృష్ణా నదికి హారతి ఇవ్వాలని నిర్ణయించారు. గతంలో గోదావరి పుష్కరాలు సందర్భంగా గోదావరికి హారతి ఇచ్చిన తరహాలోనే ఇప్పుడు కృష్ణాకు కూడ హారతి ఇవ్వబోతున్నారు. కృష్ణా హారతి ఇవ్వడానికి వీలుగా 24మంది పురోహితులు, సహాయకులను దేవాదాయశాఖ అధికారులు ఎంపిక చేశారు. హారతి ఏ విధంగా ఇవ్వాలన్న కోణంలో వారికి ప్రత్యేక శిక్షణ కూడ ఇస్తున్నారు. హారతి సందర్భంలో పురోహితులు ధరించే దుస్తులను నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిఫ్ట్)తో డిజైన్ చేయిస్తున్నారు.

క్రీడా హబ్‌గా అమరావతి

- నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని క్రీడాహబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర కార్మిక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. 2018-19లో రాష్ట్రంలో జాతీయసస్థాయి క్రీడలు నిర్వహించనున్నామన్నారు. ఈ క్రీడలను ప్రాతిపదికగా తీసుకుని రాష్ట్రంలో క్రీడా మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేయనున్నట్లు ఆయన చెప్పారు. శాప్ ఛైర్మన్ పిఆర్ మోహన్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జాతీయ క్రీడల నేపథ్యంలో ప్రతీ జిల్లాలోనూ ఒకటి లేదా రెండు కేటగిరీల్లో క్రీడాకారులను మరింత ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహించాలని నిర్ణయించినట్లు అచ్చెన్నాయుడు వెల్లడించారు. క్రీడా శిక్షకుల కొరత ఉందని, ఈ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. విలువిద్యలో శిక్షణ ఇచ్చేందుకు విశాఖపట్నంజిల్లా, అరకులో ఒక అకాడమీ, తూర్పుగోదావరిజిల్లా మారేడుమిల్లిలో ఒక ప్రత్యేక శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు అచ్చెన్నాయుడు వివరించారు.

గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంల నిర్మాణం

- రాష్ట్రంలోని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలన్న తపనతో గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. ఒక్కో నియోజకవర్గంలో కనీసం ఐదెకరాల స్థలాన్ని సమకూర్చగలిగితే రూ. 2.70 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం నిర్మిస్తామన్నారు. కృష్ణా, గుంటూరు, విశాఖపట్నం జిల్లాలో క్రీడల అభివృద్ధికి పిపిపి విధానంలో అనేక ప్రాజెక్టులు రానున్నాయని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.

పుష్కరాలకు 4వేల మంది పురోహితులు

- ఆగస్టు 12 నుంచి వైభవోపేతంగా జరగనున్న కృష్ణానదీ పుష్కరాలకు నాలుగువేల మంది పురోహితులను నియమించాలని దేవాదాయశాఖ నిర్ణయించింది. కృష్ణానదీ తీరంలో నిర్మించే స్నానపు ఘట్టాల వద్ద భక్తుల సౌకర్యార్థం క్రతువుల నిర్వహణ, ఇతరత్రా ఆధ్యాత్మికార్యక్రమాల నిర్వహణకోసం ఈ పురోహితులు తమ సేవలు అందించనున్నారు. పుష్కరాలు జరిగే కృష్ణా, గుంటూరు, కర్నూలు జిల్లాల్లో ఈ పురోహితులు ఘాట్ల వద్ద భక్తులకు అందుబాటులో ఉంటారు. ఈ పురోహితులకు గుర్తింపు కార్డులు కూడా అందిస్తారు. పుష్కరాలకు తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అవసరమైతే అదనంగా మరో రెండువేల మంది పురోహితులను నియమించడానికి ప్రణాళిక సంసిద్ధం చేశారు. పిత్రుకర్మ, పిండ ప్రధానం, ముసివాయనం వంటి క్రతువుల నిర్వహణలో ఈ పురోహితుల సేవలు భక్తులు పొందవచ్చు.

అమరావతికి 'సర్వే ఆఫ్ ఇండియా'

- సమైక్యాంధ్రప్రదేశ్‌లో గల సర్వే ఆఫ్ ఇండియా సంస్థను నవ్యాంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల శాఖలుగా విభజించారు. ఈ విషయాన్ని ఆ సంస్థ సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియా స్వర్ణ సుబ్బారావు వెల్లడించారు. నవ్యాంధ్ర విభాగాన్ని అమరావతికి తరలించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఉప్పల్‌లో ఉన్న తమ సంస్థను తెలంగాణకే కేటాయించామని తెలిపారు. ఏపి, తెలంగాణ రాష్ట్రాలలో పనిచేయడానికి ఇష్టపడే ఉద్యోగుల నుంచి స్వచ్ఛంద దరఖాస్తులు కోరారు.

మార్కెట్ కమిటీల పదవీకాలం పొడిగింపు

- నవ్యాంధ్రలోని పది మార్కెట్ యార్డు కమిటీల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలపాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీటిలో గజపతి నగరం, పోలవరం, రాజోలు, విజయవాడ, చిలకలూరిపేట, రాజుపాలెం, ఈపూరు, కోయిలకుంట్ల, పులివెందుల, అనంతపురం మార్కెట్ కమిటీలున్నాయి.

ఏపీఎస్ ఆర్టీసీకి పురస్కారం

- ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థకు ప్రతిష్ఠాత్మక పురస్కారం వరించింది. అశోక్ లేలాండ్, అభి బస్ సాఫ్ట్‌వేర్ లిమిటెడ్ సంయుక్తంగా నిర్వహించిన పోటీలో అత్యుత్తమ సమాచార,సాంకేతిక విధానాలు (ఐటీ ఇనీషియేటివ్స్) అమలు చేస్తున్నందుకు గాను ఏపీఎస్ ఆర్టీసీకి ఈ

పురస్కారం లభించింది. దేశంలోని రోడ్డు రవాణా సంస్థలు ప్రతిష్ఠాత్మకంగా భావించే పురస్కారాలలో ఇదొకటి. గోవాలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జయరావు అందుకున్నారు.

రూ.10 కోట్లతో రహదారి భద్రత నిధి

- నవ్యాంధ్రప్రదేశ్ రహదారి భద్రతానిధికి తొలి విడత కింద పది కోట్ల రూపాయలు కేటాయిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రమాదాలను నియంత్రించి, రహదారుల భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ఈ నిధులు సద్వినియోగం చేయనున్నారు. ఇందుకు సంబంధించి రవాణాశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి బి శ్యాంబాబ్ మార్గదర్శకాలను జారీచేశారు.

తిరుపతి, విశాఖలో స్పోర్ట్సు కాంప్లెక్సులు

- నవ్యాంధ్ర యువతలో క్రీడా స్ఫూర్తిని మరింత ప్రోత్సహించాలన్న ధ్యేయంతో తిరుపతి, విశాఖపట్నం నగరాలలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్సు కాంప్లెక్సులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో తిరుపతి కాంప్లెక్సు నిర్మాణానికి బిడ్స్ కూడ పిలవగా, విశాఖపట్నంలో ప్రభుత్వమే ఈ కాంప్లెక్స్‌ను నిర్మించనున్నది. అంతేగాక ప్రతి జిల్లా కేంద్రంలోనూ చిన్న తరహా స్పోర్ట్సు కాంప్లెక్సులను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పెట్టుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలోని అన్ని రంగాలలోను మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న విషయం తెలిసిందే. ఇందుకోసం మౌలిక సదుపాయాల కల్పనా సంస్థను కూడ ఏర్పాటు చేశారు.

మహిళా కమిషన్‌కు సభ్యుల నియామకం

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్‌లో ఆరుగురు సభ్యులను నామినేట్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సభ్యులుగా నియమితులైన వారిలో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన సిరినీడి రాజ్యలక్ష్మి, నెల్లూరుకు చెందిన తాళ్లపాక అనూరాధ, ప్రకాశం జిల్లా నుంచి తమ్మిశెట్టి రమాదేవి, విజయనగరంజిల్లా నుంచి కొయ్యాన శ్రీవాణి, విశాఖపట్నం జిల్లా నుంచి ఎం మణికుమారి, అనంతపురం నుంచి ఎన్ ప్రవీణ్‌భాను ఉన్నారు. వీరు తమ బాధ్యతలు స్వీకరించిననాటి నుంచి ఐదేళ్లపాటు తమ పదవుల్లో కొనసాగుతారు. మహిళా కమిషన్‌కు ఛైర్‌పర్సన్‌గా సీనియర్ నేత నన్నపనేని రాజకుమారి గతంలోనే నియామకమైన విషయం తెలిసిందే.

పారిశ్రామిక వాడలను ఆధునీకరించాలి

- రాష్ట్రంలో ఉండే పారిశ్రామికవాడలన్నీ ఆధునీకరించనున్నట్లు ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ ఛైర్మన్ పి కృష్ణయ్య తెలిపారు. పారిశ్రామిక పార్కులన్నింటినీ ఆదర్శ పార్కులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 50ఎకరాల విస్తీర్ణం లోపు ఉండే పరిశ్రమలను గుర్తించి, అక్కడ రహదారులు, డ్రైయిన్ల సమస్యలను శాశ్వత ప్రాతిపదికపై పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కృష్ణయ్య వెల్లడించారు. ఎంఎస్ఎంఇ పథకం కింద నిధులు సమకూర్చేందుకు వీలుగా ప్రాజెక్టు నివేదికను త్వరితగతిలో రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

ఏపీ అభివృద్ధిపట్ల చైనా ఆసక్తి

- నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధిపట్ల చైనా దేశం ఆసక్తి చూపుతోంది. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు పి అశోక్‌గజపతిరాజు, సుజనాచౌదరిలతో చైనా దేశానికి చెందిన చైనా రైల్వే కనస్ట్రక్షన్ కార్పొరేషన్ లిమిటెడ్ (సీఆర్‌సీసీ) ప్రతినిధులు ఇటీవల ఢిల్లీలో భేటీ అయ్యారు. మంత్రులను కలిసిన వారిలో ఆ సంస్థ ముఖ్యఆర్థికవేత్త జావో జున్హు ఉన్నారు. ఏపీలోని అన్ని ప్రాంతాలకు తాగునీటితో పాటు వ్యవసాయం, పరిశ్రమలకు, జలరవాణా, రిజర్వాయర్లకు నీటి కొరత లేకుండా చూడటం, కరవు పరిస్థితులు ఎదుర్కొనేందుకు జలాశయాల సంరక్షణ తదితర అంశాలపై వారి మధ్య చర్చ జరిగింది. రాజధాని ప్రాంతంలో పరిశ్రమలు, సంస్థలు, నివాసప్రాంతాలకు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేయడంతోపాటు విశాఖపట్నం నుంచి ఏపీ రాజధాని అమరావతి, అలాగే అమరావతి నుంచి తిరుపతి నగరాలకు హైస్పీడ్ రైలు కారిడార్ ఏర్పాటుకు సంబంధించిన అవకాశాలపై చర్చించారు. నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని తమకున్నదని ఈ సందర్భంగా చైనా ప్రతినిధిబృందం తెలిపింది. ఇందుకు సంబంధించి త్వరలోనే తగిన మార్గసూచీతో వస్తామని ఆ బృందం కేంద్రమంత్రులు అశోక్‌గజపతిరాజు, సుజనాచౌదరిలకు హామీ ఇచ్చింది.

క్షిపణులు, ఆయుధాల అధిపతిగా తెలుగోడు

- రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) లోని కీలక పదవిలో తెలుగు వ్యక్తి నియమితులయ్యారు. ఆయుధ వ్యవస్థలకు కీలకమైన నేవిగేషన్ రంగంలో దేశం స్వయం సమృద్ధి సాధించడంలో ప్రధాన పాత్ర పోషించిన డాక్టర్ జి.సతీశ్ రెడ్డి.. క్షిపణులు, వ్యూహాత్మక వ్యవస్థల (మిసైల్స్ అండ్ స్ట్రాటిజిక్ సిస్టమ్స్ -ఎంఎస్ఎస్)కు డైరెక్టర్ జనరల్‌గా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఈ పదవిలో ఉన్న సతీశ్ కుమార్ పదవీ విరమణ చెందారు. సతీశ్‌రెడ్డి ప్రస్తుతం రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారుగా ఉన్నారు. దీనికి అదనంగా క్షిపణులు, వ్యూహాత్మక వ్యవస్థల విభాగానికి నాయకత్వం వహిస్తారు.

చేనేతకు పెరిగిన కేటాయింపులు

- ఆంధ్రప్రదేశ్‌లో 2016-17 సంవత్సరానికిగాను చేనేత, జౌళి శాఖకు సంబంధించిన వివిధ పథకాలకు బడ్జెట్ కేటాయించారు. గతేడాదితో పోలిస్తే అన్ని పథకాలకు నిధులు పెరిగాయి. దీంతో చేనేత రంగ అభివృద్ధి పుంజుకోనుంది. చేనేత శిక్షణ కార్యక్రమాలకు గతేడాది కంటే రూ.138 లక్షలు ఎక్కువగా కేటాయించారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజితమైన సమగ్ర చేనేత క్లస్టర్ అభివృద్ధి పథకం కింద గతంలో రూ.13.10 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో రాష్ట్రంలోని 34 చేనేత క్లస్టర్లకు మార్కెటింగ్, సాంకేతికత, మౌలిక సదుపాయాలు తదితర అంశాల్లో ఆర్థిక చేయూత అందించనున్నారు. చేనేత వస్త్ర ప్రదర్శనలు తదితర 29 కార్యక్రమాల నిర్వహణ కోసం కేంద్ర చేనేత అభివృద్ధి కమిషనర్‌కు రాష్ట్ర అధికారులు ప్రతిపాదనలు పంపించారు.

ప్రతి జిల్లాకు పది డయాలసిస్ యంత్రాలు

- తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ (స్విమ్స్) లో ఇప్పుడున్న 30 డయాలసిస్ యంత్రాలకు అదనంగా 100 యంత్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వైద్యఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ రుయా ఆస్పత్రిలో మరో పది డయాలసిస్ యంత్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో ఒక్కో జిల్లాకు పది చొప్పున డయాలసిస్ యంత్రాలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్యకళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు రూ.20 వేల విలువైన ట్యాబ్‌లను ఉచితంగా అందించనున్నామని చెప్పారు. తిరుపతి శ్రీ పద్మావతి వైద్య కళాశాలకు చెందిన 450 మంది విద్యార్థులు అవయవదానానికి ముందుకొచ్చారు. మంత్రి సమక్షంలో అంగీకారపత్రాలు అందజేశారు.

తొలగిపోతున్న తెలుగు పదాలు

అంటు పేలు

తలలోని పేల గుడ్లను ఈరు లేక ఈపి అంటారు. ఈళ్ళు అనేది దానికి బహువచనం. జుట్టు నుంచి ఈళ్ళను లేక ఈపులను తొలగించడానికి ఈరుపెన లేక ఈర్పెన అనే ప్రత్యేకమైన దువ్వెన వాడతాం. గుడ్లనుంచి ఉత్పత్తి అయిన పేలు తొలిదశలో చర్మానికి అంటుకుని ఉండడం కారణంగా వీటిని అంటు పేలు అంటారు. వీటినే అంట్లు అనికూడా అంటారు.వీటిని తలలోనే పొడుస్తారు. అంటే కుక్కి చంపుతారు. గోరుముక్కులతో(వాడియైన కొనగోళ్ళతో) దిగదువ్వి (జుట్టును కిందికి దువ్వి) బయటకు తీసి చంపుతారు. ఇంకా తూరుపెత్తి (తూరుపెత్తడం అంటే వెంట్రుకలు పాయతీసి అడ్డంగా ఎత్తి పట్టుకోవడం. ఇలా తూరుపెత్తినప్పుడు అవటువు లేక ముచ్చిలిగుంటలోని వెంట్రుకలలో దాగివున్న పేలను సులభంగా దువ్వి తీయవచ్చు. తెనాలి రామకృష్ణకవి 'పాండురంగ మాహాత్మ్యము' కావ్యంలోని నిగమశర్మోపాఖ్యానంలో నిగమశర్మ అక్క నిగమశర్మ తలలోని పేలను ఎలా తీసి, కుక్కిందో వివరించే చక్కటి పద్యం ఉంది.

తే. ఎలయు సీత్కారములతోడ నీళ్ళు గ్రుక్కి,
యంటునంటులు పరికించి యంట్ల పొడిచి,
గోరుముక్కుల దిగదువ్వి తూరుపెత్తి, నెరుల కలిగిన



పేల నన్నింటి తిగిచి. (పాం. మా. 3– 30)

అంతశయ్య

చావును అంతశయ్య అంటారు. చనిపోయిన వ్యక్తిని అంత్యక్రియలకు ముందు నేలమీద పడుకోబెడతారు. కనుక భూశయ్యను కూడా అంతశయ్య అంటారు. మరణానంతరం అందరం దీర్ఘనిద్ర పోయేది



శ్మశానంలోనే ! అందుకే శ్మశానాన్ని కూడా అంతశయ్య అనే అంటారు.

అంధువు

అంధువు అంటే 'కూపము', 'బావి' అని అర్థం.

అంపకాడు

అంపకాడు(అమ్ము+కాడు) అంటే విలుకాడు.విల్లుతో అమ్ములు(బాణములు) వేసేవాడు. ఇతడినే



ధనుర్ధరుడు, ధానుష్కుడు అని కూడా అంటారు. ధనుర్ధరుడు వేసే బాణాలను ఆంపకోలలు (అమ్ము+ కోలలు) అని కూడా అంటారు. బాణం సూటిగా లక్ష్యం దిశగా దూసుకుపోవడం కోసం దాని గరిమనాభిని సరిచూసి, అవసరమైతే దాని చివర రెండు మూడు ఈకలను కడతారు. ఈ ఈకలను అంప గరి (బాణం యొక్క గరి) అంటారు. షటిల్ బాడ్మింటన్ ఆటలో ఉపయోగించే షటిల్ కాక్ తయారీలోనూ అంపగరి వంటి ఏర్పాటే మనం గమనించవచ్చు. అదే బంతి లక్ష్యం వైపుకు సూటిగా దూసుకుపోవడంలో సహకరిస్తుంది. అంపర (అమ్ము+పర) అంటే శర సమూహము. విలుకాడు వదిలే శర పరంపరకు రగిలే చిచ్చు లేక బాణాగ్నిని 'అంపర చిచ్చు' అంటాం.

అంపియ

అంపియ అంటే చింపి గుడ్డ. అంపె అన్నా అంపియ అన్నా ఒకటే. అంపియలు లేక అంపెలు అంటే rags, tatters– చింకిపాతలు. సంస్కృతంలో చింకి పాతను 'పటచ్చరమ్' అంటారు. 'అంపెలు గట్టి చేతనొక యష్టి ధరించి' అన్న ప్రయోగం కొండమీది గోపురాజు రాసిన 'విక్రమార్క చరిత్ర' అనే నామాంతరం కల ' ద్వాత్రింశత్సాలభంజికల కథలు' లో(10–72) చేయబడింది. యష్టి అనేది ఒక ఆయుధం.

అంపాచారము

అంపాచారము అంటే జలప్రవాహం. ప్రస్తుతం ఈ పదం వాడుకలో లేదు. వెన్నెలకంటి సూరన్న రాసిన 'విష్ణు పురాణం' లోని ఏడవ ఆశ్వాసంలోని ఈ కింది చక్కటి కంద పద్యంలో కవి వర్ష ఋతువును వర్ణించే సందర్భంగా 'అంపాచారము' అనే పదాన్ని ప్రయోగించాడు. చూడండి.

క. సంపాదిత శంపావలి, బెంపారిన మేఘ చయము పృథివియునభముం, గంపింపగ బెట్టురుముచు, నంపాచారంపువాన లప్పుడుకురిసెన్. శంప అంటే మెరపు. వలి అంటే వళి, వరుస. మెరుపులు ఒకదాని వెంట మరొకటి వరుసగా వస్తున్నాయట.మేఘ చయము అంటే మేఘముల సమూహము పెంపారి (గొప్పదై) భూమ్యాకాశాలు కంపించేటట్లు ; బెట్టురుముచున్ (ఉద్ధతితో ఉరుముతూ ఉండగా), అప్పుడు అంపాచారంపువానలు (జలప్రవాహాలను సృష్టించే జడివానలు) కురిశాయట.

అంబటి జోరిగాడు లేక అంబలి జోరిగాడు

ఇదొక పక్షి. దీనిని జోరిగాడు అనికూడా అంటారు. దీనిని ఆంగ్లంలో 'rufous-tailed finch lark' అంటారు. దీని తోక ఈకలు ఎర్రగా ఉండే కారణంగా దీనికి ఆ పేరు. Alaudidae కుటుంబానికి చెందిన ఈ పక్షి శాస్త్రీయ నామం Ammomanes phoenicura.



– ముత్తేవి రవీంద్రనాథ్



దొరలను శాసించిన తెలుగువాడు గూటాల

డాక్టర్ గూటాల కృష్ణమూర్తి అయిదు దశాబ్దాలకు పైబడి లండన్‌లో స్థిరపడి ఆంధ్రాంగ్ల సాహిత్యాలకు వెలలేని సేవలు అందించారు. 1928 జూలై 10వ తేదీన పర్లాకిమిడిలో జన్మించారు. హైస్కూల్ చదువు విజయనగరంలో కొనసాగింది. విశాఖపట్నం ఏవిఎన్ కాలేజీలో, ఆంధ్ర విశ్వ విద్యాలయంలో ఉన్నత విద్య పూర్తిచేశారు. ఇంగ్లీషు ఆనర్స్ చేసిన గూటాల అమలాపురంలో కొంతకాలం, బిలాస్‌పూర్‌లో మరి కొంతకాలం ఆంగ్లోపన్యాసకునిగా పనిచేశారు. విద్యార్థి దశలోనే లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్‌కి ఆప్తులైనారు. ప్రసిద్ధ ఆంగ్ల రచయిత ఫ్రాన్సిస్ థాంప్సన్‌పై సమగ్ర పరిశోధన చేసి సాగర్ యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. 1967లో టైమ్స్ పత్రికా కార్యాలయంలో చిన్న ఉద్యోగం రావడంతో కృష్ణమూర్తి లండన్ చేరారు. అప్పటి నుంచి ఆయన అక్కడే నిర్విరామ పరిశోధనతో, తెలుగు సాహిత్య సేవతో కాలం గడిపారు. తన 88వ ఏట పెద్దతనం కారణంగా స్వదేశానికి తిరిగి వచ్చారు. మొన్న జూలై 13న డా. గూటాల కృష్ణమూర్తి విశాఖపట్నంలో తుదిశ్వాస వదిలారు.

విక్టోరియన్ పీరియడ్‌గా వాసికెక్కిన 1890 దశకానికి చాలా విశిష్టత ఉంది. ఆ దశకంలో ఆంగ్ల సాహిత్యంలో అద్భుతాలు జరిగాయి. ఇంప్రెషనిజం, సింబాలిజం, రియలిజం, డికడెన్స్ లాంటి రచనా రీతులు ఆంగ్ల సాహిత్యంలో వెలువడి, ప్రపంచ పాఠకులను ఎంతగానో అలరించాయి. అదే దశకంలో తెలుగు సాహిత్యంలో కూడా అద్భుతాలు జరిగాయి. గురజాడ కన్యాశుల్కం ఆ దశకంలోనే పుట్టింది. విశ్వనాథ, జాషువాలాంటి కవిశ్రేష్ఠులు ఆ దశకంలోనే జన్మించారు. బ్రిటన్‌లో నాటకరంగం కూడా ఈ దశకంలో కొత్తరూపుదాల్చింది. ఆస్కార్ వైల్డ్, టిఎస్ ఇలియట్ డేవిడ్‌సన్, బెర్నార్డ్ షా, సోమర్సెట్ మామ్ లాంటి ఎందరో ఈ దశకంలోనే తమ గొప్ప రచనలను వెలయించారు. డా. గూటాల ఫ్రాన్సిస్ థాంప్సన్ తీగెను లాగి, డొంకంతా కదిలించారు. ఈ ప్రత్యేకతలను, విశిష్టతలను, నూతన ఆవిష్కారాలను మన కృష్ణమూర్తి శోధించి, పరిశోధించి చెప్పేదాకా దొరలు పట్టించుకోలేదు. తరువాత డా. గూటాల కృష్ణమూర్తిని వారు గౌరవించారు, సొంతం చేసుకున్నారు.

'ఎయిటీన్ నైన్‌టీస్ సొసైటీ' పేరుతో ఒక సాహిత్య సంస్థను కృష్ణమూర్తి స్థాపించారు. ప్రపంచంలో ఆ దశకంలో వచ్చిన గొప్ప సాహిత్యాన్ని, దాని నిర్మాతలను ప్రోది చేయడం ఈ సొసైటీ లక్ష్యం. అన్ని వివరాలతో కూడిన పెద్ద కేటలాగును కృష్ణమూర్తి ప్రచురించారు. డా. గూటాల దేశాభిమాని. ఇంగ్లీషు మాట్లాడితే దొరలకు ధీటుగా మాట్లాడే వారు. తెలుగులోకి వస్తే అచ్చమైన విజయనగరం యాస తొణికిసలాడేది. అసలు సిసలు గాంధేయవాది. రాట్నం మీద నూలు వడికేవారు. అది తనకు గొప్ప మానసిక విశ్రాంతినిస్తుందనే వారు. అర్ధశతాబ్ది పైగా లండన్‌లో వుంటున్నా దేశాన్ని, రాష్ట్రాన్ని విస్మరించలేదు. ఆయన మంచి అతిథేయుడు. ఇండియా నుంచి, మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు నుంచి వెళ్లే చాలా మందికి గూటాల కృష్ణమూర్తి చక్కని ఆతిథ్యం ఇచ్చేవారు. బాపు నాలుగైదుసార్లు లండన్ వెళ్లారు. అన్నిసార్లూ వారింటనే దిగారు. బాపు ఆర్ట్ ఎగ్జిబిషన్ లండన్‌లో ఏర్పాటు చేయించారు. లండన్ యాత్రని సద్వినియోగం చేసుకున్న వారు ఒక ఆరుద్ర మాత్రమే. ఆయన రోజంతా మ్యూజియంలకి, లైబ్రరీలకు తిరిగే వారు. బోలెడు భోగట్టా, వందల పేజీల నోట్సులు తయారు చేసుకున్నారు. నాకు వివరంగా చెప్పేవారు, దానివల్ల నాకెన్నో విషయాలు తెలిశాయి.

విదేశాంధ్ర ప్రచురణలు ప్రారంభించి పురిపండా అప్పలస్వామి పులిపంజా అచ్చు వేశారు. ఆ తరువాత శ్రీశ్రీ మహాప్రస్థానం ఫాక్సిమిల్ ఎడిషన్ వేశారు. శ్రీశ్రీ దస్తూరితో బాపు బొమ్మలతో మంచి ఆర్ట్ పేపర్ మీద అచ్చువేశారు. మహాప్రస్థానం కవితల్ని చదవగా రికార్డ్‌చేసి ఆడియో క్యాసెట్లు తయారు చేయించారు. రెంటినీ అందమైన అట్టపెట్టెలో సిద్ధంచేశారు. ప్రతి కాపీకి వరుస నెంబరు ఇచ్చారు. శ్రీశ్రీ, బాపుల ఆటోగ్రాఫ్‌లున్నాయి. దీని ఖరీదు 750 రూపాయలు పెట్టారు. మొత్తం 500 కాపీలు వేశారు. ఎవరూ అంతగా ఎగబడి కొనలేదు. కొందరు ధర ఎక్కువన్నారు. కొందరు డిస్కౌంట్లు అడిగారు. ఆ అపురూపమైన లండన్ ఎడిషన్ మన విశ్వ విద్యాలయ లైబ్రరీలలో సైతం వుండి వుండదు. సంప్రదిస్తే ఆరోజుల్లో యూనివర్శిటీ అధికారులు, కనీసం 15 శాతం డిస్కౌంట్ ఇస్తే తప్ప ఏ పుస్తకమైనా కొనజాలమని చెప్పేశారు. కృష్ణమూర్తి నవ్వుతూ, 'ఫర్వాలేదు. డిస్కౌంట్ ఇవ్వడం మాత్రం కుదరదు. ఎందుకంటే ఇది శ్రీశ్రీ గారి మహాప్రస్థానం కదా. ఆయన గౌంతక కూడా ఉంది కదా. కావలిస్తే ఉచితంగా తీసుకోండి. దానికి నాకేమీ అభ్యంతరం లేదన్నారు. తెలుగు బుక్‌షాపులు కూడా 33% ట్రేడ్ డిస్కౌంట్ అడిగారు. గూటాల కృష్ణమూర్తి చాలా నిరాశపడ్డారు. ఏదో సొమ్ము చేసుకోవాలని కాదు ఆయన ప్రచురించింది. మహాప్రస్థానాన్ని తెలుగు ప్రజ పక్షాన గౌరవించాలని ఆయన సంకల్పించారు. ఇలా వికటించడంతో మాత్రమే నిరాశపడ్డారు.

ఆ ప్రాజెక్ట్‌కి ఎంత ఖర్చయిందో కృష్ణమూర్తి చెప్పారు. శ్రీశ్రీ, సరోజ శ్రీశ్రీ, పురిపండాలను లండన్ రప్పించారు. కొన్ని నెలలపాటు వారికి ఆతిథ్యం ఇచ్చారు.

మద్రాసులో రమణయ్య రాజాతో చాలా సన్నిహితంగా ఉండేవారు. విజయనగరం కనెక్షను. రాజాలక్ష్మి అవార్డు టంగుటూరి సూర్యకుమారికి ఇచ్చినపుడు ఆమెను వెంటపెట్టుకు వచ్చారు. డా॥ గూటాలకు సూర్యకుమారి అంటే చాలా ఇష్టం. ఆమెపై మంచి వ్యాసాలతో, అపురూపమైన ఫొటోలతో మూడు సంపుటాలు కృష్ణమూర్తి తీసుకువచ్చారు. సూర్యకుమారి పోయినపుడు అంత్యక్రియలు డా॥ గూటాల నిర్వహించారు.

డా॥ గూటాల కృష్ణమూర్తి పర్‌ఫెక్షనిస్టు. ఆయనతో చాలా కష్టం. మహాప్రస్థానం పుస్తకంలో చలం యోగ్యతా పత్రం లేదు. ఫాక్సిమెల్ అంటే దస్తూరీలతో మాత్రమే వుండాలి. చలం దస్తూరీ తెస్తే వేద్దాం అన్నారు. అక్కడి వారు కృష్ణమూర్తిని అభిమానించారు. ప్రేమించారు. ఎన్‌సైక్లోపీడియా కోసం డా॥ గూటాలతో రెండు వ్యాసాలు వ్రాయించారు. వాళ్లెవరినీ నమ్మి రాయించారు. మన కృష్ణమూర్తిని నమ్మారు. ఆ దేశ రాణిగారి నుంచి అతి సామాన్యుడి దాకా. వారితో నాకు పరిచయం వుండడం నా పూర్వజన్మ సుకృతం. వారికి అంజలి ఘటిస్తున్నాను.

– శ్రీరమణ

వెండితెరపై నిరుపమాన ఆంధ్రక్షాత్రం 'బొబ్బిలియుద్ధం'

మానవజాతి పురోగమనానికి అవరోధం యుద్ధం! తరతరాల మానవ చరిత్రను పరిశీలిస్తే ఆనాటి కురుక్షేత్ర సంగ్రామం నుంచి నిన్న మొన్నటి కార్గిల్ యుద్ధం వరకు సంభవించిన సకల సమరాలకు ప్రధాన కారణం, మనిషిలోని స్వార్థపరత్వమేనని విదితమౌతుంది. ఆంధ్రదేశంలో పల్నాటియుద్ధం అనంతరం, అంతటి ప్రాచుర్యాన్ని సంతరించుకున్న బొబ్బిలియుద్ధానికి కూడా మూలకారణం, మానవుని లోని స్వార్థకాంక్షే! బొబ్బిలియుద్ధానికి సంబంధించిన విషాదోదంతం ప్రప్రథమంగా రంగస్థలం మీద, ఆపై వెండితెర మీద ప్రేక్షక లోకానికి దర్శనమిచ్చింది. 1964 డిసెంబర్ 4వ తేదీన విడుదలైన 'బొబ్బిలియుద్ధం' చిత్రంపై ప్రత్యేక వ్యాసం.



భారతదేశం పరాధీనం కావడానికి 'విభజించి పాలించే' కుటిల దౌత్యనీతి కారణభూతం అని చరిత్రకారుల అభిప్రాయం. అనైక్యత, అంతఃకలహాలు, అభివృద్ధి పొందిన యుద్ధతంత్ర రీతుల్ని అలవర్చుకోవడంలో సంప్రదాయంగా వస్తున్న ఔదాసీన్యం ఇందుకు దోహదం చేసింది. బొబ్బిలి యుద్ధం (క్రీ.శ. 1757) నాటికి సుమారు 600 సంవత్సరాల క్రితం 'గన్‌పౌదరు'ను కనిపెట్టినప్పటికీ భారతదేశంలోని సంస్థానాధీశుల మధ్య యుగాల ఆయుధాలైన కత్తి, డాలు, ఏనుగులు, గుర్రాలు మొదలైన వాటిని పరిత్యజించలేదు.

ఆయుధాలు యుద్ధగతిని గణనీయంగా నిర్ణయిస్తాయి అనేది చారిత్రక సత్యం. అందుచేతే మన కోటల గోడలు 'తెల్లవాడి' ఫిరంగి కాల్పులకు బీటలువారి పేకమేడలుగా కూలిపోయాయి. తెలుగుజాతి చరిత్రలో శౌర్యగాథలకు కొదవలేదు. ఆంధ్రక్షాత్రం నిరుపమానమైంది. ఆవేశం ఆయుధంగా, ఆత్మాభిమానం కవచంగా, అధర్మం, అన్యాయం, కౌటిల్యంతో స్వేచ్ఛను హరించడానికి దండెత్తివచ్చిన ప్రతీప శక్తులకు తలవంచక మొక్కవోని ధైర్యంతో తుది రక్తపుబొట్టు చిందే పర్యంతం సమర రంగంలో వీరోచితంగా పోరాడిన బొబ్బిలి వీరులగాథ ఆనాటి నుండి ఈనాటి వరకు ప్రజాహృదిని ఉద్రూతలూగిస్తూనే ఉంది. కళింగసీమలో విజయనగర సంస్థానానికి ఎంతో ప్రముఖ స్థానముంది. 'విద్యల నగరం'గా ప్రాచుర్యం సంతరించుకున్న ఈ సంస్థానం, నృత్య, సంగీత, సాహత్యాది పలు కళలకు ఆటపట్టుగా అలరారింది. అయితే, ఇంత ఘనకీర్తిని సాధించిన విజయనగరానికి, పున్నమి చంద్రునికి కళంకం వలే చరిత్రపుటల్లో నిక్షిప్తమైన బొబ్బిలియుద్ధం కారణంగా మాయని మచ్చ ఏర్పడింది.

ఈ చారిత్రక గాథను ఇతివృత్తంగా తీసుకుని జానపదుల్లో జంగం వాళ్లు 'బొబ్బిలిపాట' అని పాడటం చిరకాలంగా ఉంది. దీన్ని శ్రీపాద కృష్ణమూర్తి 1908లోనూ, వేదం వేంకటరాయశాస్త్రి 1916లోనూ నాటకాలుగా రాశారు.

ఈ చారిత్రక గాథనే 1964లో రిపబ్లిక్ ప్రొడక్షన్స్ అధినేత చోడవరపు సీతారాం చలనచిత్రంగా రూపొందించి తన పేరును సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలబెట్టుకున్నారు.

సంక్షిప్త చిత్రకథ

బొబ్బిలి సంస్థానాధీశుడు రంగరాయుని పుత్రుడైన చిన వెంకటరాయుని జన్మదినోత్సవం

సందర్భంలో క్రీడోత్సవాలు జరుగుతాయి. విజయనగరాధీశుడు విజయ రామరాజు ప్రధాన అతిథిగా వస్తారు. ఈర్ష్య మానవుని పతనానికి దారితీస్తుంది. ఆ క్రీడల పోటీల్లో విజయనగరం వారు ఓడిపోవడంతో విజయ రామరాజు కీర్తి ప్రతిష్ఠలకు ముప్పు వాటిల్లిందని పొరబడి బొబ్బిలి వారిపై పగ సాధించాలని, అవకాశాల కోసం అన్వేషిస్తుంటాడు.

'బూచి'గా తెలుగు పసిపాపల్ని సైతం భయభ్రాంతుల్ని చేసిన బుస్సీ రాజమండ్రికి వచ్చి, విజయనగర రాజుల్ని కప్పం చెల్లించుకోవాల్సిందిగా తాఖీదు పంపుతాడు. ఇదే అదనుగా భావించి విజయరామరాజు బొబ్బిలి వారిపై పగ సాధించడానికి బుస్సీ సహాయ సంపత్తిని పొందాలని, తర్వాత వారిని మట్టుపెట్టాలని ఆలోచిస్తాడు. ఇదే వర్తమానం విజయనగర రాజు దూతల ద్వారా బొబ్బిలి వాళ్లకు తెలియచేస్తాడు. రంగరాయుని సోదరుడు వెంగళరాయుడు ఆ వర్తమానం తెచ్చిన హర్కారుల్ని పరాభవించి పంపుతాడు. ఈ విషయం తెలిసిన రంగారాయుడు తమ్ముని సున్నితంగా మందలిస్తాడు. తమ్ముని అసమయ ఆవేశాన్ని గురించి ఆలోచిస్తున్న రంగారాయునికి, ఆయన భార్య మల్లమదేవి, వెంగళరాయునికి, బొబ్బిలిపులి తాండ్ర పాపారాయుని చెల్లెలు సుభద్రతో వివాహం జరిపించమని సలహా ఇస్తుంది. ఆ ప్రకారమే వారిరువురి వివాహం జరుగుతుంది.

బొబ్బిలికి వచ్చిన విజయనగర గూఢచారి పాపారాయుని చేజిక్కి విజయ రామరాజు కుట్రను బయట పెట్టడంతో మార్గమధ్యంలో శత్రు సైన్యాల్ని అటకాయించడానికి పాపారాయుడు రాజాం కోటకు వెళతాడు.

ఇరుపక్షాలకు యుద్ధం అనివార్యం అనే అభిప్రాయం కలిగినప్పటికీ, దాన్ని నివారించడానికి రంగారాయుడు బందరులో మకాం ఉన్న బుస్సీ స్నేహితుడు, ఫ్రెంచ్ అధికారి వద్దకు కబురు పంపుతాడు. అయినా బుస్సీ మనసు మార్చుకోలేదు. అన్ని రాజీ ప్రయత్నాలు విఫలం కాగా బుస్సీ వద్దకే రాయబారం పంపుతాడు రంగారాయుడు. చివరికి అది కూడా విఫలమౌతుంది. ఇక మిగిలింది యుద్ధం. 250 మంది ఉన్న బొబ్బిలి కోటను బుస్సీ యుద్ధ వ్యూహరచనతో ముట్టడిస్తాడు ఒకనాటి నిశిరేయి. కోటలో ప్రవేశించడానికి వేసిన ఎత్తుగడలు సాగనందున బుస్సీ సైన్యం చివరకు ఫిరంగి కాల్పులతో కోటగోడల్ని పగలగొడతారు. అప్పటికే వెంగళరాయుడు శత్రుసైన్యంతో పోరాడి అసువులు కోల్పోతాడు. కాళ్లపారాణి ఆరకముందే భర్త మృతదేహాన్ని చూసి వివాహబంధం 'ప్రాణానుబంధం'గా భావించి సుభద్ర ఆత్మార్పణ గావిస్తుంది. సైన్యాధిపత్యం రంగారాయుడు స్వీకరిస్తాడు. బొబ్బిలికి అంత్యక్షణాలు సమీపించాయని గ్రహించిన మల్లమదేవి బొబ్బిలి వంశాంకురాన్నయినా పరిరక్షించాలని చినవెంకటరాయుని మారువేషంతో దాసి వెంకటలక్ష్మితో సామర్లకోటలో ఉన్న తన చెల్లెలు జగ్గయ్యదేవికి అప్పగించమని కోట దాటిస్తుంది. అయితే వాళ్లు బుస్సీ చేజిక్కి మాయోపాయంతో తప్పించుకుంటారు.

బొబ్బిలికోట నుంచి ఎలాంటి వర్తమానం రాకపోవడంతో రాజాం కోటలో శత్రువుల కోసం ఎదురుచూస్తున్న తాండ్ర పాపారాయుడు స్వయంగా బొబ్బిలి పయనమై వెళ్తాడు. దారిలో శత్రువులు గాయపర్చగా కొనవూపిరితో ఉన్న దాసి వెంకటలక్ష్మి పాపారాయుడికి బొబ్బిలి దుస్థితి తెలిపి కన్ను మూస్తుంది. అప్పటికే బొబ్బిలి వీరులంతా నేలకొరిగిపోయారు. బొబ్బిలికోటలోని స్త్రీలంతా చిచ్చులో ఉరికారు. ఆవేదనావేశాలతో వచ్చిన పాపారాయుడికి రంగారాయ, మల్లమాంబల మృతదేహాలు కన్పిస్తాయి. దీంతో బొబ్బిలి బెబ్బులి తాండ్రపాపయ ఉగ్రరూపం దాల్చుతాడు. మహాభారతం, సౌప్తిక పర్వంలో అశ్వత్థామ లాగా, విజయ రామరాజు గుడారంలోకి అర్ధరాత్రి ప్రవేశించి అతడ్ని చిత్రవధ చేస్తాడు. తనను బందీగా పట్టుకోవడానికి ససైన్యంగా వచ్చిన బుస్సీకి చేజిక్కడం వీరుని లక్షణం కాదని, ఆత్మార్పణ గావిస్తాడు. బొబ్బిలి, విజయనగర యువరాజులిద్దరి చేతులు కలిపి ఆత్మహత్య సదృశమైన విద్వేషాల్ని విస్మరించి, పరస్పర సహకారం నెరపుకొని శాంతితో వర్ధిల్లమని దీవిస్తూ విజయనగర రాణి చంద్రయ్యమ్మ కత్తితో పొడుచుకుని ప్రాణత్యాగం చేస్తుంది.

సమకాలీన సాంఘిక చిత్రాలు నిర్మించడం సులభం. చరిత్రకు సంబంధించిన ప్రధాన ఘట్టాల్ని ప్రేక్షకుల మనోఫలకంపై చిత్రీకరించి 'ఇది మన వారసత్వం' అని దేశభక్తి ప్రపూరిత, ఉత్సాహ ఉద్వేగాలతో పరవళ్లుతొక్కించడం కష్టం. అయినా ఈ చారిత్రాత్మక చిత్రం ఈ విషయం ఆశించిన దానికన్నా మంచి విజయపతాక ఎగరేసింది.

తెరవెనకా యుద్ధమే నడిచింది

విజయనగరంలో సుమారు పదేళ్లపాటు పువ్వాడ మిల్స్‌లో మేనేజర్‌గా పనిచేసిన సీతారాం, ఆ తర్వాత చెన్నై వచ్చి పూర్ణా పిక్చర్స్‌లో మేనేజర్‌గా పనిచేశాడు. ఆ సమయంలో కొంత మంది మిత్రుల ప్రోత్సాహంతో సొంతంగా రిపబ్లిక్ ప్రొడక్షన్స్ స్థాపించి అక్కినేని ,అంజలీదేవిలతో 'పెళ్లిసందడి' నిర్మించి అభిరుచి గల నిర్మాతగా పేరు సంపాదించాడు. దీని తర్వాత 'సత్యం శివం సుందరం' అనే సినిమా తీయాలని ఆరుద్రతో మొత్తం స్క్రిప్ట్ తయారు చేయించాడు. సంగీత దర్శకుడు రమేష్‌నాయుడుతో రెండు సిటింగ్స్‌లో ఆరు పాటలు కూడా రికార్డ్ అయ్యాయి. ఈ చిత్రానికి డిజైన్స్‌ను ప్రముఖ చిత్రకారుడు బాపు తయారు చేశాడు. ఈలోపు సినీ జర్నలిస్టు కాగడా శర్మ ఓరోజు ఆఫీసుకొచ్చి 'బొబ్బిలియుద్ధం' నిర్మించమని సీతారాంకు సలహా ఇచ్చాడు. దీంతో సీతారాం ఆ సబ్జెక్టునే తీయాలని తీర్మానించుకుని గబ్బిట వెంకటరావుతో కథ సిద్ధం చేసుకున్నాడు. దాన్ని సీ॥ సముద్రాల పర్యవేక్షించాడు. చిత్ర నిర్మాణం ప్రారంభమైందని ఫీల్డ్‌లో టాక్ వచ్చేసింది.

రంగారాయుడి పాత్రను మొదట ఎన్.టి. రామారావు ఒప్పుకోలేదు. తర్వాత ఒప్పుకున్నారు. మల్లమ్మదేవి పాత్రనూ పి.భానుమతి పారితోషికం దగ్గర తేడావచ్చి మొదట ఒప్పుకోలేదు. సావిత్రిని సంప్రదిస్తే ఆమె మొదట చేస్తానంది. ఆ సమయంలో ఆమె 'పాండవ వనవాసం'కు కమిట్ అయి ఉంది. అయినా ఆమె అంగీకరించింది. అయితే ఎన్‌టి రామారావు తేదీలకు, ఆమె తేదీలకు కుదరలేదు. దాంతో దేవికకు 5,000 రూపాయలు అడ్వాన్స్ ఇచ్చి బుక్ చేసుకున్నారు. ఇంతలో భానుమతే సీతారామ్‌కు ఫోన్‌చేసి 'ఆ పాత్ర నాకు నచ్చింది. పారితోషికం దగ్గర పేచీ ఎందుకని తానే రాజీపడుతున్నానని' చెప్పింది. అలా భానుమతే మల్లమ్మ పాత్రకు నిర్ధారణ అయింది. ఇది తెలిసి ఇచ్చిన పైకం తిరిగి తీసుకోవడం ఎలా అని నిర్మాత సందేహపడకుండా దేవిక ఎంతో హుందాగా

తాను తీసుకున్న అడ్వాన్స్ తిప్పి పంపేసింది.

సుభద్ర పాత్రకు మొదట కృష్ణకుమారిని అనుకున్నారు. ఆమె తమ్ముడు రఘు, సీతారాం అబ్బాయి ప్రభు ఇద్దరూ చాలా మంచి స్నేహితులు. దీంతో ఆమెను తీసుకోవాలనుకున్నారు. ఆమెకూ ఇష్టమే. కానీ ఒక హీరో మాటలు విని ఆమె తప్పుకుంది. ఎందుకని కారణం అడిగితే రఘు 'ఇప్పుడు మా సిస్టర్ కొత్తవాళ్లతో (ఈ చిత్రంలో వెంగళరావు పాత్ర సీతారాం పోషించాడు) చేయడం కరెక్ట్ కాదని' చెప్పేశాడు. అయితే అంతకు ముందే ఆమె 'కులదైవం'లో కొత్త హీరోతో చేసింది. పరిశ్రమలో గమ్మత్తులిలాగే ఉంటాయి మరి. అప్పుడు జమునను తీసుకున్నారు.

వెంగళరాయుని పాత్ర 'పల్నాటియుద్ధం'లో బాలచంద్రుడులాంటిది. అందుచేత అక్కినేని నాగేశ్వరరావు ఆ పాత్ర తాను వేస్తానని ముందుకొచ్చారు. కానీ సీతారాం గారికి తానే హీరో వేషం వేయాలని మనసులో ఉండడంతో అది ఫలించలేదు. విజయరామరాజు పాత్రకు మొదట గుమ్మడిని అనుకున్నారు. ఆయనేమో ఇప్పటికే 'వాగ్దానం'లో విలన్‌గా చేస్తే, జనం తిట్టిపోశారు. అందువల్ల నెగటివ్ క్యారెక్టర్ చేయనన్నాడు. గబ్బిట వెంకటరావు జగ్గయ్యను పెట్టుకోమన్నారు. అసలు ఆయన స్క్రిప్ట్ రాసేటప్పుడే విజయ రామరాజుగా జగ్గయ్యనే గుర్తులో పెట్టుకుని రాశాడట. ఆయన మాట మేరకు జగ్గయ్యను తీసుకున్నారు. చిత్ర ప్రారంభంలో వచ్చే క్రీడోత్సవాలు జగ్గయ్యతోనే తీశారు. మరుసటి రోజు ఆయన షూటింగ్‌కు రాలేదు. ఆయన ఎక్కడో మహాబలిపురంలో కె.బి. తిలక్ తీస్తున్న సినిమాతో బిజీగా ఉన్నాడు. ఇది తెలిసిన సీతారామ్ వెంటనే ఆ పాత్రకు రాజనాలను తీసుకున్నాడు. ఒక హీరోను, పిక్చర్లో నుండి అతని ప్రమేయం లేకుండా తొలగించడం బహుశా ఈ చిత్రంతోనే మొదలేమో! అయితే ఇక్కడొక చిక్కుంది. బుస్సీ పాత్ర మొదట రాజనాలది. ఆయనకేమో మనసులో విజయరామరాజు పాత్రే చేయాలని ఉంది. అయి-ష్టంగానే బుస్సీ ఒప్పుకున్నాడు. జగ్గయ్య తొలగింపుతో కాకతాళీయంగా రాజనాలకు తాను ఇష్టపడ్డ వేషమే దక్కింది. ఇక బుస్సీకి ఎవరిని తీసుకోవాలా? అని ఆలోచిస్తుంటే ఎన్.టి. రామారావే ముక్కామలను తీసుకోమన్నారు.

ఆయన సిఫారసుతోనే స్టంట్ మాస్టర్ సోమును తీసుకున్నారు. ఆయనది, ఎం.ఆర్. రాధ (నటి రాధిక తండ్రి)ది పక్కపక్క ఇళ్లు. సోమ సలహా మేరకు వెరైటీ కోసం ఎం.ఆర్. రాధాను హైదర్‌జంగ్ పాత్రకు తీసుకున్నారు.

ఈ చిత్రానికి సంగీత దర్శకునిగా మొదట మాస్టర్ వేణుని తీసుకున్నారు. అయితే సీతారామ్ గారి అబ్బాయి ప్రభు 'ఎన్.టి. రామారావు, భానుమతి 'మల్లీశ్వరి' తర్వాత చేస్తున్న భారీ చిత్రమిది. దీనికి సాలూరే కరెక్టు' అని తండ్రితో వాదించాడు. ఆయనేమో 'మన బడ్జెట్ చూసుకోవాలి కదా. పైగా ఆయనతో పని చేయించుకోవడం కష్టమని విన్నాను' అంటే ప్రభు 'సాలూరి గారి పెద్దబ్బాయి రామలింగేశ్వర రావు నా సహాధ్యాయి. అంచేత రాజేశ్వరరావుగారి విషయం నేను చూసుకుంటాన'న్నారు. అలా సాలూరి ఈ చిత్ర సంగీత దర్శకుడయ్యాడు. విజయ రామరాజు భార్య రాణీ చంద్రయ్యమ్మ పాత్ర పోషించింది మొదట జూ. శ్రీరంజని. కొంత షూటింగ్ కూడా జరిగింది. కానీ ఆమె బాగా జబ్బున పడిపోయింది. పరిస్థితి విషమంగా ఉందని కబురు రావడంతో పేకేటి సలహాపై జయంతిని తీసుకున్నారు.

ఇలా పాత్రధారుల ఎంపికలో పెద్దకసరత్తే జరిగిందీ చిత్రానికి. పాత్రల ఎంపిక ఒక ఎత్తయితే, సినిమా ప్రారంభమై షూటింగ్ జరుగుతుండగా నిర్మాత ఎదుర్కొన్న ఇబ్బందులు ఎన్నో. అదొక పెద్ద ప్రహసనమే!

ఎస్.వి. రంగారావు సెట్టు వేసుకోమనే వాడు. తర్వాత వచ్చేవాడు కాదు. ఎన్ని రోజులని వేచి చూడాలి. అలా కాదని ప్రొడక్షన్ మేనేజర్ మీసాల సూర్యనారాయణ సహకారంతో ఆయనను షూటింగ్‌కు రప్పించుకోవాల్సి వచ్చేది.

భానుమతి కాల్షీట్లు ఓ పట్టాన ఇచ్చేది కాదు. ఇచ్చినా షూటింగ్ భరణిలో పెట్టుకోమనేది. అలాగే పెట్టుకుంటే అక్కడ సాఫీగా ఉండేది కాదు. నసిగేది. పాటల రికార్డింగ్ సమయంలో థియేటర్‌లో బూత్‌లోనే పాడతాననేది. కాసేపయ్యాక 'మీరెవరూ కన్పించడం లేదు. రికార్డింగ్ బయట పెట్టండి' అని నిర్ణయం మార్చుకునేది. ఇక్కడ కాదు అక్కడ, అక్కడ కాదు ఇక్కడ అని విపరీతంగా కాలయాపన చేసేది. దీంతో భానుమతికి మొదట నాలుగు పాటలనుకున్నా సీతారాంకు విసుగొచ్చి పాటలు తగ్గించేశారు. అందువల్లే ఆమెకు రెండు పాటలే మిగిలిపోయాయి. ప్రతి మ్యూజిక్ సిటింగ్‌కు ఆమె వచ్చేది.

కమల్‌ఘోష్ కెమెరా. ఆయనతో ఏదైనా బేధాభిప్రాయం వస్తే జె.సత్యనారాయణ షూట్ చేసేవాడు. భానుమతేమో కమల్‌ఘోష్ లేకుంటే నేను పనిచేయనని మొరాయించేది. ఇలా సీతారామ్‌కు నిర్మాణం జరిగినన్నాళ్లు టెన్షనే. ఇది అర్థం చేసుకుని సహకరించిన ఆర్టిస్టులూ ఉన్నారు. ఎం.ఆర్. రాధా ఆరోజుల్లో కాల్షీట్లు గంటల్లో ఇచ్చేవాడు. ఇది కుదరదని చెబితే, రాత్రి పది గంటల నుండి రెండు గంటల వరకు కాల్షీట్లు వేసుకుని సహకరించాడు. ధర్మారాయుడి పాత్ర ధరించిన బాలయ్య కూడా నిర్మాతకు ఎంతో సహకరించాడు. ఆయనకీ చిత్రంలో పద్యం కూడా ఉండేది. నిడివి ఎక్కువైందని కట్ చేసేశారు.

ఈవిధంగా తానెన్ని బాధలుపడ్డా సినిమాను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది సీతారామ్ ప్రేక్షకులకు ఈ చిత్రాన్ని సిద్ధాన్నం లాగా సమర్పించాడు.

ఆద్యంతం ఆకట్టుకునే స్క్రీన్‌ప్లే

ఈ చిత్రానికి కథ స్క్రీన్‌ప్లే సీతారామ్. చిత్రరచన మాత్రం 'గబ్బిట వెంకట్రావు'. ఈయన పౌరాణిక నాటక రచనకు ఎంతో ప్రసిద్ధి పొందిన వ్యక్తి. అందువల్లే నిర్మాత రచనా బాధ్యతను ఆయనకు అప్పచెప్పాడు. ఆ మహత్తర బాధ్యతనేగాక, సంభాషణా రచన, పద్య రచన వంటి అదనపు బాధ్యతల్ని సైతం గబ్బిట తన భుజస్కంధాలపై వేసుకున్నాడు. భానుమతి సిఫారసుతో సీ. సముద్రాల రచనా పర్యవేక్షణ చేశాడు. ఇద్దరు సాహితీ దిగ్గజాలు, అభిరుచి గల దర్శక నిర్మాత ఆద్యంతం శ్రమించినందువల్లే. కళాత్మక మైన విలువలు గల స్క్రిప్ట్ రూపొందింది.

చిత్రారంభంలో ఒక వృద్ధ యాదవుడు (చిత్తూరు వి.నాగయ్య) హరినామస్మరణ చేస్తూ పాలు పితికే సన్నివేశముంది. ఆ వృద్ధుడు ఆ ప్రభాత గీతికలో బొబ్బిలి రాజవంశాన్ని కాపాడమని ఆ దేవదేవుడిని ప్రార్థిస్తాడు. ఆ తర్వాత ఎవరో వస్తే 'ఇవాళ కుమారరాజా వారి జన్మదినం. ఈ పాలు కోటలో ఇచ్చిరమ్మని' పంపుతాడు. ఆ వెంటనే వచ్చే సన్నివేశంలో చిన రాజాను చెంత నుంచుకొని తల్లి మల్లమ్మదేవి తమ కులదైవమైన



వేణుగోపాల స్వామిని ప్రార్థిస్తూ ఒక పాట పాడుతుంది. ఈ సన్నివేశ క్రమం లేదా సీనిక్ ఆర్డర్‌ను గమనించినప్పుడు స్క్రీన్‌ప్లేలో ఏకసూత్రత ఎంత అద్భుతంగా అమరిందో మనకు బాగా బోధపడుతుంది. బొబ్బిలి వంశస్థుల కులదైవమైన వేణుగోపాల స్వామి యదువంశ తిలకుడు అయినందువల్ల, యాదవ వృద్ధుని సూత్రధారిగా చిత్రంలో ప్రవేశ పెట్టడమూ, అతనిచేత కథా ప్రస్తావనను చేయించడమూ సముచితంగా ఉంది. ఇలాంటి ఏకసూత్రత ఈ చిత్రంలో ఆద్యంతం మనకి కన్పిస్తుంది. ఆడిదం సూరకవి పాత్రకి ఓ కథాప్రయోజనాన్ని కల్పిస్తూ సీతారామ్ స్క్రీన్‌ప్లేను చాలా తెలివిగా నడిపించాడు.

గబ్బిట ఈ చిత్ర సంభాషణలకు పాత్రోచిత భాషను ఉపయోగించడం ముదావహం. ఇందుకు ఉదాహరణగా బుస్సీ, హైదర్‌జంగ్‌ల సంభాషణల్ని మనం పేర్కొనవచ్చు. 'మయసభ'లో రారాజు స్వగతాన్ని పోలిన విజయరామరాజు స్వగతాన్ని చూసినా, రంగారాయుడు యుద్ధం వల్ల కలిగే నష్టాల్ని గురించి ప్రవచించిన విధానాన్ని గమనించినా గబ్బిట వెంకట్రావు ఉపజ్ఞ మనకి చక్కగా అర్థమౌతుంది. చరిత్రకి సంబంధించిన అతి సూక్ష్మమైన అంశాల్ని సైతం వెంకట్రావు విస్మరించకుండా తమ సంభాషణల్లో అందంగా, నాటకీయంగా పొందుపరిచాడు. దీనికి తార్కాణంగా 'బుస్సీ', తెలుగునాట 'బూచి'గా ఎందుకు, ఎలా రూపాంతరం చెందాడో, రామరాజు నోట రచయిత చెప్పించిన తీరును మనం వివరించవచ్చు. సంభాషణల్లో చక్కని జాతీయాల్ని ఆయన ఎంతో నేర్పుగా వాడాడు. ఇందుకు ఉదాహరణ వెంగళరాయుడు మరణానికి ఆక్రోశిస్తూ రంగారాయుడు పలికే స్వగతంలో 'అసహాయ శూరులు! ఆకాశ దీపం అయిపోయారా?' అని అంటాడు. దీనిలో 'ఆకాశదీపం' అనే జాతీయపు ప్రయోగం ఎంతో పొందికగా గూటిలో గువ్వలా ఒదిగిపోయింది. చిత్రం ఆసాంతం ఇలాంటి మనోజ్ఞ ప్రయోగాలు పుష్కలంగా మనం గమనించవచ్చు. హాస్య సన్నివేశాల్లో రచయిత అనుచిత మాటల్ని ఆశ్రయించలేదు. ఇది చెప్పుకోదగ్గ విశేషం.

పాటలన్నీ మురిపాల ముత్యాలే!

ఈ చిత్రంలోని పాటలన్నీ సాహిత్య సౌరభాల్ని వెదజల్లేవే. చిత్రారంభంలో వచ్చే 'సిరినేలు రాయడా' అనే గీతఖండికను ఆరుద్ర జానపద పరిమళం గుబాళించే విధంగా రచించాడు. 'శ్రీకర కరుణాల వాల' పాటలో జూనియర్ సముద్రాల, మల్లమ్మ శుభాశంసను బాగా అభివ్యక్తీకరించాడు. భక్తిగీతాల రచనా శైలికి భిన్నంగా 'తెలుగుకీర్తి తేజరిల్లి దిశలా విరాజిల్లగా' తన కుమారుడు రాజ్యపాలనను చేయాలని మల్లమ్మ కాంక్షించడం మహత్తరంగా ఉంది.

ఈ పాట సిటింగ్‌కు సీ. సముద్రాల, జూ. సముద్రాల ఇద్దరూ వచ్చారు. సీ. సముద్రాల పల్లవి వినిపించి బాగుందా అని అడిగితే కొడుకు (జూ. సముద్రాల) బ్రహ్మాండం అన్నాడు. 'అయితే మిగతా నువ్వు చూసుకో' అని లేచి వెళ్లిపోయాడు సీనియర్. అదే స్థాయిలో పాట పూర్తిచేశాడు జూనియర్.

ఇక ఆరోజుల్లో యువతుల్ని బాగా ఆకట్టుకున్న పాట, కళాభారతి జమున చలాకీతనాన్ని ద్విగుణీకృతం చేసిన పాట 'ముత్యాల చెమ్మ చెక్క'. ఈ పాటలో సాహిత్యాన్ని అధిక భాగం ఆరుద్ర జానపద గేయాల నుండి తీసుకున్నాడు. ఈ పాట పుట్టుక వెనుకా ఒక కథ ఉంది. ఈ పాటకు మొదట ట్యూన్ సిద్ధమైంది. ట్యూన్ వచ్చేసింది కానీ పదాలు పడడం లేదు. సాలూరి వారు పరిస్థితినర్థం చేసుకుని సీతారాం కొడుకు ప్రభుతో 'ప్రభుగారూ! ఆరుద్ర గారు కొంచెం కష్టపడుతున్నట్టున్నారు. విపరీతంగా సిగరెట్లు లాగించేస్తున్నారు. ట్యూను మారుస్తాను చెప్పండి' అన్నారు. ఆరుద్ర ఒప్పుకోలేదు. ఐదు నిమిషాల్లో సాహిత్యం వచ్చేసింది. సీతారామ్ వచ్చి పాట విని 'రోట్లో తవుడు – నీ మొగుడెవరు' అని చిరాగ్గా బాగాలేదని అన్నాడు. అయినా ప్రభు నచ్చచెప్పి, ఈ పాటే ఆల్‌టైం రికార్డ్ అవుతుందని చెప్పాడు. అది జరిగింది కూడా. ఈనాటికీ ప్రేక్షకులు బొబ్బిలియుద్ధాన్ని గుర్తుపెట్టుకున్న కారణాల్లో ఈ పాట ఒకటి.

'మురిపించే అందాలే..' అనే శ్రీశ్రీ గీతానికి ముందు 'సొగసు కీల్జడదాన' అనే సీసపద్యం సాకీగా ఉంటుంది. ఈ పద్యం కవిసార్వభౌముడైన శ్రీనాథుని చాటువుల్లోనిది. శ్రీశ్రీ, తన పాటకి ముందు ఈ చాటుపద్యాన్ని చేర్చడం వల్ల ఆ పాట మాధుర్యం ఇనుమడించింది.

ఎల్.విజయలక్ష్మి నృత్యానికి శ్రీశ్రీ 'నిను చేర మనసాయెరా' అనే పసందైన జావళిని రచించాడు. ఈ జావళీ రచనకు ఎవరైతే బాగుంటుందని నిర్మాత తర్జనభర్జన పడుతుంటే సాలూరే శ్రీశ్రీ చేత రాయించమన్నాడు. 'రాస్తాడా?' అని సీతారామ్ సందేహపడితే రాజేశ్వరరావు 'నేనే ఫోన్ చేసి కనుక్కుంటాను' అని ఫోన్‌చేసి 'జావళీ రాయగలరా?' అని అడిగితే శ్రీశ్రీ 'గలను' అని ఫోన్ పెట్టేసి ఒక్కరోజులో పాటను పూర్తిచేశాడు.

ఈ పాటలోని చరణంలో 'విడిదికి రమ్మని చాల వేడితిరా! బిడియము నీకేలరా.. దొరా..' అనే పాదాల్లో ప్రాస బాగున్నా, 'విడిదికి రమ్మ'ని నర్తకి బుస్సీని అతని విడిదికి వచ్చి మరీ ఒత్తిడి చేయడం, వింతగా తోస్తుంది.


'ఏమయా రామయా..' అనే కొసరాజు గీతంలో 'గట్టి ఘటము' అనే జాతీయాన్ని సముచితంగా, చరణాంతంలో ప్రయోగించడమనేది ఆయన నిరుపమాన ప్రజ్ఞకి నిదర్శనం.

❖

జిల్లా వారి వర్షపాత వివరాలు

వరుస	జిల్లా	మే		జూన్		జూలై (26వ తేదీ వరకు)		జూన్ 1 నుంచి జూలై 26 వరకూ			
		తేదా	ఫలితం	తేదా	ఫలితం	తేదా	ఫలితం	తేదా	ఫలితం	సాధారణ వర్షపాతం	నమోదైన వర్షపాతం
1	శ్రీకాకుళం	102.7	152.8	134.9	139.5	153.8	123.2	288.7	262.7	-9.0	సాధారణం
2	విజయనగరం	114.2	130.9	128.4	182.7	150.0	169.1	278.4	351.8	26.4	అత్యధికం
3	విశాఖపట్నం	114.5	143.0	128.8	168.7	164.4	173.3	293.2	342.0	16.6	సాధారణం
4	తూర్పు గోదావరి	93.5	136.5	123.7	241.7	208.4	124.2	332.1	365.9	10.2	సాధారణం
5	పశ్చిమ గోదావరి	71.2	85.0	114.7	276.8	221.1	94.6	335.8	371.4	10.6	సాధారణం
6	కృష్ణా	58.0	96.9	97.8	270.7	186.9	65.6	284.7	336.3	18.1	సాధారణం
7	గుంటూరు	59.8	90.2	86.3	172.7	130.0	49.8	216.3	222.5	2.9	సాధారణం
8	ప్రకాశం	51.9	66.4	58.0	83.6	79.3	30.0	137.3	113.6	-17.3	సాధారణం
9	నెల్లూరు	53.7	91.0	56.8	63.8	78.9	29.0	135.7	92.8	-31.6	అత్యల్పం
10	చిత్తూరు	61.7	82.7	78.7	132.2	90.7	71.2	169.4	203.4	20.1	అత్యధికం
11	కడప	36.7	33.5	69.2	119.8	84.2	50.0	153.4	169.8	10.7	సాధారణం
12	అనంతపురము	39.6	82.7	63.9	94.5	58.8	45.3	122.7	139.8	13.9	సాధారణం
13	కర్నూలు	38.5	62.7	77.2	131.8	100.1	66.2	177.3	198.0	11.7	సాధారణం
	రాష్ట్రం మొత్తం	68.9	93.9	93.7	158.8	131.3	79.4	225.0	238.2	5.9	సాధారణం

అవిగో ఆలమందలు !




అమరావతి స్తూపంలో ప్రాకారాన్ని చూపే ఒక భాగం

ధరణికోట, ధాన్యకటకం అమరావతికి పూర్వనామాలు. ఇక్కడి మహాచైత్యాన్ని అచ్చతెలుగులో దీపాలదిన్నెగా పిలుచుకునేవారు. దిన్నెపై ప్రధానశిల్పాలుగా బుద్ధునికి ప్రతీకగా చూపే పాదాలు, రావి చెట్టు, పూర్ణకుంభం అమర్చారు. రెండవ – మూడవ దశల్లో ధ్యానమగ్నుడైన బుద్ధుడు, నిలుచున్న బుద్ధుడు, ఆయన జీవితంలోని ప్రధాన ఘట్టాలు, జాతక కథలకు సంబంధించిన శిల్పాలు 'తావికి బంగారంలా' చేరాయి. గాంధార స్కూల్ – మధుర స్కూల్ – అమరావతి స్కూల్ అనే మూడు శైలులు బౌద్ధ శిల్పానికి త్రిరత్నాల వంటివి. అమరావతి స్కూల్ రాతిలో కవిత్వం చూపిందని విమర్శకులు కొనియాడారు. అమరావతి స్కూల్ లేదా ఆర్ట్ అంటే కేవలం అమరావతిలోని శిల్పాలు మాత్రమే కాదు. కృష్ణానదికి ఇరువైపులా ఉన్న శ్రీపర్వతం (నాగార్జునకొండ) గోలి, జగ్గయ్యపేట, నేలకొండపల్లి, ఫణిగిరి, ధూలికట్ట, అజంతా, శ్రీలంక, తూర్పు ఆసియా దేశాల శిల్పాలకూ వర్తిస్తుంది. అమరావతి స్కూల్ ప్రత్యేకతల్లో మరొకకటి లౌకిక సౌందర్యం! బుద్ధుని బోధనలు, జీవిత ఘట్టాలతో సంబంధంలేని సాధారణ ప్రజల జీవితాన్ని అమరావతి శిల్పులు చూపారు. కళాత్మకతలో అవి ధార్మిక శిల్పాలకు మించిన పరవశాన్ని కలుగజేస్తాయి. గాంధార, మధుర శిల్పాలను అమరావతి స్కూల్ ఈ విషయంలో త్రోసిరాజన్నది.

స్త్రీలు–పురుషులు, భిన్న సమూహాలకు చెందినవారిగా చూపించే వస్త్రధారణ, ఆహార్యం, శారీరక భంగిమలు చూపడంలోనే కాదు, వారి మోముల్లో నవరసాలూ ఒలికించారని విమర్శకులు కొనియాడారు. బుద్ధుని జీవితంలో గుర్రాలు, ఏనుగులు, జింకలు విడదీయలేనివిగా కనిపిస్తాయి. ఆ మేరకు వివిధ రీతుల శిల్పాలు కన్పిస్తాయి. అమరావతి శిల్పులు సాధారణ ప్రజల నిత్యజీవితంలో విడదీయరాని భాగమైన జంతువులను చూపారు. గుర్రాలు సరేసరే. అప్పటి రవాణా సాధనాలు. ఆవులు, ఎద్దులు, బర్రెలు, దున్నపోతులు పిల్లాజెల్లాతో అమరావతి శిల్పంలో మాత్రమే కన్పిస్తుంది. ఒక ఎత్తైన ప్రదేశం నుంచి, సమతలమైన ప్రదేశంనుంచి, ఐమూలగా, మేడలోపలనుంచి బయటకు చూస్తే వీధులు ఎలా కన్పిస్తాయో, పశువుల శాలలోని పశువులను చూపేందుకు ఎలాంటి స్వాతంత్ర్యం తీసుకోవచ్చో అమరావతి శిల్పులు చూపారు. ఫొటోలకు ఫోజు ఇచ్చినట్లుగా ఎటువంటి భావసూచనా లేకుండా బిగదీసుకున్న మొహాలను చూపరాదని, మనుషులే కాదు జంతువులకు సైతం వాటివైన కమ్యూనికేటివ్ ఎక్స్‌ప్రెషన్స్ ఉంటాయని ఔత్సాహిక చిత్రకారులకు అమరావతి స్కూల్ నేర్పుతుంది.

దీపాలదిన్నెను దూరం నుంచి చూసేవారికి నలువైపుల ప్రవేశద్వారాలు కన్పిస్తాయి. ఇరువైపులా రెండు సింహాలు. దిన్నెకు ఆనుకుని అయిదు ఆయక స్తంభాలు. నాలుగు ప్రవేశద్వారాలను ఇరువైపులా కలుపుతూ వృత్తాకారపు ప్రాకారంలా నిలచిన నాలుగు విభాగాలు. వాటిపై త్రిరత్నాలకు సూచికలుగా నిలువుగా మూడు పద్మాల పట్టిక. దిన్నెను సందర్శించుకునే వారికి లోపలి ప్రాకారంలో లౌకిక శిల్పాలు అక్కడక్కడా కన్పిస్తాయి. శతాబ్దాల క్రితమే ఇక్కడి దీపాలు ఆరిపోగా, శిధిలమైన దిన్నె వద్ద, క్రీ.శ. 1817 అక్టోబర్ 5వ తేదీన బ్రిటిష్ చిత్రకారుడు ఒరిజినల్ శిల్పానికి డ్రాయింగ్ రూపంలో నకలు తీసారు. అమరావతి శిల్పులు చూపిన అమరిక (కంపోజిషన్) భళారే అన్పిస్తుంది! రెండు అడుగుల ఏడు అంగుళాల ఎత్తు, రెండు అడుగుల ఐదు అంగుళాల వెడల్పు గల పల్నాడు మార్బుల్ ఒరిజినల్ శిల్పం ఎక్కడుందో ఎవరికీ తెలీదు. ప్రస్తుతానికి డ్రాయింగ్ చూసి 'అవిగో ఆలమందలు' అనుకుని ఆశ్చర్యపోదాం!



ఒరిజినల్ శిల్పాన్ని చూస్తూ క్రీ.శ.1817లో చేసిన డ్రాయింగ్ 'ఏ హెర్డ్ ఆఫ్ కౌస్'

– పున్నా కృష్ణమూర్తి
7680950863

నిన్నటి చంద్రుడు


సామాన్య

"జీవితంలో కనిపించకుండా మిగిలి పోయిన ఖాళీలను సామాన్య తన కథానికల ద్వారా పూరిస్తూ వస్తున్నారు.ఈమె రాస్తున్న కథలు కొత్తవి, కథనాలు కొత్తవి, శిల్ప సంవిధానం కొత్తది. మారుతున్న కాలంలో మారుతున్న మానవ సంబంధాలు ఈమె కథా వస్తువులు. నిరాడంబరమైన శైలిలో నిశ్చలమైన సాంద్రత. భావోద్విగ్న సందర్భాల్లో సైతం సంయమనాన్ని పాటించే పరిపక్వత. విలువల తాజాదనాన్ని భాషగా అనువదించగల ప్రతిభా సామర్థ్యం. సాహితీ ప్రక్రియల సరిహద్దులు చెరిగి పోతున్న దశలో తెలుగు కథకు తనదైన ఒక సాంద్రతను సమకూర్చ గలగటం ఈమె ప్రత్యేకత. ఎంతటి క్లిష్టతరమైన వస్తువునైనా మైనం ముద్దగా మార్చి అతి సులభ గ్రాహ్యమైన రీతిలో కథానికా శిల్పంగా మలచ గలగటం ఈమె స్వంతం చేసుకొన్న విశిష్టత."

ఇది సామాన్యకి స్మైల్ అవార్డు కమిటీ ఇచ్చిన ప్రశంసా పత్ర సారాంశం; ఈ 'నిన్నటి చంద్రుడు కథ ఆ ప్రశంసకి ఓ నిదర్శనం.

ఇంటి వెలుపలి మధ్యాహ్నపు వెలుతురు లివింగ్ స్పేస్ చుట్టూ వున్న ఫ్రెంచ్ విండోస్ నుండి పలకలు పలకలుగా లోపల పడుతూ వుంది. దూరం నుండి చూస్తే ఒక డిజైనర్ వెలుతురు వలయం మధ్యలో వున్నట్లు అనుభూతి కలుగుతూ వుంది . ఇలాగే అల్లుకున్నాడు నిన్నటి పున్నమి వెన్నెల చంద్రుడు. చాలా సేపు అలాగే కూర్చుని, వెలుతురు పలకల మధ్యని నీడల గుండా బయటకు చూసి చూసి... చివరికి లేచి , గోడకి ఆనుకుని 'ట్రెబుల్ క్లెఫ్' ఆకారం లో వున్న బుక్ షెల్ఫ్ దగ్గరికి వెళ్లి, అన్యమనస్కంగా చేయి కదుపుతూ వుంటే సోఫాలో వున్న మొబైల్, చనువుగా మధువంతి రాగంలో మ్రోగింది. ఒక సారి మొబైల్ వంక చూసి షెల్ఫ్ లో పుస్తకమొకటి త్వరగా లాగి సోఫా దగ్గరకి వచ్చేసరికి కాల్ కట్టయింది. మొబైల్ చేతిలోకి తీసుకుని చూస్తే పెద్దమ్మ నుండి మిస్డ్ కాల్. తిరిగి చేయబోయే లోపే మళ్ళీ పెద్దమ్మ కాలింగ్ అని, కాల్ తీసుకుని "పెద్దమ్మా" అన్నానో లేదో, అటు వైపు నుండి రాజ్యమత్త "పాపా, పెద్దమ్మ చనిపోయింది నాన్న... ! వెంటనే బయల్దేరండి" అని చెప్పింది. హడావిడిగా హేమంత్ కి ఫోన్ చేసి, వినీల్ ని స్కూల్ నుండి తెచ్చి పెద్దమ్మ వాళ్ళ వూరు బ్రహ్మదేవికి బయల్దేరాం.

పల్లెటూరి కుదుళ్ల నుండి విడిపోయి ఎటు వాళ్ళం అటు వలస వెళ్ళాక అక్కడ మిగిలి పోయిన మూల వేరు పెద్దమ్మ. నూర్పిళ్ళు పూర్తయి ఒడ్లు ఇంటికొచ్చాయట, దగ్గరుండి వడ్ల కొట్టాల్లో నింపించి వెళ్లి పడుకున్నదట, సాయంత్రం కాఫీ పటుకెళ్ళి చూస్తే పడుకున్నది పడుకున్నట్లే నిద్రలోనే పోయింది, '' రాజ్యమత్త చెప్పిన మాట గుర్తుకు వచ్చింది . నా చిన్నప్పుడెప్పుడో, పెదనాయన వున్న కాలంలో, వంటింట్లో ఒక రోజు పాలు మరగ బెడుతూ, ఫిల్టరు నుండి డికాషన్ వంచుతూ, తలెత్తి ఎవరితోనో , పెద్దమ్మ"అమేయ్ నాకు బిడ్డలు పుట్టలేదని దిగులు లేదు. ఇదిగో పింకీ వుంది కదా చాలు. కానీ దేవుడు నన్ను ఆయన కంటే ముందే పోయ్యేట్లు చేస్తే చాలు. ఇంకేమీ అవసరం లేదు, మిగిలినయంతా నా చేతుల్లో పని "అంది. ఆ రోజు పెద్దమ్మ ఏం చేస్తుందో, ఆమె రూపం ఎలా ఉ ండిందో ఎందుకని అంతలా జ్ఞాపకం వుండి పోయింది నాకు.!. వేడి ఆవిర్లు కమ్ముకుని వున్న వంటింట్లో పట్టిన చెమట, పెద్దమ్మ పెట్టుకుని ఉన్న కుంకుమ బొట్టుని చీల్చుకుంటూ ముక్కు మీదకు జారుతున్న దృశ్యం , నిగ నిగ మెరుస్తున్న నల్లటి ఆమె మేని ఛాయ, ఆ రోజు ఆమె కట్టుకుని వున్న మోము పచ్చ రంగు ఝరీ అంచు నేత చీర, వంటింటి కిటికీ నుండి బయటికెళ్ళి కిటికీ పక్కనే వున్న కరివేపాకు చెట్టును కావలించుకుంటున్న గచ్చకాయ రంగు పొగ ఎందుకలా జ్ఞాపకముండి పోయినట్టు!

కారు పెద్దమ్మ ఇంటి ముందు ఆగేప్పటికి మరుసటి రోజు మద్యాన్నం మూడయింది .బొంత రాళ్ళ పెద్ద ప్రహరీ గోడకి మూలనున్న ముసలి కొబ్బరి చెట్టు చాచిన ఆకు నీడలో కునుకు తీస్తుందో కోడి పుంజు.పెద్దమ్మకు ఇష్టమైన మెలికల ముగ్గులు పరుచుకోకుండా దిబోసిగా వున్న ధనుర్మాసపు వాకిలిని దాటుకుని వెళితే వరండాలో ఆ ఇంటి యజమానురాలు పెద్దమ్మ ఐస్ బాక్సులో మోకాళ్ళ వరకు నీలి రంగు జరీ అంచున్న, ఆనంద పచ్చ రంగు కంచి పట్టు చీరలో, భిగిసిన ముఖంతో ప్రశాంతంగా నిద్ర పోతుంది. పెద్దమ్మ దగ్గర ఎవరో ఇద్దరు ముగ్గురు నాకు తెలియని వాళ్ళు వున్నారు. వాళ్ళలో సన్నగా, పొట్టిగా , తెల్లటి చాయలో వున్న అమ్మాయి నా దగ్గరకు వచ్చి "అమ్మా, శ్రావ్యమ్మ కదా నువ్వు ?"అని, నేను తల ఊపగానే ఇంటి లోపలికి వెళ్ళింది. ఆమె లోపలికి వెళ్ళిన ఐదు నిముషాలకి ఇంటి లోపలి నుండి బిల బిలమంటూ బంధువులంతా బయటికొచ్చారు. నేనొచ్చానని ఊరందరికీ కబురు వెళ్ళింది. ఇక ఆలస్యం లేకుండా కాసేపట్లోనే పాడె సిద్ధమైపోయింది. పెద్దమ్మ పాడె మీదకు చేరింది. పాపం పెద్దమ్మ ఈ ఇంటిని వదలకుండా బ్రతికింది. పెదనాయన వెళిపోయాక , తాత, అమ్మమ్మ 'ఇక మా దగ్గరికి రా' అన్నా వచ్చిందా, పగలూ రాత్రి ఆ ఆస్తి చుట్టూ సాలె పురుగు గూడును అల్లుకున్నట్లు జీవితాన్ని అల్లుకుని, దాన్ని పెదనాయన పోయాక పదింతలు పెంచింది. కానీ పాపం చనిపోయాక ఒక్క గంట అన్నా ఎక్కువ వుండగలిగిందా తన స్వంత ఇంట్లో !

చిన్న దినం అయిపోయాక, కరమంత్రాలకు వస్తామని ఎక్కడి వారక్కడ బయల్దేరారు. హేమంత్ కూడా "పింకీ నేనూ బయల్దేరుతాను, వినీల్ ని తీసికెల్తాను. నువ్వు అంతా చక్క పెటుకుని రా" అని బయల్దేరాడు. ఆ రాత్రి పెద్దమ్మ గదిలోకి వెళ్లి పెద్దమ్మ మంచం పైన పడుకున్నాను. ఎన్ని సంవత్సరాలయిందో ఇలా పడుకుని. యెర్ర చందనం తో చేసిన పెద్ద పట్టె మంచం, మూల మాచింగ్ మహారాజా సోఫా, గోడకి ఆనుకుని మూడు తలుపులున్న చాలా పెద్ద అలమారా, అలమారాకున్న మధ్య తలుపుకు బిగించి వున్న నిలువుటద్దం, దాని చుట్టూ పాత కాలం టైల్స్ తో చేసిన ఏమ్బోజ్డ్ మెంతి రంగు లతకు పచ్చటి ఆకులు, లేత ఎరుపు, గులాబీ రంగు కలగలసిన పూల గుత్తులు. కిటికీలకు తెలుపు రంగు పూలు వున్న పసుపు రంగు తెరలు. అలసిన శరీరాన్ని



మగత మెత్తగా కమ్ముకుంటూ వుంటే పెద్దమ్మ నా పక్కనే పడుకుని వున్నట్లు, నేను ఇక్కడ ఉన్నప్పటి చిన్న పిల్లగా పెద్దమ్మ పొట్ట మీద కాలేసి భుజం పైన తల పెట్టుకుని ఆమె ఏదో చెప్తూ వుంటే తల పైకెత్తి వింటూ హటాత్తు గా "పెద్దమ్మా, పెదనాయన ఎందుకలా వెళిపోయాడు? ముక్తి అంటే ఏమిటీ... ?" అడుగుతూ వుంది. అంతలోనే ఆనందా రంగు కంచి పట్టుచీర కట్టుకుని ఐస్ బాక్స్ లో పడుకున్న పెద్దమ్మ తనని చిచ్చుకొడుతూ ఒక చేయి పైకెత్తి చూపుడు వేలు సారించి నవ్వుతూ అంటుంది "పింకీ చూడు మీ పెదనాయనని. చూసావా? ఇద్దరం ఒక్క చోటే వున్నాం ఇప్పుడు, ఇదిగో చూడు" అని పెద్ద పెద్దగా నవ్వుతుంది. తనకు భయమేస్తుంది పెద్దమ్మ ఎప్పుడయినా అలా నవ్విందా అంత పెద్దగా? ఆడవాళ్ళకి నవ్వినపుడు పళ్ళు బయటకు కనిపించ కూడదు కదా. పెద్దమ్మ పొట్ట పైన తడుతూ "పెద్దమ్మా !ఎందుకలా నవ్వుతున్నావ్ ?," అని అడుగుతూ ఉండగానే తెలుపు పూల పసుపు కిటికీ తెరగుండా పెద్దమ్మ వెళిపోతుంది. తను కుచ్చుల కుచ్చుల పొట్టి గౌను వేసుకుని వుంది, పరుగెత్తుకుంటూ వెళ్లి పెద్దమ్మ చెయ్ పట్టుకుని "నేనూ వస్తా.. నేనూ వస్తా" అని ఏడుస్తూ వుంది. పసుపు రంగు కిటికీ తెర క్రమ క్రమంగా చీకటిగా మారిపోతుంది. ఎటు చూసినా చీకటి. అంతే మెలుకువ వచ్చేసింది.మళ్ళీ నిద్ర రాని మెలుకువ . ఏంటీ కలకి అర్థం. లేచి కూర్చుని చుట్టూ చూస్తే ఆ గది పురావస్తుశాల లాగా కనిపించింది . ఈ గదిలో పెద్దమ్మ ఎలా పడుకునేది, తన వొంటరితనాన్ని ఎలా ఛేదించేది.

పొద్దున్నే ఇల్లంతా అటూ ఇటూ తిరగడం మొదలు పెట్టాను. వడ్ల కొట్టు దగ్గర విప్పకుండా మిగిలి పోయిన వడ్ల మూటలు అలాగే పడి వున్నాయి. రాలి పడ్డ వడ్లని పొడుచుకు తింటున్నాయి కోళ్ళు. ముప్పాతిక వంతు నిండి పోయిందేమో కొట్టుకున్న కింది తలుపు మూసి తాళం వేసి వుంది. పైన చిన్న తలుపు తెరిచి వుంది. ఆ చిన్న తలుపు వరకు నిచ్చెన వేసి వుంది. కొన్ని పిచుకలు ఆ చిన్న తలుపు గుండా లోపలి వెళ్లి, బయటకోస్తున్నాయ్. మృదువైన రెక్కలతో పలుచటి శబ్దం చేస్తున్నాయ్. కొట్టుకున్న గోడ కొసన పిచుకుల గూళ్ళు వున్నాయ్ రెండు మూడు. చూస్తూ నిలబడి వుంటే నిన్న కనిపించిన అమ్మాయే ఇప్పుడు కళ్ళద్దాలు పెట్టుకుని వుంది, వచ్చి "శ్రావ్యమ్మా !మీ బాబాయి వచ్చాడు" అన్నది . నేను అక్కడి నుండి హాల్ లోకి వెళ్లాను. ఆయన వరసకు పెదనాయనకు తమ్ముడు. దూరపు బంధుత్వం. అదే వూర్లో ఉ ంటాడు. పెద్దమ్మకి చాలా సాయంగా వుంటుంది వాళ్ళ కుటుంబం. నేను వెళ్లి కూర్చుని "చెప్పండి బాబాయి ఏమిటి విశేషాలు? పెద్దమ్మ ఏమయినా చెప్పమన్నదా నాకు," అన్నాను. ఆయన "ఏముంది తల్లీ వయసొచ్చేసింది కదా, కాటికి కాళ్ళు చాపుకున్నాం. కొంత ముందూ వెనుక అంతే తేడా, అందరం పోవాల్సిన వాళ్ళమే. కానీ ఈ మధ్య నిన్ను చూడాలని బాగా వుబలాట పడిందనుకో" అన్నాడు. అని, "ఆహా.. ఏం లేదు, అప్పగింతల గురించే, రాతకోతలు అవీ నిఖార్సుగా చేసే పెట్టిందిలే," అన్నాడు. అంతలో అద్దాలమ్మాయి వచ్చి ఇద్దరికీ కాఫీ ఇచ్చింది. ఆ అమ్మాయిని చూడగానే బాబాయి "ఒమేయ్ ప్రసూనా ! శివ ఎక్కడ ? ఒక సారి ఇటొచ్చి పొమ్మని చెప్పు" అని, నా వైపు తిరిగి "మీ తలమనిషి శీనయ్య గుర్తున్నాడా అమ్మా? శీనయ్య కొడుకే ఈ శివ. వాళ్ళ నాన చనిపోయిన తరువాత మీ పెదమ్మ వీడ్ని తలమనిషిని చేసుకుంది, అంతకు ముందు ఎక్కడో డ్రైవర్ పని చేసుకుంటూ వుండినాడులే. వాడి భార్యే ఈ ప్రసూన. ఇద్దరూ మీ పెద్దమ్మకి బాగా నమ్మకస్తులు" అన్నాడు

కాసేపటికి శివ వచ్చాడు. నీలం రంగు గళ్ళ లుంగీ కట్టుకుని, ఊసి పోయిన నలుపురంగు టీ షర్ట్ వేసుకుని వున్నాడు. సన్నగా వున్నాడు. రాగానే నన్ను చూసి నవ్వి "బాగున్నావా పింకీ" అని అక్కడే ద్వారబంధానికి ఆనుకుని నిలబడ్డాడు. బాబాయి అతని వైపు తిరిగి "శ్రావ్య నీకు ఇంతకు ముందే తెలుసేవిట్రా"అన్నాడు. శివ "ఆ...రెడ్డీ, తెలుసును, పింకీ ఆరో క్లాసు ఇక్కడుండే చదువుకున్నది కదా అప్పుడు కలిసి ఆడుకునే వాళ్ళం" అన్నాడు. బాబాయి కాఫీ గ్లాసు టీపాయ్ మీద పెట్టి, "ఒకే ఈడు వాళ్లా మీ ఇద్దరూ" అన్నాడు. "లేదు రెడ్డీ, పింకీ నాకంటే మూడు నాలుగేళ్ళు చిన్నది," అన్నాడు శివ. అంతలో శివ భార్య ఆ అద్దాలమ్మాయి వచ్చి కాఫీ గ్లాసులు తీసుకు వెళ్ళింది. బాబాయి లేచి నిలబడి "నీకేం కావాలన్నా శివాని అడుగు తల్లీ. నాకు కొంచెం పని వుంది వెళ్లి మళ్లీ వస్తాను" అని వెళిపోయాడు.

గదిలో శివ, నేను ఇద్దరమే మిగిలాం . బాబాయి వెళ్ళగానే శివ “ పింకీ ఇవిగో మీ పెద్దమ్మ అలమారు తాళాలు. నగలు, పట్టా కాయితాలు అన్నీ లాకర్లో వుంటాయి. ఇక్కడే మనూరి గ్రామీణ బాంకులో. అలమారులో ఇంకేం వున్నాయో నాకు తెలీదు. సినిమా హాలు నుండి వచ్చే డబ్బు నేరుగా అకౌంట్ లో జమ అవుతూ వుంటుంది కదా, అన్నిటికీ నువ్వే నామినీ” అన్నాడు. ఇంకా ఏదో చెప్పబోతుండగా నడి నెత్తి మీద కృష్ణుడిలా పిలక వేసుకున్న ఒక నాలుగేళ్ల పాప “డాడీ” అనుకుంటూ వచ్చి శివ కాళ్ళు పట్టుకుని, తల పైకెత్తి చూసింది ఎత్తుకోమన్నట్టు. శివ బిడ్డని ఎత్తుకుని “ఆ.. పింకీ, పోయిన ఏడాది పెద్దమ్మకు చాలా జ్వరమొచ్చింది. మేమే దగరున్నాం. తగ్గాక దీనికి నీ చిన్నప్పటివట మురుగులు చేతికి వేసింది. అలాగే ఇది పుట్టినప్పుడు నీదేనట చిన్నప్పటి దండ పాపకి ఇచ్చింది, నీకు చెప్పిందో లేదో నాకు తెలీదు” అన్నాడు. నేనేం మాట్లాడలేదు. కాసేపాగి అతనే “ఒక సారి ఇల్లంతా చూసుకుని ఏమయినా అడగాల్సింది వుంటే అడుగు.. ఆ.. అన్నట్టు ఈ కారు, జిలకర మసూరాలు వేశాం. 82 పుట్లు పండాయి. పది రోజుల క్రితం రొయ్యలెత్తాం ఒకటో కౌంటు దాదాపు ఇరవై అయిదు కేజీలు పడ్డాయి. ఆ డబ్బంతా కూడా అకౌంట్ లో జమ చేసాం. కొన్ని రోజుల్లో చేపలు పట్టాల్సి వుంటుంది ఒక 60 క్వింటాల్ దాకా రావచ్చు, సరే ఏమయినా తెలుసుకోవాల్సింది వుంటే పిలిస్తే వస్తాను. కరంటొచ్చే టైమయ్యింది, మోటర్లు వేసారో లేదో చూడాలి చేలోకి వెళ్తున్నా” అని వెళ్లి పోయాడు. నేను వెళ్తున్న శివాని చూస్తూ కూర్చున్నా, చూస్తూ వుంటే హటాత్తుగా శివ నాకంటే పొట్టి అనిపించింది. పొట్టిగా, నల్లగా, పీలగా వున్నాడు శివ!

నా పదకండో ఏట నాన్న ఏదో కాంట్రాక్ట్ పనులకోసం సౌత్ ఆఫ్రికా వెళ్ళాడు. వెళ్తూ నన్ను పెద్దమ్మ దగ్గర వదిలి అమ్మని తనతో తీసుకుని వెళ్ళాడు. అమ్మకి, పెద్దమ్మకి తేడా వుండేది కాదు నాకు. హాయిగా పెద్దమ్మ దగ్గర వుండి పోయాను. పొద్దున్నే టౌన్ లో కాన్వెంట్ కి వెళ్ళడం, రావడం, సెలవు రోజుల్లో స్నేహితులతో ఆడుకోవడం. పిల్లలు పెద్ద జట్టు వుండేవాళ్ళు. వాళ్ళలో చాలా మంది అసలు బడి ముఖం చూసే వాళ్ళు కాదు. ఆ జట్టులో అందరికంటే పెద్దవాడు శివ. మా అందరి కంటే పొడవుగా, దృఢంగా, ధైర్యంగా వుండేవాడు. పొరలు పొరలుగా ఏవేవో జ్ఞాపకం వస్తూ ఉండగా అద్దాలమ్మాయి మళ్ళీ వచ్చింది. వచ్చి చనువుగా నవ్వుతూ “కాఫీ తాగుతారా ?తెమ్మంటారా” అంది. నేను ఆ అమ్మాయిని పరికించి చూసాను. సన్నగా, పొట్టిగా తెల్లగా వుంది. చాలా తెల్లగా ఏదో లాగా. కొంత ఎత్తుగా వున్న పళ్ళు నవ్వకున్నా నవ్వినట్లు అనిపిస్తున్నాయ్. ముదురు ఆకు పచ్చ, నారింజ, పసుపు రంగుల కలయికలో వున్న సిల్కు చీర కట్టుకుని వుంది. చేతికి వాచ్చి పెట్టుకుని వుంది. వంటపని అదీ చేసే అమ్మాయికి వాచ్చీ ఎందుకో అర్థం కాలేదు నాకు. చూపు మరల్చుకుని మొబైల్ చూసుకుంటూ “ఏం చదువుకున్నావ్” అన్నాను. ఆ అమ్మాయి అదేదో చాలా నవ్వుతాలు విషయమైనట్టు పెద్దగా నవ్వి “నన్ను చూసి అందరూ వుద్యోగస్తురాలననుకుంటారు, కానీ నేను ఐదో క్లాసు వరకే చదివా” అంది ఘనకార్యం లాగా. నాకెందుకో ఆ అమ్మాయి నవ్వు నచ్చలేదు, ఆ అతి చనువూ నచ్చలేదు. అందుకే ప్రతిస్పందన ఏమీ లేకుండా మొబైల్ చూసుకుంటూ “ఏమయినా కావాలంటే పిలుస్తా, ఇక నువ్వెళ్ళు,” అన్నాను. ఆ అమ్మాయి “సరే” అని వెళ్తూ వుండగా ఇందాక బాబాయి పిలిచిన ఆ పిల్ల పేరు గుర్తు రాక “ఆ.. అమ్మాయ్ నీ పేరేంటి?” అన్నాను. ఆ అమ్మాయి మళ్ళీ నన్ను చిరాకు పెట్టే అదే నవ్వు నవ్వి ‘ప్రసూన’ అని వెళ్ళిపోయింది.

వెళ్ళిపోతున్న ప్రసూనని చూస్తుంటే ఇందాక అదే తలుపుగుండా వెళ్ళిన శివ గుర్తొచ్చాడు. మాకంటే పెద్దవాడు కావడం వల్లనేమో శివ మా జట్టుతో కలిసే వాడు కాదు. అప్పుడప్పుడూ కనిపిస్తే పెద్దరికంగా పలకరించేవాడు. ఒక సారి కోతికొమ్మచ్చి ఆడుతూ జారి కొమ్మ మీద నుండి పడిపోయి కాలు బెణికి ఏడుస్తూంటే, ఎక్కడున్నాడో పరిగెత్తుకుంటూ వచ్చి నన్ను వుప్పెక్కించుకుని ఇంటి దగ్గర దించాడు. అప్పటి నుండి సెలవులు వచ్చినపుడు నాతోనే తిరిగేవాడు.

ఒక రోజు అందరం పత్తి చేలోకి వెళ్లి, పంపు షెడ్డు దగ్గర ఈదులాడి వస్తూ వున్నాం. వలకల దిబ్బ దగ్గరికి రాగానే నాకు చాలా భయం వేసింది. ఆ రాత్రికి చాలా జ్వరమొచ్చింది. చూడటానికి తండ్రితో కలిసి వచ్చాడు శివ. నా మంచం దగ్గరకొచ్చి చాలా రహస్యంగా “ఏమయింది” అన్నాడు. నేను అంతే చిన్నగా “నాతో పాటు చదువుకునే రాజు చెప్పినట్టే దయ్యమొచ్చేసింది , రాత్రి నన్ను నిద్ర లేపింది. కోడిలాగా కొక్కొరొకో.. కొక్కొరొకో అని అరిచింది” అని చెప్పా. శివ మూతికి చెయ్యి అడ్డం పెట్టుకుని కిసుక్కున నవ్వి, ఆ నవ్వుని ప్రయత్నంతో ఆపుకుని ఆ కోడిని రాత్రి కోళ్ళ గూడులో వెయ్యనట్టుంది అందుకని అరిచుంటుంది. భయపడ్డావ్ కదా? నాకు తెల్సు! నువ్వు బాగయి పో, నేను అర్ధ రాత్రి వలకలకి వెళ్లి వస్తా, నాకేమయినా అవుతుందేమో చూద్దువు కానీ, ధైర్యవంతులని దయ్యాలెం చెయ్యలేవు,” అన్నాడు. నిజంగా వెళ్తాడా అనే ఉత్సుకతతో నాకు మరుసటి రోజే జ్వరం తగ్గి పోయింది. ఆ తరువాతి రోజు రాత్రి శివ స్మశానంకి వెళ్లి వచ్చాడు. ఏం కాలేదా అని భయపడుతూ అడిగితే “నేను శివుడ్ని. నాకు ఏమీ కాదు, అయినా చూడు నేనెంత గట్టిగా వున్నానో, వంద దెయ్యాలనయినా కొట్టేయగలను” అన్నాడు చేతిని మడిచి జబ్బ మీద కండని బిగించి. హటాత్తుగా నాకు ఇందాకటి పొట్టి, పీల శివ గుర్తొచ్చాడు. చిన్నప్పుడు మనకు చాలా పెద్దగా అనిపించిన ఇల్లు, కట్టడాలు పెద్దయ్యాక చూస్తే అంత పెద్దవిగా అనిపించవు . ఇది కూడా అంతేనేమో. ఇప్పుడు అప్పటి శివ మాటలు బడాయిగా అనిపించవచ్చేమో కానీ అప్పుడు తన జట్టు జట్టంతా శివకి దాసోహమయింది. ఆలోచిస్తూ వుంటే ఎందుకో పెదవుల పైకి నవ్వొచ్చింది. నా నవ్వుకి కొనసాగింపులా ప్రసూన వచ్చి ‘ఎవరో విచారింపుకు’ వచ్చారని చెప్పింది.”పంపించు” అంటే వెళ్లి పంపింది. వచ్చిన వాళ్ళు పెద్దమ్మ జీవన శైలిని , సంస్కారాన్ని పొగుడుతున్నారు. కాసేపటికి వాళ్ళని సాగనంపి తిరిగి పెద్దమ్మ గదిలోకి వచ్చాను.

ఎర్రచందనపు ఆ పందిరి మంచంపై పడుకోగానే నిన్న రాత్రి కల జ్ఞాపకం వచ్చింది. పదిహేనేళ్ళకే పెళ్ళయి వచ్చిన పెద్దమ్మ దాదాపు ఇరవై ఏళ్ళు కాపురం చేసింది పెదనాయనతో. పెదనాయన జీవితమంతా ఎప్పుడూ సందడే. పెద్దమ్మ పువ్వు చుట్టూ తిరిగే తుమ్మెదలా రోజంతా పెదనాన్న చుట్టూతే తిరుగుతుండేది . పెదనాన్న ఆ ప్రేమనంతా దీపం చుట్టూ తిరిగే శలభపు ప్రేమ చేసి వెళ్ళాడు. ఎలా తట్టుకుంది అసలు. స్త్రీ బిడియపు వలువలు తొలగించుకుని సంతోషపు పరిశోధనలకు సిద్ధమయ్యే ప్రౌఢ వయసులో పెదనాన్న ఎడబాటుని ఎలా భరించింది. ఎందుకో పెద్ద నిట్టూర్పు వచ్చింది. పక్కకి తిరిగి పడుకున్నాను. పక్కనే గోడపైన నా ఫోటో. పిచ్చి పెద్దమ్మ. ఇక్కడ నుండి వెళ్ళిపోయాక ఒక్క సారి కూడా ఈ వూరి ముఖం చూడలేదు నేను. తనే మా దగ్గరికి వచ్చి వెళ్ళేది. కానీ ఎందుకని నేనంటే ఇష్టం ఆమెకు. ఎవరినయినా దత్తత తీసుకుని దగ్గరుంచుకుని పెంచుకుని ఉండొచ్చు కదా. ఏంటో ఇది. రక్త సంబంధమనేది మానసిక భావన కాదా?

ఉదయం వినీల్ కాల్ తో మెలుకు వచ్చింది. రోజంతా అవీ ఇవీ పనులు. బాబాయి వచ్చాడు.ఇక్కడ భూముల రేట్లు చాలా పెరిగాయని అన్నాడు. అమ్మేస్తే బాగుంటుంది కానీ వినీల్ పెద్దయితే కానీ అమ్మడానికి వీలు కాదు. ప్రసూన కాఫీ, టిఫిన్ తీసుకొచ్చింది. ఆ అమ్మాయి నవ్వు నన్ను చిరాకు పెడుతుంది. కరమంత్రాల ఏర్పాట్ల గురించి చెప్పడానికి వచ్చాడు శివ. మధ్యలో ‘అత్తయ్య’ అని సంబోధించాడు, బహుశా పెద్దమ్మని అనుకుంటా. నా సందేహాత్మక ముఖాన్ని చూసి బాబాయ్ “పల్లెటూర్లలో కులాలు వేరయినా, బంధుత్వాలు లేకున్నా వరస కలిపి పిలుచుకుంటారు కదా అమ్మా, వాడు మీ పెద్దమ్మని అత్తయ్య అంటాడులే,” అన్నాడు. వరుస బాగానే వుంది అనుకుని పైకి వచ్చేసాను. ఇంతవరకు గమనించనేలేదు కానీ మేడపైకి వచ్చేదారిలో ఒక మెట్టు పెద్దదిగా వుండి అటువైపు కొంత స్థలం వుంటుంది. ఆ స్థలం లో గడ్డి నింపిన ఒక బుట్ట అందులో పొదుగుతూ ఒక కోడి వుంది. బహుశా పెద్దమ్మ ఈ గుడ్లు నుండి వచ్చే కోడిపిల్లల్ని

చూస్తాననే అనుకుని వుంటుంది అనుకుని ఏదో ఆలోచిస్తూ నిలబడి వుంటే ప్రసూన వచ్చి నవ్వుతూ "మీ ఫ్రెండంట, ప్రభ వచ్చింది. పైకి పంపమంటారా" అని అడిగింది. తలవూపగానే వెళిపోయింది. కానీ ఈ పిల్లని భరించడం హారిబుల్ అనిపిస్తుంది నాకు ఎందుకని.ఆ పిల్ల భాష గుర్తొచ్చింది. 'ఏమిటి' అనాల్సిన చోట 'వేమిటి' అంటుంది, అంతా ఎక్కడిదో తెచ్చిపెట్టుకున్న భాష.

ప్రభ వచ్చింది. పెద్దదయింది నాలాగే. కూర్చుంటూ 'బాగున్నావా పింకీ' అంది . ఏవేవో మాటలు, చిన్నప్పటి జ్ఞాపకాలు, ముఖ్యంగాఅందరం కలిసి మా సినిమా హాలులో ఫ్రీగా చూసిన సినిమాలు.పాత పాత సినిమాలు తెచ్చి ఆడించే వాళ్ళు. ఒక సినిమాలో ఒకావిడకి అడివిలో బిడ్డ పుడితే ఆ బిడ్డ పైన వాన పడకుండా పైన ఒక చేట కప్పులాగా నిలబడిన సీన్ గురించిన అప్పుడు నడిచిన మా చర్చలు, ఇంకా అటువంటివే అవీ ఇవీ మాట్లాడాక ప్రభ వెళిపోయింది. వెళిపోయిన తరువాత జ్ఞాపకం తెచ్చుకుంటే , ఆ పిల్ల చేయించుకున్న నగలు, వాళ్ళాయన గొప్పతనం, పిల్లలు ఇక్కడి నుండీ టౌన్ కి వెళ్లి ఇంగ్లీషు మీడియంలో చదవడం వంటి మాటలే ఎక్కువ వున్నాయని అనిపించింది. చిరాకు కలిగింది. ఎందుకని? ఇది ఎవరి లోపం?

సాయంత్రం కిందికి దిగి ఇల్లు, వడ్ల కొట్టాలు, పసుల కొట్టాలు అన్నీ తిరగటం మొదలు పెట్టాను. శివ నాతో పాటూ నడుస్తున్నాడు. శివ కంటే కనీసం ఒక ఐదంగుళాలు ఎక్కువ పొడవున్నట్లున్నాను నేను. మీగడ, పాలపొడి కలిపి చేసిన గట్టి బొమ్మలా అనిపిస్తానేమో బహుశా నల్లటి, బక్క పలుచటి శివ పక్కన. వడ్ల కొట్టాలు, వడ్లు లేని కాలంలోఅంటే నాట్లు, నూర్పిళ్ళు సమయంలో పనులకు వచ్చిన వలస కూలీలు 'ఉత్తరాజోళ్ళకి' ఆవాసంగా వుండేవి . ఎక్కడెక్కడి నుండో వచ్చి కోతలు, నూర్పుళ్ళు అయిన తరువాత వెళ్ళేవాళ్ళు వాళ్ళు. ఒక రోజు అందరం దాగుడు మూతలు ఆడుతున్నాం. నేనేదయినా కొట్టులో దాక్కుందామని వెదుకుతున్నా, ఒక కొట్టు తలుపు వేసి వుంది. మూడు నిలువు చెక్కలు ఒక అడ్డ చెక్కకు అతికించి చేసిన ఆ తలుపుకి రెండు చీలికలు వున్నాయి . ఆ చీలికల నుండి లోపల ఉన్నదంతా బాగా కనపడుతుంది. ఆ రంధ్రాల నుండి చూస్తే లోపల ఒక మగా, ఆడ కనిపించారు. మగవాడు తల కింద చెయ్యి ఊతం చేసుకుని ఆ ఆడపిల్ల పొట్ట మీద చెయ్యి వేసి ఆమె ముఖంలోకి చూస్తూ ఏదో మాట్లాడుతూ వున్నాడు. నేనది చూస్తూ వుండే లోపే ఇంకో పిల్ల వచ్చింది నాలాగే దాక్కోవడానికి. ఇద్దరం కలిసి లోపలి సంగతి చూస్తూ వుండగా శివ వచ్చి, మేమేం చూస్తున్నామో చూసి ఇద్దరికీ తల మీద మొట్టికాయలు ఇచ్చి తరిమేసి వెళిపోయాడు. అది తనకు గుర్తున్నట్లు శివకి గుర్తుండి ఉంటుందా ఇప్పటికీ?

ఇద్దరం ఆ కొట్లు దాటుకుని పశువుల కొట్టం దగ్గరకి వచ్చాం. కొట్టంకి అవతల గడ్డివాము పక్కన పెద్ద గంగిరేణి చెట్టు వుండేది. దాని పక్కన రెండు తాటి చెట్లు ఉండేవి. వాటి మొదలు ఒకే దగ్గరనుండి వచ్చి రెండూ ఎడపెడ ముఖాలతో ఉండేవి . ఆ తాటి చెట్లకి రంధ్రాలు చేసి చిలకలు, గూళ్ళు పెట్టేవి. ఒక సారి ఎందుకో చిలకని పెంచాలని వుందని చెప్పింది శివకి తను. ఒక రోజు శివ తాటి చెట్టెక్కి చిలక పిల్లను పటుకొచ్చాడు. పసిగుడ్డు. అది చూసి శివ వాళ్ళ నాన్న శివాని బెత్తంతో నాలుగు బాది మళ్ళీ పిల్లని గూట్లో పెట్టించాడు. ఆ రోజు గంగిరేణి చెట్టు చిటారు కొమ్మ మీద కూర్చుని సాయంత్రం వరకు దిగనేలేదు శివ. అన్నం కూడా తినలేదు. తను చెట్టు దగ్గరికి వెళ్లి పిలిస్తే , "మనిషి తాకిన బిడ్డని గూట్లోంచి తోసేస్తాయంట పక్షులు, ఎప్పుడు తోస్తాయా అని చూస్తున్నా, కిందపడితే తెస్తా, నువ్వు ఇంటికి పో" అన్నాడు. కానీ అవి బిడ్డని గూట్లోంచి తొయ్యనే లేదు.

నేను శివ ఏమయినా మాట్లాడుతాడేమో అని వెనక్కు తిరిగి చూసాను. శివ కొంత దూరంలో ఎవరితోనో మాట్లాడుతున్నాడు. కరమంత్రాలలో పెద్దమ్మ జ్ఞాపకార్థమ్ ఇవ్వాలనుకున్న వెండి గ్లాసులు, భగవద్గీత వచ్చేసాయట. ఇద్దరం మళ్ళీ వెనక్కి వచ్చేసాం. శివ బాగా చదివే వాడు. చురుకైన వాడు. ఎందుకనో హటాత్తుగా చదువు మానేసాడు. ఒక సారి గ్రామ దేవత ఉత్సవం జరుగుతూ ఉండింది. రాత్రంతా పెట్రోమాక్స్ లైట్లు అవీ పెట్టి, కీలుగుర్రాలు, హిజ్రాల ఆటలు ఆడించారు. పిల్లలమందరం పొలోమని పోయ్యాం. పొద్దుపోతే అక్కడే వున్న బంధువుల ఇంట్లో పడుకోమంది పెద్దమ్మ నన్ను. ఎప్పుడో అర్ధరాత్రి వరకు తిరిగి, తిరిగి ఆ బంధువు ఇంటికి వెళ్లాం అందరం. వాళ్ళిద్దరూ ముసలి వాళ్ళు. మేడ పైన బారు పాటి గది ఒకటి వుంటే తలో చాప ఇచ్చి అందరినీ అక్కడ పడుకోమని చెప్పి నన్ను మాత్రం వాళ్ళతో పాటు పడుకోమన్నారు. నేను కూడా స్నేహితులతోనే పడుకుంటానని చెప్పి మిద్దెపైకి వచ్చేసాను. అందరం పడుకున్నాం. శివ నా చాప పక్కనే వేసుకున్నాడు తన చాప. కాసేపయ్యాక ఆ గదిలో ఆరోజు చూసిన మగవాడిలాగా తలకింద చెయ్యి పెట్టుకుని కిటికీ నుండి పడుతున్న మసక రంగు కాంతి లో నా ముకంలోకి అలాగే చూసి , కాసేపాగాక నా గుండె మీద చెయ్యి వేసి నొక్కాడు. అంతే నేను 'అమ్మో నొప్పి' అని అరిచేసాను . అయినా స్నేహితులెవరూ లేవలేదు. శివ మాత్రం చెయ్ తీసేసి తన చాప మీద వెల్లకిలా పడుకుని "నీ పేరేంటి పింకీ.. మంకీ లాగా" అనేసి నిదుర పోయాడు. సరిగ్గా ఆ తరువాతి రోజే తను స్నేహితులతో ప్రహరీ గోడ దగ్గర టెంకాయ చెట్టుకింద పోసి వున్న ఇసుక గుట్ట మీద ఆడుకుంటూ వుంటే వచ్చి, ఆ చెట్టుకి చేయి ఆనించి నిలబడి జనాంతికంగా "నేను చదువు మానేస్తున్నాను తెలుసా?" అన్నాడు. అందరం గట్టిగా "ఎందుకెందుకు ?" అని అరిచాం. శివ "త్వరగా డబ్బు సంపాదించాలి. డ్రైవింగ్ నేర్చుకుంటే త్వరగా డబ్బులొస్తాయ్" అని వెళ్ళిపోయాడు. ఆ తర్వాత కొన్ని రోజులకు, నిజంగానే మా వూరి ప్రైవేటు బస్సులో డ్రైవర్ కి అసిస్టెంటుగా చేరాడు.

చూస్తూ ఉండగానే కరమంత్రాల రోజు వచ్చేసింది. బంధువులందరూ వచ్చేసారు. హేమంత్, వినీల్ కూడా వచ్చారు. హేమంత్ నేను చక్కబెట్టిన ఆర్థిక లావాదేవీలను పునః పరిశీలన చేసి, సంతృప్తిపడి నా సామర్థ్యాన్ని చాలా మెచ్చుకున్నాడు. నేను, పెద్దమ్మ కట్టుబడి చీరల్ని పనిబాపలకి ఇచ్చేసి బంగారు ఝరీ చీరలను పెట్టెలో సర్దుకున్నాను. సాయంత్రం నాలుగు గంటలకు ఫ్లైట్. వూరి నుండి పదకొండింటికి బయల్దేరాలి . బాబాయ్ ఎయిర్ పోర్ట్ కు వస్తానన్నాడు. చివరిగా అన్ని తాళాలు సక్రమంగా పడ్డాయో లేదో లాగి చూసి, కొన్ని తాళాలు బాబాయ్ చేతిలో పెట్టి, కారెక్కడానికి వస్తుంటే ప్రసూన, శివ పిల్లల్ని తీసుకుని వీడ్కోలివ్వడానికి వచ్చారు. ప్రసూన నవ్వుతూ బిడ్డ చేత 'బై..బై ..' చెప్పిస్తుంది. నాకెందుకో హటాత్తుగా చిరాకనిపించి కారులో కూర్చున్న దానినల్లా దిగి వచ్చి ప్రసూన దగ్గర వున్న బిడ్డ చేతిలో కొంత డబ్బు పెట్టి "ఎందుకు అర్థం పర్థం లేకుండా నవ్వుతుంటావ్ నువ్వు" అన్నాను శాంతంగా నవ్వుతూ చిరాకును అదిమిపెట్టుకుని. నా మాటకి ప్రసూనకి బదులుగా శివ "అది దాని పద్ధతి పింకీ, అంతే " అన్నాడు. నేను తిరిగొచ్చి కారెక్కాను.

అందరం ఎయిర్ పోర్ట్ లోపలి వెళ్ళాక "ఇప్పుడే వస్తాను" అని హేమంత్ కి చెప్పి, మాకు చెయ్యి ఊపుతున్న బాబాయి దగ్గరకొచ్చి "బాబాయ్ నేను శివని తలమనిషిగా తీసేసాను. వాడున్నాడు కదా రమణ, వాడిని పెట్టండి. నేను రమణకి చెప్పే వచ్చాను. మీతో మళ్ళీ ఫోన్ చేసి మాట్లాడుతాను" అన్నాను. నా మాటలకు బాబాయ్ ఆందోళన పడి "ఏం తప్పు చేసాడమ్మా వాడు? శివ చాలా నమ్మకస్తుడమ్మా, అలాటి వాళ్ళు దొరకరు" అన్నాడు. మళ్ళీ తనే "అదీ కాక వాడికింకో బ్రతుకు తెరువు లేదు నాయనా" అన్నాడు. నేను నవ్వి, "ఊర్లో వాళ్లందరికీ మనం బ్రతుకు తెరువు కల్పించలేం కదా బాబాయ్. అంతగా మరీ అతనికి ఇబ్బందయితే నాకు చెప్పు. మనకు తెలిసిన వాళ్ళెవరికయినా చెబుదాం. ఈ విషయం మీరే శివకి చెప్పండి. ఇక నేను వెళ్లొస్తాను" అని చెప్పి, వచ్చి హేమంత్ వాళ్ళను కలుసుకున్నాను.అప్పటికే లేట్ అనౌన్స్మెంట్ చేస్తున్నారు. వడివడిగా వెళ్లి ఫ్లైట్ ఎక్కి మా సీట్లు వెతుక్కుంటూ వుంటే నా మొబైల్ మధువంతి మ్రోగింది. చూస్తే శివ, కట్ చేసి కూర్చుని సీట్ బెల్ట్ పెట్టుకున్నాను.


– సామాన్య

కిడ్స్ కార్నర్



జో అచ్యుతానందా.. జో... జో ముకుందా!

'నీలాల కన్నులలో మెల మెల్లగా నిదుర రావమ్మ రావే నిండార రావే....' అన్న పాట విన్నారా పిల్లలూ. ఇప్పటిలాగా తెల్లవారుజాము 5 నుంచి, రాత్రి 8 వరకూ నాన్-స్టాప్ చదువుల రోజులకి బాగా వెనకటి కాలంలో పాట అది. నిండారా నిద్ర సంగతి దేవుడెరుగు, అసలిప్పుడు నిద్ర పోయే టైమే లేదు. పిల్లల్ని తెల్లవారుజామున 4 గంటలకు నిద్రలేపి చదివిస్తే మంచిదనుకుంటారు అమ్మానాన్నలు. అందుకనే మిమ్మల్ని ఉదయాన్నే లేపేస్తారు. మీరేమో పుస్తకాలు ముందేసుకుని తూగుతుంటారు. నిజానికి తల్లిదండ్రులు, తమ పిల్లల్ని ఉదయాన్నే లేపితే చదువగలుగుతున్నారా? లేదా ? అనేది గమనించాలి. ప్రతి వారికీ తమ శరీర ధర్మాన్ని బట్టి నిద్రొస్తుంది. రాత్రిళ్ళు ఎక్కువ సేపు మేల్కొనే వాళ్ళు ఉదయం తొందరగా లేవలేరు. ఉదయం తొందరగా లేచేవాళ్లు రాత్రిపూట మేల్కోలేరు. పిల్లల బాడీ క్లాక్ ను గమనించి దాని ప్రకారం కార్యక్రమాల టైంటేబుల్ తయారు చేసినట్లైతే అందరు పిల్లలు బాగా చదివే అవకాశం ఉంటుంది. అలాకాకుండా, పిల్లల్ని 'నువ్వు మొద్దుని పొద్దున్నే లేవట్లేదు..' అనితిట్టడం వల్ల ప్రయోజనం లేదు. పిల్లలకి 18 ఏళ్లు వచ్చే వరకూ 10 గంటలు నిద్రపోవడం మంచిదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



దారి కనుక్కోండి


చిన్నారి 'చిత్రం'




ఎస్.అబ్దుల్లా
3వ తరగతి, నంద్యాల,
గురురాజా స్కూల్.




చిన్నారుల పెయింటింగ్స్‌ను apchiefeditor@gmail.comకు ఈ మెయిల్ చేస్తే ప్రచురిస్తాం.



చుక్కలు కలపండి



రంగులు వేయండి



ఎటువంటి పరిమితులు లేవు



విద్యావంతులైన యువకులు అద్భుతాలు చేస్తున్నారు. అతి సామాన్యమైన కుటుంబంలో పుట్టిన యువకుడొకతను ఒక చిన్న ఆవిష్కరణ చేస్తాడు. ఒక స్టార్టప్ కంపెనీ ప్రారంభిస్తాడు. అతని దగ్గర పెట్టుబడి లేదు. అన్ని ప్రాంతాలకు విస్తరించగల వ్యూహంలేదు. తనతో కలసి పనిచేయడానికి ముందుకొచ్చే నిపుణులు లేరు. ఒంటరిగా తనంతట తాను రూపొందించిన ఓ కొత్త ఆలోచన సరైన రీతిలో పదిమందికీ తెలియగానే ఒక అద్భుతం జరిగిపోతుంది.

ఈ ఆలోచనను వ్యాపారంగా మలచడానికి మంచి అవకాశం ఉందని గుర్తించిన వారు ఇందులో కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టడానికి ముందుకు వస్తారు. ఈ రంగంలో అనుభవం ఉన్న వ్యక్తులు ఉద్యోగాల కోసం ఎగబడతారు. ఈ కొత్త వాణిజ్యం తమకెలా ఉపయోగపడుతుందోనని చాలా మంది ఎదురు చూడడం ప్రారంభమవుతుంది. కొందరు దీనితో చేతులు కలుపుతారు. కొద్దికాలంలోనే ఈ ఆరంభ సంస్థ అనేక దేశాలకు విస్తరిస్తుంది. దీనిమూల విలువ అనుకోని రీతిలో పెరిగిపోతుంది. ఏం చేయాలో తేల్చుకోలేని స్థితిలో కాలేజీ నుండిబయటకు వచ్చిన యువకుడు ఏనాడూ ఊహించని రీతిలో, కొద్ది కాలంలోనే కోట్లకు అధిపతి కాగలిగాడు.

ఈ యువకుడు అసలేం చేశాడు? వివిధ రంగాలకు చెందిన చిన్న చిన్న వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు తమ తమ వాణిజ్యాన్ని ఏ ఏ రంగాలకు ఎలా విస్తరించవచ్చో అతి వివరంగా తెలియచేసే సాఫ్ట్‌వేర్‌ను అతను రూపొందించాడు. సమాజం పట్ల, ప్రజల అవసరాల పట్ల అవగాహనతో ఆ యువకుడి మదిలో మెదిలిన ఆలోచన అతని జీవితాన్ని మార్చివేసింది. అలాగే కొన్ని లక్షల మందికి ప్రయోజనాన్ని కలగజేసింది. ఈ చిన్న అంశాన్ని అత్యధిక శాతం మంది గుర్తించారు. అందుకే తమ ఆలోచనలపై అనేక పరిమితులు విధించుకుంటుంటారు. పాత తరహా ఆలోచనలను, మారుతున్న కాలానికి అనుగుణంగా లేని విశేషాలను విశ్వసిస్తుంటారు.

తమకు తగినంత పెట్టుబడి కావాలి. రాజకీయాలలో ఉన్న వారు, ఉన్నత పదవులలో ఉన్న వారి అండదండలు కావాలి. తను ఎంచుకున్న రంగంలో నిపుణులైన వారి సహాయ సహకారాలు కావాలి. అన్నింటికీ మించి తను ఏ రంగంలోనైనా కృషి చేయడానికి ముందుగా తనకు సరిపడిన ఆదాయం కావాలి. ముందుగా ఏదో ఒక ఉద్యోగంలో స్థిరపడితే ఆ తరువాత దేన్ని గురించి అయినా ఆలోచించవచ్చు. ఇటువంటి ఆలోచనలతో స్వతంత్రంగా ఏ పనిని చేపట్టడానికి చాలామంది సంసిద్ధులు కారు. అంతేకాదు, చిన్నతనం నుండి ప్రతి ఒక్కరూ అనేక ప్రతికూల వ్యాఖ్యానాలను ఎదుర్కొంటుంటారు. లావుగా ఉంటాడు. సన్నగా ఉంటాడు. నల్లగా ఉంటాడు. ఏ అంశాన్ని త్వరగా అర్థం చేసుకోలేడు. బద్ధకం ఎక్కువ. సోమరిపోతు. అందరితో పోట్లాడతాడు. కష్టపడి చదువుకోవడంకంటే కాలక్షేపం చేయడానికి ఇష్టపడతాడు. క్లాసులో మొదటి స్థానంలో ఎలా ఉండాలన్న ధ్యాసే లేదు' ఇటువంటి వ్యాఖ్యానాలను ఎదిగే క్రమంలో చాలా మంది మరచిపోతారు. కొందరు వీటిని తమ మనసుపై బలంగా ముద్రించుకుంటారు. వాటి కారణంగా తమపై తాము అనేక పరిమితులు విధించుకుంటారు. తమనెవరూ ఇష్టపడరని, తాము స్వంతంగా ఏమీ చేయలేమని, ఇతరులకున్న మేధాశక్తి తమకు లేదని, లేనిపోని ఆలోచనలు చేసి ఆకాశానికి నిచ్చెనలు వేయకూడదని, తమ పరిమితులలో తాము జీవించడం అలవాటు చేసుకోవాలని నిర్ణయానికి వచ్చేస్తుంటారు.

నిజం చెప్పాలంటే మన ప్రపంచంలో ఏ ఒక్కరికీ ఎటువంటి పరిమితులు లేవు. తాము వున్నాయనుకునే పరిమితులన్నీ తమపై తాము విధించుకున్నవి మాత్రమే. చిన్నతనం నుండి ప్రతి ఒక్కరూ అనేక వైఫల్యాలను ఎదుర్కొంటూనే ఉంటారు. ఎదురు లేకుండా ముందుకు సాగిపోగలమని గాఢంగా విశ్వసించిన చోట కూడా ఎదురుదెబ్బలు తగలవచ్చు. ఈ వైఫల్యాలు ఎదురైనప్పుడు ఎవరైనా ఎలా ప్రతిస్పందించు చున్నారన్న అంశంపైనే వారి ప్రగతి ఆధారపడి ఉంటుంది. ఒకతను ఒక వ్యాపారం ప్రారంభించి తీవ్రంగా నష్టపోతాడు. మరొకతను ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేయబోతే అనుకోని కష్టాలు, నష్టాలు ఎదురవుతాయి. అందరికీ ఉపయోగపడే పరికరాన్ని ఎంతో కష్టపడి రూపొందిస్తే దానికి ప్రజల ఆదరణ లభించదు.

తమ జీవితంలో నిరాశా, నిస్పృహలు అనేక సందర్భాలలో ఎదురవుతుంటాయి. వైఫల్యాలు ఎదుర్కొనని వారు అసలీ సమాజంలో ఎవరూ ఉండరు.వైఫల్యం ఎదురవ్వగానే అత్యధిక శాతం మంది ఆత్మ విశ్వాసాన్ని కోల్పోతారు. నిస్పృహలోకి జారిపోతారు. తమ శక్తి సామర్థ్యాలను శంకించడం ప్రారంభిస్తారు. మరే పని చేయాలన్నా, చొరవ తీసుకోరు. మరే పని ప్రారంభించినా అందులో వైఫల్యం ఎదురు కాకూడదని అనేక జాగ్రత్తలు తీసుకోబోతారు. ఒక ప్రమాదంలో చిక్కుకొని అంగ వైకల్యాన్ని ఎదుర్కొన్న వారిలా వారి పరిస్థితి తయారవుతుంది.

అతి కొద్ది మంది మాత్రమే ఇందుకు భిన్నంగా ప్రతిస్పందిస్తారు. తాము ఎదుర్కొన్న వైఫల్యం వలన తాము కోల్పోయింది ఏమిటి అని ఆలోచిస్తారు. తమ శ్రమ, కాలం, డబ్బు కోల్పోయామని, అయినా కోల్పోయిన దానికంటే అతి విలువైన అనుభవాన్ని పొందగలిగామని భావిస్తారు. ఏ పనీ చేయకుండా కూర్చున్న వారికి ఇటువంటి అనుభవం ఏనాటికీ చేకూరదని గుర్తిస్తారు. తోటి వృత్తుల పట్ల తమ దృక్పథంలో కూడా ఎంతో మార్పు వస్తుంది. ప్రతి ఒక్కరినీ గుడ్డిగా విశ్వసించడం మాని, వారి దృక్కోణాన్ని అవగతం చేసుకోవడం అలవాటవుతుంది. నిజం చెప్పాలంటే, ప్రతి వైఫల్యం ప్రతి ఒక్కరిలోనూ పరిణితి తేవడానికి తోడ్పడుతుంది. తాము ఎదుర్కొన్న వైఫల్యాన్ని తాము ముందుకెదగడానికి ఓ మెట్టుగా వినియోగించుకునే వారు తమపై దానినొక పరిమితిగా పరిగణించరు. తమకెదురైన ప్రతి వైఫల్యం నుండి తామేం నేర్చుకోవాలా అని ఆలోచిస్తారు.

– సి నరసింహారావు
మనోవైజ్ఞానిక విశ్లేషకులు



మంచి దారికి మంచి మాటలు

అన్నిటికంటే ఉత్తమ ప్రయోజనకారి ధర్మమే. చేయవలసిన దానిని, సరైన సమయంలో సర్వజనహితంగా చేయటమే ధర్మం. అదొక నిష్ఠ.

తనకు, తనతోటి వారికి, సర్వహితంగా వుండేట్లు జీవించాలని కోరుకోవటం అభిలషణీయం. ఎందుకంటే జీవుడు సృష్టిలో భాగం కనుక. జీవితం ఈ సాధనలో అంకితం కావాలి.

మనసు ద్వారా విషయవాంఛలను రేకెత్తించే యింద్రియాలు అసలు దొంగలు. ఇవన్నీ జీవుడి లోపలే వున్నయ్. దొంగలను ఒక కంట కనిపెట్టి వుండాలి. అప్రమత్తంగా వుండాలి. సాధనతో దొంగలను లొంగతీసుకుని, మనసును హృదయంతో కలిపి, నిలుపుకోవాలి.

ఏ పనీ చేయకపోవటం, ఆత్మ విచారణ సాగించక, కాలమంతా, ప్రాపంచిక ఆలోచనలతో కాలాన్ని చెల్లగొట్టటం, బుద్ధిమాంద్యం. నిష్క్రియ మంచిది కాదు. క్రియాశీలంగా కాలం గడవాలి.

గొప్పతనం యివ్వటంలో వున్నది. పుచ్చుకోవటంలో కాదు. అడగటంలో, అడిగి పొందటంతో అవమానం దాగి వుంది.

హాయిగా వుండలేకపోవటం, ఎవరికీ ఆనందాన్ని కలిగించలేక పోవటమే, దురదృష్టం.

పరిస్థితులెట్లావున్నా, అన్ని వేళలా హాయిగా వుండాలి. సమన్వయంతో, సామరస్యంతో పరిస్థితులన్నిటిని చక్కదిద్దుకోవాలి. సంఘర్షణకు తావులేని విధంగా, సుఖంగా వుండాలి.

అనుభవం నేర్పిన గుణపాఠాన్ని గుర్తుంచుకుని, తిరిగి తప్పుచేయకుండా జీవించాలి. క్రమశిక్షణతో జీవితాన్ని నడపాలి.

యౌవనం, ధనం, జీవితం... యివన్నీ తామరాకు మీద నీటి బిందువులే. ఈ స్పృహ వలన స్పష్టత, స్వచ్ఛత, నిబద్ధత ఏర్పడి, మానవజీవితం ఆనంద సాగరమౌతుంది.

సరైన సమయంలో చేసే సహాయమే అత్యంత విలువైనది. అవసరానికి అక్కరకు రానిది, సకాలంలో కురవని వర్షం వంటిది.

రహస్యంగా, లోకం కంటపడకుండా చేసే పాప చింతన, పాపకార్యం భయంకరమైనది. ఆత్మవంచన వలన జీవించినంత కాలమూ, మనసును శూలం వలె పొడిచి, తీర్చరాని వేదనను మిగుల్చుతుంది.

అజ్ఞానాన్ని మటుమాయం చేయగల విద్యే ఆత్మవిద్య; ప్రాణాన్ని నిలబెట్టి ఆరోగ్యాన్నివ్వగల ఔషధం; ఇంకొకరికి యాతనను, బాధను, క్షోభను తొలగించగల త్యాగము, దానము; ఇవే దివ్య సాధనలు.

ధర్మపరాయణుడు, సత్యశోధకుడు, సత్యసాధకుడు పరాజయమెరుగడు. తనను తాను తెలుసుకున్నందున, అటువంటి వాడు జగదేకవీరుడే!

ఆత్మనెరిగినవాడు, దయామయుడు, వినమ్రుడూ, ఈ మూడు విధాలైన మానవుడి అధీనంలో ఈ సృష్టి సర్వానందమయంగా వుంటుంది.

ధర్మమార్గంలో నడవటం, ఆత్మను ఎరగటం, ఆత్మగా జీవించటం, నిశ్చల, నిర్మల, నిరంజన, నికేతన స్థితిలో నిలకడగా వుండటం.... వీటన్నిటి వలన అనంతానందం లభిస్తుంది. అధర్మం దుర్దశకు దారితీయిస్తుంది.

ఎవరినుండీ ఏమీ ఆశించకపోవటమే మహోన్నత దానం. భగవంతుణ్ణి సైతం ఏమీ అడగకుండా వుండగలగాలి. మన అవసరం భగవంతుడికి తెలుసు. ధర్మజీవనం గడిపేవాడికి, అది అయాచితంగా లభిస్తుంది.

పాప భావన నుండి, పాపకార్యం నుండి మనసును మరల్చి హితం పలికేవాడే, నిజమైన స్నేహితుడు.

మధురమైన పలుకులతో కూడిన దానం, వినయంతో కూడిన విద్య, సహనంతో కూడిన ధైర్యం, త్యాగంతో కూడిన సంపద... ఎంతో సాధన చేస్తే గాని రాబట్టుకోలేం. ఎంత కష్టమైనా సాధించుకోవలసినవి, ఇవి.

దయాహీనత, కార్పణ్యం, ఎన్నడూ మనయందు ఉండకూడదు.

దురాశాపరుడైన ప్రభువు; మూర్ఖుడు... వీరున్న ప్రదేశంలో వుండకూడదు. ఉండవలసి వచ్చినా, చేరువ కాకూడదు.

సర్వసంపదలూ వుండి కూడా ఎవరికీ సాయపడని, అక్కరకు రాని వ్యక్తి ఈ ప్రపంచంలో వుండీ వ్యర్థుడే. ప్రయోజనం లేని జీవితం వాడిది.

జన్మ ఎత్తినందుకు సాధించుకోవలసినవి, జ్ఞానం, సంపద, శక్తి, కీర్తి, ప్రతిభ!

జ్ఞానం వలన ఆత్మసాక్షాత్కారం; సంపద వలన సత్కర్మాచరణ; శక్తి వలన కార్యసాధన; కీర్తి వలన నిత్యస్ఫూర్తి, ప్రతిభ వలన శ్రేయస్సు; కలుగుతయ్.

మంచి గుణాలను నాశనం చేసే 'లోభం' వదులుకోవాలి. లోభం భయాన్ని, అసహనాన్ని, అభద్రతను-పెంచి, దైవీ గుణాలను తుంచుతుంది.

అహంకార మమకారాల వలన కలిగే 'లాలస', జీవుడి నిత్య శత్రువు. కామం అనర్థహేతువు.

కీర్తిని, సహధర్మచారిణిని, స్వబుద్ధిని రక్షించుకోవాలి.

అందుకోగలిగిన అర్హత, అందుకోవాలన్న తీవ్ర కాంక్ష వున్న శిష్యుడికి అందించిన జ్ఞానమే, యిలలో కల్పతరువు.

క్రూరత్వమే మహాపాతకం.

అపకీర్తే మహామృత్యువు.

ఒదిగి వున్నవాడే ఎదుగుతాడు.

ఆయుష్షు కంటే ఆరోగ్యమే మిన్న.

వర్షమే జీవన హేతువు.

భీతి చెందిన వాణ్ణి రక్షించేవాడే, ధీశాలి.

గురువే సర్వ రక్షకుడు.

తల్లే ప్రత్యక్ష దేవత.

తండ్రే రక్షకుడు.

ఆకలి గొన్నవాడే, అన్నం అందుకోవటానికి అర్హుడు!

– వి.యస్.ఆర్. మూర్తి
ఆధ్యాత్మిక శాస్త్రవేత్త



సినీరంగంలో సెంటిమెంట్స్



సినిమా రంగంలో నమ్మకాలు, శకునాలు, సెంటిమెంట్స్ విషయానికి వస్తే తక్కిన రంగాల్లోకంటే కొంత మోతాదు ఎక్కువగానే ఉంటుంది. ఉదాహరణకు ఓ పరభాషా చిత్రాన్ని తెలుగులో తీస్తున్నారనుకోండి. మూలచిత్రంలో ఓ ముఖ్య సన్నివేశాన్ని ఏదో ఒక ఊర్లో ఒక మర్రిచెట్టు కింద తీశారనుకోండి. రీమేక్ చేస్తున్నప్పుడు ఆ సన్నివేశాన్ని అదే మర్రిచెట్టు కింద తీయడానికి అంతా కష్టపడి ఆ ఊరికి వెళ్తారు. అంటే అక్కడ తీయడం వల్లే ఆ సినిమా 'హిట్' అయి ఉంటుందనే సెంటిమెంట్ వాళ్లను అలా నడిపిస్తుంది.

ప్రసిద్ధ దర్శకుడు కోడి రామకృష్ణ తొలి చిత్రం 'ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య'కు ఈ సెంటిమెంట్ అవరోధాలు ఎన్నోరకాలుగా ఎదురయ్యాయి. ఎలా అంటే షూటింగ్ తొలిరోజు ముహూర్త సమయానికి చేరుకోవలసిన హీరో చిరంజీవి కారు దార్లో బ్రేక్ డౌన్ అయింది. ఆయన సమయానికి రాలేకపోయారు. సరే ముహూర్తం మించిపోకూడదని కథానాయిక పూర్ణిమ మీద మొదటి దృశ్యాన్ని తీశారు. డైరెక్టర్ 'కట్' చెప్పాక ఛాయాగ్రాహకుడి వంక చూస్తే, ఆయన తెల్లమొహం వేసుకుని ఉన్నారు. 'సారీ సర్.. కెమెరా ప్లగ్ పెట్టడం మర్చిపోయాను' అని అనేసరికి మొట్టమొదటి సారిగా డైరెక్షన్ అవకాశం వచ్చిన ఆ దర్శకుడి మనోభావాలు ఎలా ఉంటాయి? ఇంతలో చిరంజీవి ఆ షూటింగ్ స్పాట్‌కు చేరుకున్నారు. జరిగిన సంగతి తెలుసుకుని 'మొదటి షాట్ నా మీద తీయాలనుకున్నావ్ కదా తీసెయ్' అని కోడిరామకృష్ణను ఉత్సాహపరిచారు. అలా సినిమా ప్రారంభమైంది. తీరా సినిమా పూర్తయి సెన్సార్‌కు వెళ్లాక అక్కడ సినిమా టైటిల్‌కు అభ్యంతరం చెప్పారు. అంతేకాదు నాలుగు వేల అడుగుల మేరకు కట్స్ ఇచ్చారు. దాంతో సినిమా విడుదల నెలరోజులపాటు వాయిదా పడే పరిస్థితి ఎదురైంది. అప్పుడు చిత్ర పరిశ్రమలోని పెద్దలు కలగజేసుకోవడంతో తక్కువ సమస్యలతోనే ఆ చిత్రం విడుదలైంది. ఇన్ని జరిగినా, ఆ సినిమా ఘన విజయం సాధించి కోడి రామకృష్ణకు చిత్రరంగంలో సుస్థిర స్థానాన్ని ఏర్పరచింది. ఈ సెంటిమెంట్స్ గురించి ఎవరికి వారు అనుకోవడమేగానీ నిజంగా వాటి ప్రభావానికీ ఫలితాలకూ ఎలాంటి సంబంధమూ ఉండదని ఎవరు ఎంతగా చెప్పినా, అవి మాత్రం ఈ రంగంలో అలా కొనసాగుతూనే ఉన్నాయి.

లీల కాదు.. ఎస్.జానకి లీల!

ప్రముఖనటి సావిత్రి నటించిన 'మురిపించే మువ్వలు' చిత్రంలో ఆరుద్రగారు రాసిన 'నీ లీల పాడెద దేవా' అనే ఓ ప్రసిద్ధ గీతం ఉంది. ఆ సినిమా వచ్చి ఎంతో కాలమైనా నేటికీ ఆ పాట రసజ్ఞులైన పండిత పామర ప్రేక్షకులను మురిపిస్తూనే ఉంది. ఆ పాట వెనక ఓ చిన్న కథ ఉంది. ఈ చిత్రానికి సంగీత దర్శకులు ఎస్ఎం సుబ్బయ్య నాయుడుగారు. ప్రసిద్ధ నాదస్వర విద్వాంసుడు కారుకురుచ్చి అరుణాచలంగారి నాదస్వరానికి అనుగుణంగా ఈ పాటను తమిళం, తెలుగు భాషల్లో పాడాలి. సంగీత ప్రధానమైన చిత్రం (తమిళంలో కొంజుం సలంగై) కాబట్టి పాట అద్భుతంగా రావాలని ప్రముఖ గాయని పి.లీలగారిని సంప్రదించారు. 'ఈ కష్టతరమైన పాటకు పూర్తిగా న్యాయం చేయాలంటే, నేను కాదు.. ఎస్.జానకిగారే



సమర్థురాలు' అని లీలగారు సంగీత దర్శకుడితో వినమ్రంగా చెప్పారు. ఈ పోటీ ప్రపంచంలో ఏమాత్రం వీలున్నా, ఇతరుల అవకాశాలు చేజిక్కించుకోవడానికి ప్రయత్నించే వారే ఎక్కువ మంది ఉంటారు. కానీ తనకు వచ్చిన అవకాశాన్ని కాదని ఆమె జానకిగారి పేరు సూచించడమే విశేషం. ఆమె అన్నట్టుగానే ఎస్.జానకిగారు రెండు భాషల్లోనూ ఆ పాటను అద్భుతంగా పాడి అందరినీ మెప్పించారు. అయితే కథ అంతటితో ఆగిపోలేదు. 'నా పాటంటే పి.సుశీలగారే పాడాలి. మరొకరిచేత ఎందుకు పాడించారు?' అని కథానాయిక సావిత్రి అభ్యంతరాన్ని లేవదీశారు. అప్పటికే ఆ పాట మీద గట్టి నమ్మకాన్ని ఏర్పరచుకున్న దర్శక నిర్మాతలు 'మీరు ఆ పాటకు నటించనంటే మరో పాత్రను సృష్టించి ఆమె మీద చిత్రీకరిస్తాం కానీ గాయనిని మార్చే ప్రసక్తి లేదు' అని గట్టిగా చెప్పారు. ఎస్.జానకి గారి పాట విన్నాక, సావిత్రి కూడా తన అభిప్రాయాన్ని మార్చుకుని, సంతోషంగా ఆ పాటకు తన అభినయంతో మరింత శోభను చేకూర్చారు. చిత్రరంగంలో ఇలాంటి చిత్రాలు కూడా తరచుగా జరుగుతూ ఉంటాయి.

ప్రేమ గుడ్డిదేనా?

'లవ్ ఈజ్ బ్లయిండ్.. అండ్ లవర్స్ కెనాట్ సీ' అన్నాడు షేక్స్పియర్ 'మర్చంట్ ఆఫ్ వెనిస్'లో. సినిమా నాయికలు ఎన్నో సినిమాల్లో ప్రియురాలి పాత్రల్లో నటిస్తూ, ప్రేమకు సంబంధించిన భావోద్వేగాలను చక్కగా అభినయిస్తూ ఉంటారు. అంతమాత్రంచేత వాళ్లకు 'ప్రేమ' పట్ల మంచి అవగాహన ఏర్పడుతుందనీ, ఆ విషయంలో వాళ్లు తెలివిగా వ్యవహరిస్తారని అనుకోడానికి లేదు. ఎందుకంటే కొంతమంది తారలు ఈ విషయంలో అతి సాధారణమైన యువతుల్లా 'ఫెయిల్' అయిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఉదాహరణకు దక్షిణాది మీనాకుమారి అని పేరు పొందిన సావిత్రిని, ఉత్తరాదిన మీనాకుమారిని పేర్కొనవచ్చు. ఇద్దరూ ప్రేమ, విషాద పాత్రలకు పెట్టిందిపేరు. మీనాకుమారి కూడా సావిత్రిలాగే ఓ వివాహితుడ్ని ప్రేమించింది. పెళ్లయిన కొంతకాలానికే భర్త, సినీ దర్శకుడు కమల్ అమ్రోహి నిజస్వరూపం ఏమిటో ఒకటొకటిగా బయటపడుతూ వచ్చింది. నువ్వు నాకే సొంతం. నా సినిమాల్లో తప్ప ఇతరుల సినిమాల్లో నటించకూడదు అని మొదట ఆజ్ఞాపించాడు. అందుకు మీనాకుమారి అంగీరించింది. అయితే కొన్నాళ్లపాటు నటించి ఓ రెండు లక్షల రూపాయలు సంపాదించి, తన తండ్రికి ఇచ్చి ఆ తర్వాత నటించడం మానేస్తానంది. అంతవరకు మన వివాహం రహస్యంగానే ఉండనిద్దామని అభ్యర్థించింది. అందుకు సరేనంటూ ఆమెకు మూడు షరతులు విధించాడు ఆ భర్త. ఒకటి ఎట్టి పరిస్థితుల్లోనూ షూటింగ్ సాయంత్రం ఆరున్నరకు ముగించుకుని, ఇంటికి చేరుకోవాలి. రెండు స్టూడియోలోని మేకప్ గదిలోకి మేకప్ వాళ్లను తప్ప మరెవరినీ అనుమతించకూడదు. మూడు షూటింగ్‌కు వెళ్లడానికి, తిరిగి రావడానికి తన కారునే ఉపయోగించుకోవాలి తప్ప మరెవరి కారులోనూ



ప్రయాణించకూడదు. ఇవి ఆ ప్రేమికుడు ఈ ప్రియురాలికి విధించిన నిబంధనలు. ఈ పురుష అహంకారపు ఆంక్షలు విన్న తర్వాతే మీనాకుమారికి తన ప్రేమ ఫలితం ఏమిటో అర్థమై ఆవేదనతో ఉక్కిరిబిక్కిరి అయిపోయింది. సావిత్రి ప్రేమ కూడా చివరికి అటువంటి పరిస్థితులకే దారితీసింది.

– బి.కె.ఈశ్వర్



వృక్షజాతికి ప్రాణం ఉన్నా అవి కదలేవు. ప్రాణి కాబట్టి తన జాతి అంతరించిపోదానికి ఇష్టపడదు. ఒకేచోట నేలలో పాతుకుపోయి ఉన్నా అవి బీజవ్యాప్తి చేసుకుంటాయి. కొన్ని చెట్లు కమ్మని కాయల్ని పండ్లని ఎరగా వేసి మనుషుల్ని, పక్షుల్ని, ఉడతల్ని ఆకర్షిస్తాయి. అవి పండ్లని తిని వాటి విత్తనాలను దూరంగా పడేస్తాయి. కొత్త జామలు, మామిళ్లు ఎక్కడెక్కడో మొలకెత్తి పెరుగుతాయి. ఈ విషయంలో పక్షిజాతి ఎక్కువ సేవ చేస్తాయి. కొన్ని మొక్కలు కాసే కాయలు బాగా ముదిరి ఎండాక చిటుక్కున చిట్లుతాయి. విత్తనాలు దూరంగా పోయి పడతాయి. ఉత్తరేణి, తేలుకొండి లాంటివి పశువుల్ని పట్టుకుని ప్రయాణిస్తాయి. కొన్ని గింజలు గాలిలో ఎగురుతాయి. మరికొన్ని నీటి ప్రవాహాల్లో కొట్టుకు వెళ్తాయి. భాష కూడా ఇలాంటిదే. గ్రంథ రచనల ద్వారా ప్రచారంలోకి వచ్చే పదసంపద సేద్యంలాంటిది. వ్యవసాయంలో నారుమళ్లు పోయడం, పెరిగాక నాట్లు వేయడం, పంట పొలాన్ని కాపాడడం తప్పనిసరి. అప్పుడే చేను అక్కరకు వస్తుంది. భాషని కూడా పంట చేనులాగా చూసుకోకపోతే విత్తనం మళ్లదు. తెలుగు భాషలో ఈ 'విత్తనం మళ్లదు' అనేది సేద్యగాడు వాడే మంచి మాట. అంటే విత్తనాలుగా జల్లిన ఆ మానెడు సోలెడు గింజలు కూడా పండవని అర్థం. తెలుగు భాష గ్రామీణ ప్రాంతంలోనూ, ముఖ్యంగా చేతివృత్తుల వారి వద్ద చాలా కాలం చెక్కు చెదరకుండా ఉంది. పశుసంపద పోయాక, వాటి ద్వారా జరిగే బీజవ్యాప్తి ఆగిపోయింది. ఆనకట్టలు వచ్చాక ప్రవాహాల్లోంచి వచ్చే వాటికి అడ్డుకట్టలు పడ్డాయి. ఇది భాషకు వర్తిస్తుంది.

– సంపాదకుడు

కృష్ణా పుష్కరవేళ



కృష్ణా తీరం అన్నివిధాలా సారవంతమైంది. సంసారంలో, సాహిత్యంలో, సంగీతంలో ముక్కారు పంటలు ఇక్కడ పండాయి. ఇక్కడ ఆకాశవాణి ఒక అదనపు పంట భూమి. తెలుగులో కొత్త కొత్త మాటలు పుట్టించిన మహనీయులెందరో ఉన్నారు. 'ఎవరూ పుట్టించకపోతే మాటలెలా పుడతాయి! వెయ్యండిరా వీడికొక వీరతాడు!" – మాయాబజార్ చిత్రంలో పింగళి నాగేంద్రరావు మాట ఇది. తన మాటనే ఘటోత్కచుని నోట పలికించి మెప్పించారు. తెలుగు సినిమా మాటతీరుకి పింగళి ఒరవడి పెట్టారు. ముఖ్యంగా మాయాబజార్ లాంటి పౌరాణిక చిత్రానికి సాంఘిక చిత్రపు మాటలు కూర్చి మెప్పించారు. మాయాబజార్ ద్వాపరం నాటిదే కావచ్చు. ద్వారకా నగరంలో రాజమందిరాలలో జరిగి వుండచ్చు. కానీ చూచేవారికి బందరులో ఎక్కడో ఒక మధ్య తరగతి మండువా లోగిలిలో కథ నడుస్తున్నట్టు ఉంటుంది. పింగళి మాటలు రాజదర్పాలతో, గ్రాంథికాలతో ఏమాత్రం ఇబ్బంది పెట్టవు. అందుకే ప్రతిమాటా, ప్రతి సంభాషణా తెలుగు వారికి కంఠస్థం అయిపోయింది. కృష్ణాతీరపు రుచుల్ని నవ్విస్తూ నవ్విస్తూనే చెప్పించి మెప్పించారు. గోంగూరని, ఆవకాయని ప్రస్తుతించారు. కూచిపూడి సాంప్రదాయంలో 'భామాకలాపం' విశిష్టమైన యక్షగానం. అందులో రుక్మిణీదేవి తన ప్రియుడు కృష్ణస్వామికి రాసే లేఖ చాలా ప్రసిద్ధం. అందులో "..శాయంగల విన్నపములు.." అనే చక్కని జానపద పద ప్రయోగం ఉంది. అంటే చేయగల విన్నపాలని అర్థం. దాన్ని పలుచోట్ల పింగళి అందంగా వాడుకున్నారు. గుండమ్మకథ సినిమాలో ఒక పాటలో "జగమే ఊటీ శాయగ" అని రాశారు. ఇది పింగళికి చాలా యిష్టమైన పదబంధంగా చెబుతారు. అందుకే "సాహసం శయరా ఢింభకా" అని కూడా అనిపించారు.

దివిసీమను దివ్యసీమను చేసిన కవి వేటూరి సుందరరామ్మూర్తి. అర్థం పరమార్థం ఉన్న వేలాది పాటలు రచించిన వేటూరికి కృష్ణా తీరమన్నా, కృష్ణా నదన్నా వల్లమాలిన ప్రేమ. తెలుగు సినిమా పాటకి కొత్త నడకలు నేర్పింది పింగళి అయితే, పాటకు అన్ని హంగులు, రంగులు అద్దిన వారు వేటూరి. చాలా చిన్న చిన్న తేడాలతో పెద్ద పెద్ద తీర్మానాలు చేయడం ఆయనకే యెరుక. ఆకుచాటు పిందెతడవడం తెనాలి రామకృష్ణ కవి ప్రయోగమైతే, దాని సరసన కోకచాటు పిల్లని తడిపించే పాటకట్టి, కోటి రూపాయల పాటగా నిలబెట్టారు. శుభస్య శీఘ్రం పక్కన 'పదస్య పదిలం' అని సొంత కవిత్వంతో పాటని మెరిపించారు. సరికొత్త మాటల్ని అలవోకగా కట్టడం వేటూరికి వినోదం. తెలుగు పలుకుబడిని ఆ మహనీయుడు విస్తృతపరిచారు.

హాస్యరచయితగా ఆవిర్భవించి, గొప్ప దర్శకునిగా ఆరోగ్యకరమైన చిత్రాలు తీసిన జంధ్యాల స్మరణీయులు. ఆయన నేపథ్యం బెజవాడ. దాన్ని చెక్కు చెదరకుండా తన చిత్రాలకు ఎక్కించారు. బెజవాడ మాటతీరు, మానరిజమ్స్ ఆయన సినిమాల్లో కొట్టొచ్చినట్టు, తన్నొచ్చినట్టూ కనిపిస్తాయి. తెలుగులో పూర్తి నిడివి హాస్యచిత్రాలను పండించిన ఘనత జంధ్యాలదే. బోరు కొట్టడానికి ప్రతీకగా సుత్తిని పరిచయం చేశారు. సుత్తి వేయడం, సుత్తి కొట్టడం, సుదీర్ఘ సుత్తి, రివర్స్ హామరింగ్ – ఇలా సుత్తిని శాస్త్రీయంగా విశ్లేషించారు. తెలుగు జాతికి పూర్తిగా పట్టించారు. దశాబ్దాలు గడిచినా సుత్తి ఎవర్‌గ్రీన్‌గా కొట్టబడుతూనే ఉంది.

మల్లాది రామకృష్ణశాస్త్రిది పదప్రయోగంలో ఒక ప్రత్యేక శైలి. ఆవుజున్నులా, జుంటితేనెలా వాక్యాలకు వాక్యాలు జాలువారతాయి. బహుభాషా వేత్త. రహస్యం చిత్రంలో మల్లాది రచించిన గిరిజా కల్యాణం నృత్యరూపకం ఒక కావ్యం. 'అంబా పరాకు' అంటూ కూచిపూడి రీతిలో అన్ని హంగులతో నడుస్తుంది. 'అధిక చక్కని' అనే పదకట్టు శాస్త్రిగారి సొంతం. 'టూ గుడ్'ని సంస్కృతాంధ్రాలలోకి అనువదించారు. భాషతో ఎన్నో తమాషాలు చేశారు. బందరుని కొంత కాలం పరిపాలించి తరువాత చెన్నపట్టణంపై దండయాత్ర చేశారు. ఎందరో శిష్య ప్రశిష్యులను తయారు చేసుకున్నారు. నడిచే విజ్ఞాన సర్వస్వంగా కీర్తి గడించారు.

జానపద పాటలకు పెట్టింది పేరు కొసరాజు రాఘవయ్యచౌదరి. ఆయన పాటకోసం నాటి చిత్రాలలో ఒక జాగాని సృష్టించేవారు. పాత రోజుల్లో బాక్సాఫీస్ ఫార్ములాలో ముఖ్య దినుసు కొసరాజు పాట. రోజులు మారాయిలో 'ఏరువాకా సాగారో..' పాటతో ఆయనను స్మరించుకుందాం. ఈ పుష్కర పుణ్య ఘడియలలో అందరికీ అంజలి

ఘటిద్దాం.

దసరా పద్యాలు, పాటలు నారాయణ స్తుతులుగానే ఉంటాయి. 'ధర సింహాసనమై నభంబు గొడుగై..' అనే ప్రసిద్ధ దసరా పద్యం కూడా వర్ధిల్లు నారాయణా అంటూ దేవుణ్ని దీవిస్తుంది. జానపదాలలో దసరా పద్యాల కోవకు చెందిన దీనిలో దశావతారాల వర్ణన ఉంది.

మరుజనక మమ్మేలు మత్స్యావతార

గురుతుగా కృపజూడు కూర్మావతార

వరదుడవు కావయ్య వరహావతార

సిరులు కరుణించు నరసింహావతార

రక్షించు మము పరశురామావతార

రాక్షసాంతక రఘురామావతార

పక్షివాహన బలభద్రావతార

బ్రోవనేర్చిన యట్టి బుద్ధావతార

కావవే మము వేడ్క కలికావతార

భాషాపతి స్తోత్ర భానుప్రకాశా

శేషాచలాధీశ శ్రీ వేంకటేశా!

తెలుగు జాతీయం

ఒక తల్లి పొరుగింటికి పంపుతూ, తన కూతురికి చెబుతుంది 'త్వరగా వచ్చెయ్. అక్కర్లేనివి వాగకు. ఆవిడ చేటలో బియ్యం పోస్తుంది జాగ్రత్త' అని హెచ్చరించి మరీ పంపిస్తుంది. ఏమిటీ చేటలో బియ్యం పోయడం? అంటే.

అది తెలుసుకోవాలంటే ఒక పల్లెటూరి సాంప్రదాయం తెలియాలి. మన జానపద కళారూపాలలో సోదెమ్మి కూడా ఒకటి. దీన్ని సంస్కృతంలో కురువంజి అంటారు. చిక్కగా అల్లిన చిన్న వెదురు పేళ్లబుట్ట చంకన పెట్టుకుని, ఏక్‌తార మీటుతూ "సోది చెబుతానమ్మ సోది.." అంటూవస్తారు. చక్కని కట్టు బొట్టుతో సోదెమ్మి వేషధారణ ప్రత్యేకంగా ఉంటుంది. ఇది కూడా ఒకవిధంగా చెప్పాలంటే యాచక వృత్తే కానీ పల్లెల్లో అమ్మలక్కలకు సత్కాలక్షేపం. నమ్మిన వారికి నమ్మిక. అయితే ఇల్లిల్లూ తిరగదావిడ. పిలిచిన ఇంటికే వెళుతుంది. అక్కడ అరుగుమీద కూచోగానే, చేటనిండా బియ్యం తీసుకొచ్చి దాని ముందు సోది చెప్పించుకునే వారిని కూచోమంటుంది. ఆమె బుట్టలో చిన్న కర్రపుల్ల ఉంటుంది. దానిని చూపుతూ, సమస్త దేవతలనూ స్మరిస్తూ సోది ప్రారంభిస్తుంది. ఎంతకీ అసలు సంగతిలోకి రాదు. ఏవేవో చెబుతూ వుంటుంది. అందుకే క్లుప్తత లేకుండా మాట్లాడినపుడు, 'సోది చెప్పకు ఏవిటా సోది' అంటారు.

తర్వాత ఏం జరుగుతుందంటే – చెప్పబోయే భవిష్యవాణికి కావల్సిన సమాచారమంతా అవతల వారి దగ్గరే రాబడుతుంది. అదొక చాతుర్యం. ఏదీ సూటిగా చెప్పదు సోదెమ్మి.

మళ్లీ మన జాతీయంలోకి వస్తే – సోదమ్మి వొడుపుగా సంగతులు రాబట్టినట్టే, ఈ పొరుగింటావిడ కూడా మన ఇంటి కబుర్లు రాబడుతుంది సుమా! జాగ్రత్త! అని చెప్పడానికి "చేటలో బియ్యం పోస్తుంది జాగ్రత్త!" అని హెచ్చరిస్తుంది. ఇంత కథ తెలిస్తే గాని ఈ జాతీయం బోధపడదు.

చిత్రమైన తెలుగు పలుకులు

ఒకలాగ స్ఫురిస్తూ, మరొకలాంటి భావాన్నిచ్చే మాటలు మనకే పరిమితం. ఒకవైపు నిందుతనాన్ని, మరోవైపు నిరాపేక్షని సూచించే పదాలున్నాయి. ఉదాహరణకి–



వాడంటే నాకు తగని ప్రేమ. బందరు లడ్డంటే నాకు తగని ఇష్టం. తగని ఈర్ష్య, తగని శ్రద్ధ, తగని భక్తి, ఇలా తగని విశేషణంగా బోలెడు మాటలొస్తాయి. "తగని"అంటే ఇక్కడ అమితం, అత్యధికం అనే భావం. మరోవైపు తగదు, కూడదు అని చెబుతుంది. మన వేదాంతం, అతి సర్వత్ర వర్జయేత్ అని బోధిస్తోంది. ప్రేమ భక్తి, ఈర్ష్య, ఇష్టం ఏదైనా అతి మంచిది కాదు. ఆ సూక్తిని "తగని" అనే మూడక్షరాలకు కుదించి, విశేషణమైంది. చాలా ఎక్కువ, అత్యధికం అనేదాన్ని అందంగా చెప్పే విధానం ఇది. దీనిలోంచే వచ్చి, దీని కోవకు చెందినవే "మాచెడ్డ కోపం, మాచెడ్డ ఇష్టం, మాచెడ్డ తీపి" ఇవన్నీ. ఇక్కడ మహా అన్నది మా అవుతుంది. అంతే!

పుష్కరం లేని సామెతలు!

సామెతలు ఏ భాషలో అయినా అత్యంత ప్రాచీనమైనవి. జానపదులు తమ అనుభవాల్లోంచి సృష్టించుకున్న జీవన సత్యాలు. నాగరికత పెరిగాక సామగ్రి మారచ్చు గాని సామెత చెప్పిన సత్యం మారదు. ఉదాహరణకి, "తడిసిగాని గుడిశె కప్పదు" సామెత ఉంది. గుడిశెలిప్పుడు లేవు. గుడిశె ఇల్లు అయింది. "తడిసిగాని ఇల్లు కప్పదు" అంటే సరిపోతుంది. సత్యం ఒక్కటే.

నేను తెలుగు సామెతలన్నింటినీ ఈమధ్య శ్రద్ధగా చూశా. పుష్కరం మీద, పుష్కరతీర్థం మీద ఎలాంటి సామెతలు లేవు. సామెతల్లో పుష్కర ప్రసక్తే లేదు. "జన్మకల్లా శివరాత్రి" వుంది. అంభంలో కుంభం, ఆదివారంలో సోమవారం వుంది. తద్దినం పెట్టేవాడి తమ్ముడు వుంది. ఇలాగే తీర్థాల మీద, తిరునాళ్ల మీద, సంతల మీద సామెతలున్నాయి.

ఈ పుష్కర సంప్రదాయం ఎంతటి ప్రాచీనమైందో చెప్పలేం. ప్రాచీన సాహిత్యంలో నదుల ప్రస్తావనలున్నాయి గాని యీ పుష్కర పర్వం గురించి లేవు. పురాణాలలో పుష్కర ప్రాశస్త్యం, చేయాల్సిన విధులు వుండచ్చు గాని కవుల కలాలలో లేదు. ఇవి మొదట్నుంచీ శ్రోత్రీయమై, ఒక వర్గానికి చెందినవే అయి వుంటాయి. అందుకని జన సామాన్యం వీటిని అంతగా పట్టించుకున్నట్టు లేదు. ఇటీవల కాలంలో ప్రచారంలో జన బాహుళ్యంలోకి వెళ్లాయి. ఏడెనిమిది పుష్కరాలకు ముందు పత్రికలను తిరగేస్తే, వీటి ప్రస్తావన చాలా స్వల్పంగానే కనిపిస్తుంది. ఏమైనా మంచిదే, ఒక సత్సాంప్రదాయం ఇంతగా ప్రాచుర్యంలోకి రావడం. సామెతలు అప్పుడు లేకపోతే ఇప్పుడు పుట్టిద్దాం.

"పంచాంగం లేనంత మాత్రాన పుష్కరం రాకమానుతుందా?"

న్యూసుడి అనే కొత్త సామెతలు

జనవాక్యం కంటే భజన వాక్యం యింపు.

ఎస్ఎమ్ఎస్‌లో వ్యాకరణ దోషాలు వెదికినట్టు.

తాగేస్తే వున్న మతి పోయినట్టు.

తుపాను వచ్చినరోజే అత్తగారు కూడా వచ్చినట్టు.

ఆకాశరామన్నలు ఐడీలిస్తారా?

ఆధారం లేదు గాని కార్డు మాత్రం వుందన్నట్లు.

అల్లుడికి కేస్టన్‌గిరి యిస్తే పరుగులాపి వర్షానికి ప్రార్థనలు చేయమన్నాట్ట.

ఆఫీసు జ్ఞానం లేనివాడు ఆడిట్‌కొచ్చిన వారిని అప్పు అడిగాట్ట.

ఆత్మకథ రాయనేల? అందరినీ తిట్టనేల?

సిమ్ము కొంచెం కూత ఘనం.

పొడుపు – విడుపు

పచ్చ పచ్చని ఆకు పరువాల ఆకు. గుజ్జయి గుప్పెళ్లలో పండవుతుంది.

– శ్రీరమణ


మనవి

తెలుగు మీద, తెలుగు గురించి తెలుగులో మాట్లాడుతున్న శీర్షిక యిది.
మీరు కూడా తెలుగులో యిక్కడ హాయిగా మాట్లాడండి.

– సంపాదకుడు, ఆంధ్రప్రదేశ్ మాస పత్రిక

కొత్తపుస్తకం

జీవిత సాగర మథనం 'దహనం'



దహనం (నవల), సాగర్ శ్రీరామ కవచం
వెల రూ. 80/-లు, పుటలు: 184, ప్రతులకు: ఉషారాణి శ్రీరామ కవచం, హెచ్‌నెం. 8-1-21, జెమ్మిచెట్టుబజార్, లాయర్‌పేట, ఒంగోలు - 523 002

